సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 303

గురువారం 24-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



ఆఖర్లో అమ్మకాలు..

336 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో విక్రయాలు -బిజినెస్‌లో



కూల్చారు... గెలిచారు

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై 8 వికెట్ల తేడాతో నెగ్గిన భారత్. - స్పోర్ట్స్‌లో

ప్రియాంక రాజకీయ అరంగేట్రం



■ గాంధీ కుటుంబం నుంచి మరో వారసురాలు అధికారికంగా రాజకీయ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ వాద్రా(47) బుధవారం తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఆమె బాధ్యతలు చేపడతారని పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించే 80 సీట్లున్న ఉత్తరప్రదేశ్‌లో ఆమె తన సోదరుడు రాహుల్‌కు సహాయకారిగా పనిచేస్తారని వెల్లడించాయి.

- వివరాలు 13లో

జేఈఈ ఫైనల్ 'కీ'లో మార్పులు



- 11 ప్రశ్నల జవాబుల్లో మార్పులు.. 11 ప్రశ్నల తొలగింపు
- ఫిజిక్స్‌లో 7 జవాబుల్లో మార్పులు.. మరో 7 ప్రశ్నల తొలగింపు
- కెమిస్ట్రీలో ఒకే ఒక ప్రశ్నకు జవాబులో మార్పు, 2 ప్రశ్నల తొలగింపు
- మ్యాథ్స్‌లో 3 జవాబులు మార్పు, 2 ప్రశ్నల తొలగింపు

- వివరాలు 4లో

హస్తంతోనే సైకిల్ సవారీ

కాంగ్రెస్‌తో చంద్రబాబు 'పరోక్ష పొత్తు' ● రాహుల్ గాంధీతో మంతనాల మర్మమదే!

- పెళ్లి సాకుతో బాబు ఢిల్లీ పర్యటన
- బీజేపీయేతర పక్షాలతో భేటీ అని లీకులు
- కాంగ్రెస్ అధ్యక్షుడితో మాట్లాడి వచ్చేసిన ముఖ్యమంత్రి
- రాయలసీమ, దక్షిణ కోస్తాలలో ఓట్లు చీల్చడమే లక్ష్యం
- అభ్యర్థులను డిసైడ్ చేసేది బాబే..
- ఖర్చులు టీడీపీ ఖాతాలోంచే..
- జనసేనతో 'ప్రత్యక్ష పొత్తు'కు కసరత్తు
- కుదరకపోతే కాంగ్రెస్ తరహా అవగాహనకు సిద్ధం
- ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో లబ్ధి పొందడమే లక్ష్యం..



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తుల ఎత్తుగడలు ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుని కలసి పోటీ చేసే కన్నా పరోక్షంగా సహకరించుకోవడమే మేలన్న అవగాహనకు ఈ రెండు పార్టీలూ వచ్చాయి. మంగళవారం నాడు ఢిల్లీ వెళ్లిన సీఎం, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈమేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అన్నీ వివరించి ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలిసింది. ఆ వెంటనే రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు హుటాహుటిన అమరావతికి వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ ఎంచుకున్న స్క్రిప్ట్‌ను పొల్లుపోకుండా వల్లెవేసి వెళ్లిపోయారు. తాము ఏపార్టీతోనూ పొత్తు పెట్టుకోవడం లేదని ఇంత అర్ధాంతరంగా ఊమెన్ చాందీ స్పష్టం చేయాల్సిన అవసరమేమిటో ఎవరికీ అంతుబట్టలేదు. అందులోనూ రాహుల్ గాంధీని చంద్రబాబు కలసి మంతనాలాడిన మర్నాడే ఈ ప్రకటన దేనికో అర్థం కాలేదు. కానీ పరోక్ష పొత్తు గనుక ఇక ఆలస్యం చేయకూడదని ఇద్దరు నాయకులు నిర్ణయించుకున్నందుకే ఈ హడావిడి ప్రకటన వెలువడిందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

హస్తంతో పరోక్ష పొత్తు ఎందుకంటే..

కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ కుమారుడి వివాహానికి హాజరయ్యే పేరుతో ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు అసలు ఉద్దేశం వేరే ఉంది. రాహుల్ గాంధీతో చర్చలు జరిపి అవగాహనను ఓ కొలిక్కి తెచ్చుకోవడానికే తన ఢిల్లీ పర్యటనను చంద్రబాబు ఉపయోగించుకున్నారు. పెళ్లికి వెళ్లిన చంద్రబాబు మరుసటి రోజు కూడా అక్కడే ఉండబోతున్నారని, బీజేపీయేతర పార్టీల నాయకులతో

మిగతా 2వ పేజీలో ▶

మార్చిలో జనసేనతో సీట్లపై చర్చలు — సీఎంను కలిసిన తర్వాత టీడీపీ ఎంపీ టీజీ వ్యాఖ్యలు పవన్, బాబు దోస్తీ బట్టబయలు 2లో

టీజీ.. నోరు అదుపులో పెట్టుకో — అడ్డగోలుగా మాట్లాడితే మూల్యం చెల్లించుకోక తప్పదు: పవన్ 2లో

సాధారణ ఎన్నికలకు..
షెడ్యూల్ ఫిబ్రవరిలోనే!

ఏప్రిల్ మొదటి వారం నుంచి ఎన్నికలు షురూ

- ఐదు దశల్లో పూర్తిచేసేలా ఈసీ కసరత్తు
- తెలుగు రాష్ట్రాల్లో ఒకే విడతలో ఎన్నికలు
- రెండో వారంలో తెలంగాణ.. మూడో వారం ఏపీలో
- తొలి రెండు దశల్లో మావో, ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో..
- మే మొదటి వారానికి ఎన్నికల ప్రక్రియను ముగించే యోచన



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

2019 సార్వత్రిక ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ నియోజకవర్గాలు, నాలుగు రాష్ట్రాల శాసన సభల ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ప్రారంభించింది. ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్రాల ఎన్నికల అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సంప్రదింపులు, సమావేశాలు జరిపిన ఈసీ.. తాజాగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖతోనూ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించిన లాంఛనాలను పూర్తి చేసింది. ఫిబ్రవరి మూడో వారంలో షెడ్యూల్ విడుదల చేయడానికి వీలుగా ఎన్నికల సంఘం కసరత్తును ముమ్మరం చేసింది. మొత్తం ఐదు దశల్లో దేశవ్యాప్తంగా ఎన్నికల తతంగాన్ని పూర్తి చేయనున్నట్లు సమాచారం. మునుపటి సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ గజిబిజిగా ఉండటంతో పాటు ఎన్నికల ప్రక్రియ (షెడ్యూల్ మొదలుకుని ఫలితాలు వచ్చేవరకు) ఎక్కువకాలం సాగడంపై రాజకీయ పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. సుదీర్ఘమైన ప్రక్రియ వల్ల రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అనేక విషయాల్లో అచేతనంగా ఉండాల్సి వస్తుందనే ఫిర్యాదు కూడా వచ్చింది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకున్న ఈసీ నెలరోజుల్లో మొత్తం ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. 2014లో మార్చి 6న మొదలైన ప్రక్రియ రెండున్నర మాసాలపాటు సాగింది. ఈ సారి 55–60 రోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా షెడ్యూల్ ఉంటుందని

మిగతా 2వ పేజీలో ▶

బడ్జెట్ ప్రవేశపెట్టనున్న గోయల్ — జైట్లీ స్థానంలో తాత్కాలిక బాధ్యతలు 13లో



కాపు రిజర్వేషన్ల పేరుతో బాబు కుట్ర

- కేంద్రం పదిశాతం రిజర్వేషన్లు ఈబీసీలకే కేటాయించింది
- ఇందులో కాపులకు ఐదుశాతం ఇచ్చే అధికారం బాబు చేతిలో లేదు
- రాజకీయ ప్రయోజనాలు, కాపులను మోసం చేసేందుకు ఆయన యత్నం
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

2లో



జగన్‌పై హత్యాయత్నం కేసులో
తుది చార్జిషీట్ దాఖలు



- నిబంధనలను అనుసరించే దర్యాప్తు
- జైలు అధికారుల నుంచి నిందితుడు రాసిన లేఖ తీసుకున్నాం.. మరిన్ని ఆధారాలు లభిస్తే మీ ముందుంచుతాం
- ఇన్ కెమెరా ప్రొసీడింగ్స్ నిర్వహించండి
- కోర్టుకు ఎన్ఐఏ నివేదన
- నిందితుడి రెండు మెమోలపై 25న ఉత్తర్వులిస్తామన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు బుధవారం ఎన్ఐఏ కోర్టులో తుది చార్జిషీట్ దాఖలు చేశారు. దీంతోపాటు పలు డాక్యుమెంట్లను సైతం సమర్పించారు. తదుపరి దర్యాప్తును కొనసాగించి ఆధారాలను సమర్పిస్తామని ఎన్ఐఏ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు

మిగతా 4వ పేజీలో ▶

వర్సిటీ పోస్టుల నోటిఫికేషన్లన్నీ రద్దే!

- 'సుప్రీం' తీర్పుతో రిజర్వేషన్ల విధానంలో మార్పు తప్పదంటున్న మానవ వనరులశాఖ వర్గాలు
- 1,110 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బ్రేక్
- విభాగాలవారీగా పోస్టులకు రిజర్వేషన్ల వర్తింపు
- నిబంధనలకు విరుద్ధంగా నోటిఫికేషన్లు
- యూజీసీ నియమాలను పట్టించుకోకుండా ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్ట్
- ఫీజుల రూపంలో నిరుద్యోగుల నుంచి రూ.8 కోట్లు దాకా వసూలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో బోధనా పోస్టుల భర్తీ అగమ్యగోచరంగా మారింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో 14 వర్సిటీల్లో 1,110 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్లు రద్దయ్యే పరిస్థితులు తలెత్తాయి. సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైన నేపథ్యంలో నియామక ప్రక్రియను నిలిపివేయాలని యూజీసీ గత ఏడాది జూలైలోనే అన్ని వర్సిటీలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి పట్టించుకోలేదు. తమవారిని నియమించుకునేందుకు ఇష్టానుసారంగా నోటిఫికేషన్లు విడుదల చేశారు. రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువడే వరకు నియామక ప్రక్రియను నిలిపివేయాలన్న సూచనలను బేఖాతరు చేశారు. నిబంధనలు పాటించకుండా ఇచ్చిన నోటిఫికేషన్లపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తెచ్చినా ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకే వెళ్లింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నంగా ఉన్న ఈ నోటిఫికేషన్లను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఇవ్వాల్సి ఉంటుందని మానవవనరుల అభివృద్ధి శాఖ

మిగతా 5వ పేజీలో ▶

ఆత్మవిమర్శ కోసం అడవికి..!

- ప్రతి దీపావళికి వెళ్లి ఐదు రోజులు ఉండేవాణ్ని
- ఆ అనుభవం ఇప్పటికీ ఉపయోగపడుతోంది: మోదీ
- యువత కూడా అంతర్మథనం చేసుకోవాలని సూచన
- చిన్న నాటి జీవితం గురించి పలు విషయాలు వెల్లడించిన ప్రధాని

13లో



మార్చిలో జనసేనతో సీట్లపై చర్చలు

సీఎం కలిసిన తర్వాత టీడీపీ ఎంపీ టీజీ వెంకటేష్ వ్యాఖ్యలు

పవన్, బాబు దోస్తీ బట్టబయలు



సాక్షి, అమరావతి: జనసేనతో టీడీపీ పొత్తు ఉంటుందని టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్, మాయావతి ప్రపంచంలో ఎవరూ లేనంతగా కొట్లాడుకున్నారని.. వారే కలిసినప్పుడు టీడీపీ, జనసేన కలిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. ఉండవల్లిలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చిలో రెండు పార్టీల మధ్య ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే విషయంపై చర్చలు జరుగుతాయని, తెలిపారు. పొత్తు తప్పకుండా ఉంటుందని తేల్చి చెప్పారు. తనకు ముఖ్యమంత్రి కుర్చీపై ఆశ లేదని పవన్ గతంలోనే చెప్పారని గుర్తు చేశారు. రెండు పార్టీల నాయకుల మధ్య అపోహలు తొలగిపోయాయని చెప్పారు. తన కుమారుడికి కర్నూలు సీటు వస్తుందని, సర్వేల్లో ప్రజాదరణను బట్టి చంద్రబాబు సీటిచ్చే అవకాశం ఉందన్నారు. పొత్తుపై టీజీ వ్యాఖ్యలు చేసిన తర్వాత పవన్‌కల్యాణ్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. ఆయన మళ్లీ ఉండవల్లిలో మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆవేశం తగ్గించుకోవాలని, అప్పుడు మంచి భవిష్యత్తు ఉంటుందని హితవు పలికారు. పొత్తు ఖరారైతే మార్చిలో చర్చలు ఉంటాయని మాత్రమే చెప్పానన్నారు. కాగా పొత్తు గురించి మాట్లాడడంపై పవన్ ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో.. చంద్రబాబు టీజీ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసినట్లు మీడియాకు లీకులిచ్చారు.

హస్తంతోనే సైకిల్ సవారీ

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశమవుతారని ముందుగా మీడియాకు లీకులిచ్చారు. కానీ పెళ్లికి వెళ్లిన చంద్రబాబు ఢిల్లీలో ఉండలేదు. బీజేపీయేతర పార్టీలను కలిసే ఉద్దేశమే ఆయనకు లేదు. అనుకున్నట్లుగా రాహుల్ గాంధీని కలసి అనుకున్నవన్నీ మాట్లాడుకుని ఆయన తిరుగుముఖం పట్టారు. పెళ్లి ఒక సాకు మాత్రమేనని, రాహుల్ గాంధీని కలవడానికే చంద్రబాబు ఢిల్లీ వెళ్లారని దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చునని విశ్లేషకులంటున్నారు. తెలంగాణలో తల బొప్పికట్టిన దరిమిలా రాష్ట్రంలో పరిస్థితులన్నీ మదింపు వేసిన తర్వాత పొత్తుల విషయమై చంద్రబాబు ఓ అంచనాకు వచ్చారని, కాంగ్రెస్ ఓట్లు తమకు బదిలీ కావడం అంత తేలికైన పనికాదని అర్థం చేసుకున్నారని అంటున్నారు. అందుకని రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాలను ఆయన ఎంచుకున్నారు. అందులో 25 నుంచి 35 నియోజకవర్గాలలో కాంగ్రెస్ తరపున గట్టి అభ్యర్థులను నిలబెట్టాలని నిర్ణయించారు. వారిని చంద్రబాబే నిర్ణయిస్తారని, వారి ఎన్నికల ఖర్చును కూడా ఆయనే ఇస్తారని అంటున్నారు. తద్వారా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి వెళ్లే ఓట్లను వీలైనంత ఎక్కువగా చీల్చాలన్నది వీరి ఎత్తుగడగా కనిపిస్తున్నది. ఇదే కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య కుదిరిన రహస్య అవగాహన సారాంశం.

జనసేనతో పొత్తు కూడా అనుకున్నట్లుగానే..



ఇక ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రల విషయానికొస్తే జనసేనతో పొత్తు పెట్టుకోవాలన్నది తెలుగుదేశం ఎత్తుగడగా కనిపిస్తున్నది. ఇటీవలే అమెరికా పర్యటించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అక్కడ చంద్రబాబు సన్నిహితుడు లింగమనేని రమేశ్‌ను కలుసుకున్నారని, అనేక విషయాలపై చర్చలు జరిపారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఉభయ పార్టీల మధ్య పరస్పర సహకారం విషయమై విడతలవారీగా పలుమార్లు చర్చలు జరిగినట్లు కూడా టీడీపీ, జనసేన వర్గాలలో వినబడుతున్నది. 'చంద్రబాబుగారిపై కక్షసాధించడానికే వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్ పార్టీలు కలుస్తున్నాయి' అన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్య గానీ, 'పవన్ మనోడే ఆయనను ఏమీ అనవద్దు' అని పార్టీ నాయకులకు చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలు గానీ ఇరు పార్టీల మధ్య అవగాహన ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తూనే ఉన్నాయి. మరోవైపు ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకునే అవకాశాలను నిర్ధారిస్తున్నట్లుగా బుధవారం నాడు టీడీపీ ఎంపీ టీజీ వెంకటేష్ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ మధ్యే పొత్తు కుదిరినప్పుడు జనసేన – టీడీపీ కలిస్తే తప్పేమిటి అని ఆయన ప్రశ్నించారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే విషయంపై మార్చిలో చర్చలు జరుగుతాయని కూడా టీజీ తేల్చి చెప్పడం మీడియాలో హల్‌చల్ చేసింది. పొత్తుల విషయం ముందే బయటకు పొక్కడం ఎందుకనుకున్నారో ఏమో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దీనిపై కాస్త ఘాటుగానే స్పందించారు. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండదని ఖండించడం కాకుండా టీజీ వెంకటేష్‌పై పవన్ వ్యక్తిగత విమర్శలకు దిగడం చూసి అందరూ విస్తుపోయారు. అయితే రెండు పార్టీల మధ్య ఏదో రకంగా పొత్తు కొనసాగే అవకాశాలే ఎక్కువన్న అభిప్రాయం తెలుగుదేశం వర్గాల్లో వ్యక్తమౌతోంది. జనసేనతో పొత్తు పెట్టుకుంటే ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఎంతో కొంత లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు అంచనా వేస్తున్నట్లు వినిపిస్తోంది. అందుకనే ప్రత్యక్షంగా పొత్తుపెట్టుకున్నా లేదా పరోక్షంగా సహకరించుకున్నా జనసేన ఎన్నికల ఖర్చులు భరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది.

టీజీ.. నోరు అదుపులో పెట్టుకో

- అడ్డగోలుగా మాట్లాడితే మూల్యం చెల్లించుకోక తప్పదు
- పాడేరు బహిరంగ సభలో పవన్‌కల్యాణ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

పాడేరు: తాను వద్దనుకుని వదిలేసిన.. రాజ్యసభ ఎంపీ పదవిని పొందిన టీజీ వెంకటేష్ అడ్డగోలుగా మాట్లాడితే సహించేది లేదని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హెచ్చరించారు. విశాఖ జిల్లా పాడేరులో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జనసేన గురించి అదుపుతప్పి పనికిమాలిన మాటలు చెబితే ఊరుకోబోమన్నారు. పద్ధతి మార్చుకోవాలని.. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని టీజీ వెంకటేష్‌ను హెచ్చరించారు. తన ఫ్యాక్టరీల నుంచి విడుదల అవుతున్న పారిశ్రామిక వ్యర్థాలను అడ్డగోలుగా నదుల్లోకి వదిలి పరిసరాలను, భూగర్భజలాలను కలుషితం చేస్తున్నాడని పవన్ ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వానికి దోచుకోవడంలోనే చిత్తశుద్ధి ఉందని, ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించి అడ్డగోలుగా అవినీతికి పాల్పడుతున్నారని పవన్‌కల్యాణ్ ధ్వజమెత్తారు. ప్రజలకేదో మంచి చేస్తారనుకుని తాను టీడీపీ పార్టీకి గత ఎన్నికల్లో మద్దతు ఇస్తే.. ప్రజల కోసం పనిచేయాలనే చిత్తశుద్ధి వారిలో లేకుండా పోయిందని దుయ్యబట్టారు. చంద్రబాబు తన పాత పద్ధతిని ఇంకా మార్చుకోలేదన్నారు. మన్యంలో కొండల్ని తొలిచేద్దాం బాక్సైట్‌ను దోచేద్దామనే ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మన్యం ఖనిజ సంపదను కొల్లగొట్టకుండా అడ్డుకోవడానికి జనసేన పోరాడుతుందన్నారు. ఖనిజాల జోలికొస్తే తాటతీస్తామని పవన్ హెచ్చరించారు. ఖనిజాల జోలికి పోకుండా ఉంటే ఇటీవల అధికారపార్టీ నేతల ప్రాణాలు కూడా పోయేవి కాదని.. దీనికి చంద్రబాబే బాధ్యత వహించాలన్నారు. నాదెండ్ల మనోహర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఫిబ్రవరిలోనే!

▶ మొదటి పేజీ తరువాయి

విశ్వసనీయవర్గాల సమాచారం. సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరిలో షెడ్యూల్ విడుదల చేయడం దాదాపుగా ఖరారైందని, తేదీ ఎప్పుడనేది ఈ నెలాఖరుకు స్పష్టత వస్తుందని విశ్వసనీయ అధికార వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ మొదటివారంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి 5 లేదా 6 దశల్లో పూర్తి చేయాలని (ఏప్రిల్ చివరి వరకు) ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. తొలి రెండు విడతల్లో ఈశాన్య రాష్ట్రాలతో పాటు జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాలు, జమ్ముకాశ్మీర్‌తో పాటు ఇతర కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది. ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ఒకే దశలో ఎన్నికలు పూర్తి చేసేలా షెడ్యూల్ రూపొందిస్తోంది. గతంలో మాదిరిగానే.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఒకే దశలో ఎన్నికలు పూర్తి చేయనున్నారు. ఏప్రిల్ రెండో వారంలో తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు, మూడో వారంలో ఏపీలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ఏకకాలంలో పూర్తి చేసేందుకు వ్యూహరచన జరుగుతోంది. దక్షిణాది ఐదు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు ఒకే దశలో పూర్తి చేస్తారు. రెండో దశలో తెలంగాణ, తమిళనాడు, మూడో దశలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక ఉండొచ్చని అధికారవర్గాల సమాచారం.

'పోలవరం' లెక్కలు చెప్పాల్సిందే

- భూసేకరణ, సహాయ, పునరావాస ప్యాకేజీల వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి పీపీఏ లేఖ
- వాటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తామని స్పష్టీకరణ
- పోలవరం కుడి కాలువ భూసేకరణలో అక్రమాలపై పక్కా ఆధారాలు సేకరించిన పీపీఏ
- పీపీఏ లేఖతో ఆందోళనలో రాష్ట్ర ప్రభుత్వం
- ఎలాంటి వివరాలు ఇవ్వొద్దంటూ అధికారులపై ప్రభుత్వ పెద్దల ఒత్తిడి

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, సహాయ, పునరావాస ప్యాకేజీ అమలులో అక్రమాలను నిగ్గుతేల్చేందుకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సిద్ధమైంది. ఇప్పటివరకూ పోలవరం జలాశయం.. కుడి, ఎడమ కాలువల పనుల కోసం సేకరించిన భూమి సర్వే నెంబర్లు, యజమాని పేరు, చెల్లించిన పరిహారం వివరాలు ఇవ్వాలని పీపీఏ సభ్య కార్యదర్శి డాక్టర్ ఆర్కే గుప్తా రాష్ట్ర ప్రభుత్వానికి, పోలవరం భూసేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్ సీహెచ్ భానుప్రసాద్‌కు లేఖ రాశారు. ఇప్పటివరకూ పునరావాసం కల్పించిన నిర్వాసితులు, వ్యక్తిగతంగా వారికి పంపిణీ చేసిన పరిహారం, పునరావాస కాలనీల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటికి చేసిన ఖర్చుల వివరాలు ఇవ్వాలని కోరారు. వివరాలు ఇస్తే అక్రమాలు గుట్టంతా రట్టు అవుతుందని ప్రభుత్వ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. పీపీఏకు ఎలాంటి వివరాలు ఇవ్వొద్దంటూ తమపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేస్తున్నారని పోలవరం భూసేకరణ విభాగం అధికారులు చెబుతుండటం గమనార్హం. పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం 2010–11 ధరల ప్రకారం.. రూ.16,010.45 కోట్లు. ఇందులో భూసేకరణ, సహాయ, పునరావాస ప్యాకేజీ వ్యయం.. రూ.2,934.42 కోట్లు. 2013–14 ధరల ప్రకారం.. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.57,940.86 కోట్లకు పెంచుతూ ఆగస్టు 17, 2017న రాష్ట్ర ప్రభుత్వం పీపీఏ ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో భూసేకరణ, సహాయ, పునరావాస ప్యాకేజీ వ్యయం.. రూ.33,225.74 కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వం లెక్కగట్టింది. భూసేకరణ చట్టం 2013 ప్రకారం.. సేకరించిన భూమికి పరిహారం చెల్లించినా, నిర్వాసితులకు సహాయ, పునరావాస ప్యాకేజీ అమలు చేసినా ఇంత వ్యయం చేయాల్సిన అవసరం ఉండదని ఆదిలోనే పీపీఏ స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు పనుల తరహాలోనే భూసేకరణ, సహాయ, పునరావాస ప్యాకేజీల అంచనా వ్యయాన్ని భారీ ఎత్తున పెంచేసి కమీషన్లు పంచుకోవడానికి ప్రభుత్వ పెద్దలు ప్రణాళిక రచించినట్లు గుర్తించింది.

కుడి కాలువ అక్రమాలతో ఆరంభం

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో నాలుగు మండలాల్లోని టీడీపీ నేతలు, సానుభూతిపరులైన రైతులకు ఎకరానికి గరిష్టంగా రూ.62 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం లెక్కగట్టినా ఎకరానికి రూ.20 లక్షలు నుంచి రూ.25 లక్షలకు మించి పరిహారం ఇవ్వడానికి అవకాశం లేదని అధికారవర్గాలు



అప్పట్లోనే వెల్లడించాయి. మొత్తం రూ.700 కోట్లను టీడీపీ నేతలు, సానుభూతిపరులకు పరిహారంగా పంపిణీ చేశారు. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. పోలవరం జలాశయంలో ముంపునకు గురయ్యే భూమిని 2009కి ముందే సేకరించినా.. సేకరించనట్లు చూపి బినామీ పేర్లతో పరిహారాన్ని టీడీపీ నేతలు కాజేశారు. గిరిజనులకు భూమికి బదులుగా భూమిని పంపిణీ చేసేందుకు జరిపిన భూసేకరణలోనూ, పునరావాస కాలనీల నిర్మాణానికి చేసిన భూసేకరణలోనూ భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడి వందలాది కోట్ల రూపాయలను టీడీపీ నేతలు దోచుకున్నారు.

వివరాలు ఇవ్వొద్దని ఒత్తిళ్లు

పోలవరం జలాశయంలో ముంపునకు గురయ్యే భూమి, కుడి, ఎడమ కాలువల తవ్వకానికి అవసరమైన భూమి వెరసి 1,66,423.27 ఎకరాల భూమిని సేకరించాలి. ఇప్పటివరకూ 1,10,787 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. భూసేకరణకు రూ.5,398.59 కోట్లను ఖర్చు చేసింది. పోలవరం జలాశయంలోముంపునకు గురయ్యే గ్రామాల్లోని 1,05,601 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఇందులో 3,922 కుటుంబాలకు మాత్రమే ఇప్పటివరకూ పునరావాసం కల్పించారు. నిర్వాసితులయ్యే గిరిజనులకు భూమికి బదులుగా భూమి ఇచ్చేందుకు పది వేల ఎకరాలను సేకరించారు. సహాయ, పునరావాస ప్యాకేజీ కింద రూ.802 కోట్లను ఖర్చు చేశారు. మిగిలిన 55,636 ఎకరాల భూమి సేకరణకు రూ.7,208.89 కోట్లు, 1,01,679 మందికి పునరావాసం కల్పించడానికి రూ.19,817 కోట్లు అవసరమని ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ భూసేకరణకు, సహాయ, పునరావాస ప్యాకేజీ అమలుకు చేసిన వ్యయంతోపాటు ఇంకా సేకరించాల్సిన భూమి, పునరావాసం కల్పించాల్సిన నిర్వాసితుల వివరాలు ఇవ్వాలని పీపీఏ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వివరాల ఆధారంగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయించి అక్రమాల గుట్టును రట్టు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే కుడి కాలువ భూసేకరణలో అక్రమాలపై పక్కాగా ఆధారాలు సేకరించిన పీపీఏ.. జలాశయం, ఎడమ కాలువ భూసేకరణ వ్యవహారంపై దృష్టి పెట్టడంతో ప్రభుత్వ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అంచనా వ్యయాన్ని రూ.57,940.86 కోట్లకు పెంచుతూ పంపిన ప్రతిపాదనలు మినహా.. పీపీఏకు ఎలాంటి వివరాలు ఇవ్వొద్దంటూ ప్రభుత్వ పెద్దలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని భూసేకరణ విభాగంలో కీలక అధికారి తెలిపారు.

ఈ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంకోర్టులో పిటిషన్

దాఖలు చేసిన రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కట్టబెట్టిన 123వ రాజ్యాంగ సవరణ చట్టం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తోందని, దీనిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ రిటైర్డ్ జస్టిస్ వి.ఈశ్వరయ్య బుధవారం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. '123వ రాజ్యాంగ సవరణ చట్టం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని, రాజ్యాంగంలోని 141వ ఆర్టికల్‌కు ఉల్లంఘిస్తోంది. ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1991లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విభేదిస్తోంది. 2011లో చేపట్టిన సామాజిక–ఆర్థిక కుల జనగణనను ప్రచురించి, దాని ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి. ఆర్థికంగా వెనకబడిన వర్గాలు ఏరకంగానూ అణచివేతకు గురికాలేదు. కానీ సామాజికంగా బలహీనులైన వెనకబడిన వర్గాలు అనేక విధాలుగా వివక్షకు గురయ్యాయి. అగ్రవర్ణాల్లో పేదలు కనీసం 5 శాతం కూడా లేరు. ఆ 5 శాతం ఆర్థిక వెనకబాటు వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించారు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల ఈ చట్టాన్ని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ప్రకటించాలని తెలిపారు.

కాపులకు రిజర్వేషన్ల పేరుతో బాబు కుట్ర

- కేంద్రం పదిశాతం రిజర్వేషన్లు ఈబీసీలకు కేటాయించింది
- ఇందులో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్‌లిచ్చే అధికారం బాబు చేతిలో లేదు
- రాజకీయ ప్రయోజనాలు, కాపులను మోసం చేయడానికి బాబు యత్నం
- ఈబీసీ రిజర్వేషన్లను ఉపయోగించుకొని కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు
- బాబు ఎస్సీల్లోనూ ఇలానే చిచ్చుపెట్టారు
- వైఎస్ జగన్‌పై హత్యాయత్నంలో టీడీపీ నాయకత్వ ప్రమేయం
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ధ్వజం

సాక్షి, అమరావతి బ్యూరో: సీఎం చంద్రబాబు కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తాననడంలో దుర్మార్గపు, స్వార్థపరమైన ఆలోచన, కుట్ర దాగి ఉన్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు విమర్శించారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 124వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించిందని, పార్లమెంటు ఉభయసభలు దీనిని ఆమోదించాయని తెలిపారు. రాష్ట్రాలు ఈ రాజ్యాంగ సవరణను ఆమోదించాలని, సగం రాష్ట్రాలు ఆమోదిస్తే చాలని అన్నారు. ఈ తరుణంలో చంద్రబాబు వివాదానికి తెరలేపుతున్నారని, బిల్లు విత్ ఇన్ ది బిల్ పేరుతో రాష్ట్రంలో ఒక బిల్లు చొప్పించి, కాపులకు రిజర్వేషన్లు ఈబీసీల కోటాలో కేటాయిస్తాననడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కేంద్రం ఇస్తున్న ఈబీసీ రిజర్వేషన్లను బాబు రాజకీయ ప్రయోజనాల కోసం, కాపులను మోసగించడానికి వాడుకుంటున్నారని చెప్పారు. ఈబీసీ 10 శాతం కోటాలో 5 శాతం కాపులకు ఇస్తామంటూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇలా కులాల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబుకు అలవాటేనని, ఎస్సీ వర్గీకరణ పేరుతోనూ రెండు కులాల మధ్య చిచ్చు పెట్టారని వివరించారు. వాస్తవానికి ఈబీసీ కోటాలో ఐదు శాతం రిజర్వేషన్లు అనేవి చంద్రబాబు చేతుల్లో లేవని స్పష్టం చేశారు. రాజ్యాంగ సవరణ విషయంలో రాష్ట్రాలు కేవలం ఆమోదించిందీ లేనిదీ మాత్రమే వెల్లడించాల్సి ఉందన్నారు. సవరణ ప్రతిపాదించే హక్కు మాత్రం లేదన్నారు. పార్లమెంటు జరుగుతున్నప్పుడే దాన్ని పొందుపరచమని అడగొచ్చని, బాబు అలా చేయలేదని వివరించారు.

టీడీపీ ముసుగు తొలిగింది

పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీలు ముస్లింమైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు పొందుపర్చాలని కోరారని, అయితే ఆ రిజర్వేషన్‌లు ఓబీసీలకేనని కేంద్రం స్పష్టం చేసిందన్నారు. పార్లమెంట్‌లో కాపులకు రిజర్వేషన్లు ఇవ్వండని టీడీపీ సభ్యులెవరూ నోరుమెదపలేదని తెలిపారు. గత పార్లమెంటు సమావేశాల్లో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ 'ఏపీ నుంచి కాపు రిజర్వేషన్ ప్రతిపాదన వచ్చింది.. అది ఎంతవరకొచ్చింది' అని ప్రశ్నించగా, సాక్షుత్తు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ 'ఏపీ నుంచి అటువంటి ప్రతిపాదన రాలేదు.. అలాంటప్పుడు అలాంటి ప్రశ్న ఉత్పన్నం కాదు' అని చెప్పడంతోనే టీడీపీ ముసుగు తొలగిందన్నారు. కాపు సామాజికవర్గాన్ని మభ్యపెట్టినందుకు బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్‌ల ప్రతిపాదనను ఆహ్వానిస్తూ కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బారాయుడు సీఎంకు అభినందనలు తెలిపారని, ఈ రిజర్వేషన్లు సాధ్యం కావని తెలిసి కూడా ఇలా చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పుడు ఈబీసీలకు, కాపులకు మధ్య గొడవలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలు తనవేనని చెప్పబోతున్న చంద్రబాబు

ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌కు వచ్చిన ప్రజా స్పందన చూసి మతిభ్రమించిన బాబు.. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఏం చేయాలో తెలియక ఇప్పటికే కొన్ని నవరత్నాలను దొంగలించారని ఎద్దేవా చేశారు. రత్నాల దొంగలు రాజకీయాల్లోకి వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. 2017లో జగన్ గుంటూరు ప్లీనరీ సభల్లోనే పింఛన్లు రూ.2 వేలకు పెంచుతామని చెప్పారని, ఇప్పుడు బాబు నిద్ర లేచి తాను కొత్తగా ఇచ్చినట్టు చెబుతున్నారని విమర్శించారు. రైతురక్ష పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జగన్ ప్రకటించిన నవరత్నాలను దొంగలించి.. అవి తనవేనని బాబు చెప్పబోతున్నారని చెప్పారు. కోల్‌కతాలో చంద్రబాబు కర్ణాటకలో ఫిరాయింపులపై మాట్లాడటంపై అందరూ నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించి.. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల పేర్లు ఇప్పటికీ అసెంబ్లీ గెజిట్‌లో వైఎస్సార్‌సీపీ జాబితాలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1252 కోట్లు బకాయిలున్నాయని, దీంతో విద్యార్థుల చదువులు ముగిసినా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్‌లు నిలిచిపోయాయని, ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు లేక ఇబ్బంది పడుతున్నా.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్‌పై హత్యాయత్నంలో టీడీపీ నాయకత్వ ప్రమేయం

వైఎస్ జగన్‌పై హత్యాయత్నంలో టీడీపీ నాయకత్వ ప్రమేయం, కుట్రకోణం దాగి ఉన్నాయని ఉమ్మారెడ్డి అన్నారు. లేకుంటే ఎన్ఐఏ దర్యాప్తునకు సహకరించకపోగా ఎందుకు ఉలిక్కిపడుతున్నారని, హైకోర్టులో స్టే కోసం ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ ప్రమేయం లేదంటే ఎన్ఐఏకు సహకరించి రికార్డులు అప్పగించాలని సూచించారు. పొత్తుల కోసం ఆరాటపడేది టీడీపీయేనని.. వైఎస్ జగన్ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఉమ్మారెడ్డి వివరించారు.

వైఎస్సార్‌సీపీలో మంత్రి సోమిరెడ్డి బావ..

- ఇద్దరు కుమారులతోసహా రామకోటారెడ్డి చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన వైఎస్ జగన్
- నెల్లూరు టీడీపీకి షాక్



రామకోటారెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్. చిత్రంలో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్

సాక్షి, హైదరాబాద్: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి స్వయానా బావ అయిన కేతిరెడ్డి రామకోటారెడ్డి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. రామకోటారెడ్డి తన అనుచరులతో కలసి బుధవారం హైదరాబాద్‌లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలసి పార్టీలో చేరాలన్న అభీష్టాన్ని వ్యక్తం చేశారు. ఆయనకు జగన్ పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కోటారెడ్డితోపాటు ఆయన ఇద్దరు కుమారులు శశిధర్‌రెడ్డి, కళాధర్‌రెడ్డికి కూడా జగన్ కండువా వేసి పార్టీలో చేర్చుకున్నారు. రామకోటారెడ్డి దశాబ్దాలుగా టీడీపీలో ఉంటూ కావలి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర నిర్వహించారు. కావలి పట్టణ టీడీపీ అధ్యక్షునిగానూ, సాగునీటి సంఘం చైర్మన్‌గానూ సేవలందించారు. జిల్లాలో బంధువర్గమున్న కోటారెడ్డి టీడీపీని వీడటం ఆ పార్టీకి దెబ్బేనని భావిస్తున్నారు. చేరిక కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీలు విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే రాంరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అనంతరం రామకోటారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రజల ప్రయోజనాలకోసం వైఎస్ జగన్ చేస్తున్న పోరాటం అభినందనీయమని, ఆయన ద్వారానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని తానే కాదు, ప్రజలంతా గట్టిగా విశ్వసిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టిన కాంగ్రెస్‌తో సీఎం చంద్రబాబు జతకట్టి రాష్ట్ర ప్రజల్ని మరోసారి మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని, అందువల్లనే తాను పార్టీలో చేరానని చెప్పారు. జగన్ ప్రకటించిన నవరత్నాల కార్యక్రమం పట్ల ఆకర్షితులమై తన తండ్రితోపాటు వైఎస్సార్‌సీపీలో చేరామని ఆయన తనయులు కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాల పథకాల్ని చంద్రబాబు కాపీ కొడుతున్నారని ఎమ్మెల్యే రాంరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు ఎన్ని చేసినా వచ్చే ఎన్నికల్లో ఆయనకు భంగపాటు తప్పదన్నారు. ఏ పల్లెకు వెళ్లినా నిన్ను 'నమ్మం బాబూ...' అంటూ నినదిస్తున్నారన్నారు.

ఇదం జగత్



ఇంకా ముగ్గురిని మర్చిపోయినందుకు తీవ్రంగా ఖండిస్తున్నాం!

రక్షక భటులలం.. రక్షించండి



- పోలీసులపై పెచ్చుమీరుతున్న అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు
- ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు
- చంద్రబాబు సొంత జిల్లాలో కానిస్టేబుల్‌ను చితకబాదిన టీడీపీ నాయకులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలీసులపై అధికార పార్టీ నేతల ప్రతాపం నానాటికీ శృతి మించుతోంది. టీడీపీ నాయకుల దౌర్జనాలకు నాలుగో సింహం నలిగిపోతోంది. అయ్యా.. బాబూ.. పోలీసోళ్లం కాపాడండి అని వేడుకునే దుస్థితి దాపురించింది. రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ నుంచి కానిస్టేబుల్‌పై వరకూ అధికార టీడీపీ నేతల బారిన పడుతున్న పోలీసుల సంఖ్య పెరుగుతోంది. నిబంధనల ప్రకారం నడుచుకుంటామంటే దౌర్జన్యం.. చట్ట వ్యతిరేక చర్యలు వద్దంటే దాడులు. అసాంఘిక కార్యకలాపాలు ఆపాలని కోరితే ఆగ్రహం.. ఇలా తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులపై రెచ్చిపోతున్నారు. రక్షక భటులని పిలిపించుకునే తమకే రక్షణ లేని పరిస్థితి నెలకొందని పోలీసులు మదన పడుతున్నారు.

చంద్రబాబు సొంత జిల్లాలో..

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో మంగళవారం ఇద్దరు టీడీపీ నేతలు కానిస్టేబుల్‌ను కొట్టడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. చిత్తూరు జిల్లా టీడీపీ ఆఫీస్ ఆపరేటర్ యుగంధర్ నాయుడు, అతడి తండ్రి చంద్రశేఖర్ నాయుడు మండల కేంద్రమైన పెనుమూరులో ఓ స్థలం వివాదంలో కానిస్టేబుల్ రమేష్‌ను నడిరోడ్డుపైనే కర్రలతో కొట్టారు. పోలీసులైతే ఏం పీకుతార్రా అంటూ దాడికి దిగారు. రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లలో ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరిగాయి.

- ఈ నెల 18వ తేదీన నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నార్త్ ఆములూరులో కోడి పందేలను అడ్డుకునేందుకు వెళ్లిన ఎస్సై వీరేంద్రబాబు, కానిస్టేబుళ్లపై పందేల నిర్వాహకులైన స్థానిక టీడీపీ నేతలు కుర్చీలతో కొట్టారు.
- అదేరోజు విశాఖ జిల్లా అనకాపల్లి మండలం మామిడిపాలెంలో అశ్లీల నృత్యాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎస్సై ఆదినారాయణరెడ్డి, పోలీసు సిబ్బందిని టీడీపీ నేతలు కరణం శ్రీనివాసరావు తదితరులు దాడి చేసి కొట్టారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఎస్సై ఆదినారాయణరెడ్డి పక్కనే ఉన్న కాలువలో పడిపోయాడు. పోలీసు జీపునకు టీడీపీ నాయకులు నిప్పుపెట్టడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో పలువురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి.
- ఇటీవల కొద్ది రోజుల క్రితం అనంతపురంలో మట్కా మాఫియా పోలీసులపై దాడి చేసింది. పోలీసు జీపును కూడా తగలబెట్టడం సంచలనం రేపింది. ఈ మట్కా మాఫియాను నడిపిస్తున్నది తెలుగుదేశం పార్టీ నేతలేనని పోలీసులకు తెలిసినా ఏమి చేయలేని పరిస్థితి.

పోలీసులే బాధితులు

అధికార పార్టీ నేతల దాడుల్లో పోలీసులే బాధితులుగా మారుతున్నారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో చోటు చేసుకున్న కొన్ని ప్రధాన సంఘటనలపై ఇప్పటికీ పోలీసు శాఖలో చర్చ సాగుతోంది. తమపై దాడులకు దిగుతున్న అధికార పక్షం తీరుపై పోలీసు శాఖలో పలువురు మండిపడుతున్నారు.

- తాము చెప్పిన తప్పుడు పనులు చేయలేదనే ఉక్రోషంతో విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నలు సీనియర్ ట్రాన్సుపోర్టు కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యంపై దౌర్జన్యం చేశారు. బాలసుబ్రహ్మణ్యం విధులకు ఆటంకం కలిగించడంతోపాటు ఆయన గన్‌మెన్‌పై దౌర్జన్యం చేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై ఇప్పటిదాకా ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.
- పశ్చిమగోదావరి జిల్లా గుండుగొలను వద్ద ట్రాఫిక్ విధుల్లో ఉన్న దేవరపల్లి ఏఎస్ఐ జె.పాపారావుపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దుర్భాషలాడి దాడిచేసి కొట్టడంతో బాధితుడు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.
- దెందులూరు నియోజకవర్గంలో ఒక కానిస్టేబుల్‌ను ఇంటికి వెళ్లి మరీ చింతమనేని ప్రభాకర్ తీవ్రంగా కొట్టారు. కొల్లేరు ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేస్తున్న చింతమనేనిని అడ్డుకున్నందుకు ఫారెస్టు అధికారులపై దాడి చేసి కొట్టారు.అయినా చర్యలు లేవు.
- పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం ఎస్ఐ శ్రీనివాస్, రైటర్‌ను నిర్బంధించి దుర్భాషలాడిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మరో ఎనిమిది మందిపై తప్పనిసరి పరిస్థితిలో కేసు నమోదు చేసిన పోలీసులు చట్టపరమైన చర్యలు మాత్రం తీసుకునే సాహసం చేయలేకపోయారు.
- నెల్లూరులో సీఐని తాట తీస్తానంటూ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుర్భాషలాడినా చర్యలు లేవు.

విమానాల్లో 'టికెట్' రహిత ప్రయాణం



టీ.నగర్ (చెన్నై): దేశీయంగా డొమెస్టిక్ విమానాల్లో టికెట్ (పేపర్ల అవసరం) లేకుండా ప్రయాణించేలా సరికొత్త పద్ధతిని ప్రవేశ పెట్టనున్నారు. మరో మూడు నెలల్లో డిజిటల్ పద్ధతిలో డొమెస్టిక్ విమానాల్లో ప్రయాణించేందుకు వీలు కల్పిస్తామని సెంట్రల్ సివిల్ ఏవియేషన్ శాఖ బుధవారం ప్రకటించింది. అయితే అంతర్జాతీయ విమానాల్లో ఈ పద్ధతిని ప్రవేశపెట్టే వీలు లేదని పేర్కొంది. డొమెస్టిక్ విమానాల్లో ప్రయాణించే వారు.. విమానాశ్రయంలో మొదట సెక్యూరిటీ చెక్ పూర్తి చేసుకుంటారు. ఆ సమయంలో వారికి ఒక నంబరు అందజేస్తారు. టికెట్ రిజిస్ట్రర్ చేసే సమయంలో ఈ నంబరు ద్వారా ఎలాంటి పేపర్ అటెస్టేషన్ లేకుండా ప్రయాణించవచ్చు. హైదరాబాద్, బెంగళూరు, వారణాసి, కోల్‌కతా, పూణె, విజయవాడ మధ్య ఈ డిజిటల్ పద్ధతిని మరో మూడు నెలల్లో ప్రవేశపెట్టనున్నారు.

6 నుంచి ఆర్టీసీలో సమ్మె

- కార్మిక సంఘాల నిర్ణయం
- 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో నిరసన కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగింది. ఫిబ్రవరి 6 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు ఆర్టీసీ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. 50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎంప్లాయీస్ యూనియన్ గతేడాది డిసెంబర్ 31న సమ్మె నోటీసిచ్చింది. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం పలు దఫాలుగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపింది. 20 శాతం కంటే ఫిట్‌మెంట్ ఇచ్చే ప్రసక్తే లేదని మంగళవారం జరిగిన చర్చల్లో తేల్చిచెప్పింది. దీంతో కార్మిక సంఘాలన్నీ కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడ్డాయి. బుధవారం ఆర్టీసీ హౌజ్‌లోని ఈయూ కార్యాలయంలో కార్మిక సంఘాల నేతలు సమావేశమై ఫిబ్రవరి 6 నుంచి నిరవధికంగా సమ్మెకు



వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక పోరాటాలను యూనియన్ నేతలు నిర్వహించనున్నారు. అలాగే ఈ నెల 26వ తేదీ నుంచి 28 వరకు డ్యూటీలకు వెళ్లే కార్మికులంతా డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని, 28వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిపోల్లో ఒకరోజు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టాలని జేఏసీ నిర్ణయించింది. అనంతరం 30వ తేదీన అన్ని ఆర్ఎంల కార్యాలయాల వద్ద సమ్మె సన్నాహక మహాధర్నాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు 13 సమ్మె డిమాండ్లను ప్రకటించారు. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీ బస్సులకు ఎంవీ ట్యాక్స్ రద్దు చేయాలని, నష్టాలు మొత్తం ప్రభుత్వమే భరించాలని, కచ్చితంగా 50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కాగా, జేఏసీ పోరాటానికి వెలుపల నుంచి మద్దతిస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రకటించినట్లు జేఏసీ కన్వీనర్ పి.దామోదరరావు తెలిపారు.

చంద్రబాబు తీరుతోనే ఆర్టీసీకి నష్టాలు: రాజారెడ్డి

చంద్రబాబు తీరుతోనే ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయని వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. చంద్రబాబు సభలకు, పోలవరం యాత్రలకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటూ ఒక్క పైసా చెల్లించడం లేదని విమర్శించారు. చంద్రబాబు ఖరీదైన బస్సును రూ.9 కోట్లతో కొనుగోలు చేసి ఆ భారం ఆర్టీసీపైనే మోపారని ధ్వజమెత్తారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే తప్ప మనుగడ సాధించలేదని ఆయన స్పష్టం చేశారు.

కృష్ణా నీళ్లు చెరువులోకి వెళితే ఒట్టు

- చిత్తూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్న ప్రభుత్వం
- ప్రచారం కోసం ఆర్భాటంగా గేట్లు ఎత్తిన మంత్రులు
- కొద్ది గంటలకే నీటి విడుదల నిలిపివేత



తిప్పరాయ చెరువుకు సాగే కాలువలో నీరు లేని దృశ్యం

బి.కొత్తకోట: కృష్ణా జలాలతో చిత్తూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ఒట్టి బూటకమేనని తేలిపోయింది. రాష్ట్ర మంత్రులు ఆర్భాటంగా గేట్లు ఎత్తిన గంటల్లోనే నీటి విడుదల ఆగిపోయింది. హంద్రీ–నీవా కాలువ ద్వారా చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం సమీపంలోని తిప్పరాయ చెరువుకు మంత్రులు దేవినేని ఉమా, అమరనాథరెడ్డిలు మంగళవారం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. పెద్దతిప్పసముద్రం సమీపంలో వ్యాసరాయ చెరువుకు నీరు అందించే పిల్లకాలువ నుంచి 1,980 ఎకరాల ఆయకట్టు కలిగిన తిప్పరాయ చెరువుకు నీళ్లు పంపిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అదేరోజు చీకటిపడగానే నీటి విడుదల నిలిపివేశారు. కొన్ని గంటలు మాత్రమే నీటిని పంపగా ఆ నీరు కనీసం చెరువులోకి వెళ్లలేదు. పుంగనూరు ఉపకాలువ నుంచి 20 క్యూసెక్కుల నీటి సామర్థ్యం కలిగిన గేటును అమర్చారు. కాలువ నుంచి గేటు ద్వారా తిప్పరాయ చెరువును కృష్ణా జలాలతో నింపుతున్నట్లు మంత్రులు ప్రకటించారు. బుధవారం తెల్లవారుజామున కాలువ వద్దకు వెళ్లి చూసిన రైతులు నీళ్లు ఆగిపోవడం చూసి విస్తుపోయారు. ప్రస్తుతం పుంగనూరు ఉపకాలువలో 100 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రవాహం నుంచే 20 క్యూసెక్కుల నీరు తిప్పరాయ చెరువుకు చెరువుకు వెళ్లాల్సి ఉంది. అయితే తాము కాలువకే నీళ్లిస్తాము కానీ చెరువుకు కాదని సూపరింటెండెంట్ ఇంజనీర్ చెప్పడం గమనార్హం. కేవలం ప్రచారానికే ప్రభుత్వం ఈ గేట్లు ఎత్తే కార్యక్రమం నిర్వహించిందని రైతులు విమర్శించారు.

ప్రకృతి సాగు ఆఫీసుపై విజిలెన్స్ దాడులు!

- నిధుల దుర్వినియోగంపై విచారణ
- జెడ్‌బీఎన్ఎఫ్ ఉన్నతాధికారుల రంగ ప్రవేశం
- విజిలెన్స్ డీజీపై ఒత్తిడి.. అర్ధాంతరంగా ఆగిన దాడులు

సాక్షి, అమరావతి: ప్రకృతి సాగు(జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్– జెడ్‌బీఎన్ఎఫ్) కార్యాలయంతోపాటు పలు ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల ఆఫీసులపై విజిలెన్స్ విభాగం ఇటీవల దాడులు నిర్వహించింది. దీంతో జెడ్‌బీఎన్ఎఫ్ అధికారులు, సిబ్బంది బెంబేలెత్తారు. జెడ్‌బీఎన్ఎఫ్ ఉన్నతస్థాయి అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. తమకున్న అధికార బలాన్ని ఉపయోగించి విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌పై ఒత్తిడి పెంచారు. దాడులను నిలిపివేయించారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించి, రైతుల ఆదాయాన్ని పెంచాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో రెండేళ్ల క్రితం పెట్టుబడి లేని ప్రకృతి సాగు (జెడ్‌బీఎన్ఎఫ్) ప్రారంభమైంది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రకృతి సాగు నడిచేలా ఏర్పాటు చేశారు. సాధికార సంస్థకు ముఖ్యమంత్రి చైర్మన్, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేసిన విజయ్‌కుమార్ జెడ్‌బీఎన్ఎఫ్ అధిపతిగా ఉన్నారు. ప్రకృతి సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు విప్రో లాంటి కొన్ని కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద నిధులు ఇచ్చాయి. అజీమ్ ప్రేమ్‌జీ దాతృత్వ ప్రోత్సాహం (ఏపీపీఐ) కింద రూ.వంద కోట్లు గ్రాంట్‌గా వచ్చాయి. పరంపరాగత్ కృషి వికాస్ యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కేంద్రం రూ.1,250 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఖర్చు లేని సాగు పద్ధతులను నేర్పిస్తామంటూ రూ.కోట్లు ఖర్చుపెట్టి రైతులతో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సమావేశాలను నిర్వహించే బాధ్యతను 14 ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. ఆయా సంస్థలకు కోట్లాది రూపాయలు కేటాయించారు. ఒక్కో శిక్షణా శిబిరానికి రూ.10 కోట్లు ఖర్చు చేశారు. కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, నాచురల్ ఫార్మింగ్ ఫెలోస్, కమ్యూనిటీ క్యాడర్ అనే పేర్లతో 4,500 మందిని నెలవారీ జీతభత్యాలతో నియమించారు. వీరికి నెలకు రూ.5 వేల నుంచి రూ.26,400 దాకా ఇస్తున్నారు.

ప్రకృతి సాగు పేరిట నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ కొందరు వ్యక్తులు, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశాయి. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు జెడ్‌బీఎన్ఎఫ్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖకు చెందిన జాయింట్ డైరెక్టర్లను, వ్యవసాయ విస్తరణాధికారులను, ఉత్తరాంధ్ర, రాయలసీమలో రైతులకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి సమ్మేళనాలను వీడియో తీసిన ఒక వ్యక్తికి, పుస్తకాలను ప్రచురించి, పంపిణీ చేసిన ఓ సంస్థకు చేసిన చెల్లింపులే రూ.కోట్లల్లో ఉన్నట్టు గుర్తించారు. జెడ్‌బీఎన్ఎఫ్ ఉన్నతాధికారులు విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌ను కలిసి దాడుల్ని ఆపించేలా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రే చైర్మన్‌గా ఉన్న సంస్థలపై దాడులా అంటూ మండిపడ్డారు. దీంతో విజిలెన్స్ డీజీ ఆ దాడుల్ని అర్ధాంతరంగా నిలిపివేసినట్లు తెలిసింది. రూ.వేల కోట్ల దుబారా వెలుగులోకి రాకుండాపోయింది.

రూ.66 కోట్ల పన్ను ఎగవేత కేసులో పారిశ్రామికవేత్తల అరెస్ట్

సాక్షి ప్రతినిధి, చెన్నై: నకిలీ పత్రాలు సృష్టించి రూ.66 కోట్ల పన్ను ఎగవేసిన వ్యవహారంలో ఉత్తర చెన్నైకి చెందిన ఇద్దరు పారిశ్రామికవేత్తలను జీఎస్టీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. జీఎస్టీ కమిషనర్ శ్రీధర్ నేతృత్వంలో సదరు పరిశ్రమలపై అధికారులు ముందుగా విచారణ జరిపారు. తమ సంస్థలకు వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లుగా లెక్కలు చూపి పన్ను మినహాయింపు పొందినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో శ్రీనివాసులు, బోస్ అనే ఇద్దరు పారిశ్రామికవేత్తలను అధికారులు అరెస్ట్ చేశారు. జీఎస్టీ పన్ను ఎగవేతకు సంబంధించి తమిళనాడు, పుదుచ్చేరిల్లో 2017 జూలై నుంచి 2019 జనవరి మొదటి వారం వరకు 169 కేసులు నమోదుకాగా రూ.569 కోట్ల పన్ను ఎగవేసినట్లు అధికారులు గుర్తించారు.

నడికుడి వరకు కాచిగూడ-మిర్యాలగూడ డెమూ రైలు

సాక్షి, హైదరాబాద్: కాచిగూడ–మిర్యాలగూడ–కాచిగూడ డెమూ ప్యాసింజర్ రైలు (77673/77674) సేవలను నడికుడి వరకు పొడగించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు మధ్యలో కొండ్రపోల్‌హాల్ట్, విష్ణుపురం, పొందుగుల స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు. ఈ సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రేమ జంట ఆత్మహత్యా యత్నం

- యువతి మృతి, యువకుడు క్షేమం
- ఘటనపై పలు అనుమానాలు

మల్కాపురం (విశాఖపట్నం): ఒకే ప్రాంతానికి చెందిన యువతి, యువకుడు తమ ఇళ్లలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన బుధవారం విశాఖ నగరంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో యువతి మృతి చెందగా, యువకుడు క్షేమంగా బయట పడ్డాడు. అయితే దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తామిద్దరం ప్రేమించుకుంటున్నామని, ఆమెకు వేరే సంబంధం చూడడంతో ఇద్దరం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నామని యువకుడు చెబుతుంటే.. ఆ యువకుడే తమ అమ్మాయిని వేధిస్తున్నాడని, ఆ వేధింపులు తాళలేక ఉరి వేసుకుందని.. దీంతో భయపడిన యువకుడు ఆత్మహత్య నాటకం ఆడాడని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలోని 49వ వార్డు క్రాంతినగర్ ప్రాంతంలో నివసిస్తున్న కొవ్వాడ దేవి (22) స్థానిక కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమె ఇంటి సమీపంలో ఉండే అరవింధ్ (24) అలియాస్ భానుప్రశాంత్ ఐటీఐ చేసి ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల యువతికి పెద్దలు పెళ్లి సంబంధం ఖాయం చేశారు. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం ఉదయం 9.15కు ఇంట్లో తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం 9.40 సమయంలో అరవింద్ కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు రక్షించారు. తాను, దేవి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నామని.. దేవికి ఆమె మేనమామతో పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధపడి బుధవారం నిశ్చితార్థం చేసేందుకు నిర్ణయించారని దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నామని అరవింధ్ పోలీసుల విచారణలో వివరించాడు. మృతురాలి చిన్నాన్న మహాత్మ మాత్రం అరవింధ్ తమ అమ్మాయిని వేధిస్తున్నాడని, ఈ మేరకు దేవి బాధపడుతూ ఒక లేఖ కూడా రాసిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ వేధింపులు తాళలేక దేవి ఆత్మహత్య చేసుకుందని, ఆమె మరణించిందని తెలుసుకొని ఎక్కడ తనపై దాడి చేస్తారోనని భయపడి ఉరి డ్రామా ఆడాడని పేర్కొన్నాడు. సీఐ లంకా భాస్కర్ రావు అనుమానిత కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఫిబ్రవరి 15 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 22 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా తత్కాల్ స్కీమ్ కింద ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును కూడా పొడిగించినట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. రూ.1000 లేట్ ఫీజుతో ఈనెల 31 వరకు చెల్లించవచ్చని తెలిపారు.

సహాయ గణాంకాధికారి, అసిస్టెంటు డైరెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎకనమిక్స్, స్టాటిస్టికల్ విభాగంలోని సహాయ గణాంకాధికారి, గణాంక అసిస్టెంటు డైరెక్టర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం నోటిఫికేషన్లు జారీ చేసింది. సహాయ గణాంకాధికారుల పోస్టులు 78, అసిస్టెంటు డైరెక్టర్ పోస్టులు 6 భర్తీ చేయనున్నారు. సహాయ గణాంకాధికారుల పోస్టులకు ఫిబ్రవరి 12వ తేదీనుంచి మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు.అసిస్టెంటు డైరెక్టర్ పోస్టులకు ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది.

నెలాఖరులోగా ఇతర నోటిఫికేషన్లు

ఇలా ఉండగా ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయ భాస్కర్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ప్రభుత్వం ఆమోదించిన పోస్టుల్లో కొన్నిటికి ఇంకా నోటిఫికేషన్లు విడుదల చేయాల్సి ఉన్నందున వాటిని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని నిర్ణయించారు. దీంతో పాటు గ్రూప్1 పోస్టుల ప్రిలిమ్స్ పరీక్షలకు తక్కువ సమయం ఇచ్చారని, సిలబస్ ఎక్కువగా ఉన్నందున ఈ సమయం పెంచాలని అభ్యర్థుల నుంచి విన్నపాలు వస్తున్నందున దానిపైనా కమిషన్ చర్చించింది. దరఖాస్తుల సమర్పణ తుది గడువు ఇంకా ఉన్నందున మరోసారి దానిపై చర్చించి పరీక్షల తేదీల పొడిగింపు అంశాన్ని ప్రకటించాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి.

నకిలీ ఎరువులమ్మిన డీలర్లపై 11 కేసులు

- మైసూరులో నకిలీ ఎరువుల తయారీ
- విజిలెన్స్ అధికారుల వెల్లడి



ఒరిజినల్, నకిలీ ఎరువుల తేడాను గుర్తించిన అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో నకిలీ ఎరువులు విక్రయించిన డీలర్లపై 11 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. నకిలీ ఎరువుల విక్రయం వల్ల రైతులను మోసగిస్తుండడంపై గుంటూరు, ప్రకాశం జిల్లాల రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లు (ఆర్వీఈవో) శోభామంజరి, రజని, మరో ఉన్నతాధికారి బాలాజీనాయక్ వెల్లడించారు. ఈ మేరకు విజయవాడలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఉప్పులో రెడ్ ఆక్సైడ్ కలిపి పొటాష్ పేరిట రైతులకు విక్రయిస్తూ మోసం చేస్తున్నారనే సమాచారం అందడంతో దాడులు చేసి రూ.16.84 లక్షల విలువ చేసే 99 మెట్రిక్ టన్నుల నకిలీ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ)ని సీజ్ చేసినట్లు తెలిపారు. అందుకు బాధ్యులైన గుంటూరు జిల్లా ముప్పాళ్లలో ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌తో పాటు మంచికల్లు గ్రామానికి చెందిన శ్రీ వెంకట రామాంజనేయ ట్రేడర్స్, లక్ష్మీ గణపతి ట్రేడర్స్, శ్రీ శివబాలాజీ ట్రేడర్స్‌పై కేసులు నమోదు చేశామన్నారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకంకు చెందిన శ్రీమత్‌బాలాత్రిపుర సుందరిదేవి ఏజెన్సీ, శ్రీవెంకట సుబ్రమణ్యేశ్వర ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఏజెన్సీస్, కామిశెట్టి సుబ్బారావు, దుళ్ల చిన్నసుబ్బారావు, దోర్నాలకు చెందిన బొగ్గారపు రమేష్, ఎర్రగుండపాలెం సాయి బాలాజీ రైస్‌మిల్‌కు చెందిన బ్రహ్మయ్య, సప్తగిరి ట్రేడర్స్‌కు చెందిన సత్యనారాయణ, ఎండివారిపాలెంకు చెందిన అన్నా సుబ్రమణ్యం, కుంబగిరి నాగిరెడ్డిలపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సీజ్ చేసిన నకిలీ పొటాష్ ఎరువులు కర్ణాటక రాష్ట్రం మైసూరు నుండి దిగుమతి చేసుకున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఒరిజినల్ పొటాష్ ఎరువు బ్యాగు ధర రూ.950 కాగా అదే మోతాదులో నకిలీ ఎరువు తయారు చేసేందుకు కేవలం రూ.200 మాత్రమే ఖర్చు అవుతుందని వివరించారు.

బీసీలకు వైఎస్సార్‌సీపీతోనే న్యాయం

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుద్ధా నాగేశ్వరరావు



సాక్షి, అమరావతి బ్యూరో: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందుకే ఆ పార్టీలో చేరినట్లు బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుద్ధా నాగేశ్వరరావు చెప్పారు. విజయవాడలోని తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా బీసీ ఐక్యవేదిక ద్వారా బీసీ సమస్యలు, సామాజిక సమస్యలపై అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీలకు వైఎస్ జగన్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్ పాలనలో బీసీలకు మేలు జరిగిందని, ఇంకా వారు పలు సమస్యలనెదుర్కొంటున్నారని, అపరిష్కృతంగా ఉన్న 140 బీసీ కులాల సమస్యలు తీరాలంటే జగన్ అధికారంలోకి రావాలన్నారు. సమావేశంలో విజయవాడ పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ నాయకుడు కొసగాని దుర్గారావు, బొమ్మిన రవికుమార్, బీసీ ఐక్యవేదిక నాయకులు బాయన శేఖర్‌బాబు తదితరులున్నారు.

31 నుంచి కడప వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్

తిరుపతి అర్బన్: విశాఖపట్నం–తిరుపతి మధ్య నడుస్తున్న 'తిరుమల ఎక్స్‌ప్రెస్'ను ఈనెల 31వ తేదీ నుంచి కడప వరకు నడపనున్నట్టు రైల్వే డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. కడప ప్రజల వినతుల మేరకు రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

తిరుపతి–కడప మధ్య రైలు వేళలు: తిరుపతిలో ఉ. 5:20 గంటలకు రైలు బయలుదేరి రేణిగుంట, కోడూరు, రాజంపేట, నందలూరు మీదుగా ఉదయం 8:25 గంటలకు కడపకు చేరుకుంటుంది.

కడప– తిరుపతి మధ్య: కడపలో సా. 5:05 గంటలకు బయలుదేరి 5:42కు నందలూరు, 5:58కి రాజంపేట, 6:35కి కోడూరు, రాత్రి 7:20కి రేణిగుంట, రాత్రి 8 గంటలకు తిరుపతికి చేరుకుని యథావిధిగా రాత్రి 8:30 గంటలకు బయలుదేరి విశాఖపట్నం వెళుతుంది.

అనూహ్య స్థాయిలో సరుకు రవాణా

ద.మ. రైల్వే పీసీఓ మేనేజర్ మధుసూదనరావు

సాక్షి, హైదరాబద్: దక్షిణ మధ్య రైల్వే నిర్వహిస్తున్న ముఖ్యమైన పోర్టుల్లో ఒకటైన కృష్ణపట్నం పోర్టు నుంచి అనూహ్య స్థాయిలో 15.19 మిలియన్ సరుకు రవాణా జరిగిందని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ (పీసీఓ) ఎన్.మధుసూదనరావు తెలిపారు. బుధవారం రైల్‌నిలయంలో కృష్ణపట్నం పోర్టు రవాణా వినియోగదారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరుకు రవాణాకు కృషి చేసిన రవాణా వినియోగదారులను ఆయన అభినందించారు. గతేడాదిలాగే ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ సరుకు రవాణా లక్ష్యాన్ని మరింత పెంచాలని కోరగా, దీనికి వినియోగదారులు ఈ ఏడాది 20.25 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేస్తామని మధుసూదనరావుకు హామీ ఇచ్చారు.

జేఈఈ ఫైనల్ 'కీ'లో మార్పులు

- 11 ప్రశ్నల జవాబుల్లో మార్పులు..
- 11 ప్రశ్నల తొలగింపు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యాసంస్థలు (జీఎఫ్‌టీఐ)లలో బీఈ/బీటెక్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల ఫైనల్ 'కీ'ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం ప్రకటించింది. ప్రాథమిక 'కీ'తో పోల్చితే అందులో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. మొత్తంగా 11 ప్రశ్నలకు జవాబులు మారిపోగా 11 ప్రశ్నలను తొలగించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ నెల 8 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు తెలంగాణ నుంచి సుమారు 70 వేల మంది సహా దేశవ్యాప్తంగా 8,74,469 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ ప్రతి సబ్జెక్టులో 30 చొప్పున 90 ప్రశ్నలతో 360 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల ఓఎంఆర్ రెస్పాన్స్ షీట్లను ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అలాగే ప్రాథమిక 'కీ'ని ప్రకటించి వాటిపై విద్యార్థుల అభ్యంతరాలను స్వీకరించింది. అయితే ఇందుకు సంబంధించిన ఎలాంటి సమాచారం లేకుండానే ఈ నెల 19న ఫలితాలను ప్రకటించింది. అదే రోజు ఫైనల్ 'కీ'కూడా వెలువడుతుందని భావించినా ఎన్‌టీఏ దాన్ని బుధవారం ప్రకటించింది. 'కీ'ని పరిశీలించిన జేఈఈ నిపుణులు ఉమాశంకర్ ప్రాథమిక 'కీ', ఫైనల్ 'కీ' మధ్య వ్యత్యాసం ఉందని అంచనా వేశారు. దీంతో 11 ప్రశ్నలను తొలగించడంతోపాటు మరో 11 ప్రశ్నలకు సంబంధించిన జవాబుల్లో మార్పులు చేసినట్లు వెల్లడించారు. తొలగించిన 11 ప్రశ్నలకు ఆయా షిఫ్టులలో పరీక్షలకు హాజరైన విద్యార్థులకు మార్కులను కేటాయించినట్లు ఎన్‌టీఏ వివరించింది. అయితే 8 షిఫ్టులలో పరీక్షలు రాసిన విద్యార్థుల స్కోర్‌ను నార్మలైజేషన్ చేసి వారి పర్సంటైల్‌ను ఇటీవల ఎన్‌టీఏ ప్రకటించడం తెలిసిందే. ఇందులో భాగంగా 100 పర్సంటైల్‌లో సాధించిన వారు దేశవ్యాప్తంగా 15 మంది ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఆ ఫలితాలను ఎన్‌టీఏ ఎలా వెల్లడించిందన్న విషయంలో విద్యార్థుల్లో అనుమానాలు నెలకొన్నాయి. ప్రాథమిక 'కీ'పై ఇచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ఫైనల్ 'కీ'ని సిద్ధం చేసి ఫలితాలను ప్రకటించిందా లేక వాటిని పరిగణనలోకి తీసుకోకుండానే ఫలితాలను ప్రకటించిందా? అనే గందరగోళం నెలకొంది. ఒకవేళ వాటిని పరిగణనలోకి తీసుకోకపోతే ఫైనల్ 'కీ'ప్రకారం 100 పర్సంటైల్‌లోకి వచ్చే తెలుగు విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల ప్రకటించిన 100 పర్సంటైల్ విద్యార్థుల్లో తెలుగువారు ఐదుగురు ఉండగా ఆ ఫలితాల్లో ఫైనల్ 'కీ'ని పరిగణనలోకి తీసుకోకపోతే జరిగిన మార్పులు, ఫైనల్ 'కీ'మేరకు చూస్తే మరో 10 మంది వరకు తెలుగు విద్యార్థులు 100 పర్సంటైల్‌లోకి వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు ఇందులో మార్కులను వెల్లడించకుండా పర్సంటైల్ ఇస్తున్నప్పటికీ విద్యార్థుల ఓఎంఆర్ రెస్పాన్స్ షీట్ల ప్రకారం 360 మార్కులకుగాను అత్యధికంగా 350 మార్కులు తెలుగు విద్యార్థులకే వచ్చినట్లు పేర్కొంటున్నారు.

ఇవీ వివిధ షిఫ్టులలో జవాబుల మార్పు, ప్రశ్నల తొలగింపు..

- ఈ నెల 9న జరిగిన మొదటి షిఫ్ట్ పరీక్షలో ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నను తొలగించింది. కెమిస్ట్రీలో ఒక ప్రశ్నకు జవాబును మార్చింది. అలాగే మ్యాథ్స్‌లో ఒక ప్రశ్నకు జవాబును మార్పు చేసింది. అదే రోజు జరిగిన రెండో షిఫ్ట్‌లో ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నల జవాబులను మార్చింది.
- 10వ తేదీన జరిగిన మొదటి షిఫ్ట్ పరీక్షలో ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు జవాబును మార్పు చేయగా ఒక ప్రశ్నను తొలగించింది. కెమిస్ట్రీలో ఒక ప్రశ్నను తొలగించగా, మ్యాథ్స్‌లో ఒక ప్రశ్నకు జవాబును మార్పు చేయడంతోపాటు ఒక ప్రశ్నను తొలగించింది. అదే రోజు జరిగిన రెండో షిఫ్ట్ పరీక్షలో ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు జవాబును మార్పు చేయగా ఒక ప్రశ్నను తొలగించింది.
- 11వ తేదీన మొదటి షిఫ్ట్ పరీక్షలో ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలకు జవాబులను మార్పు చేయగా ఒక ప్రశ్నను తొలగించింది. మ్యాథ్స్‌లో ఒక ప్రశ్నకు జవాబును మార్పు చేసింది. అదేరోజు మధ్యాహ్నం జరిగిన రెండో షిఫ్ట్ పరీక్షలో ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు జవాబును మార్పు చేయగా ఒక ప్రశ్నను తొలగించింది. అలాగే మ్యాథ్స్‌లో ఒక ప్రశ్నను తొలగించింది.
- 12వ తేదీన మొదటి షిఫ్ట్ పరీక్షలో కెమిస్ట్రీలో ఒక ప్రశ్నను తొలగించగా రెండో షిఫ్ట్‌లో ఫిజిక్స్‌లో 2 ప్రశ్నలను తొలగించింది.

జగన్‌పై హత్యాయత్నం కేసులో తుది చార్జిషీట్ దాఖలు

▶ మొదటి పేజీ తరువాయి

నివేదించారు. కాగా, వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన శ్రీనివాసరావు తరఫున న్యాయవాదులు దాఖలు చేసిన రెండు మెమోలపై తదుపరి విచారణ ఈ నెల 25కి వాయిదా పడింది. శ్రీనివాసరావు రాసిన 22 పేజీల లేఖను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుందని, ఆ లేఖను తమకు అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ అతడి తరఫున న్యాయవాది మెమో దాఖలు చేశారు. అలాగే శ్రీనివాసరావును విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకునే విషయంలో ఎన్ఐఏ అధికారులు తమకు సరైన సమాచారం ఇవ్వలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. తమ ప్రమేయం లేకుండా జరిగిన విచారణకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకోరాదంటూ మరో మెమో దాఖలు చేశారు.

జైలు అధికారులు తీసుకున్నారని నిందితుడే చెప్పాడు

ఈ సందర్భంగా నిందితుడు శ్రీనివాసరావు తరఫున న్యాయవాది మట్టా జయకర్ వాదనలు వినిపిస్తూ నిందితుడు రాసిన 22 పేజీల లేఖను అతని ఇష్టానికి విరుద్ధంగా ఎన్ఐఏ అధికారులు తీసుకున్నారని చెప్పారు. న్యాయమూర్తి స్పందిస్తూ నిందితుడిని కోర్టు ముందు ప్రవేశపెట్టినప్పుడు.. తాను స్వయంగా అడిగినప్పుడు పుస్తకం రాశానని, దాన్ని జైలు అధికారులు తీసుకున్నారని శ్రీనివాసరావు స్పష్టంగా చెప్పాడని గుర్తు చేశారు. జయకర్ వాదనలను కొనసాగిస్తూ.. శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకునే రోజున జైలు లోపల, బయట ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సమయంలో ఎన్ఐఏ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జోక్యం చేసుకుంటూ నిందితుడు రాసిన లేఖను దర్యాప్తులో భాగంగా జైలు అధికారుల నుంచి తీసుకున్నామని చెప్పారు. నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని పిటిషనర్లు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వివరించారు. ఈ కేసులో తాము చార్జిషీట్ దాఖలు చేస్తున్నామని, ఆ లేఖను చార్జిషీట్‌తోపాటు కోర్టు ముందుంచుతున్నామన్నారు. తాము లేవనెత్తిన అభ్యంతరాలను చదవకుండానే నిందితుడి తరఫున న్యాయవాది ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. న్యాయవాదుల సమక్షంలో శ్రీనివాసరావును విచారించాలని ప్రత్యేక కోర్టు ఆదేశించిందని తెలిపారు. నిందితుడి తరఫున న్యాయవాది సలీం ఫోన్ నెంబర్ తెలుసుకుని, నిందితుడిని ఎక్కడకు తీసుకెళుతున్నాం? ఎక్కడ విచారిస్తాం? ఎన్ని గంటలకు విచారిస్తాం? తదితర వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేశామన్నారు. సలీంకు చేసిన ఫోన్ కాల్స్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను సైతం కోర్టు ముందుంచారు.

ఎవరిని పడితే వారిని అనుమతించడం సాధ్యం కాదు

విచారణ సమయంలో శ్రీనివాసరావును ఎన్ఐఏ అధికారులు బాగా చూసుకున్నారని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. విచారణ సమయంలో ఎవరిని పడితే వారిని అనుమతించడం సాధ్యం కాదని, శ్రీనివాసరావు తరఫున న్యాయవాదులమని చెప్పి వచ్చి, అతడికి ఏదైనా హాని తలపెడితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఈ కేసులో మీడియా ట్రయిల్ జరుగుతోందని, విచారణకు సంబంధించిన వివరాలను సలీం మీడియాకు తెలియచేశారని కోర్టుకు నివేదించారు. అందువల్ల ఈ కేసును బహిరంగంగా కాకుండా ఇన్ కెమెరా ప్రొసీడింగ్స్ ద్వారా విచారించాలని కోరారు. నిరాధార ఆరోపణలతో నిందితుడి తరఫున దాఖలు చేసిన మెమోలను కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ రెండు మెమోలపై ఉత్తర్వులను ఈ నెల 25న వెలువరిస్తానని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఈ కేసులో అటు రాష్ట్ర పోలీసుల సిట్, ఇటు ఎన్ఐఏ అధికారులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరపడంలేదని, ఈ కేసులో వారు ఏ పత్రాల మీద ఆధారపడుతున్నారో వాటిని తమకు అందచేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ శ్రీనివాసరావు తరఫున మరో మెమో దాఖలైంది. ఈ మెమోపై స్పందించాలని ఎన్ఐఏ ప్రత్యేక పీపీని న్యాయమూర్తి ఆదేశించారు.

ఏపీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ



సాక్షి, అమరావతి: రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ వెల్లడించారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఊమెన్ చాందీ మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా అనే నినాదంతోనే ఎన్నికల్లో ముందుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ తిరిగేందుకు ఫిబ్రవరి నుంచి బస్సుయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు ఈనెల 31న అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల ఇన్‌చార్జిలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఎవరూ అడగకపోయినా అగ్రవర్ణ పేదల పేరిట 10 శాతం రిజర్వేషన్లు, తదితర వాటిని ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి హామీ ఇచ్చిన, రాష్ట్ర ప్రజలు ఏకైక గొంతుగా అడుగుతున్న ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తప్ప ఏ పార్టీకి ఓటు వేసినా నష్టమే అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు సి.డి.మయ్యప్పన్, క్రిష్టాఫర్ తిలక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను తీవ్రంగా పరిగణించాలి

- కఠినంగా వ్యవహరిస్తే తప్ప అక్రమార్కులు దారిలోకి రారు
- టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని అక్రమ మైనింగ్ కేసులో హైకోర్టు వ్యాఖ్యలు
- పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీకి ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, నడికుడి తదితర ప్రాంతాల్లో జరిగిన అక్రమ లైమ్‌స్టోన్ తవ్వకాలను తీవ్రంగా పరిగణించాలని సీఐడీ అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి వ్యవహారాలను తేలిగ్గా తీసుకోవద్దని, కఠినంగా వ్యవహరిస్తే తప్ప అక్రమార్కులు దారిలోకి రారని వ్యాఖ్యానించింది. అక్రమ మైనింగ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎంత మందిపై కేసులు నమోదు చేశారు? ప్రస్తుతం ఆ కేసుల పరిస్థితేంటి? అలాగే ఎంత మంది సాక్షులను విచారించారు? తదితర వివరాలను తమ ముందుంచాలని సీఐడీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీకి చెందిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్థానిక నేతలతో కలిసి పిడుగురాళ్ల, నడికుడి, కేశనుపల్లి, దాచేపల్లి, కొండమోడులతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా యథేచ్ఛగా లైమ్‌స్టోన్ తవ్వకాలు చేస్తున్నారని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ పిడుగురాళ్లకు చెందిన కె.గురవాచారి 2015లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై అప్పట్లో విచారణ జరిపిన ధర్మాసనం అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయించడంతో పాటు బాధ్యుల నుంచి అక్రమ మైనింగ్ వల్ల కలిగిన నష్టాన్ని వసూలు చేయాలని అధికారులను ఆదేశించింది.

ఆదేశాలు అమలు కావడం లేదంటూ..

అయితే ధర్మాసనం ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని, టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని లైమ్‌స్టోన్ తవ్వకాలు కొనసాగిస్తున్నారని, రూ.31 కోట్ల మేర ప్రభుత్వానికి పన్నులు, సీనరేజీ చార్జీలు ఎగవేశారంటూ మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి 2016లో ఉమ్మడి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన అప్పటి సీజే నేతృత్వంలోని ధర్మాసనం.. అక్రమ మైనింగ్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ కేసులో సీబీఐ, కాగ్‌లను ప్రతివాదులుగా చేర్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అక్రమ మైనింగ్ వ్యవహారంపై హడావుడిగా సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. హైకోర్టు విభజన తర్వాత ఈ కేసు తొలిసారి బుధవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది డి.రమేశ్ స్పందిస్తూ.. గత విచారణ సమయంలో ధర్మాసనమిచ్చిన ఆదేశాల మేరకు సీఐడీ దర్యాప్తు పురోగతి నివేదికను సమర్పిస్తున్నామంటూ సీల్డ్ కవర్‌ను కోర్టు ముందుంచారు. ఆ సీల్డ్ కవర్‌లోని నివేదికను ధర్మాసనం పరిశీలించింది.

నష్టాన్ని వసూలు చేయండి..

నివేదికను పరిశీలిస్తే భారీస్థాయిలో అక్రమ మైనింగ్ జరిగినట్లు తేటతెల్లమవుతోందని ధర్మాసనం అభిప్రాయపడింది. అక్రమ మైనింగ్ వల్ల ఖజానాకు వాటిల్లిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఇటువంటి విషయాలను తీవ్రంగా పరిగణించాలని సీఐడీకి స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పటి వరకు ఎంత మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు? తదితర వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. అలాగే చార్జిషీట్ దాఖలు చేశారా.. లేదా? ఒకవేళ చార్జిషీట్ దాఖలు చేయకపోతే ఎందుకు చేయలేదో తెలపాలని సీఐడీకి స్పష్టం చేసింది.

కాపులకు బాబు మరో మోసం!

- ఈబీసీ 10% రిజర్వేషన్లలో కాపులకు 5% కోటాపై స్పష్టతనివ్వాలి
- కాపులకు కోటాపై అధ్యయనం చేసే ప్రకటించారా?
- ఓట్ల కోసం కులాల మధ్య చిచ్చుపెడుతున్న సీఎం
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కురసాల కన్నబాబు



కాకినాడ: అగ్రవర్ణాల్లోని పేదలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 10 శాతం రిజర్వేషన్లలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ ప్రకటించడం ద్వారా ఆ వర్గాన్ని మరోసారి మోసగించేందుకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మండిపడ్డారు. ఈబీసీ రిజర్వేషన్లలో కాపు కోటాపై శాస్త్రీయతను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఆయన తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం సీఎం చంద్రబాబు సున్నితమైన అంశాలను రాజకీయంగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఒకప్పుడు వర్గీకరణ పేరుతో ఎస్సీల మధ్య చిచ్చురేపిన బాబు ఇప్పుడు అదే తరహాలో రిజర్వేషన్ల పేరుతో అగ్రవర్ణాలకు, కాపులకు మధ్య కలహాలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

గెజిట్‌లో కులాల ప్రస్తావనే లేదు: ఈబీసీలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై సీఎం చంద్రబాబు స్పష్టతనివ్వాలని కన్నబాబు డిమాండ్ చేశారు. ఈబీసీ కోటాకు సంబంధించి గెజిట్‌లో ఆర్థికంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనే తప్ప కులాల ప్రస్తావన లేదని కన్నబాబు గుర్తు చేశారు. అలాంటప్పుడు ఈబీసీ కోటాలో కాపులకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అసలు ప్రభుత్వం అధ్యయనం చేసిందా అని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థం కోసం ఎంతకైనా దిగజారుతారనేందుకు చంద్రబాబు సర్కారు అనుసరిస్తున్న విధానాలే నిదర్శనమని పేర్కొన్నారు.

కాపులను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాపు కులస్తులు రోడ్డెక్కితే వారిపై అనేక కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్న ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా ఏటా రూ.వెయ్యి కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం రూ.1,700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. అలాగే ఎన్నికలకు ముందు చంద్రబాబు బీసీలకు 110 హామీలు ఇచ్చి ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేకపోయారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో తూర్పు గోదావరి జిల్లాలో 'జయహో బీసీ సభ' ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ సభ నిర్వహించేలోపు బీసీలకు ఇచ్చిన హామీలు, అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని కన్నబాబు డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కర్ణాసుల సీతారామాంజనేయులు, నురుకుర్తి రామకృష్ణ, చింతా ఈశ్వరరావు, రొక్కం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'కరెన్సీ' కల కరిగిపోయింది

- విదేశీ పురాతన నాణేల విలువను క్యాష్ చేసుకోవాలనుకున్న టీటీడీకి ఝలక్
- 55 టన్నుల మేర విదేశీ కరెన్సీ నిల్వలు..
- కొనుగోలుకు ముందుకు రాని బ్యాంకులు
- అయోమయ స్థితిలో అధికారులు

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అధికారుల అతి తెలివి.. అసలుకే మోసం తెచ్చింది. శ్రీవారి భక్తులు హుండీలో సమర్పించే విదేశీ కరెన్సీ నుంచి అతి ఎక్కువ విలువను ఆశించి.. చివరకు వాటికి అసలు విలువే లేకుండా చేశారు. ఇప్పుడు ఆ విదేశీ కరెన్సీ మార్చుకోలేక టీటీడీ ఆర్థిక విభాగం అధికారులు తలలు పట్టుకున్నారు. టన్నుల కొద్దీ నిల్వలను ఏం చేయాలో తెలియక కిందా మీదా పడుతున్నారు. శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాది మంది దేశ, విదేశీ భక్తులు తిరుమలకు తరలివస్తుంటారు. వారంతా తమ మొక్కుల చెల్లింపులో భాగంగా హుండీలో కానుకలు సమర్పిస్తుంటారు. ఇందులో పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా వస్తుంటుంది. ముఖ్యంగా మలేసియా, సింగపూర్ దేశాలకు చెందిన కరెన్సీ ఉంటోంది. 2003కు ముందు వీటిని టీటీడీ బరువు ఆధారంగా లెక్కించి అమ్మేది. ఆ తర్వాత విదేశీ నాణేలను వాటి విలువ ఆధారంగా మార్చడం మొదలుపెట్టారు. అయితే టీటీడీ ఆర్థిక విభాగం అధికారులకు ఒక గమ్మత్తయిన ఆలోచన వచ్చింది. కానుకల్లో వచ్చే విదేశీ నాణేల్లో పురాతన నాణేలు ఉంటాయని, వాటి విలువ మరింత ఎక్కువగా ఉంటుందని భావించిన అధికారులు.. ఆయా నాణేలను నిపుణుల చేత గుర్తించి విక్రయించాలని నిర్ణయించారు. టీటీడీ ఆర్థిక విభాగం అధికారుల ఆలోచనతో 2009 నుంచి విదేశీ నాణేల మారకం నిలిచిపోయింది. దీంతో ఇప్పటివరకు విదేశీ నిల్వలు 55 టన్నులకు చేరుకున్నాయి. వీటిలో పురాతన నాణేల కోసం నిపుణులు పరిశీలించింది కేవలం 25 టన్నులను మాత్రమే. చివరకు వారు కూడా చేతులెత్తేశారు.

వేలానికి స్పందన నిల్: రోజురోజుకూ పెరిగిపోతున్న విదేశీ నాణేల నిల్వలతో ఆందోళనకు గురైన టీటీడీ వాటిని వేలం వేయాలని నిర్ణయించింది. కాని టీటీడీ వేలం ప్రకటనకు ఎలాంటి స్పందన రాలేదు. 2013లో రిజర్వ్ బ్యాంక్‌ను కూడా సంప్రదించింది. అయితే అక్కడి నుంచి కూడా ఎలాంటి స్పందన రాకపోవడంతో కేంద్ర ఆర్థిక శాఖను ఆశ్రయించింది. నాణేలను దేశాలవారీగా లెక్కించి వాటిని బ్యాంకుల సహకారంతో సంబంధిత దేశాలకు పంపి సొమ్ము చేసుకోవాలని టీటీడీకి ఆర్థిక శాఖ, ఆర్బీఐ అధికారులు సూచించారు. ఈ వ్యవహారంలో సహకరించేందుకు ఐసీఐసీఐ బ్యాంకు ముందుకు వచ్చింది. దీంతో నాణేలను దేశాల వారీగా గుర్తించాలని ఐసీఐసీఐని టీటీడీ కోరింది. అయితే ఇందుకు వారు తిరస్కరించడంతో ప్రక్రియ మళ్లీ ఆగిపోయింది. తిరిగి 2017లో టీటీడీ 18 పబ్లిక్ సెక్టార్‌కు చెందిన బ్యాంకులు, 5 ప్రైవేట్ బ్యాంకులను మలేసియా నాణేలను మారకం చేసుకోవడానికి సంప్రదించింది. వీటిలో ఒక్క కోటక్ మహీంద్రా బ్యాంకు మాత్రమే స్పందించింది. 11 పైసలు విలువ ఉన్న ఒక మలేసియా సెన్‌కు 4 పైసలు చెల్లిస్తామని, 16.8 రూపాయల విలువ ఉన్న రింగెట్‌కు 40 పైసలే చెల్లిస్తామని చెప్పారు. మార్కెట్ విలువ చెల్లించాలని టీటీడీ కోరడంతో.. కోటక్ బ్యాంక్ వెనక్కి వెళ్లిపోయింది. మరోవైపు నిల్వలు రోజురోజుకు పెరుగుతుండటంతో ఈ ఏడాది జూన్‌లో మరోసారి టీటీడీ ప్రకటన ఇచ్చింది. దీంతో కోటక్ బ్యాంకు మాత్రమే గతంతో పోలిస్తే కాస్త ఎక్కువ మొత్తం చెల్లించేందుకు ముందుకు వచ్చింది. గతంలో సెన్‌కు 5 పైసలు, ఒక రింగెట్‌కు 49 పైసలు చెల్లిస్తామని స్పష్టం చేసింది. అయితే ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న వివాదాస్పద అంశం కావడంతో టీటీడీ ప్రస్తుత పాలకమండలి ఈ ప్రతిపాదనలను తాజాగా పక్కన పెట్టేసింది. దీంతో విదేశీ కరెన్సీ నిల్వలు గుట్టల్లా పేరుకుపోతుండటంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఎన్ఐఏ అంటేనే బాబుకు వణుకు

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ధ్వజం
- జగన్‌పై హత్యాయత్నం కేసులో వాస్తవాలు బయటపడతాయని సీఎంకు భయం.. అందుకే విచారణను అడ్డుకునే కుట్ర



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు భయపడుతున్నారని పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ చెప్పారు. అందుకే ఎన్ఐఏ విచారణకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. విచారణ జరిగితే హత్యాయత్నం వెనుక దాగి ఉన్న కుట్ర, తెరవెనుక ఉన్న కీలక వ్యక్తుల పేర్లు బయటపడతాయని చంద్రబాబు భీతిల్లుతున్నారని పేర్కొన్నారు. వాసిరెడ్డి పద్మ బుధవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖ విమానాశ్రయంలో జరిగిన సంఘటనతో తమకేం సంబంధం లేదని, అది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశమని తొలత చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుంటే మళ్లీ నాలుక మడతవేశారని మండిపడ్డారు. చంద్రబాబు ఇప్పటికే 'సిట్' విచారణను నీరుగార్చేలా చేశారని విమర్శించారు. కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు, సాక్ష్యాధారాలను ఎన్ఐఏకు ఇవ్వకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు. 15 రోజులుగా చంద్రబాబు వ్యాపకం అంతా ఎన్ఐఏ విచారణపైనే కేంద్రీకతం అయిందన్నారు. చివరకు కేంద్ర హోంమంత్రికి లేఖ కూడా రాశారని గుర్తుచేశారు. ఎన్ఐఏ విచారణ అంటే చంద్రబాబుకు ఎందుకంత భయమని నిలదీశారు. వాసిరెడ్డి పద్మ ఇంకా ఏం మాట్లాడారంటే.. "ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక భౌతికంగా అంతం చేయడానికి ప్రయత్నించారు. తన వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారన్న విషయం చంద్రబాబుకు తెలిసి కూడా విచారణకు అడ్డ తగులుతున్నారు. ప్రజలు ఆయనకు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారు. ఏపీలో 15 రోజులుగా పాలన కుంటుపడింది. సీఎం కోల్‌కతాకు వెళ్లారు, ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీని కలిసి వచ్చారు. అయితే ఇతర జాతీయ నేతల అపాయింట్‌మెంట్లు చంద్రబాబుకు లభించడం లేదు. వివిధ రాజకీయ పార్టీల నేతలను బలవంతంగా కౌగలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు చేస్తున్న పర్యటనలేవీ రాష్ట్ర శ్రేయస్సు కోసం కాదు, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే.

ఓటమి భయంతోనే ఈవీఎంలపై సాకులు

వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి చంద్రబాబు ఈవీఎంల అంశాన్ని సాకుగా భుజాలపైకి ఎత్తుకున్నారు. 2014 ఎన్నికల్లో, నంద్యాల ఉప ఎన్నికలో చంద్రబాబు ఈవీఎంలను టాంపరింగ్ చేసే గెలిచారా? చంద్రబాబు– కాంగ్రెస్‌ది దుష్ట చతుష్టయ కూటమి. చంద్రబాబు మరోవైపు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను దువ్వుతున్నారు. ఒకవైపు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య రహస్య అవగాహన కొనసాగుతుండగా, మరోవైపు కాంగ్రెస్‌తోనూ బాబు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

జీవో నెం.5 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య

సాక్షి, అమరావతి: జీఓ నెంబర్ 5 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం అంటూనే ఆయా వర్గాలకు నష్టం కలిగించేలా జీఓలు జారీ చేస్తున్నారని టీడీపీ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఏపీపీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు నిర్వహించిన ఉద్యోగ నియామక ప్రిలిమినరీ పరీక్షలకు హాజరైన అభ్యర్థుల నుంచి 1:50 నిష్పత్తిలో మెయిన్ పరీక్షకు ఎంపిక చేసే విషయంలో రిజర్వేషన్లను పాటించడం లేదన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.5 వల్ల బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ జీఓ జారీ చేయడం వల్ల ఒక అభ్యర్థి ప్రిలిమినరీ పరీక్షలో రిజర్వేషన్ కోటా కింద అర్హత సాధించి మెయిన్స్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించినప్పటికీ అతన్ని జనరల్ కోటా కింద పరిగణించడం లేదన్నారు. జీఓని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నైతిక విలువలకు పట్టం..
ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం



- నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్
- ఓ పార్టీ నుంచి మారేటప్పుడు అధికార పదవులు వీడాల్సిందేనని స్పష్టీకరణ
- ఆదర్శవంతమైన రాజకీయాలకు జగన్ పెద్దపీట
- ఎమ్మెల్సీ పదవి వదులుకుని పార్టీలో చేరిన చక్రపాణిరెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరేందుకు మేడా సన్నద్ధం

సాక్షి, అమరావతి: రాజకీయ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, నైతికత వంటి నీతి సూత్రాలను వల్లె వేయడమే గానీ ఆచరణలో వాటికి కట్టుబడి ఉండే రాజకీయ నాయకులు కరువవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైతిక విలువలకు పెద్దపీట వేస్తూ ఆదర్శవంతమైన రాజకీయాలకు చిరునామాగా మారారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారు. ఎవరైనా పార్టీలోకి రావాలంటే.. అప్పటిదాకా అనుభవిస్తున్న పదవులకు రాజీనామా చేశాకే రావాలని జగన్ గట్టిగా సూచిస్తున్నారు. అలా పదవులు వదులుకుని వచ్చిన వారినే వైఎస్సార్‌సీపీలో చేర్చుకుంటున్నారు.

రాష్ట్రంలో నిస్సిగ్గుగా ఎమ్మెల్యేల కొనుగోళ్లు

ఓ పార్టీ గుర్తుపై గెలుపొంది, మరో పార్టీలోకి ఫిరాయించడం ఏపీ రాజకీయాల్లో సర్వసాధారణంగా మారిపోయింది. స్వీయ ప్రయోజనాల కోసం, ప్రలోభాలకు లొంగి అధికారంలో ఉన్న పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ టికెట్‌పై నంద్యాల నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఎస్పీవై రెడ్డి ఓట్ల లెక్కింపు పూర్తి కాక ముందే చంద్రబాబు పంచన చేరిపోయారు. తరువాత మరో ఇద్దరు ఎంపీలు అదేబాట పట్టారు. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలనే కుట్రతో చంద్రబాబు ఎమ్మెల్యేల కొనుగోళ్లకు తెర లేపారు. ఒక్కొక్క ఎమ్మెల్యేకు రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లు, ఇతర ప్రయోజనాలను ఎర చూపి వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనేశారు. సొంత పార్టీలో చేర్చుకున్నారు. కొనుగోలు చేసిన వారిలో నలుగురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా కట్టబెట్టారు. చంద్రబాబు సాగిస్తున్న అనైతిక, అప్రజాస్వామిక రాజకీయాలపై ప్రజాస్వామ్యవాదులు ఆగ్రహం వ్యక్తం చేసినా ఆయన లెక్కచేయలేదు. ఓవైపు ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూనే.. మరోవైపు ప్రజాస్వామ్య పరిరక్షణ, విలువలు, నైతికత, హుందా రాజకీయాలు అంటూ నీతిపాఠాలు చెప్పడం చంద్రబాబుకే సాధ్యమైంది. తెలంగాణలో టీడీపీ ఎమ్మెల్యేలు అధికార టీఆర్‌ఎస్‌లోకి ఫిరాయించినపుడు కూడా సంతలో పశువులు కొన్నట్లు కొంటున్నారని చంద్రబాబు గగ్గోలు పెట్టారు. ఏపీలో పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు పడకుండా జాగ్రత్తపడ్డారు. స్పీకర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు.

జగన్ తీరుపట్ల ప్రజాస్వామ్యవాదుల హర్షం

ప్రజాస్వామ్య విలువలకు సాక్షాత్తూ పాలకులే తూట్లు పొడుస్తున్న ఏపీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా, ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా నీతికి, నిజాయతీకి, నైతిక విలువలకు, విశ్వసనీయతకే కట్టుబడి ఉన్నారు. 2017లో నంద్యాల అసెంబ్లీకి ఉప ఎన్నికల సందర్భంగా.. పదవికి రాజీనామా చేయనిదే వైఎస్సార్‌సీపీలో చేరడానికి వీల్లేదని అప్పటి టీడీపీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డికి షరతు విధించారు. అప్పటికి చక్రపాణిరెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికై మూడు నెలలు కూడా కాలేదు. ఇంకా దాదాపు ఆరేళ్ల పదవీ కాలం ఉంది. అయినా ఒక పార్టీ తరఫున ఎన్నికై మరో పార్టీలో చేరాలంటే అంతకు ముందు సంక్రమించిన పదవి నుంచి కచ్చితంగా నిష్క్రమించాలనే విధానానికే జగన్ విలువనిచ్చారు. వైఎస్సార్‌సీపీలోకి వచ్చే ముందు టీడీపీ తరఫున సంక్రమించిన (ఎన్నికైన) ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సిందేనని చక్రపాణిరెడ్డిని జగన్ కోరారు. ఆ ప్రకారమే చక్రపాణిరెడ్డి తన ఎమ్మెల్సీ పదవిని తృణప్రాయంగా వదిలేశారు. నంద్యాల బహిరంగ సభా వేదికపైనే తన రాజీనామా లేఖను జగన్‌కు సమర్పించారు. తాజాగా వైఎస్సార్ జిల్లా రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాలన్న తన అభీష్టాన్ని వెల్లడించారు. టీడీపీ పార్టీతో సంక్రమించిన ఎమ్మెల్యే పదవిని వీడిన తర్వాతే తమ పార్టీలోకి రావాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఆ మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తరువాతే వైఎస్సార్‌సీపీలో చేరేందుకు మేడా మల్లికార్జునరెడ్డి సన్నద్ధమవుతున్నారు. అనైతిక రాజకీయాలతో సంఖ్యాబలం పెంచుకోవడం కాదు, నైతిక విలువలకు కట్టుబడి, ప్రజాస్వామ్యం నిలబడాలనే ఉదాత్తమైన ఆశయం కోసం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరుపట్ల ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ బంగాళాఖాతానికి ఆనుకుని హిందూ మహాసముద్రం భూమధ్య రేఖా ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. బుధవారం నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అదే సమయంలో ఉపరితల ఆవర్తన ప్రాంతం నుంచి రాయలసీమ మీదుగా తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. వీటన్నిటితో పాటు పశ్చిమ ఆటంకాలు (వెస్టర్న్ డిస్టర్బెన్సెస్), తూర్పు గాలుల కలయికతో శుక్రవారం నుంచి కోస్తాంధ్రలో, శనివారం నుంచి రాయలసీమలోనూ మూడు రోజులపాటు అక్కడక్కడ తేలికపాటి వర్షం గానీ, జల్లులు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో 27న కోస్తాంధ్రలో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్రలో చలి కొనసాగుతోంది. సాధారణంకంటే 2–4 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
విశాఖపట్నం	15
కళింగపట్నం	15
ఆరోగ్యవరం	15
నంద్యాల	17
అనంతపురం	17
అమరావతి	17
జంగమహేశ్వరపురం	17
నందిగామ	17
బాపట్ల	18
తుని	18
తిరుపతి	18
కర్నూలు	19
కడప	19
విజయవాడ	19
నర్సాపురం	19

టీడీపీ వల్లే కాపు రిజర్వేషన్లు

మంత్రి గంటా శ్రీనివాసరావు

పెదవాల్తేరు (విశాఖ తూర్పు): రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విశాఖపట్నంలోని సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఈబీసీలకు కల్పించిన 10 శాతం రిజర్వేషన్లలో 5 శాతం కాపులకు ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. కాపులను బీసీల్లో చేర్చేందుకు సంబంధించిన నివేదికను ఏడాది క్రితమే కేంద్రానికి పంపించామన్నారు. విశాఖలో నిర్మించే కాపు భవన్‌కు రూ.5 కోట్లు కేటాయించినట్టు గంటా పేర్కొన్నారు. అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో కాపులకు రిజర్వేషన్లు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బి.ఉదయలక్ష్మి, యలమంచిలి ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ర కులాల్లో సగానికిపైగా కాపులు

టీడీపీ నాయకులతో చంద్రబాబు

సాక్షి, అమరావతి: అగ్రకులాల్లో కాపులు సగానిపైగా ఉన్నారని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల శాతమే ఎక్కువని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అందుకే కేంద్రం ప్రకటించిన ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లలో వారికి ఐదు శాతం ఇస్తున్నామని తెలిపారు. బీజేపీ, వైసీపీకి ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలతో బుధవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తాము కాపులకు మేలు చేస్తే వక్రీకరిస్తున్నారన్నారు. కులాల్లో చిచ్చుపెట్టాలని వైసీపీ, బీజేపీ నేతలు చూస్తున్నారని ఆరోపించారు. అవినీతిని 85 శాతం నియంత్రించామని మోదీ అనడం హాస్యాస్పదమని, ఆయన పాలనలో సంస్కరణలు పడకేశాయని విమర్శించారు. ఉద్యోగాల సృష్టి సక్రమంగా లేదని, ఆర్‌బీఐకి గతంలో ఉన్న స్వేచ్ఛ ఇప్పుడు లేదన్నారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, దాన్ని పక్కదారి పట్టించాలని బీజేపీ చూస్తోందని చెప్పారు. మళ్లీ బ్యాలెట్ పేపర్ కావాలనేది అందరి డిమాండ్ అని.. లేకపోతే వీవీ ప్యాట్ రశీదులు 100 శాతం నియోజకవర్గాలకు ఇవ్వాలన్నారు. దావోస్‌లో లోకేష్ బృందం సత్ఫలితాలు సాధిస్తోందని చంద్రబాబు కితాబిచ్చారు.

వంగవీటి రాధా ఇంటికి టీడీపీ ఎమ్మెల్సీలు

పార్టీలో చేరికపై చర్చించేందుకు పంపిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను టీడీపీలోకి ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబు ఇద్దరు ఎమ్మెల్సీలను ఆయన ఇంటికి పంపించారు. ఎమ్మెల్సీలు టీడీ జనార్ధన్, బచ్చుల అర్జునుడులు బుధవారం విజయవాడలోని వంగవీటి రాధాకృష్ణ ఇంటికి వెళ్లి టీడీపీలో చేరాలని కోరారు. చంద్రబాబు సూచనల మేరకు తాము వచ్చామని పేర్కొన్నారు. అనంతరం టీడీ జనార్ధన్, బచ్చుల అర్జునుడు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాధాకృష్ణను టీడీపీలోకి ఆహ్వానించామని చెప్పారు. గురువారం వంగవీటి రాధా మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తారని చెప్పారు. కాగా, ఈ నెల 25వ తేదీన వంగవీటి రాధా టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

కత్తులు లేకుండా రెస్టారెంట్‌లో ఎలా పనిచేస్తారు?

- శ్రీనివాసరావుతో నేనెప్పుడూ ప్రత్యేకంగా మాట్లాడలేదు
- టీడీపీ నేత, ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి వెల్లడి

గాజువాక: కత్తులు లేకుండా రెస్టారెంట్‌లో ఎలా పనిచేస్తారని టీడీపీ నేత, ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి మీడియాను ప్రశ్నించారు. కోడికత్తి ఎలా వచ్చిందో తనకు తెలియదన్నారు. నిందితుడు శ్రీనివాసరావు కత్తిని ఎప్పుడు తీసుకెళ్లాడో, ఎందుకు తీసుకెళ్లాడో తెలియదని చెప్పారు. గాజువాకలో స్థానిక పంతులుగారి మేడ వద్ద తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో హర్షవర్ధన్ చౌదరి మాట్లాడారు. ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో విచారణకు తాను పూర్తి స్థాయిలో సహకరిస్తున్నానని తెలిపారు. తాను పారిపోయానని, విచారణకు సహకరించడం లేదని మీడియాలో వస్తోందని అందులో వాస్తవం లేదని అన్నారు. తాను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నానని, మెట్లు ఎక్కలేనని చెప్పడంతో ఎన్ఐఏ అధికారులు తన నివాసానికి రెండుసార్లు వచ్చి కావాల్సిన సమాచారాన్ని తీసుకున్నారని వెల్లడించారు. ఎన్ఐఏ అధికారులు కోర్టుకు నివేదిక ఇవ్వాల్సి ఉందని, తనపై కూడా అభియోగం ఉండటంతో తాను కేసుకు సంబంధించిన విషయాలను మాట్లాడలేనన్నారు. ఎయిర్‌పోర్టులో ప్రవేశించడానికి కట్టుదిట్టమైన సెక్యూరిటీ చెకింగ్‌తోపాటు రెస్టారెంట్‌లోకి తీసుకెళ్లే ప్రతి వస్తువుకు నంబర్ ఉంటుంది కదా.. అలాంటప్పుడు మీ రెస్టారెంట్‌లోకి కోడికత్తి ఎలా వెళ్లిందని మీడియా ప్రశ్నించగా ఎయిర్‌పోర్టులో పనిచేసే సిబ్బంది లోపలకు వెళ్లేటప్పుడు ఎటువంటి తనిఖీ ఉండదని ఆయన చెప్పారు. విమానాలు ఎక్కేవారికి మాత్రమే తనిఖీ ఉంటుందని, సిబ్బంది ఏ వస్తువునైనా తీసుకెళ్లవచ్చని తెలిపారు.

పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్నా..

మీరు టీడీపీ నేత కాబట్టి మిమ్మల్ని రక్షించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, విచారణ కూడా టీడీపీకి అనుకూలంగా జరుగుతున్నట్టు ప్రచారం సాగుతోందని మీడియా ప్రశ్నించగా.. తాను టీడీపీ అభిమానినని, పార్టీ ఆవిర్భావం నుంచి అందులో ఉన్నానని హర్షవర్ధన్ చౌదరి చెప్పారు. అంతమాత్రాన టీడీపీ చెప్పిన తప్పుడు పనులు చేస్తానని ఊహించడం తగదన్నారు. ఎన్ఐఏ విచారణను ఆపాలని ప్రభుత్వం కోర్టుకు ఎందుకెళ్లింది? మిమ్మల్ని కాపాడటానికే కాదంటారా? అని ప్రశ్నించగా.. తాను ప్రభుత్వంలో లేనని ప్రభుత్వంలో ఉన్నవారిని అడిగితే చెబుతారన్నారు. వీఐపీ లాంజ్‌లో తమ సేవలు ఉండవని, ఎవరైనా వీఐపీకి టీ, కాఫీ ఇవ్వండని ప్రభుత్వ అధికారులు పిలిస్తే వారితో కలిసి తమ పనివాళ్లు వెళ్తారని చెప్పారు. హత్యాయత్నం ఎవరు చేసి ఉంటారో తనకు తెలియదన్నారు.

వర్సిటీ పోస్టుల నోటిఫికేషన్లన్నీ రద్దే!



▶ మొదటి పేజీ తరువాయి

వర్గాలు పేర్కొంటున్నాయి.

న్యాయ వివాదాలున్నా ముందుకే..

రాష్ట్రంలోని వర్సిటీల్లో 4 వేలకు పైగా బోధనా పోస్టులు ఖాళీగా ఉండగా రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వం వీటిని 1,385కి కుదించింది. 1,104 పోస్టులను ఒకదశలో, 281 పోస్టులను రెండో దశలో భర్తీ చేసేలా ఉత్తర్వులు ఇచ్చింది. వీటిల్లో ప్రొఫెసర్ పోస్టులు 101, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 174, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 1,110 ఉన్నాయి. రేషనలైజేషన్ ప్రక్రియ అంతా తప్పుల తడకలా సాగిందనే విమర్శలున్నాయి. ప్రొఫెసర్ పోస్టులను అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుగా మార్చడం, ఒక విభాగం పోస్టులను వేరే విభాగానికి మళ్లించడంపై న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలు కాగా స్టే ఉత్తర్వులు కూడా వచ్చాయి. స్వయం ప్రతిపత్తి ఉన్న వర్సిటీల పోస్టులను ప్రభుత్వం ఉన్నత విద్యామండలి కమిటీ ద్వారా ఎలా రేషనలైజేషన్ చేస్తుందని కోర్టు మొట్టికాయలూ వేసింది. దీంతో ప్రభుత్వ పెద్దలు అవే జాబితాలను యూనివర్సిటీల ద్వారా ఆమోదింపచేసి మమ అనిపించారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంపైనా అభ్యంతరాలు వచ్చాయి. న్యాయ వివాదాలు చుట్టుముట్టినా ప్రభుత్వం ముందుకే వెళ్లింది.

నిరుద్యోగులపై రూ.8 కోట్ల ఫీజుల బాదుడు

వర్సిటీల్లో పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ పరీక్ష కోసం నిరుద్యోగులపై ఫీజుల పేరుతో పెనుభారం మోపారు. ఒక్కో పోస్టుకు రూ.1,000 చొప్పున వసూలు చేశారు. ఒకేరకం పోస్టుకు దరఖాస్తు చేసుకున్నా ఎన్ని యూనివర్సిటీలకు సమర్పిస్తే అంతమేరకు ఫీజులు వసూలు చేశారు. ఇలా ఈ పరీక్షలకు హాజరైన వారి నుంచి రూ.8 కోట్ల వరకు ఫీజులు వసూలు చేశారని చెబుతున్నారు. మరోవైపు ఏపీపీఎస్సీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్ష సివిల్ సర్వీస్ కన్నా కఠినంగా ఉందని అభ్యర్థులు వాపోయారు.

ఒకే సామాజిక వర్గానికి పోస్టులు..

ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను ఒకే సామాజిక వర్గానికి దక్కేలా చేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనంతపురంలోని ఓ వర్సిటీలో 9 పోస్టులను భర్తీ చేయగా 7 పోస్టులు అధికార పార్టీ ముఖ్యుల సామాజిక వర్గానికే దక్కాయని పేర్కొంటున్నారు. సుప్రీం ఉత్తర్వులు అడ్డంకిగా ఉన్నా నియామకాలు హడావుడిగా ముగించాలని ఉన్నత విద్యామండలి అధికారులు ప్రయత్నించడాన్ని మానవవనరుల శాఖ వర్గాలు తప్పుబడుతున్నాయి.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యమిదీ...

బోధనా పోస్టుల భర్తీలో ఆయా వర్సిటీలను యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. కొన్ని విభాగాల్లో ఒకే రకమైన రోస్టర్ పాయింట్లు రావడం, ఇతర కారణాలతో కొన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోంది. దీనిపై ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ వర్సిటీలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఆయా విభాగాలు యూనిట్‌గా రిజర్వేషన్లు అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు కాగా అత్యున్నత న్యాయస్థానం కూడా విభాగం యూనిట్‌గానే తీసుకోవాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దీనిపై మానవ వనరుల అభివృద్ధి శాఖ కౌంటర్ దాఖలు చేస్తూ వర్సిటీ యూనిట్‌గా రిజర్వేషన్ల అమలుకు ఆదేశించాలని కోరగా సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులనే ఖరారు చేస్తూ తుది తీర్పు వెలువరించింది.

ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలు

ఆంధ్రా యూనివర్సిటీ	391
శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ	201
నాగార్జున వర్సిటీ	97
శ్రీకృష్ణదేవరాయవర్సిటీ	118
శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీ	29
ద్రవిడ వర్సిటీ	18
యోగి వేమన వర్సిటీ	68
జేఎన్‌టీయూ అనంతపురం	158
జేఎన్‌టీయూ కాకినాడ	41
ఆదికవి నన్నయ వర్సిటీ	39
బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ	48
కృష్ణా యూనివర్సిటీ	40
రాయలసీమ వర్సిటీ	61
విక్రమ సింహపురి వర్సిటీ	76
మొత్తం	1,385

జమ్మలమడుగుపై పీటముడి!

మంత్రి ఆది, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలతో సీఎం మంతనాలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు అసెంబ్లీ సీటు విషయంలో తెలుగుదేశం పార్టీలో పడిన పీటముడి ఎంతకూ తెగడం లేదు. ఈ సీటు విషయంలో మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పట్టు వీడకపోవడంతో చంద్రబాబుకు తలనొప్పి తప్పడం లేదు. ఈ స్థానాన్ని ఎవరికివ్వాలనే దానిపై చర్చించేందుకు చంద్రబాబు ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డితో బుధవారం ఉండవల్లిలో సమావేశమై మంతనాలు జరిపారు. ఇద్దరిలో ఒకరు కడప ఎంపీగా పోటీ చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా సీఎం వారికి స్పష్టం చేశారు. అయితే ఇద్దరూ జమ్మలమడుగు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేస్తామంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఏమీ పాలుపోని పరిస్థితుల్లో మీరే తేల్చుకోవాలంటూ చంద్రబాబు వారిద్దరికి సూచించినట్లు సమాచారం. నియోజకవర్గంపై తనకు మంచి పట్టు ఉందని, తనకే ఎమ్మెల్యే సీటివ్వాలని మంత్రి ఆదినారాయణరెడ్డి గట్టిగా డిమాండ్ చేస్తుండడం, అదే సమయంలో రామసుబ్బారెడ్డి సైతం అదేమాట చెబుతుండడంతో చంద్రబాబు నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో జమ్మలమడుగులో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన ఆదినారాయణరెడ్డి టీడీపీలోకి ఫిరాయించి మంత్రి పదవి పొందారు. ఓడిపోయిన రామసుబ్బారెడ్డికి చంద్రబాబు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి బుజ్జగించారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఈ స్థానం విషయమై ఇద్దరూ పట్టు వీడటం లేదు.



నేడు పీఎస్ఎల్వీ సీ44 ప్రయోగం

లాంఛనంగా కౌంట్‌డౌన్ ప్రారంభం

శ్రీహరికోట(సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి గురువారం రాత్రి 11.37 గంటలకు సరికొత్త పీఎస్ఎల్వీ సీ44 (పీఎస్ఎల్వీ–డీఎల్) ఉపగ్రహ వాహక నౌకను ప్రయోగించనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం రాత్రి 7.37 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించారు. బుధవారం ఎంఆర్ఆర్ కమిటీ చైర్మన్ బీఎన్ సురేష్ ఆధ్వర్యంలో మిషన్ రెడినెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం నిర్వహించి రాకెట్‌కు తుది విడత తనిఖీలు నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్)కు అప్పగించారు. ల్యాబ్ చైర్మన్ ఎస్.పాండ్యన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాక.. ప్రయోగానికి 28 గంటల ముందు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. పీఎస్ఎల్వీ రాకెట్‌లలో సరికొత్త రాకెట్ ఇది. అంటే రెండే రెండు స్ట్రాపాన్‌బూస్టర్ల సాయంతో చేస్తున్న ప్రయోగం కనుక దీనికి పీఎస్ఎల్వీ–డీఎల్ అని నామకరణం చేశారు. ఈ తరహా రాకెట్‌ను మొట్టమొదటి సారిగా ఇస్రో ప్రయోగిస్తోంది. ఉపగ్రహాల బరువు చాలా తక్కువ కావడంతో ఖర్చు తగ్గించుకోవడానికి రెండు స్ట్రాపాన్ బూస్టర్లతో ప్రయోగం చేస్తున్నారు. ఈ ప్రయోగంలో తమిళనాడులో హైస్కూల్ విద్యార్థుల బృందం తయారు చేసిన కలాం శాట్, మైక్రో శాట్–ఆర్ అనే రెండు తేలికపాటి ఉపగ్రహాలను భూమికి అత్యంత చేరువలోని సూర్యానువర్తన కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. పీఎస్ఎల్వీ రాకెట్ సిరీస్‌లో ఇది 46వ ప్రయోగం కాగా.. షార్ కేంద్రం నుంచి 70వ ప్రయోగం కావడం విశేషం.

ప్రయోగమిలా..

ఈ ప్రయోగంలో పీఎస్ఎల్వీ నాలుగో దశ (పీఎస్04 మోటార్)ను ఎక్స్‌పరమెంటల్‌గా రిస్టార్ట్ చేయడానికి డిజైన్ చేశారు. అదే విధంగా పీఎస్–4 దశలోనే అమర్చిన కలాం శాట్‌ను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో, మైక్రోశాట్–ఆర్‌ను 274.2 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. అయితే పీఎస్–4ను ప్రయోగాత్మకంగా రెండుసార్లు రీస్టార్ట్ చేయనున్న దృష్ట్యా.. 54 వేల సెకండ్లు (15 గంటల) సమయాన్ని తీసుకుంటున్నారు. మొదటి రీస్టార్ట్ 3,275 సెకండ్లకు, రెండోసారి రీస్టార్ట్‌ను 6,026 సెకండ్లకు చేయనున్నారు. ఈ ప్రయోగాత్మక పరీక్ష పూర్తయ్యే సరికి 15 గంటల సమయం పడుతుంది. అయితే మొదటి దశలోని రెండు స్ట్రాపాన్ బూస్టర్లు నింపిన 24.4 టన్నుల ఘన ఇంధనం, కోర్ అలోన్ దశలో నింపిన 139 టన్నుల ఘన ఇంధన సాయంతో 44.4 మీటర్ల పొడవు, 290 టన్నుల బరువు కలిగిన పీఎస్ఎల్వీ–డీఎల్ రాకెట్ ప్రయాణాన్ని ప్రారంభించి.. 109 సెకండ్లలో మొదటి దశను పూర్తి చేయనున్నారు. రెండో దశలో నింపిన 4.1 టన్నుల ద్రవ ఇంధనంతో 262 సెకండ్లకు పూర్తి చేయనున్నారు. అందుకు ముందే అంటే 168 సెకండ్లకే హీట్‌షీల్డు తెరుచుకుంటాయి. 7.65 టన్నుల ఘన ఇంధనంతో మూడో దశను 387 సెకెండ్లకు, 1.6 టన్నుల ద్రవ ఇంధనంతో.. 766 సెకండ్లకు నాలుగో దశను పూర్తి చేయనున్నారు. తర్వాత 813 సెకండ్లకు (13.55 నిమిషాల్లో) పూర్తి చేసేలా డిజైన్ చేసుకున్నారు.

విశాఖలో కాలుష్య నియంత్రణ ల్యాబొరేటరీ ప్రారంభం



ల్యాబొరేటరీని ప్రారంభిస్తున్న మంత్రి శిద్ధా

ఎన్ఏడీజంక్షన్ (విశాఖ): దక్షిణ భారత్‌లో కాలుష్య నియంత్రణ తొలి ల్యాబొరేటరీని విశాఖలో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు బుధవారం ప్రారంభించారు. దీంతో పాటు మొబైల్ ల్యాబొరేటరీలను కూడా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. దక్షిణ భారత్‌లో అత్యాధునిక ల్యాబొరేటరి ఇదేనని మన దేశంలో మూడు ల్యాబొరేటరీలు ఉన్నాయని చెప్పారు. గతంలో కొన్ని పరీక్షలకు ఇతర ప్రాంతాలకు, దేశాలకు పంపించేవారని ఈ ల్యాబొరేటరీని అభివృద్ధి చేయడంతో ఈ పరిస్థితి నుంచి బయటపడ్డామని వివరించారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసే క్రమంలో కొన్ని పరీక్షలు ఇక్కడే చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ ల్యాబొరేటరీకి ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.20 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో దేశంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. మంత్రి గంటా మాట్లాడుతూ.. హుద్‌హుద్ తుపాను తరువాత విశాఖలో ఈ స్థాయిలో పచ్చదనం పెంపొందడానికి అటవీశాఖ, పరిశ్రమల యాజమాన్యాలు చేసిన కృషిని ప్రశంసించారు. కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ బీఎస్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణ మండలిలో ఆధునికీకరించిన ల్యాబొరేటరీలో కాలుష్య కారకాలను అత్యంత సూక్ష్మపరిమాణంలో విశ్లేషించవచ్చని పేర్కొన్నారు.

జగన్‌పై హత్యాయత్నం వెనుక సీఎం, లోకేష్

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స ధ్వజం
- అందుకే ఎన్ఐఏ విచారణకు మోకాలొడ్డుతున్నారు

సాక్షి, విశాఖపట్నం: ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, ఇంటెలిజెన్స్ డీజీ వెంకటేశ్వరరావు పాత్ర ఉందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ కుట్రలో వారి పాత్ర లేకపోతే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) విచారణ ఎందుకు వద్దంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ సిటీ పార్టీ కార్యాలయంలో బొత్స మీడియాతో మాట్లాడారు. జగన్‌పై హత్యాయత్నం వెనుక దాగి ఉన్న కుట్రకోణంపై దర్యాప్తు సాగుతోందని హైకోర్టులో ఎన్ఐఏ అఫిడవిట్ ఫైల్ చేసిందని తెలిపారు. ప్రభుత్వం మాత్రం ఎన్ఐఏ విచారణే అవసరం లేదంటూ కౌంటర్ అఫిడవిట్ ఫైల్ చేయడం చూస్తుంటే తమ నేతపై జరిగిన హత్యాయత్నం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని స్పష్టమవుతుందని చెప్పారు. ఓ ప్రతిపక్ష నేతపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించే కనీస సంస్కారం లేని ప్రభుత్వ పెద్దలు ఓ డీఎస్పీ స్థాయి అధికారితో ఏర్పాటు చేసిన సిట్‌తో విచారణ జరపడమే పెద్ద కుట్రని తెలిపారు. కోర్టు ఆదేశాలతో కేంద్రం ఎన్ఐఏ విచారణకు ఆదేశిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకుండా డ్రామాలాడుతోందని విమర్శించారు.



కాపులు మరీ అంత అమాయకులు కాదు

అగ్రవర్ణాల్లో పేదలకు కేంద్రం ఇచ్చిన పది శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు ఇచ్చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సహచరులు కాపులను మభ్యపెట్టేందుకు చేస్తున్న ప్రకటనలు నమ్మే స్థితిలో కాపులు ఎంతమాత్రం లేరన్నారు. కాపులు మరీ అంత అమాయకులు, అవివేకులు, నిర్లక్ష్యరాస్యులు కాదన్నారు. అగ్రవర్ణాల్లో పేదలకు పది శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రం రాజ్యాంగ సవరణ చేసిందని, ఇందుకోసం కేంద్రం రూపొందించే గైడ్‌లైన్స్‌లో ఒక్క లైను కాదు.. కదా కనీసం ఒక్క పదం కూడా దాటి ఏ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇష్టమొచ్చినట్టుగా మార్చడం కుదర దని స్పష్టం చేశారు. కేవలం రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాపులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. పొత్తుల విషయంలో తమ పార్టీ విధానాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారని చెప్పారు. చంద్రబాబుకు చిన్నమెదడు చితికి పోవడం వల్లనే ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారని బొత్స ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యానంతరం గడచిన 70 ఏళ్లలో రూ.90వేల కోట్ల అప్పులున్న ఏపీని.. గడచిన నాలుగున్నరేళ్లలో రూ.2.40లక్షల కోట్ల అప్పులకు చేర్చి..అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు.

దావోస్‌లోనూ పాత ఒప్పందాలే

- ప్రచారంలో తండ్రిని మించి పోతున్న తనయుడు నారా లోకేష్
- జిందాల్‌తో రూ.3,500 కోట్ల ఒప్పందమంటూ ప్రచారం
- ఇప్పటికే ఇదే విషయాన్ని పలుమార్లు చెప్పిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: గొప్పలు చెప్పుకోవడంలో మంత్రి నారా లోకేష్ తన తండ్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మించిపోతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో వివిధ సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందాలనే దావోస్‌లో కొత్త ఒప్పందాలుగా ప్రచారం చేసుకోవడమే దీనికి నిదర్శనం. రామాయపట్నం పోర్టులో నిర్మిస్తున్న 8 బెర్తుల్లో రెండు బెర్తులను జేఎస్‌డబ్ల్యూ సొంత అవసరాలకు కేటాయిస్తూ గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. అలాగే రామాయపట్నం సమీపంలో స్టీల్ కర్మాగారం, కర్ణాటకలోని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు ఇక్కడి నుంచి ముడి ఇనుము సరఫరా చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే విషయాన్ని రామాయపట్నం పోర్టు శంకుస్థాపన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా వెల్లడించారు. జేఎస్‌డబ్ల్యూ సంస్థ రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు. కానీ, ఇప్పుడు వీటినే దావోస్‌లో కొత్తగా పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటించడమే కాకుండా జేఎస్‌డబ్ల్యూ సజ్జన్ జిందాల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు నారా లోకేష్ ప్రకటించడం గమనార్హం. అంతేకాదు తన పుట్టిన రోజు సందర్భంగా ఈ ఒప్పందం కుదరడం జీవితంలో మరిచిపోలేని సంఘటన అని ట్వీట్ చేశారు.

అంతా ప్రచార ఆర్భాటమే

పెట్టుబడుల కోసమంటూ కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేస్తూ దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ సదస్సుకు సీఎం చంద్రబాబు పలుమార్లు హాజరైన సంగతి తెలిసిందే. రూ.వేల కోట్ల పెట్టుబడులు వచ్చేస్తున్నాయంటూ ప్రచారమే తప్ప ఇంతవరకు ఒక్క ఒప్పందం కూడా కార్యరూపం దాల్చలేదు. ఈసారి ముఖ్యమంత్రి స్థానంలో ఆయన తనయుడు లోకేష్‌ను దావోస్ పర్యటనకు పంపించారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన ఏపీ పెవిలియన్‌లో సమావేశాలు నిర్వహించి, ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులు వచ్చేస్తున్నాయంటూ లోకేష్ పాత పెట్టుబడులనే చూపిస్తుండడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి

గురువారం, జనవరి, 24

ప్రియాంక రంగప్రవేశం

తమతో మాటమాత్రమైనా చెప్పకుండా...తమను అసలు పరిగణనలోకే తీసుకోకుండా సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ)–బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)లు కూటమిగా ఏర్పడటాన్ని చూసి డీలా పడిన కాంగ్రెస్ శ్రేణులకు బుధవారం తీపి కబురు అందింది. వారంతా ఏనాటినుంచో కోరుకుంటున్నట్టు రాహుల్‌గాంధీ సోదరి ప్రియాంకా గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత కాంగ్రెస్ విభాగానికి ఆమెను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్టు కాంగ్రెస్ ప్రకటించింది. రాహుల్, ప్రియాంకలకు ఒక విషయంలో పోలిక ఉంది. రాహుల్ ఎంపీగా గెలిచినా వీలు కుదిరినప్పుడల్లా రాజకీయాలపట్ల అనాసక్తత కనబరిచేవారు. విపక్షంలో కూర్చోవడం మొదలుపెట్టాకే ఆయనలో మార్పువచ్చింది. ప్రియాంక ధోరణి సైతం అదే. రాజకీయాలపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఎట్టకేలకు ఆమె కూడా మారారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏను ఎలాగైనా మట్టికరిపించి మళ్లీ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని రాహుల్ విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రసంగాల తీరు మునుపటితో పోలిస్తే మెరుగైంది. మొన్న అయిదు రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లు చేతికి అందిరావడం ఆయన ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కానీ తెలంగాణ రాష్ట్రంలో లెక్క తప్పింది. తెలుగుదేశంతో కూటమి కట్టి బోర్లాపడ్డారు. మూడు రాష్ట్రాల్లో గెలుపు దాదాపుగా అందరూ ఊహించిందే. రాజస్తాన్‌లో అయిదేళ్లకోసారి పాలకులను మార్చడం రివాజు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో మూడు దఫాలుగా అధికారం చలాయిస్తున్న బీజేపీపై ఓటరుకు అసంతృప్తి ఏర్పడింది. అదే కారణంతో మిజోరంలో కాంగ్రెస్ ఓటమి చవిచూసింది. దానిపైనా పెద్దగా దిగుల్లేదు. ఏతావాతా తెలంగాణలో అధికారం రాకపోవడం సంగతలా ఉంచి, ఈ స్థాయి పరాభవం సంభవించడమే దానికి మింగుడు పడకుండా ఉంది. తెలంగాణలో మంచి ఫలితాలు వచ్చి ఉంటే ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీలు కాంగ్రెస్‌ను ఇంతగా తీసిపారేసేవి కాదు. ఆ రెండు పార్టీలూ చెరో 38 స్థానాలూ పంచుకుని, మిగిలిన నాలుగులో రెండింటిని కాంగ్రెస్‌కు, మరో రెండింటిని రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ)కి ఇస్తున్నట్టు ఏకపక్షంగా ప్రకటించాయి. పౌరుషానికి పోయి 'మీ దయాదాక్షిణ్యాలు మాకు అవసరం లేద'ని చెప్పే ధైర్యాన్ని కూడా కాంగ్రెస్ ప్రదర్శిం చలేకపోయింది. వారి నిర్ణయాన్ని గౌరవిస్తామని మాత్రమే రాహుల్ ప్రకటించారు. ఒకపక్క కేంద్రంలో మరోసారి అధికార పగ్గాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలిస్తూ, మరోపక్క డీఎంకే వంటి మిత్రపక్షాల ద్వారా ఆ సంగతిని బాహాటంగా చాటిస్తున్న పార్టీకి సహజంగానే ఈ పరిస్థితి మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో ప్రియాంక రంగ ప్రవేశం పార్టీ శ్రేణుల్లో ఎంతో కొంత ఉత్సాహాన్ని తీసుకొస్తుందనటంలో సందేహం లేదు. తాము నిరాసక్తంగా, నిస్తేజంగా ఉండబోమని... పార్టీకి జవజీవాలు కల్పించడానికి రానున్న సార్వత్రిక ఎన్నికలను వినియోగించుకుంటామని ఈ చర్య ద్వారా కాంగ్రెస్ చెప్పినట్టయింది. ఆమె రాకతో యువత, మహిళలు తమకు చేరువ కాగలరని పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు.

నిజానికి ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ దాదాపు కనుమరుగైంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో అది ఏడంటే ఏడు స్థానాలు మాత్రమే గెల్చుకుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 42 శాతం ఓట్లు లభిస్తే, ఎస్పీ–బీఎస్పీలు రెండూ 41శాతం వరకూ తెచ్చుకున్నాయి. కాంగ్రెస్‌కు లభించిన ఓట్లు 7.5శాతం మాత్రమే. 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇంచుమించు ఇదే స్థితి. బీజేపీకి 39.47శాతం ఓట్లు రాగా, ఎస్పీ, బీఎస్పీలకు 44.2శాతం గెల్చుకున్నాయి. కాంగ్రెస్‌కు దక్కిన ఓట్ల శాతం 6.2 మాత్రమే. ఆ పార్టీకి ఒకప్పుడు వెన్నుదన్నుగా ఉన్న ముస్లింలు చెల్లాచెదురు కావడం, ఓబీసీలు, దళితుల్లో అత్యధికులు ఎస్పీ, బీఎస్పీలవైపు మొగ్గు చూపడం, ఆధిపత్య కులాలు బీజేపీని నమ్ముకోవడం వంటి పరిణామాలే ఇందుకు కారణం. ఈ పరిస్థితిని ప్రియాంక ఏమేరకు మార్చగలరన్నదే ప్రశ్న. గత కొన్ని నెలలుగా రాహుల్‌గాంధీ తనకు తోచిన రీతిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తూ వస్తున్నారు. తాను మొదణ్ణించీ శివభక్తుడినని ఆయన చాటుకున్నారు. తన కుల గోత్రాలు గుర్తు చేశారు. దేవాలయాలు సందర్శించారు. కానీ ఆ చర్యలు పార్టీకి పెద్దగా ఉపయోగపడిన దాఖలాలు లేవు. సరికదా ఎస్పీ, బీఎస్పీలు తమతో చేర్చుకోక పోవడం వల్ల పరిస్థితి మరింత క్షీణించింది. తూర్పు యూపీ బీజేపీకి కంచుకోట. ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యంవహిస్తున్న వారణాసి ఆ ప్రాంతంలోనిదే. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా అక్కడివారే. ఆ ప్రాంతంలో పార్టీని పటిష్టం చేయడంలో ప్రియాంక తోడ్పడితే ఆ మేరకు బీజేపీకి నష్టం కలుగుతుంది. బ్రాహ్మణ–దళిత–ముస్లిం ఫార్ములాను మళ్లీ ప్రయోగించగలిగితే... ఆధిపత్య కులాల్లో మోదీపై ఉన్న అసంతృప్తిని వినియోగించుకోగలిగితే అది సాధ్యమేనని కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. ఇదంతా ప్రియాంక వల్ల సాధ్యమవుతుందని విశ్వసిస్తోంది. అయితే ఈ క్రమంలో ఎస్పీ–బీఎస్పీ ఓటు బ్యాంకును కాంగ్రెస్ చీల్చవచ్చునని, అంతిమంగా అది బీజేపీకే లాభిస్తుందన్న అంచనాలూ ఉన్నాయి.

ప్రియాంక రాజకీయ రంగప్రవేశం చేయడం నిజానికి లాంఛనప్రాయమే. ఆమె ఈ రంగానికి ఎప్పుడూ దూరంగా లేరు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలి, సోదరుడు ప్రాతినిధ్యంవహిస్తున్న అమేథీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడం ఆమెకు అలవాటే. ఆమె మాట తీరు, వ్యవహారశైలి ఇందిరాగాంధీని గుర్తుకుతెస్తున్నాయని ఆ రెండుచోట్లా చాలామంది అనుకునే మాట. ప్రియాంక రూపంలో తాజాగా తలెత్తిన సవాలును బీజేపీ తేలిగ్గా తీసుకోదు. కనుక 2019 సార్వత్రిక ఎన్నికలు అనుకున్నకంటే మరింత ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా ఉంటాయి. ఆ సంగతలా ఉంచి ఆమె రంగప్రవేశం కాంగ్రెస్ పార్టీకి ఏమేరకు జవసత్వాలిస్తుందో వేచిచూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి బ.చవితి రా.2.33 వరకు, తదుపరి పంచమి నక్షత్రం పుబ్బ రా.11.50 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం ఉ.8.50 నుంచి 10.20 వరకు, దుర్ముహూర్తం ఉ.10.20 నుంచి 11.04 వరకు, తదుపరి ప.2.47 నుంచి 3.33 వరకు అమృతఘడియలు... సా.5.49 నుంచి 7.19 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

బయోపిక్‌లకు సత్యమే పునాది

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్


ఏపీలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను మాత్రమే దృష్టిలో ఉంచుకుని, పిల్లనిచ్చిన మామకు, మంత్రిపదవి కట్టబెట్టిన నాయకుడికి ద్రోహం చేసి సీఎం పీఠం నుంచి ఆయన్ని కూలదోసి తాను గద్దెనెక్కిన చంద్రబాబు వెన్నుపోటు చరిత్రను మాత్రమే వర్మ నేటి తరానికి చూపించదల్చుకుంటే ఆయన 'లక్ష్మీస్ ఎన్టీఆర్' కోసం ఇంత కష్టపడవలసిన అవసరం లేదు. ఈ మాత్రం దానికైతే ''జామాతా దశమగ్రహ'' అనే ఎన్టీఆర్ క్యాసెట్ ఆధారంగా వర్మ ఒక పొలిటికల్ డాక్యుమెంట్‌ని నిర్మిస్తే సరిపోతుంది. చివరిదశలో ఎన్టీఆర్ ఉత్థాన పతనాలకు చెందిన వాస్తవాలను, కారకులైన వ్యక్తులను వాస్తవిక దృక్పథంతో చిత్రించడం అవసరం. బయోపిక్‌లకు వాస్తవాల చిత్రణే ప్రాతిపదిక.

ఇటీవల బయోపిక్స్ అంటూ వివిధ రంగాల్లో పేరుప్రతిష్టలు గల వారిని గురించి, వారి జీవితాల్లో ప్రధాన ఘట్టానికి సంబంధించి చలన చిత్రాలు వచ్చాయి, వస్తున్నాయి. గాంధీ బయోగ్రఫీ ఆంగ్లంలో చాలా కాలం క్రితమే వచ్చింది. ఏ బయోగ్రఫీ కూడా పూర్తిగా చరిత్రగానే ఉండటం సాధ్యం కాదు. గాంధీ చిత్రం గాంధీజీ జీవితాన్ని, ఆయన దేశప్రజలకు చేసిన మేలు ఇచ్చిన సందేశాన్ని ప్రజలకు అందించాల్సిందే. కానీ నాటి అకుంఠిత దేశభక్తుడు భగత్‌సింగ్‌కు బ్రిటిష్ పాలకులు ఉరిశిక్ష విధిస్తే గాంధీజీ స్పందించలేదు. ఆ విషయం ప్రత్యేకించి గాంధీ చిత్రంలో లేదు. అలాగే దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు గాంధీజీ వ్యవహరించిన తీరు, జాతి వివక్షకు వ్యతిరేకంగా కాకుండా దాన్ని సమర్థించే రీతిలో ఉందని కూడా విమర్శ ఉంది. కానీ గాంధీ చిత్రంలో ఆ విషయం ప్రస్తావన లేదు. అయినా, ఆ చిత్ర దర్శకుడు అటెన్‌బరో స్థూలంగా నిజాయితీగానే గాంధీజీని చిత్రీకరించాడనే చెబుతుంటాము.

మన 'మహానటి' సావిత్రి జీవిత చరిత్రను అందరూ ఆహ్వానించారు. ప్రధానంగా నాటి సావిత్రి, నటిగా తెలుగు ప్రజల ప్రేమాభిమానాలను ఎంతగా చూరగొన్నదో మనకు అర్థం అవుతుంది. కీర్తి నటన వలననే ఆ సినిమా గొప్ప విజయం సాధించిందని చెప్పలేము. ఆమె తన పరిధిలో తాను చక్కగా నటించారు తప్ప, మహానటి పట్ల ప్రజల్లో ఉన్న ఆరాధన, ఆత్మీయభావనలే ఆ చిత్ర విజయానికి ప్రధాన కారణం. ఆ చిత్రంపై కూడా జెమినీ గణేష్ పాత్రకు న్యాయం జరగలేదనీ, సావిత్రిపట్ల ఆ కుటుంబ సభ్యుల నిరాదరణను పక్కన బెట్టారన్న విమర్శలూ లేకపోలేదు. అయితే మహానటి సావిత్రి ప్రధానంగా ఒక నటిగానే జీవించారు. వ్యక్తిగతంగా ఆమె సద్గుణాలు ముఖ్యంగా ఆమె దాతృత్వ గుణం, వ్యక్తిత్వం వంటివి ఉన్నా ఆమెకు జయలలితలాగా ప్రముఖ రాజకీయ నాయకురాలుగా, సీఎం వంటి పదవులు అలంకరించిన పరిస్థితి లేదు. కనుక సావిత్రి చిత్రంపై చర్చకు తావులేదు. ఇకపోతే తన ప్రజారంజక పాలనతో తెలుగు ప్రజల హృదయాల్లో ముఖ్యంగా పేద, అణగారిన ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన దివంగత సీఎం వైఎస్సార్ రాజకీయ జీవితం ప్రధాన ఘట్టం 'యాత్ర' అన్నపేరుతో సినిమాగా వస్తోంది.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో మూడు తరాల ప్రేక్షకులకు ఆరాధనీయ మహానటుడు ఎన్టీఆర్ జీవిత చరిత్ర సినిమాలుగా రానున్నాయి. ప్రథమ భాగం ఇప్పటికే విడుదలైంది కూడా. ఎన్టీఆర్ కేవలం సినిమా నటునిగానే మిగిలిపోతే, ఆయన జీవిత చరిత్రపై చిత్రం ఇంత చర్చనీయాంశం అయి ఉండేది కాదు. నటుడిగా, సంచలన రాజకీయ నేతగా ఆయన జీవిత చరిత్ర ప్రజలకు తెలిసిన చరిత్ర కూడా కనుక ఆ మహనీయుని జీవిత చరిత్ర వీలైనంత వాస్తవికంగా ఉండాలని, చరిత్ర కనుక చరిత్రగానే రాగద్వేషాలకు అతీతంగా నిర్మించాలని కోరుకోవడంలో అసహజం లేదు. అలాగే ఆయన జీవితంలో ఒక ప్రధాన భాగానికే పరిమితమైనప్పుడు కూడా నిజాయితీ చిత్రీకరణను ప్రజలందరూ ఆశిస్తారు.

ఎన్టీఆర్ తనయుడు, ప్రముఖ నటుడు బాలకృష్ణ, ఎన్టీఆర్ జీవిత చరిత్రను రెండు భాగాలుగా 'కథానాయకుడు', 'మహానాయకుడు' పేరిట నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ నటజీవితం, ఒక పల్లెటూరు నుండి వచ్చి ఆయన మహానటుడిగా ఎదగడానికి ఆయన ప్రదర్శించిన అకుంఠిత దీక్ష ఇవన్నీ ప్రజలను ఉత్తేజపరిచే అంశాలు. అలాగే ఆ చిత్రాల్లో ఎన్టీఆర్ అద్వితీయ జీవితం ప్రధానంగా ఉంటుంది. ఎన్టీఆర్ బయోపిక్ రెండో భాగం ప్రధానంగా ఆయన రాజకీయ జీవితానికి, ప్రజా ప్రస్థానానికి



సంబంధించిందని అంటున్నారు. ఈ రెండో భాగంలో ఆయన జీవితం ప్రజలందరికీ తెరిచిన పుస్తకం. ఆయన ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, ఆత్మగౌరవం గల తెలుగుజాతి ప్రతి ఒక్కరి ప్రతినిధిగా, ప్రజల మనసులు చూరగొన్నవాడు. నిజానికి, తెలుగుజాతిని కూడా, ద్రవిడ జాతితో కలిపి మద్రాసు వారిగానే ప్రపంచం చూస్తున్నప్పుడు, మన తెలుగువారి అస్తిత్వం నిలపడంలో ఎన్టీఆర్ ప్రధాన పాత్ర పోషించారు.

ఆ మహనీయుని జీవిత చరమాంకంలో.. ఆయన రాజకీయ ఔన్నత్యం విశ్వవ్యాపితమవుతున్న దశలో, తన పార్టీని, తన పదవిని, చివరకి తాను స్థాపించిన పార్టీ పేరును కూడా పోగొట్టుకుని, సొంత అల్లుడు చంద్రబాబు కారణంగా, సొంత పార్టీ ఎంఎల్ఏలే చెప్పులు విసిరిన దుస్థితిలో ఎన్టీఆర్ ఘోర అవమానభారాన్ని మోయవలసి వచ్చింది. ఈ అంశాన్ని సైతం 'మహానాయకుడు ఎన్టీఆర్' చలన చిత్రంలో వాస్తవాలకు దగ్గరగా చరిత్రను వక్రీకరించకుండా చిత్రించాలని ఆశించడంలో అసహజం ఏమీ ఉండదు. ఎన్టీఆర్ జీవితాన్ని విషాదాంతం చేయడంలో, నాటి రాజకీయ పరిస్థితికి ప్రధాన కారకులు ఎవరు, ఏం చేశారు? అన్నది కూడా తెలుగు ప్రజలకు తెలియాలి. ఎన్టీఆర్ బయోపిక్‌లో ఎన్టీఆర్ పాత్రను పోషిస్తూ, తన తండ్రి పాత్రలో పరకాయప్రవేశం చేసి తండ్రి రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్న వారసుడు బాలకృష్ణ. ఎన్టీఆర్ బయోపిక్ రెండోభాగం 'మహానాయకుడు'లో చరిత్రను వక్రీకరించకుండా వీలైనంతవరకు వాస్తవానికి దగ్గరగా నిర్మిస్తారని ఆశించలేము.

మరోవైపున పరిచయం అక్కరలేని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. సంచలనాలకు మారుపేరుగా, విలక్షణ దర్శకుడిగా, వార్తల్లో ఉంటూ లక్ష్మీస్ ఎన్టీఆర్ అనే పేరిట ఎన్టీఆర్ జీవితంలో లక్ష్మీపార్వతి ప్రవేశించినప్పటినుంచి ఎన్టీఆర్ మరణం వరకు ప్రధానమైన, ప్రత్యేకభాగాన్ని చలనచిత్రంగా రూపొందించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఒక పాట కూడా యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఎన్టీఆర్ తాను నమ్మిన వారిచేతే నమ్మకద్రోహానికీ, కుట్రకూ బలైన వాడిగా ఆ పాట ఉంది. ఆ పాట సందర్భంలో ఆనాటి చంద్రబాబు, అలాగే దగ్గుబాటి వెంకటేశ్వరరావు తదితర కుటుంబ సభ్యులను, ఇతరులను ఎన్టీఆర్‌తో విడిగానూ ఉన్న వీడియో క్లిప్పింగులను కూడా జత చేశారు. దానితో నేటి తెలుగుదేశం పార్టీ, కార్యకర్తల నుంచి, నేతల నుంచి రామ్‌గోపాల్ వర్మపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆ పాటలో చంద్రబాబును చూపించడంతో, ఆ కుట్రలకు చంద్రబాబే బాధ్యుడు అన్నట్లుందనీ, రాష్ట్రానికి సీఎంగా ఉంటున్న నేతను ఇలా చూపించడం, ఆయన్ని అవమానించడమేననీ, దీన్ని మేం సహించం అంటూ కొందరు వర్మపై స్థానిక పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టారు. వర్మ దిష్టిబొమ్మలు తగులబెట్టారు. ఇది చంద్రబాబు టీడీపీ వారి భుజాలు తడుముకునే నైజానికి, నిజం బయటపడుతుందేమోనన్న భయానికి, ఆనాటి ఘటనపై ఉండిన తీవ్ర వైరుధ్యాలను గూర్చిన అవగాహన లేకపోవడానికి సంబంధించినదిగా నాకు తోచింది. అంతే కాదు. వర్మ తీస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమా విడుదలను ఆపడానికో, ఆ సినిమా చూసేందుకు వెళ్లే ప్రేక్షకులను భయపెట్టడానికో ఇలా చేస్తున్నారని అనిపిస్తుంది.

ఎవరేమనుకున్నా, ఏదో సినిమాలో అన్నట్లు 'చరిత్రను చించేస్తే చిరిగిపోదు. చెరిపేస్తే చెరిగిపోదు'. కొంత కాలం చారిత్రక సత్యాన్ని తొక్కిపెట్టవచ్చు. లేదా వక్రీకరించవచ్చు. కానీ సత్యాన్ని సమాధి చేయలేరు. నిజానికి ప్రజలకు ఆనాటి చారిత్రక సత్యమేమిటో తెలియాలి. ఈ సందర్భంగా నాకొక విషయం గుర్తుకొస్తున్నది. ప్రముఖ కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య నాటి వీర తెలంగాణ సాయుధ పోరాట రథసారథుల్లో ఒకరిగా 'వీర తెలంగాణ విప్లవ రైతాంగ పోరాటం–గుణపాఠాలు' అని రాసిన బృహత్ గ్రంథంలో 'సీపీఎం వారి కంటే సీపీఐలో ఉన్న వారికే ఎక్కువగా పాత్ర కల్పించారు ఎందుకని' అని నాటి సీపీఎం నాయకుడు లావు బాలగంగాధరరావు ప్రశ్నించారు. 'నేను చరిత్రలో ఒక ఉజ్వల ఘట్టాన్ని మాత్రమే రాస్తున్నాను. ఆ ఘటనలో ఎవరెవరి పాత్ర ఏమిటి? ఈ రోజు వారు ఏ పార్టీలో ఉన్నారు? వారి ప్రస్తుత జీవితాన్ని బట్టి నాటి సాయుధ పోరాటంలో వారి పాత్రను విస్మరించలేను, వక్రీకరించలేను. ఒక చరిత్రకారునిగా అలాంటి పనిచేయరాదు. నాటి భౌతిక వాస్తవికతనే ప్రస్తావించాలి' అని సుందరయ్య సమాధానమిచ్చారు. బయోపిక్ నిర్మించదలిచిన వారు ఎవరైనా దీన్ని గుర్తించుకోవాలి.

ఏపీలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను మాత్రమే దృష్టిలో ఉంచుకుని, పిల్లనిచ్చిన మామకు, మంత్రిపదవి కట్టబెట్టిన నాయకుడికి ద్రోహం చేసి సీఎం పీఠం నుంచి ఆయన్ని కూలదోసి తాను గద్దెనెక్కిన చంద్రబాబు వెన్నుపోటు చరిత్రను మాత్రమే వర్మ నేటి తరానికి చూపించదల్చుకుంటే ఆయన లక్ష్మీస్ ఎన్టీఆర్ కోసం ఇంత కష్టపడవలసిన అవసరం లేదు. ఈ మాత్రం దానికైతే ఎన్టీఆర్ సీఎం పదవి కోల్పోయిన తర్వాత సొంత అల్లుడు తనకు చేసిన నమ్మకద్రోహం గురించి తన గళంతో వెలువరించిన ''జామాతా దశమగ్రహ'' అనే క్యాసెట్ ఆధారంగా వర్మ తన వ్యాఖ్యానం జోడించి ఒక పొలిటికల్ డాక్యుమెంట్‌గా నిర్మిస్తే సరిపోతుంది. కేవలం ఈ దృష్టితో మాత్రమే కాకుండా తన మొదటి భార్య బసవతారకం మరణానంతరం, సంతానం ప్రేమాభిమానాలు కరువై ఒంటరిగా జీవిస్తున్న ఎన్టీఆర్ మానసిక పరిస్థితి, ఆ నేపథ్యంలో ఆయన జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించాక ఎన్టీఆర్ మనస్థితిలో వచ్చిన సానుకూల మార్పు, పార్టీలోని పదవీవ్యామోహపరులు లక్ష్మీపార్వతికి అధికార దాహం ఆపాదించి అధికార దాహం తీర్చుకునేపనిలో సాగించిన ఘాతుకాలను, ఈ క్రమంలో దారుణంగా మారిన మానవ సంబంధాలను వర్మ చిత్రించదల్చుకున్నారేమో! చివరిదశలో ఎన్టీఆర్ ఉత్థాన పతనాలకు చెందిన వాస్తవాలను, కారకులైన వ్యక్తులను వాస్తవిక దృక్పథంతో చిత్రించడం ఈ బయోపిక్‌ల ద్వారా సాధ్యపడుతుందని ఆశిద్దాం. అలాంటప్పుడే ఎన్టీఆర్‌పై బయోపిక్ ప్రయత్నాలు ఆహ్వానించదగినవి. 'చంద్రోదయం' పేరుతో చంద్రబాబు బయోపిక్ కూడా తీయనున్నారని తాజావార్త. ఎవరైనా 'చంద్రగ్రహణం' అని మరో బయోపిక్ తీస్తే అదీ వివాదాస్పదం కావడం ఖాయమే!


వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు । మొబైల్ : 98480 69720

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

భయం



"బీజేపీ అన్నా, ప్రధాని నరేంద్ర మోదీ అన్నా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భయపడుతున్నారు. సాధ్యమైనంత వరకు మా ర్యాలీలు, రథయాత్రలను అడ్డుకుంటున్నారు. కానీ, బీజేపీ బెంగాల్ ప్రజల హృదయాల్లో ఉందని నేను మమతకు గుర్తు చేయాలనుకుంటున్నా. గడపగడపకూ వెళ్లి మీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను, అన్యాయాలను ప్రజలందరికీ వివరిస్తాం"

– అమిత్ షా
బీజేపీ జాతీయ అధ్యక్షుడు

అసలు రంగు



"డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను సొంతం చేసుకోవాలని బీజేపీ, సంఘ్ పరివార్ ఆరాటపడుతున్నాయి. కానీ, అంబేడ్కర్ మనవరాలి భర్త, మేధావి అయిన ఆనంద్ తేల్తుంబ్డే వ్యవహారంలో వారి ప్రజా వ్యతిరేక, దళిత వ్యతిరేక భావాలు బయటపడుతూనే ఉన్నాయి"

– మీనా కందస్వామి
రచయిత్రి

జ్ఞాపక చిహ్నం



"ప్రధాని మోదీ కృషి వల్ల ఇప్పుడు ఢిల్లీలో సర్దార్ పటేల్ మ్యూజియం, అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌తోపాటు సుభాష్ చంద్రబోస్ మ్యూజియం కూడా ఏర్పాటయ్యింది. మన జాతి ప్రయాణంలో ఎంతో కీలకపాత్ర పోషించిన ఈ నాయకులందరికీ దేశ రాజధాని అయిన ఢిల్లీలో ఇప్పటి వరకు ఎందుకు జ్ఞాపక చిహ్నం లేదో అర్థం కాదు"

– రవిశంకర్ ప్రసాద్, కేంద్ర మంత్రి

వినియోగం



"నాకో వందకోట్ల రూపాయల గ్రాంట్ ఇవ్వండి. ఒక పౌరురాలిగా ఆ మొత్తంతో ఎంత చక్కగా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయొచ్చో చూపిస్తా. మనకింకా జ్ఞాపక చిహ్నాలు అవసరమా? మనకి కావాల్సినవి ఆసుపత్రులు, పాఠశాలలు"

– శోభా డే, రచయిత్రి

పౌరసత్వం



"కుల, మత, వర్గాల వారీగా ప్రజల హృదయాలను విభజించాలనుకునేవారిపట్ల అంతా అప్రమత్తంగా ఉండాలి. చిట్టచివరికి వాళ్లు మనందరినీ మింగేస్తారు. హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు భయపడాల్సిన అవసరం లేదని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. ఇక మిగిలినది చొరబాటుదారులైన ముస్లింలు మాత్రమే. పౌరసత్వ సవరణ బిల్లు అనేది కేవలం ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. మత ప్రాతిపదికన పౌరసత్వం అనేది భారతదేశానికి వ్యతిరేకం"

– షోమా చౌదరి
జర్నలిస్ట్

ఉత్తరాంధ్ర ఏకంకావాలి

రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, విజయనగరంలో గిరిజన యూనివర్సిటీ అవసరాన్ని శ్రీ కృష్ణ కమిషన్ సూచించింది. కొద్ది నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నాయి గానీ విభజన హామీలు ఎక్కడవి అక్కడే ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన రాజకీయ క్రీడామైదానంలోకి ప్రజలను లాగి లాభపడాలని చూసి ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరించారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర మంత్రులుగా కొనసాగుతున్న అచ్చెన్నాయుడు, సుజయ కృష్ణ రంగారావు, అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, కిడారి శ్రావణ్‌కుమార్ ఉత్తరాంధ్ర వాసులైనా ఈ ప్రాంత ప్రజల సమస్యలు పట్టవు. తమ పదవులు కాపాడుకోవడానికి తాపత్రయం తప్ప ఈ ప్రాంత ప్రజలకు మేలుచేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామన్న ఆలోచన వారికి లేదు.

పాలకులపై విశ్వాసం ఉంచి ఊరుకుంటే వినాశనం తప్ప ఉత్తరాంధ్రకు న్యాయం జరగదు. ఉత్తరాంధ్ర వెనుకబాటు మూలాలపై అందరూ మాట్లాడాలి. ప్రజలు తమ ప్రాంత అభివృద్ధికి తామే కంకణం కట్టుకోవాలి. ఉదాశీనత వీడి కదిలించే శక్తులన్నీ ఏకం కావాలి. అల్లూరి సీతారామరాజు పోరాట వారసత్వ స్ఫూర్తితో కరువు, కాటకాల్లేని, విద్య, ఉపాధి, తాగు, సాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన సాధన కోసం ఉత్తరాంధ్ర ఏకం కావాలి.

అల్లు రాజు, సామాజిక కార్యకర్త
మొబైల్ : 94903 00788

ఆత్మవిశ్వాసమే ఆయుధం

'మానవుడే నా సందేశం మనుష్యుడే నా సంగీతం' అనే విధంగా జన మయమైన ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లో, జనంతో జగన్ మమేకం నిజంగానే ఒక వాస్తవం! ఒక చరిత్ర! ఒక అద్భుతం! అంతేకాదు దేశ రాజకీయాల్లో రాయవలసిన ఒక చారిత్రక ఘటన. క్షేత్ర స్థాయిల్లో ప్రజల ఆవేదనలు, అసంతృప్తులు, ఆకాంక్షలు, ఆశలు తెలుసుకుంటూ అడుగు అడుగులో పరిణతి పెంచుకుంటూ సాగిన ఈ జన యాత్ర ఆంధ్రప్రదేశ్ జన జీవితాల్లో కొంగ్రొత్త గా ఆశాకిరణాల మెరుపులు మెరిపించాయని చెప్పక తప్పదు.

ఊహలు ఎప్పుడూ వాస్తవాలకు భిన్నంగానే ఉంటాయి. కలలు కనే రాజకీయాలు కాదు, ప్రజల కలలు సాకారం చేసే రాజకీయాలే ఇప్పుడు కావాల్సింది. ఇదే నేపథ్యంలోనే ఎన్నో అవరోధాలను దాటుకుంటూ అడుగు అడుగులో ప్రజల గుండె చప్పుళ్ళు వింటూ దిగ్విజయంగా సాగిన జగన్ మోహన్ రెడ్డి జనయాత్ర పార్టీ శ్రేణులకు విజయ సంకేతాలను అందిస్తోంది.

ఈ మధ్య తెలుగు రాష్ట్రాలలో ప్రజల మనోభావాలతో సంబంధం లేని విధంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తూ ఉంటే విలువలకు వలువలు ఊడి పోయాయా అనిపిస్తోంది. ముఖ్యంగా, ఆనాడు కాంగ్రెస్ వ్యతిరేక పునాదుల మీదే తెలుగుదేశం ఆవిర్భవించిందని ఢంకా బజాయించి చెప్పారు నందమూరి తారక రామారావు. ఆ తరువాత జరిగిన అనేకానేక రాజకీయ పరిణామాలలో కూడా తెలుగుదేశం అంటేనే కాంగ్రెస్ కు వ్యతిరేకం అనే భావన తెలుగు ప్రజా బాహుళ్యంలో బలంగా నాటుకు పోయిందనేది అక్షర సత్యం. భాషకు కూడా అందని భావావేశాలతో కాంగ్రెస్ మరియు తెలుగుదేశం రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులుండరనే వాదాలతో ఈ పొత్తులు కొందరికి సమంజసంగా అనిపించవచ్చు కానీ ప్రజలకు మాత్రం సమంజసం అనిపించట్లేదు.

ఈసారి జరగబోయే ఎన్నికలు నల్లేరు మీద నడక కాదు ప్రజల ఆశలు, ఆకాంక్షలు, వారి మనోభావాలను క్షేత్ర స్థాయిల్లో అర్థంచేసుకుంటూ ప్రజల వైపు, ప్రజల కొరకు అడుగులు కదిపే వాడే ద్రష్ట! ఆనాడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి కానీ, జగన్మోహన్ రెడ్డి చేసింది, చేస్తోంది అదే! ప్రజల ఓట్లను నోట్లతో లేదా ఏవేవో ప్రలోభాలకో గురిచేసి కొట్టేయాలనే వారి ఆటలు ఇక సాగవు. ప్రజలకు స్పష్టంగా తెలుసు ఎవరిని వంచాలో! ఎవరిని పెంచాలో! తమని అర్థం చేసుకుని తమ వెతలు తీర్చగల పార్టీ నాయకులే ప్రజలకు కావాల్సింది అందుకు భిన్నంగా వ్యవహరించే ఏ పార్టీలకైనా శృంగభంగం తప్పదు.

ఇక ముగింపుగా ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు ఎన్నో ఎన్నెన్నో కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొంటూ సాగిన కొన్ని వేల కిలోమీటర్ల జన సంద్ర యాత్ర ప్రజల ఆశయ, ఆకాంక్షల ఆలంబనగా ఉంటుందనే విశ్వాసం, ప్రజల మనోభావాలలో బలంగా నాటుకున్నాయనే అనుకూల వార్తలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి. మొక్కవోని దీక్షా, ధైర్యం, మడమతిప్పని ఆత్మవిశ్వాసంతో ప్రజా నీరాజనాల మధ్య సాగిన ఈ అపూర్వ పాదయాత్ర చిరకాలం జరిగిన మోసాన్ని, బలవంతుల దౌర్జన్యాలను, ధనవంతుల పన్నాగాలను ఇంకానా? ఇకపై సాగవు అనే రీతిలో జగన్‌కు భరోసాగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వనున్నారని అర్థమౌతోంది.

అమరనాథ్. జె,
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, హైదరాబాద్
మొబైల్ : 98495 45257

అధికారం-అపశ్రుతులు



గొల్లపూడి మారుతీరావు

జీవన కాలమ్

నేను అందరిలాగే పత్రికలలో రాజకీయ పరిణామాలు తెలుసుకుని స్పందించే ఓటర్ని. ఏ రాజకీయ పార్టీకీ చెందినవాడినీ కాను. ఆ కారణానికే కొన్ని పరిణామాలు వింతగా, విడ్డూరంగా, వికృతంగా, విపరీతంగా కనిపిస్తాయి.

పార్టీలో నాయకత్వం పట్ల అందరికీ అన్నివిధాలా విధేయత ఉండాలి. ఇది అందరు రాజకీయ నాయకులు ఒప్పుకునే, గర్వంగా చెప్పుకునే సద్గుణం. లోగడ కనీసం అయిదారు సందర్భాలలో మెజారిటీ సాధించిన కాంగ్రెస్ అతిగర్వంగా 'మేం అధిష్టాన వర్గం మాటని అక్షరాలా పాటిస్తామ'ని చెప్పడం మనకి తెలుసు. నిజానికి వారేం చెప్తారో ముందు మనకే తెలుసు. కానీ తీరా నాయకుడి ఎన్నిక జరిగాక చాపకింద నీరులాగ మెల్లగా తమ తమ అసంతృప్తులను అనుచరుల ద్వారానో– ఇంకా బరితెగిస్తే తామో బయటపడి చెప్పడం మనం విన్నాం. నిజానికి కాంగ్రెసులోంచి విడిపోయి మరో పార్టీగా అవతరించిన అన్ని పార్టీల మూల కథ ఇదే. అలనాటి దేవరాజ్ ఉర్స్, నిజలింగప్ప, మొరార్జీ దేశాయ్, శరద్‌యాదవ్, సంగ్మా ప్రభృతుల కథలన్నీ ఇవే. అయితే ఈ నాయ కులు ఉన్నతులు. ఆయా రాష్ట్రాల్లో ప్రముఖులు. కాగా–ముఖ్యమైన విషయం– అప్పటి అధిష్టాన వర్గం గురుతరమైనది.

కాగా, ఇప్పటి నాయకులు మరుగుజ్జులు. అంత వ్యక్తిత్వాలున్న నాయకులు లేరు. ఉదాహరణకు అలనాడు ఆనంద శర్మ, గులాంనబీ ఆజాద్ పేర్లు చిన్నవి. రెండో పేరు చెప్తే అలనాడు పాలకవర్గానికి చెందిన ఒకాయన చక్రమున్న సందర్భం నాకు తెలుసు.

ఏతావాతా ఇవాళ ముఖ్యమంత్రి పదవికి ఎన్నికైన నాయకులలో ఒకాయన మీద 1984 మారణకాండ 'మచ్చ' ఉంది. మరొకాయన 'నీతులు మాట్లాడే' పార్టీ మీటింగు ముందు వరసలో కనిపించారు. వీరంతా అద్భుతమైన కాఫీ డికాషన్ కింద మిగిలిన 'మడ్డి' లాంటి వారు.

ఈ మధ్య కాంగ్రెస్ పదవిలోకి వచ్చి చాలా రోజులయింది. అదీన్నీ చావు తప్పి కన్నులొట్టపోయినట్టు ఎదుటి పార్టీ లోపంవల్ల మిగిలిన చచ్చు మెజారిటీ. వెంటనే ఈ నాయకుల భాషణ విన్నాం. 'మా అధిష్టానం ఏం చెప్తే అది పాటిస్తాం' అంటూ. అధిష్టానం ఏం చెప్పాలో తాము చెప్పడానికి ఢిల్లీ పరిగెత్తిన సంఘటనలు మనం చూస్తున్నాం. తీరా అధిష్టానం– రాజస్తాన్‌లోలాగ సీనియర్ నాయకుని పదవిలో నిలిపితే ఛోటా నాయకుని వర్గీయులు 'కాంగ్రెస్‌ని నాశనం చేస్తాం' అని టీవీ కెమెరాల ముందు బోరవిరుచుకోవడం మనం చూశాం. సరే. మధ్యప్రదేశ్ నాయకుని మీద 1984 'పొడ' ఉందని విమర్శలు లేచాయి. కర్ణాటకలో చచ్చీ చెడీ పదవిలోకి వచ్చిన ప్రభుత్వంలో అధిష్టానానికి ఎదురు తిరిగిన సభ్యులు, ముష్టియుద్ధాలు ఇప్పుడు టీవీల్లో చూస్తున్నాం. వారు అధికార అసెంబ్లీ సమావేశానికి హాజరు కాలేదు.

ఇక అటువేపు చూద్దాం. మనం ఎప్పుడూ ఆనందీ బెన్ పేరు వినలేదు. విజయ్ రూపానీ పేరు వినలేదు. దేవేంద్ర ఫడ్నవీస్ పేరు తెలీదు. ఆ మాటకి వస్తే నితిన్ గడ్కరీ పేరు వినలేదు. ఇవాల్టి స్పీకర్ సుమిత్రా మహాజన్ గారి పేరు వినలేదు. కానీ వీరి ఎంపిక జరిగాక ఎవరూ టీవీల ముందు కాంగ్రెస్‌లోలాగ సన్నాయి నొక్కులతో విరగబడలేదేం? అలాగే పదవిలో ఉన్న ముఖ్యమంత్రి (ఆనందీబెన్) 'నాకు వయస్సు మీద పడింది. పదవిలో ఉండను' అని తప్పుకోవడం వినలేదు. మనకు హైదరాబాద్ రాజ్ భవన్‌లో శృంగార కార్యకలాపాలు వెలగబెట్టిన ముసిలి గుజ్జు ఎన్డీ తివారీలే తెలుసు. పార్టీ పదవిలోకి వచ్చాక ఎల్‌కే అడ్వాణీ, మురళీ మనోహర్ జోషికి పదవులు రాకపోవడం తెలీదు. అడ్వాణీని రాష్ట్రపతిని చేయడం తెలీదు. ఏమైంది?

అధికారానికి బేషరతయిన, అకల్మషమయిన భక్తి అయినా ఉండాలి. శక్తి అయినా ఉండాలి. ఉదాహరణలు బోలెడు: జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ. మొదటి వ్యక్తిపట్ల భక్తి, రెండవ వ్యక్తిది శక్తి. ఎమ్.జీ.ఆర్, ఎన్.టీ.ఆర్ నికార్సయిన మెజారిటీ. అందుకనే మహిళలకు ఆస్తిలో వాటా, గ్రామాలలో అధికారాల సరళతరం, మద్యపాన నిషేధం వంటి పనులు నల్లేరుమీద బండిలాగ చేయగలిగారు. అధికారంలో ఆత్మవంచన, అవకాశవాదం, స్వార్థం, పరిస్థితులకు పబ్బం గడుపుకునే స్వభావం– ఆ అధికారాన్ని గబ్బు పట్టిస్తాయి. ఉదాహరణ–10 జనపథ్ ఒక్కటి చాలు.


అలనాడు శ్రీరాముడిది ప్రజల భక్తి. రావణుడిది శక్తి. అయినా రాముడి పాలనలో రజకుడు ఉన్నాడు. లంకలో రజకుడు నోరెత్తలేడు.

అవిధేయత పునాదులు పెకలించలేనంత బలంగా, లోతులకు పాతుకున్నప్పుడు– అధికారానికి తప్పనిసరిగా 'శక్తి' అవసరం. ఇది సమకాలీన వ్యవస్థకి అవసరమైన ఆయుధం. ఇప్పటి వ్యవస్థలో దీని పేరు 'మెజారిటీ'. అధికారానికి పట్టిన 'గబ్బు'ని అచిరకాలంలోనే మనం చూశాం.

70 ఏళ్ల వ్యవస్థలో ప్రజాస్వామ్యం కంపు కొడుతోందని ఆనాడే గుర్తించిన గాంధీగారు కాంగ్రెస్ పార్టీని ఆనాడే అటకెక్కించమన్నారు. ఎక్కించకపోతే ఏమవుతుంది? ముందు రోజులు చెప్తాయి.

ఆస్కార్ బరి

నాప్కిన్స్‌కి నామినేషన్



● డాక్యుమెంటరీ పోస్టర్

కథిఖేరా... ఢిల్లీకి అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం. హాపూర్ జిల్లా. కొన్నాళ్ల కిందట అక్కడ మహిళల పరిస్థితి దారుణం. దేశంలోని చాలా ఊళ్లలాగే ఇక్కడ రుతుచక్రం గురించి చాలా అపోహలు, అంధ విశ్వాసాలూనూ. రుతు సమయం వచ్చిందంటే చాలు ఆ ఊళ్లోని ఆడవాళ్లు ఎవరికంటా పడకుండా ఊరవతలకు వెళ్లి ఉండే వారు. ఇక అమ్మాయిలు పెద్దమనిషి అయ్యారు అంటే పెళ్లికి, సంసారానికి ఇంకా చెప్పాలంటే రేప్‌కి లైసెన్స్ వచ్చినట్టుగా భావించేవారట ఆ ఊళ్లో మగవాళ్లు. ఇలాంటి సామాజిక పరిస్థితులు, నెలసరి పట్ల అవగాహన లేమి ఉండేదక్కడ. సిగ్గుతో ఆడపిల్లలు చదువు మానేసి ఇంటికే పరిమితమయ్యేవారు. అందుకే ఆ ఊళ్లో మొన్నమొన్నటి వరకు కూడా హైస్కూల్ పూర్తి చేసిన అమ్మాయి లేదు. రుతుసమయంలో శుభ్రత పాటించడం తెలియక ఎంతో మంది మహిళలు అనారోగ్యం పాలయ్యారు. ఒకరకంగా చెప్పాలంటే రుతుచక్రం మొదలైన ఆడవాళ్లను అస్పృశ్యులుగా పరిగణించే సంప్రదాయం నెలకొందన్నమాట. అక్కడే విప్లవమూ మొదలైంది. అదీ మహిళల నుంచి! శానిటరీ నాప్కిన్స్ తయారు చేసే మెషీన్ వచ్చింది. రుతుచక్రం, రుతు సమయం పట్ల ఉన్న అపోహలు పోయాయి. ఆడవాళ్లే నాప్కిన్స్ తయారు చేస్తూ మార్కెట్ కూడా వాళ్లే చేసుకుంటూ వాళ్ల ఆర్థిక పరిస్థితినీ మెరుగుపర్చుకున్నారు. ఆ నాప్కిన్స్‌కి ''ఫ్లై'' అనే పేరు పెట్టుకున్నారు. దాంతో ఆ ఊరి చిత్రమే మారిపోయింది. ఓ షార్ట్ డాక్యుమెంటరీగానూ రూపుదిద్దుకుంది..

అదే... ''పీరియడ్. ఎండ్ ఆఫ్ ది సెంటెన్స్'. ఆస్కార్ అవార్డ్స్ బరిలో డాక్యుమెంటరీ కేటగిరీలో షార్ట్‌లిస్ట్ అయింది. ఈ డాక్యుమెంటరీకి లాస్ ఏంజెల్స్‌లోని ఓక్‌వుడ్ స్కూల్, ఫెమినిస్ట్ ఫౌండేషన్ రెండూ కలిసి ఫండింగ్ చేశాయి. దర్శకత్వం.. రేయ్‌కా జెహ్తాబ్చీ.

రేయ్‌కా జెహ్తాబ్చీ.. అమెరికాలో పుట్టిన ఇరానీ వనిత. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కాలిఫోర్నియా నుంచి ఫిల్మ్ ప్రొడక్షన్ డిగ్రీ చేశారు. మొదటి నుంచీ డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్ అంటే ఆసక్తి ఉన్న రేయ్‌కాకు ఫిల్మ్ మేకర్స్ అష్గర్ ఫర్హాది, పాల్ గ్రీన్‌గ్రాస్‌లే స్ఫూర్తి. 'పీరియడ్. ఎండ్ ఆఫ్ సెంటెన్స్'.

డాక్యుమెంటరీ తీయడానికి నిర్మాతలు ఒక యంగ్ ఫిల్మ్‌మేకర్ గురించి వెదుకుతుంటే వాళ్లకు రేయ్‌కా గురించి తెలిసింది. అలా ఆమెకు ఈ అవకాశం వచ్చింది. ''ఓక్‌వుడ్ స్కూల్‌లోని పదిహేను నుంచి పదహారేళ్ల మధ్య వయసున్న అమ్మాయిలంతా ఇండియాలోని కథిఖేరా విలేజ్ మహిళల కోసం శానిటరీ నాప్కిన్ మెషీన్ కోసం ఆర్థిక సహాయం అందించడం, ఈ మెషీన్‌తో అక్కడి మహిళలు ఆరోగ్యంతోపాటు ఆర్థిక స్వావలంబననే సాధించడం నన్ను చాలా ఇన్‌స్పైర్ చేసింది. ఈ సినిమాకు అవార్డ్ వస్తుందా రాదా.. అన్నది సెకండ్ థింగ్. ఫస్ట్ ఆఫ్ ఆల్.. ఇది ఆస్కార్ డాక్యుమెంటరీ షార్ట్‌లిస్ట్‌లో ఉన్నందుకే చాలా గర్వంగా ఉంది'' అని తన సంతోషాన్ని పంచుకున్నారు రేయ్‌కా జెహ్తాబ్చీ. ఈ సినిమా షూటింగ్ అంతా కథిఖేరాలోనే తీశారు. అందుకోసం రేయ్‌కా రెండు సార్లు ఇండియాను సందర్శించారు. శానిటరీ వెండింగ్ మెషీన్ రాకముందు ఊళ్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఆ ఊరివాళ్లను ఇంటర్వ్యూ చేయడానికి, తర్వాత షూటింగ్ కోసం. ఊళ్లోని చాలా మంది దీనిమీద మాట్లాడ్డానికి ఇష్టపడలేదట. ప్యాడ్స్ తయారు చేసే మెషీన్ నెలకొల్పడానికి, దాన్ని ఆడవాళ్లే నడుపుకునేలా చేయడానికి స్నేహ అనే అమ్మాయి చేసిన ప్రయత్నాన్ని తెలుసుకుని చలించి పోయిందట రేయ్‌కా. ఆ సంఘటననూ ఉన్నదున్నట్లే 'పీరియడ్. ఎండ్ ఆఫ్ సెంటెన్స్'లో పొందుపర్చారు రేయ్‌కా జెహ్తాబ్చీ.

– శరాది


● దర్శకురాలు రేయ్‌కా జెహ్తాబ్చీ



అమ్మ అంతగా ప్రేమించకూడదా!

పిల్లలు సరిగా పెరగకపోతే
నిర్లక్ష్యం చేశారు అంటారు.
మరి..వాళ్లే ప్రపంచం అనుకుని జీవిస్తే?
నిర్లక్ష్యం అయిపోతామా!
చివరి రోజు దాకా
పిల్లల దగ్గర ఏమీ ఆశించము.
వాళ్లు ఆశిస్తే
బాగుండు అనుకుంటాము.
బలమైన చెట్టుకు
లత పాకినట్లు ఉండేది..
పిల్లలు కాదు.. తల్లే!!

అతని కణతల నుంచి జివ్వున చెమటలు చిందాయి.

'ఏమంటున్నావు నువ్వు' అన్నాడు పనిమనిషిని చూస్తూ.

'అవునయ్యా. అమ్మగారు సరుకుల పట్టిక కూడా చెప్పలేకపోతున్నారు. రెండు మూడు నెలలుగా నేనే సరుకులు రాసి తెస్తున్నాను'

అతనికి రెండు నెలల క్రితం జరిగింది గుర్తు కొచ్చింది.

ఇంట్లో పవర్ కట్ చేశారు డిపార్ట్‌మెంట్ వారు. ఇలా జరగడం అరుదు. భార్యే ఆన్‌లైన్‌లో కట్టేస్తుంది.

'బిల్ కట్టలేదా?' అడిగాడు.

'మ..మ... మర్చిపోయాను' అని గొణిగింది.

ఏదో పొరపాటనుకుని పట్టించుకోలేదు.

కాని ఒక్క క్షణం స్థిమితంగా కూర్చుని గత ఆరు నెలలుగా భార్య ప్రవర్తనను గుర్తు చేసుకుంటే అతడి కణతల నుంచే కాదు ఒళ్లు మొత్తం చెమటలు పడుతున్నాయి.

తామిద్దరూ కలిసి బయటకు వెళ్లి ఆరునెలలు. భార్య ఇల్లు దాటి ఆరు నెలలు. అసలు ఇంట్లో కూడా తను క్రమంగా బెడ్‌రూమ్‌లోకే పరిమితమైపోయినట్టు మెల్లగా అతనికి గుర్తుకొచ్చింది. డైనింగ్ టేబుల్ మీద గతంలో పదార్థాలు పెట్టేది. తింటుంటే వచ్చి కూచునేది. ఉదయాన్నే ఇంట్లో పనుల్లో హడావిడిగా కనిపించేది. గార్డెనింగ్‌లో బిజీగా ఉండేది. అవన్నీ ఆమె చేయట్లేదని, చేసి చాలా రోజులు అవుతోందని అతడికి జ్ఞాపకం చేసుకునే కొద్దీ అర్థమైంది.

ఆమెను ఇంత నిర్లక్ష్యం చేశాడా?

ఆమె ఇలా శిథిలం అయిపోయిందా?

* * *

అతనికి యాభై సంవత్సరాలు. ఆమెకు నలభై అయిదు సంవత్సరాలు. మంచి ఇండిపెండెంట్ హౌస్ ఉంది. రెండు కార్లున్నాయి. బ్యాంక్ బేలెన్స్ ఉంది. అతడికి చాలా పెద్ద ఉద్యోగం. ఇవాళ హైదరాబాద్‌లో రేపు ముంబైలో ఎల్లుండి యూకేలో తిరుగుతుంటాడు. ఆమె ఇంట్లో ఉంటుంది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం. కాని అతడు పనుల్లో ఉంటాడు. ఆమె ఇంటిని నిర్వహిస్తూ ఉంటుంది.

గతంలో ఆమె దినచర్య చాలా వేగంగా ఉండేది.

ఇద్దరు అబ్బాయిలు. మూడేళ్ల గ్యాప్‌తో పుట్టారు. వాళ్లకు తండ్రి మంచి స్నేహితుడు. కాని తల్లి ఊతకర్ర. పిల్లలు ఆమె మీదే ఆధారపడేవారు. స్కూలుకు వెళ్లడం ఆమె తయారు చేస్తేనే. టిఫిన్లు ఆమె తినిపిస్తేనే. సాయంత్రం వచ్చి హోమ్ వర్క్‌లు... ఆమె చేయిస్తేనే. స్విమ్మింగ్ క్లాసులకు తీసుకెళ్లేది. సినిమాలకూ కలిసి ముగ్గురూ వెళ్లేవారు. పెద్దవాడు ఎమ్‌సెట్ రాయాల్సి వస్తే తనే కోచింగ్ తీసుకున్నంత హడావిడి చేసింది. చిన్నవాడు క్రికెట్ సెలెక్షన్స్‌కు వెళతానంటే తనే గ్రౌండ్‌లో పడిగాపులు కాచేది.

పిల్లలు ఆమెలో నిండిపోయారు. ఆమె పిల్లలతో పెనవేసుకుపోయింది.

మొదటి దెబ్బ ఆమెకు పెద్దాడు ఐఐటి కోసం ముంబైకు వెళ్లడంతో పడింది. వాడు వెళ్లిపోవడంతో ఆమెలో సగం ఖాళీ అయ్యింది. కాని ఆమె ధ్యాస మళ్లించడానికి చిన్నవాడు ఉన్నాడు. వాడి బిటెక్ ఇక్కడే పట్టుబట్టి చేర్చడం వల్ల కళ్లెదుటే ఉన్నాడు. కాని వాడి బి.టెక్ అయిపోయింది. ఎం.బి.ఏ చేయడానికి యూ.ఎస్ వెళతానని చెప్పినప్పుడు ఆమెను రెండో దెబ్బ తాకింది.

పెద్దాడు చదువు పూర్తయ్యి అక్కడే ఉద్యోగం చూసుకుని చుట్టపుచూపుగా వచ్చిపోతున్నాడు. చిన్నాడు అమెరికా వెళితే మరి కనిపిస్తాడో లేదో.

చిన్నాడు ఫ్లయిట్ ఎక్కేరోజున ఆమె కన్నీరు మున్నీరైంది. భర్త అది చూసి సహజమైన తల్లిప్రేమ అనుకున్నాడు.

తల్లిప్రేమ నిజమే కాని అది ఒంటరిగా మిగలనున్న తల్లి విలాపం కూడా.

* * *

ఇద్దరు పిల్లలు ఇప్పుడు ఇంట్లో లేరు. వాళ్ల భోజనం గురించి ఆలోచించాల్సిన పని లేదు. వాళ్లు ఎప్పుడు ఇంటికొస్తారో అని ఎదురు చూడాల్సిన పని లేదు. వాళ్ల బట్టలు ఉతికించి రెడీ చేయాల్సిన పని లేదు. వాళ్లతో కలిసి సరదాగా అలా రైతు బజారుకు వెళ్లే పని లేదు. పిల్లలకు సంబంధించినంత వరకు తల్లిగా ఆమె చేయాల్సిన బాధ్యత దాదాపుగా ముగిసిపోయినట్టుగా అనిపించింది.

ఇక భర్త సంగతి.

పెళ్లయిన నాటి నుంచి చూస్తున్నదే. ఉదయాన్నే వెళ్లిపోతాడు ఏ రాత్రో వస్తాడు. అవసరం ఉన్నంత వరకు మాట్లాడతాడు. పిల్లల గురించి సమాచారం తెలుసుకుంటాడు. భార్యతో అతడికి బంధం ఉంది తప్ప అనుబంధం లేదు. పిల్లలు వెళ్లిపోయాక కూడా అతని దినచర్య మారలేదు. అతనికి సంబంధించినంత వరకూ తానేమిటో ఇప్పటికీ తెలియదు.

అప్పుడు ఆమెకు సందేహం వచ్చింది.

ఇక నా జన్మకు అర్థం ఏమిటి? ఎందుకు జీవించాలి? ఏం పని ఉందని జీవించాలి?

అంతా ఖాళీ... అంతా ఖాళీ... అన్నీ ఖాళీ.

మెల్లగా ఆమె ముకుళించుకోవడం మొదలుపెట్టింది. మెల్లమెల్లగా ఇంటి పనులు కూడా పట్టించుకోవడం మానేసింది. పనివాళ్లను అజమాయిషీ చేయడం కూడా ఆమెకు రావడం లేదు. చిన్నచిన్న పనులకు కూడా శక్తి ఉండటం లేదు. భర్త పలికితే జవాబు ఇస్తోందే తప్ప తాను మాట్లాడటం లేదు.

ఆమెకు ఏమైందో తెలుసుకోవడానికి అతడికి ఆరునెలలు పట్టింది.

జరిగిన నష్టం అర్థమయ్యాక ఆమెను తీసుకొని అతడు సైకియాట్రిస్ట్ దగ్గరకు పరిగెత్తాడు.

* * *

'ఇంతకాలం పిల్లల కోసం జీవించారు. ఇక మీదట మీ కోసం జీవించొచ్చు కదా' అంది లేడీ సైకియాట్రిస్ట్ ఆమెతో మొత్తం విని.

సైకియాట్రిస్ట్ మళ్లీ అంది.

'మన తల్లులు, అమ్మమ్మ నాయనమ్మలు కూడా ఇలా లేరు. మన సిస్టమ్‌లో ఎంతో కొంత వెసులుబాటు ఉండేది. పల్లెల్లో ఆడవాళ్లు గుళ్లకు వెళ్లడం, భజనలకు వెళ్లడం, పేరంటాలకు వెళ్లడం, లేదంటే ఉమ్మడిగా కబుర్లు చెప్పుకోవడం, బంధువులతో ఇంటరాక్ట్ అవడం ఇలా ఏదో ఒక వ్యాపకంలో ఉండి వాళ్లదైన ఒక ఫుల్‌నెస్‌తో ఉండేవారు. కాని మీరూ మీలాంటి వాళ్లు మొత్తం భర్తతో, పిల్లలతో జీవితాన్ని ఫుల్ చేసుకుంటే వాళ్లు పక్కకు తప్పుకున్నప్పుడు అవస్థ పడాల్సి వస్తుంది. మీరు చదువుకొని ఉండొచ్చు. పార్ట్‌టైమ్ ఉద్యోగమైనా చేసి ఉండొచ్చు. లేదంటే మీకు నచ్చిన పని ఏదో తెలుసుకొని అందులో ఒక గుర్తింపు పొంది ఉండవచ్చు. కాని అవేమీ మీరు చేయలేదు. ఇక మీదైనా చేయాలి' అంది సైకియాట్రిస్ట్.

తర్వాత ఆమె భర్తతో మాట్లాడింది.

'మీరు మీ భార్యను టేకెన్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసుకున్నారు. మీరు ఎలా ఉన్నా ఆమె పడి ఉంటుంది అని భావించారు. ఆమె ఒక మనిషి అని, ఒక ఐడెంటిటీ అని, మీకు మల్లే ఆమెకు కూడా ఏవో కోరికలు, ఆకాంక్షలూ, వ్యాపకాలూ ఉండాలని మీరనుకోలేదు. వాటిని పట్టించుకోవాలని భావించలేదు. విమానాల్లో ఎగురుతూ నేల మీద ఉన్న జీవితాన్ని పాడు చేసుకున్నారు' అంది.

కాని అప్పటికే అదుపు లేనంత డిప్రెషన్‌లోకి అతని భార్య వెళ్లిపోయి ఉంది.

అతడు మెల్లమెల్లగా మారుతూ ఇంట్లో ఎక్కువ సమయం ఉంటూ ఆమెకు దగ్గరయ్యే ప్రయత్నం సిన్సియర్‌గా చేశాడు. కొద్దిపాటి మందులు వాడాల్సి వచ్చింది. ఒక స్కూల్‌లో ఆమె వాలెంటీర్‌గా చేరడం, రెండు మూడు స్వచ్ఛంద సంస్థల్లో చేరి కొన్ని సమాజ హిత కార్యక్రమాల్లో పాల్గొనడం... ఇవన్నీ క్రమంగా ఆమెను మామూలు మనిషిని చేశాయి.

మంచి ఇల్లు అంటే మనుషులు నిండుగా ఉన్న ఇల్లు మాత్రమే కాదు.


మనుషులు లేకపోయినా అనుబంధాలు నిండుగా ఉండే ఇల్లు. భార్యాభర్తల బంధం గట్టిగా ఉంటే పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయినా ఆ గూడు బోసిపోదు. ఆమె గుండె పాడు కాదు. అది గ్రహించుకుంటే ప్రతి ఇల్లూ పొదరిల్లే.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

ఇన్‌పుట్స్: **పద్మ పాల్వాయి,** సైకియాట్రిస్ట్

'మాయా'బజార్

తప్పిపోకండి అవసరం లేనివి తెచ్చుకోకండి



షాపింగ్ మాల్‌నంతా కొని తెచ్చుకున్నా, మళ్లీ పచారీ కొట్టుకు పరుగులు తీస్తున్నారంటే.. మీ బడ్జెట్ తప్పిందనే. హెడేక్‌ను మీరు కొని తెచ్చుకున్నారనే!

''పది మ్యాగీ నూడుల్స్ ప్యాకెట్స్, అయిదు పాస్తా పాకెట్లు, పన్నెండు బాంబినో ఇన్‌స్టంట్ సూప్ ప్యాకెట్స్, మల్టీగ్రెయిన్ పిండి, ఇన్‌స్టంట్ ఉప్మా, పులిహోర పాకెట్లు, ఇడ్లీ, దోశపిండి, బటర్, చీజ్...'' కప్‌బోర్డ్‌లోంచి కొన్ని, ఫ్రిజ్‌లోంచి కొన్ని తీసి కింద పడేసిన వస్తువుల జాబితా చదువుతూ చదువుతూ ఆగిపోయింది బబిత ఉస్సూరుమంటూ.

''మేడమ్.. ఇంకా ఉన్నాయ్'' పనమ్మాయి నందా అంటోంది.

''హూ..'' నిట్టూరుస్తూ ''ఇంతకీ ఇప్పుడు కావల్సిన పసుపు, ఎండు మిరపకాయల పాకెట్లు ఉన్నాయా? లేవా?'' అడిగింది బబిత.

''ప్చ్..'' లేవన్నట్టు చేతులు తిప్పుతూ నిలుచుంది నందా.

''పచారీ కొట్టుకు పరిగెత్తాల్సిందే కదా..'' – హాల్లోంచి వంటగదిలోకి వస్తూ బబిత అత్తగారు.

సమాధానం ఇవ్వకుండానే ఫ్రిజ్‌పైన కవర్ లోంచి రెండు వందల రూపాయల నోటు తీసి నందాకు ఇచ్చింది బబిత... వెంటనే వెళ్లి వాటిని తెమ్మన్నట్లు.

''మా కాలంలో ఒక్కసారి లిస్ట్‌రాసి పంపిస్తే నెలకు సరిపడా సరకులు ఇంటికొచ్చి పడేవి. మళ్లా నెల దాకా పచారీ కొట్టు మొహం చూసే వాళ్లం కాదు. అవసరమైనవి తప్ప అనవసరమైనవి వచ్చేవీ కావు'' అంటూ నేల మీద చిన్న రాశిగా పోగేసి ఉన్న పాకెట్ల లోంచి ఓ పాకెట్ తీసింది పెద్దావిడ.. ముక్కు మీదకు జారిన కళ్లద్దాలను సవరించుకుంటూ ఆ పాకెట్ మీదున్న ఎక్స్‌పైరీ డేట్ చూసే ప్రయత్నం చేస్తూ.

ఇంకా అక్కడే ఉంటే అత్తగారు తన హయాంలోని రామాయణాన్ని వినిపిస్తారని గబగబా హాల్లోకి వచ్చేసింది కానీ ఆవిడ మాటల్లోని నిజాన్ని మాత్రం మెదడు లోంచి తీసేయలేకపోయింది బబిత.

నిజమే.. సూపర్ మార్కెట్ల మాయలో అవసరమైనవే కాకుండా అనవసరమైనవి ఎన్ని వస్తున్నాయి ఇంటికి! ఆలోచనలో పడింది బబిత.

* * *

సూపర్‌మార్కెట్.. శ్రావ్యమైన సంగీతం.. అద్దాల అల్మారాలు.. అందమైన ర్యాక్‌లు.. ఆకర్షణీయమైన ప్యాక్‌లు.. ట్రాలీ పట్టుకొని ఏ వస్తువు నచ్చితే ఆ వస్తువు దగ్గరకు వెళ్లే సౌకర్యం.. దేన్నయినా మనమే తీసుకొని ట్రాలీలో వేసుకునే వెసులుబాటు. అందుకే పర్స్‌లో తెచ్చుకున్న డబ్బు అయిపోవడంతోపాటు పాటు క్రెడిట్ కార్డ్‌లు, డెబిట్ కార్డ్‌లు, కార్పొరేట్ ఆఫీస్‌లు ఇచ్చే ఫుడ్ కార్డ్‌లూ స్వైప్ మిషన్‌లో సగ్రుమంటాయి!

పర్యవసానం

''తెచ్చుకున్న లిస్ట్ అలాగే ఉంటుంది. లిస్ట్‌లో లేని సరుకులు ట్రాలీ నిండుతాయి. వేసుకున్న బడ్జెట్ ఓవర్ అయిపోయి.. డెట్‌లో పడిపోతాం'' అంటున్నారు హైదరాబాద్‌కు చెందిన ఎన్. శైలజ. ఆమె నిమ్స్ ఉద్యోగి. ''వర్కింగ్ ఉమన్‌ని కాబట్టి ఈ సూపర్ మార్కెట్ల ఎంట్రీ హ్యాపీగానే అనిపించింది మొదట్లో. కిరాణా షాప్‌లో లిస్ట్ ఇస్తే కావల్సిన సరకులు ఇంటికొచ్చేవి. కాని పప్పులు, బియ్యాలు శుభ్రం చేసుకోవాల్సి వచ్చేది. సూపర్‌మార్కెట్లోనైతే అలాంటి బాదర బందీ ఉండదు. చక్కగా నీట్‌గా ప్యాక్ చేసి ఉంటాయి. దాదాపు పదేళ్ల నుంచి సూపర్ మార్కెట్లోనే కొంటున్నాను. అయితే ఈ పదేళ్లలో ఏ నెల కూడా నేను వేసుకున్న బడ్జెట్‌లో సరుకులు రాలేదు. ఓన్లీ పప్పులు, ఉప్పు, చింతపండు, ఎండు మిర్చి, నూనె, సబ్బులు, షాంపూలకు వెళితే నాలుగు రకాల షాంపూలు, నాలుగు రకాల సబ్బులు, రెండు రకాల వంట నూనెలు, డిష్ వాష్ లిక్విడ్ సోప్, రెండు రకాల హ్యాండ్ వాష్‌లు ఎట్‌సెట్రా తీసుకెళ్తా. బడ్జెట్ ఎక్కువై పోతుందని ఒకసారి పచారీ కొట్టు నుంచి సరుకులు తెప్పించా. మా ఇంట్లో నలుగురం ఉంటాం.. రెండున్నర వేలల్లో బియ్యంతోపాటు సరుకులన్నీ వచ్చాయి. అదే సూపర్‌మార్కెట్‌కి వెళితే ఏడు వేలు దాటుతుంది. అవసరమైనవి మైనస్ అవుతాయి'' అని చెప్పారు శైలజ.



> **వాడేది తక్కువ.. పడేసేది ఎక్కువ**
> ఇన్‌స్టంట్ ఫుడ్ మార్కెట్‌లోకి వచ్చినప్పటి నుంచ యితే చెప్పక్కర్లేదు. అంతకు ముందు ఆఫీస్ నుంచి రాగానే చక్కగా ఇడ్లీ, దోశకు పిండి మిక్సీలో పట్టి పెట్టుకునేదాన్ని. ఇప్పుడు ఇన్‌స్టంట్ కనిపించేసరికి బద్ధకం ఎక్కువై పాకెట్లు కొనేసుకోవడమే. ఉప్మా, పులిహోర అన్నీ. టేస్ట్ నచ్చక.. వాడేది తక్కువ, పారేసేది ఎక్కువ. డబ్బు దండగా.. ఆరోగ్యమూ పాడు.
> **- శైలజ**

క్రెడిట్ కార్డ్స్‌తో డెబిటే

నిజామాబాద్‌కు చెందిన లక్ష్మీతివారి అనుభవం కూడా ఇంచుమించు ఇలానే ఉంది. ''పచారీ కొట్టు అంటేనే పరిమితమైన బడ్జెట్ అని. చచ్చు, పుచ్చులు వచ్చినా వెళ్లి తిరిగి ఇచ్చే సౌకర్యం ఉండేది. సూపర్‌మార్కెట్లోనూ ఉన్నా.. అదో పెద్ద ప్రహసనం. ఎవరికి ఎవరు పూచీకత్తు అన్నట్టే ఉంటుంది. డబ్బులుంటేనే వస్తువులు. ఇప్పుడు ఈ క్రెడిట్ కార్డ్స్, డెబిట్ కార్డ్స్ వచ్చి డబ్బులు లేకపోయినా వస్తువులు వస్తున్నాయి. పద్దు హద్దు దాటుతోంది. అంతేకాదు ఉన్నవి డబుల్ డబుల్ ఉంటున్నాయి. లేనివి అసలే ఉండట్లేదు. వాటి కోసం మళ్లీ వీధిలో ఉన్న కిరాణా షాప్‌కి పరిగెత్తడమే. ఏం సుఖం? శ్రమ, డబ్బులు అన్నీ వేస్ట్. క్రెడిట్ కార్డ్స్‌తో అప్పులు'' అని అంటున్నారు లక్ష్మి.



> **పచారీ కొట్టు తీరే వేరు**
> పచారీ కొట్టు ఓ షాప్‌లా కాకుండా.. ఓ ఫ్రెండ్‌షిప్‌లాంటిదిగా ఉండేది. ఇంట్లో పిల్లలను పంపించి ఫలానా ఇంటి వాళ్లం.. ఫలానా వస్తువు కావాలి.. రాసి పెట్టమన్నారు అని చెబితే చాలు ఆ వస్తువు ఇంటికి వచ్చేసేది. అంటే అంత నమ్మకం ఉండేది. సూపర్‌మార్కెట్లలో ఆ క్రెడిట్ ఉండదు కదా!
> **- లక్ష్మీ తివారీ**

పరిష్కారం ఏమిటి?

ఇంటికి అవసరమైనవి. మాత్రమే లిస్ట్ చేసుకొని.. వాటి కోసమే సూపర్‌మార్కెట్‌కి వెళితే మంచిది. వీలైనంత వరకు ఇన్‌స్టంట్ ఫుడ్ జోలికి వెళ్లకుండా.. క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్స్‌ను ఇంట్లోనే వదిలేసి.. క్యాష్‌నే క్యారీ చేస్తే.. సూపర్‌మార్కెట్లనూ మన బడ్జెట్‌లోనే బంధించొచ్చు అని అనుభవంతో సలహా ఇస్తున్నారు శైలజ, లక్ష్మిలాంటి వినియోగదారులు.

– సరస్వతి రమ

చెట్టు నీడ

అంత సమయం ఏదీ!

ఒక ఊరిలో ఒక దేవాలయముంది. ఆ ఊళ్లో ఒక సాధువు ఉండేవాడు. అతను రోజూ తన పొట్టకు సరిపడా భిక్షాటన చేసుకుని మిగతా సమయం అంతా దేవాలయంలో ధ్యానంతో గడుపుతూ, రాత్రి నిద్రపోవటానికి ముందు దేవుని దగ్గరకు వెళ్లి ఏడుస్తూ, ఏదో మొరపెట్టుకుంటున్నట్లుగా భగవంతుణ్ణి వేడుకునే వాడు. ఇది రోజూ గమనిస్తున్న ఆ గుడి పూజారికి ఆ సన్యాసి రోజూ దేవుని ఏమని కోరుకుంటాడో తెలుసుకోవాలనిపించింది. ఒకరోజున ఆ సాధువును సమీపించి ''బాబా! మీరు గొప్ప దైవభక్తి సంపన్నులు. మీకు 'నా' అన్న వారు ఎవరూ లేరు. మీరు రోజూ దేవుణ్ణి ఎవరికోసం ప్రార్థిస్తారు? ఏమని ప్రార్థిస్తారు' అని అడిగాడు. అందుకు ఆ సన్యాసి చిరునవ్వుతో ''నేను ఏమీ అడక్కుండానే ఎంతో కరుణ తో అవసరమైన దానికంటే ఎక్కువగా కురిపిస్తూ నా అవసరాలన్నీ తీర్చాడు భగవంతుడు. ఒక్కొక్క అవసరాన్ని తీర్చినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి కదా.. అందుకోసమే రోజంతా – నా అవసరం ఎలా తీర్చాడో అందుకు ఒక్కొక్క అవసరానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అయితే, ఇన్ని రోజులుగా ప్రార్థన చేస్తున్నా – ఆయన తీర్చిన నా అన్ని అవసరాలకు పూర్తిగా కృతజ్ఞతలు తెలియజేయలేకపోతానేమో అని ఆందోళనగా ఉంది'' అని సమాధానం చెప్పాడు. పూజారి ఆశ్చర్యంతో ''అయితే మీరు భగవంతుణ్ణి ఏమీ కోరరా?'' అనడిగాడు. ''భగవంతునికి కృతజ్ఞతలు తెలియజేయటానికే రోజంతా సరిపోతుందే! ఇక కోరికలు కోరే తీరికెక్కడ? అడక్కుండానే అన్ని కోర్కెలు తీరుస్తుంటే తిరిగి కోరికలు తీర్చమని కోరాలా! ఏవి తీర్చాలో ఆయనకు తెలియదా!'' అన్నాడు. సాధువు సమాధానంతో పూజారిలో జ్ఞానం మేల్కొంది. నిజమైన పూజ అంటే ఏమిటో అర్థమైంది.

– డి.వి.ఆర్.

బ్యూటిప్స్

నునుపైన పాదాల కోసం

చలికాలం పాదాల పగుళ్ల సమస్య ఎక్కువ. చర్మం త్వరగా పొడిబారడం, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా ఈ సమస్య అధికం. పగుళ్ల వల్ల మడమల్లో నొప్పి కూడా వస్తుంటుంది. నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటే సమస్య తీవ్రతను తగ్గించవచ్చు.



- టేబుల్ స్పూన్ ఉప్పు, రెండు టీ స్పూన్ల నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల గ్లిజరిన్, గోరువెచ్చని నీళ్లు, ప్యూమిక్ స్టోన్.. తీసుకోవాలి.
- ఒక వెడల్పాటి టబ్బు లేదా బేసిన్ లాంటిది తీసుకొని దానిని గోరువెచ్చని నీళ్లతో నింపాలి. దాంట్లో ఉప్పు, 4టీ స్పూన్ నిమ్మరసం, టేబుల్ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ రోజ్‌వాటర్ వేసి కలపాలి. ఈ నీళ్లలో పాదాలను 15 నిమిషాల సేపు ఉంచాలి.
- ప్యూమిక్‌స్టోన్ తీసుకొని పాదాల అడుగున, మడమలను రుద్దాలి.
- మరొకపాత్రలో టేబుల్ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ రోజ్‌వాటర్, టీ స్పూన్ నిమ్మరసం కలపాలి. పడుకునే ముందు పాదాలను తడి లేకుండా తుడిచి, తయారుచేసుకున్న మిశ్రమాన్ని రాయాలి. పాదాలకు సాక్స్ తొడగాలి.
- మరుసటి రోజు ఉదయం గోరువెచ్చని నీటితో శుభ్రంగా పాదాలను కడగాలి. వారంలో కనీసం మూడు రోజులైనా ఈ విధంగా చేస్తూ ఉంటే పాదాల పగుళ్ల సమస్య తగ్గిపోతుంది.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేనొక అబ్బాయిని ఇష్టపడ్డాను. తనకి కూడా నేనంటే ఇష్టమే. తనే మా ఇంట్లోను, వాళ్ల ఇంట్లోనూ పెళ్లికి ఒప్పిస్తాను అన్నాడు. మా ఇంట్లో ప్రాబ్లమ్ వల్ల వన్ ఇయర్ వెయిట్ చెయ్యమన్నాను. 'సరే' అన్నాడు. తను ఆర్మీలో చేస్తాడు. 'త్వరలో ఇంటికి వస్తాను.. అప్పుడు వేరే విధంగా కలుద్దాం' అంటున్నాడు. నాకెందుకో నచ్చడం లేదు. ఆ విషయమే తనకి చెప్పాను. 'నీ ఇష్టం' అన్నాడు. కానీ... 'నీతో తప్ప.. ఎవరితోనూ అలా ఉండలేనుగా?' అంటున్నాడు. నాకు ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి.

– ప్రియ

పెళ్లి అయ్యే దాకా సెక్స్ వద్దు తల్లీ!

అది తప్పో కాదో నేను జడ్జ్ చేయను.

అలా కలిసిన తర్వాత కూడా సంతోషంగా పెళ్లి చేసుకుని సంసారం చేస్తున్న వాళ్లు ఉన్నారు. వాళ్లు కొందరే అయ్యుండచ్చు కానీ.. ఒక్కసారి అంత దగ్గరగా ఉన్నాక ఏ కారణంగానైనా పెళ్లి కాకపోతే???

అప్పుడు జీవితంలో ఒక బాధ వెంటాడుతుందిగా??

అలా జరగడం మచ్చ అనో.. తప్పు అనో.. నేను జడ్జ్ చెయ్యను.. ఎవరూ చెయ్యకూడదు..!!

అయినా.. మన మనసులో ఒక గిల్ట్ అయితే ఉండిపోయే ఛాన్స్ ఉంది కదా బంగారం!

ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి.

కొందరు మగవాళ్ల బుద్ధిని కూడా నమ్మలేం.

సెక్స్ తర్వాత వాళ్లకు మన మీద గౌరవం తగ్గే ఛాన్స్ ఉంటుంది.

ఇంకెవరితోనైనా ఇలా చేసుంటుందా అని ఆలోచించే అవకాశం ఉంది.

అనుమానంతో మనల్ని చూసే ఛాన్స్ ఉంది.

ఇన్ని అనుమానాలు, అవమానాలు ఎందుకు నాన్నా?

అలాంటి జీవితం.. అలాంటి పెళ్లి.. అలాంటి ఫ్యూచర్.. వద్దు నాన్నా!!

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి: నైజాం బాబులు నాటు బాంబులు...
అతిథులు మీరండీ.. ఆర్డరు వేయండి
చక్కని భామలు చంద్రవంకలు...
చిలకలు మీరండీ.. కోర్కెలు తీర్చండీ
వధువు మా ఫ్రెండండీ – వరుడు మా వాడండీ
సేవలను పొందండీ – చేసుకోండీ ॥ నైజాం॥

చరణం-1:
జర్దాలూ పానుమసాలలు పట్టుకురండీ
జల్దీగా గోల్డ్‌ఫ్లాకులు కొనుక్కుతెండీ
పానేసి ముద్దాడితే చేదుగ ఉంటుందీ
పొగతాగితే మగతనమే ఉష్‌కాకంటుందీ
పేలని బాంబులు పిచ్చి మొద్దులు బుద్ధులు
మీరండీ – మౌతులు మూయండీ
ఉడకని పప్పులు నూతి కప్పలు కోతలు
మానండీ – మౌతులు మూయండీ

చరణం-2:
తొందరగా నల్లకొంగను తీసుకురండీ
తక్షణమే కొండమీది కోతిని తెండీ
మసిపూస్తే మీరేమో కొంగవుతారండీ
ఆ... మీ ఫ్రెండు ఉండంగా కోతెందుకులెండీ
తింగరి బాబులు వెర్రికుంకలు గొర్రెలు మీరండీ
బుర్రలు పెంచండీ
తిక్కల భామలు అరటితొక్కలు మేకలు
మీరండీ – తోకలు ముడవండీ
మీరు ఆడాళ్లండీ.. మాది మగజాతండీ
తాళికట్టే వేళ తొలొంచాలి తప్పదు

చిత్రం: ప్రేమంటే ఇదేరా
రచన: చంద్రబోస్
గానం: మనో, స్వర్ణలత
సంగీతం: రమణ గోగుల

కట్‌చేయ్...దాచేయ్...

నేను విన్నాను.. నేను ఉన్నాను


మమ్ముట్టి

'నీళ్లుంటే కరెంటు ఉండదు.. కరెంటు ఉంటే నీళ్లు ఉండవు.. రెండూ ఉండి పంట చేతికొస్తే సరైన ధర ఉండదు. అందరూ రైతే రాజు అంటారు.. సరైన కూడు, గూడు, గుడ్డ, నీడ లేని ఈ రాచరికం మాకొద్దయ్యా.. మమ్మల్ని రాజులుగా కాదు.. కనీసం రైతులుగా బతకనివ్వండి చాలు.. అని ప్రతి రైతు గొంతెత్తి అరుస్తున్న సమయం అది.. ఎవరైనా ఆదుకుంటారా అని రైతన్న ఎదురుచూసిన సమయంలో 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ విడుదలైన 'యాత్ర' టీజర్ రైతుల కష్టాలను కళ్లకు కట్టింది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'యాత్ర'. వైఎస్ పాత్రలో మమ్ముట్టి నటించారు. మహి వి. రాఘవ్ దర్శకత్వం వహించారు. శివ మేక సమర్పణలో 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 8న మూడు భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ– ''మడమ తిప్పని నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారి జీవితంలో అతి కీలకమైన పాదయాత్ర ఘట్టాన్ని ప్రధానాంశంగా తీసుకుని 'యాత్ర' చిత్రాన్ని నిర్మించాం. మా బ్యానర్ నుంచి 'భలే మంచి రోజు, ఆనందోబ్రహ్మ' వంటి సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. 'యాత్ర' హ్యాట్రిక్ సినిమాగా నిలుస్తుందనే నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రజలందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రమిది. సెన్సార్ నుంచి క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఏకకాలంలో ఫిబ్రవరి 8న సినిమా విడుదల చేస్తున్నాం'' అన్నారు. రావు రమేష్, జగపతిబాబు, సుహాసిని, అనసూయ, పోసాని కృష్ణమురళి, సచిన్ కడ్కర్, వినోద్ కుమార్, జీవా, 30 ఇయర్స్ పృథ్వీ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సత్యన్ సూర్యన్, సంగీతం:కె (కృష్ణ కుమార్).


● చార్మీ, రామ్

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం బుధవారం అధికారికంగా ప్రారంభమైంది. నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటి, నిర్మాత చార్మీ కౌర్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు పూరి జగన్నాథ్, చార్మీ సంయుక్తంగా ఈ సినిమా నిర్మిస్తున్నారు. నేటి నుంచి ఈ సినిమా షూటింగ్ ఆరంభం అవుతుంది. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మేలో విడుదల చేయాలనుకుంటున్నారు. సత్యదేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు రాజ్ తోట ఛాయగ్రాహకుడు.

నరసింహస్వామి వైభవం


● పి. శ్రీనివాస్, కామిశెట్టి శ్రీనివాసులు, సింహయాజి స్వామీజీ, బెక్కెం వేణుగోపాల్

సుమన్ ప్రధాన పాత్రలో పి.శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భక్తిరస ప్రధాన చిత్రం 'సింహనాదం'. (శ్రీ నరసింహస్వామి వారి వైభవం). శ్రీ లిఖిత మూవీ మేకర్స్, శ్రీ వైష్ణవ స్పిరిటైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు స్వామిజీల ఆశీస్సులతో ఈ చిత్రం టైటిల్ లోగోను కూడా ఆవిష్కరించారు. శ్రీనరసింహస్వామి వైభవాన్ని చాటి చెబుతూ రూపొందుతున్న 'సింహనాదం' సినిమా ఘన విజయం సాధించాలని స్వామీజీలు ఆశీర్వదించారు. ''సుమన్ టైటిల్ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇతర నటీనటుల ఎంపిక జరుపుతున్నాం. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టనున్నాం'' అని పి. శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ అహోబిల నరసింహస్వామిపై తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన కీర్తనలతో కూడిన 'సర్వం సింహమయం' ఆడియో సీడీలను ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవంలో సింహయాజి స్వామి, కామిశెట్టి శ్రీనివాస్, రామానుజాచార్యులు, విశ్రాంత న్యాయమూర్తి మాల్యాద్రి, బీజేపీ నాయకురాలు గీతామూర్తి, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ (గోపి) తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మణి-దిలీప్, సంగీతం: విజయ్ కురాకుల.

ఇప్పట్లో లవ్‌ని వదలను!


అఖిల్

''మన బ్యాగ్రౌండ్ చూసి ఆడియన్స్ థియేటర్స్‌కు రారు. యాక్టర్‌గా కష్టపడి ఆడియన్స్ నమ్మకాన్ని సంపాదించుకోవాలి. అందుకు కాస్త టైమ్ పడుతుంది. మెట్టు మెట్టుగా ఎదగాలి. నా గత రెండు సినిమాల నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నాను. నా పై ఉన్న భారీ అంచనాలు, ఒత్తిడి నాకు ఉన్న శత్రువులుగా భావిస్తున్నాను. నాకు ఉన్న భయాలు కూడా అవే. మార్పు అనేది అనుభవం నుంచి వస్తుంది'' అని అఖిల్ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్, నిధీ అగర్వాల్ జంటగా రూపొందిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు..

● నా తొలి సినిమా 'అఖిల్'కి ముందే వెంకీ అట్లూరి నాకు కథ చెప్పాడు. ఈ సినిమా జర్నీలో మంచి క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యాం. కథలో నాకు, వెంకీకి అభిప్రాయభేదాలు వచ్చాయన్న వార్తలు అవాస్తవం. షూటింగ్ ఫన్నీగా గడిచింది. ఈ సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. త్రివిక్రమ్ సినిమాలకు వెంకీ ఇన్‌స్పైర్ అయ్యాడు. కానీ కాపీ కొట్టలేదు. తాతగారి (ఏయన్నార్) 'ప్రేమ్‌నగర్' ఇంపాక్ట్ కూడా ఉంటుందీ సినిమాపై.

● మంచి ఎంటర్‌టైనింగ్ చిత్రం ఇది. లవర్‌గా మారే ప్లేబాయ్ విక్కీ పాత్రలో నటించాను నేను. రిలీజ్ చేసిన ట్రైలర్‌లో విక్కీని ప్లేబాయ్‌గా చూపించగలిగాం. కానీ సినిమాలో అందుకు టైమ్ పడుతుంది. ఫస్ట్ హాఫ్ స్టార్టింగ్‌లో నా క్యారెక్టర్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఉంటుంది. ఆ తర్వాత లవ్‌స్టోరీ స్టార్ట్ అవుతుంది. స్టార్టింగ్‌లో నా పెర్ఫార్మెన్స్‌తో ఆడియన్స్‌ను ఎలా ఎంగేజ్ చేయాలన్న విషయం నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది.

● 'మజ్ను' అనే టైటిల్ మా ఫ్యామిలీకి బాగా కలిసొచ్చింది. కానీ మజ్ను అంటే ట్రాజిక్ లవ్‌స్టోరీ అనుకుంటారని, ఈ చిత్రం మోడ్రన్ లవ్‌స్టోరీ అని చెప్పడానికి మజ్నుకి మిస్టర్ అని యాడ్ చేశాం. ఈ సినిమా కూడా సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకు నేను 8 ప్యాక్స్ చేయడం ఇంపార్టెంట్ కాదనే విషయాన్ని ఒప్పుకుంటాను. నేను వద్దనుకున్నాను. కానీ శేఖర్ మాస్టర్ కన్విన్స్ చేశారు. నా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ సాంగ్ కోసం తప్పలేదు. ఆ సాంగ్ షూట్ సెట్‌కి చరణ్ వచ్చారు. చరణ్ డ్యాన్స్ బాగా చేస్తారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో తారక్ (ఎన్టీఆర్)ని చూసి 'మాస్' నేర్చుకోమని నాన్నగారు (నాగార్జున) చెప్పారు. మాస్ ఎలా నేర్చుకోవాలో నాన్నని ఓసారి అడగాలి (నవ్వుతూ).

● బీవీఎస్ఎన్ ప్రసాద్‌గారు చాలా మంచి నిర్మాత. తాతగారితో సినిమాలు చేసిన ఆయనతో సినిమా చేయడం నాకు గర్వంగా అనిపించింది. 'సవ్యసాచి' సినిమా రషెస్ చూసి నిధీని తీసుకున్నాం. బాగా నటించింది. ఒక లవ్‌స్టోరీకి మ్యూజిక్ చాలా ఇంపార్టెంట్. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఆరు పాటలు ఆడియన్స్‌కు బాగా నచ్చాయి.

> నాన్నగారు (నాగార్జున) నా సినిమాల స్క్రిప్ట్ వింటారు. షూట్ ముగిసిన తర్వాత సినిమా చూసి ఇన్‌పుట్స్ కూడా ఇస్తారు. నేను పుట్టిన తర్వాత అమ్మగారు (అమల) సినిమాలకు లాంగ్ బ్రేక్ ఇచ్చారు. ప్రస్తుతం మోడ్రన్ ఫిల్మ్ మేకింగ్‌పై అమ్మకు అంతగా అవగాహన లేదు. ఎమోషనల్‌గా, యాక్టస్‌గా చాలా స్ట్రాంగ్. నాన్నగారు నా ఫిల్మ్ మేకింగ్ విషయాలను గమనిస్తుంటారు.

● ఇప్పుడు నాకు పాతికేళ్లు. రొమాంటిక్ సినిమాలు చేసే చాన్స్ బాగా ఉంది. తప్పకుండా డిఫరెంట్ జానర్ సినిమాలను చేస్తాను. కానీ లవ్‌స్టోరీ చిత్రాలను ఇప్పుడే వదలను.

● ప్రస్తుతానికి నేను సింగిల్. టైమ్ కుదిరితే మింగిల్ అవ్వడానికి ట్రై చేస్తా (నవ్వుతూ). రియల్ లైఫ్‌లో నేను ఒత్తిడిని దూరం చేసుకునేందుకు క్రికెట్ ఆడతా. సీసీఎల్ జరిగితే తప్పకుండా పాల్గొంటాను. భవిష్యత్‌లో క్రీడా నేపథ్యంలో ఓ సినిమా చేయాలనుంది.

● మల్టీస్టారర్ సినిమాలపై ఆసక్తి ఉంది. రెండు, మూడు స్క్రిప్ట్స్ నా దగ్గరికి వచ్చాయి. అప్పట్లో చేయాలని అనిపించలేదు. ఐదారుగురు ఉన్న మల్టీస్టారర్ మూవీ అయితే బాగుంటుంది. మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌తో పాటు సెట్ వాతావారణం కూడా ఫన్నీగా ఉంటుంది.

● ప్రస్తుతం రెండు మూడు కథలు విన్నాను. ఆ సినిమాల గురించి వచ్చే నెలలో చెబుతాను. ఇకపై సినిమాలు చేయడంలో స్పీడ్ పెంచుతా. ఈ దసరాకి ఓ సినిమాను రిలీజ్ చేద్దామనే ఆలోచన ఉంది.


● మహేశ్‌బాబు

అడవిలో వేట!

మహేశ్‌బాబు ప్రస్తుతం 'మహర్షి' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై మహేశ్‌బాబు హీరోగా ఓ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రం షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. తాజాగా ఈ సినిమా కథనం సింహాచలం అడవుల నేపథ్యంలో సాగుతుందనే వార్త ప్రచారంలోకొచ్చింది. ఇది రీవెంజ్ డ్రామా అట. అంతేకాదు ఈ సినిమాలో మహేశ్‌బాబు లుక్ ఫుల్ గడ్డంతో ఉంటుందట. ఒకవేళ ఈ వార్తలే నిజమైతే అడవిలో మహేశ్ వేట ఆడియన్స్‌కు మంచి కిక్ ఇస్తుందని చెప్పుకోవచ్చు.


● సౌందర్య, విశాగన్

పెళ్లికి బాజా మోగింది

సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇంట్లో పెళ్లి పనులు షురూ అయ్యాయి. ఆయన కుమార్తె సౌందర్య పెళ్లికి బాజా మోగింది. సినీ నటుడు, వ్యాపారవేత్త అయిన విశాగన్ వనంగాముడిని ఆమె వివాహం చేసుకోబోతున్నారు. ఫిబ్రవరిలో ఈ పెళ్లి వేడుక జరగనుంది. గతేడాది ఇరు కుటుంబీకుల సమక్షంలో సౌందర్య, విశాగన్‌ల నిశ్చితార్థం జరిగిందట. ఎంగేజ్‌మెంట్ సింపుల్‌గానే జరిపారని టాక్. పెళ్లిని కూడా కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో మాత్రమే జరపాలనుకుంటున్నారట. అయితే రిసెప్షన్ మాత్రం ఘనంగా ఏర్పాటు చేయాలనుకుంటున్నారని భోగట్టా. మెహందీ, సంగీత్ కార్యక్రమాలతో కలిపి మూడు రోజుల పాటు ఈ పెళ్లి వేడుకలు జరగనున్నాయట. కాగా అశ్విన్ రామ్ కుమార్ అనే వ్యాపారవేత్తను 2010లో సౌందర్య వివాహం చేసుకున్నారు. వ్యక్తిగత కారణాల వల్ల 2017లో వారిద్దరూ విడాకులు తీసుకున్నారు.

హద్దు దాటలేదు



● ప్రియాంత్

''నటనలో శిక్షణ తీసుకోలేదు. కానీ సినిమాల పట్ల ఆసక్తితోనే హీరోగా చేశా. రియలిస్టిక్ సినిమాలంటే ఇష్టపడతా'' అని ప్రియాంత్ అన్నారు. రమణ మొగిలి దర్శకత్వంలో ప్రియాంత్, యామినీ భాస్కర్ జంటగా తెరకెక్కిన 'కొత్తగా మా ప్రయాణం' ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రియాంత్ మాట్లాడుతూ– ''మా నాన్నగారు డాక్టర్. నేను సీఎస్ (కంపెనీ సెక్రటరీ) చేశాను. ప్రస్తుతం బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నా. ఇప్పటి సాఫ్ట్‌వేర్ కల్చర్ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. ఉద్యోగరీత్యా సొంత కుటుంబాలకు దూరంగా జీవిస్తున్న నేటి యువత ప్రవర్తన ఎలా ఉంది? అన్నదే కథాంశం. సినిమాలో అనవసరమైన రొమాన్స్ సీన్స్‌ను పెట్టలేదు. ఎక్కడా హద్దు దాటలేదు. మా సినిమాతో పాటు 'మిస్టర్. మజ్ను, మణికర్ణిక: ఝాన్సీ రాణి' సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఒక ఆడియన్‌గా నేనూ పెద్ద సినిమాలే చూడాలని కోరుకుంటాను. కానీ మా సినిమాలోని డిఫరెంట్ పాయింట్ ప్రేక్షకులకు చేరువయ్యేలా చేస్తుంది. హైదరాబాద్ లైఫ్‌స్టైల్ ఎలా ఉంటుంది? అనే కాన్సెప్ట్‌తో ప్రసాద్ అనే కొత్త దర్శకుడితో నా నెక్ట్స్ సినిమా ఉంటుంది'' అన్నారు.


కత్రినా

అనుష్కా.. నా గురించి మీ ఆయనకు చెప్పు!

బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ మరో బాలీవుడ్ హీరోయిన్ అనుష్కా శర్మను రికమెండ్ చేయమని అడిగారు. సినిమా చాన్స్ కోసం అయితే కాదండోయ్. క్రికెట్ నేర్చుకోవడం గురించి. ప్రస్తుతం సల్మాన్‌ఖాన్ హీరోగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'భారత్' సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు కత్రినా కైఫ్. ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. షూటింగ్‌కి ప్యాకప్ చెప్పాక ఓ రోజు రాత్రి టీమ్‌తో కలిసి కత్రినా క్రికెట్ ఆడారు. ''క్రికెట్ ప్రపంచ కప్ దగ్గరపడుతోంది. నా గురించి టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి కాస్త చెప్పు. (అనుష్కా శర్మ భర్త విరాట్ కోహ్లీ అన్న విషయం తెలిసిందే). నేను ఆల్‌రౌండర్ అవ్వాలనుకుంటున్నాను. మన టైమ్ వస్తుంది'' అని సరదాగా తాను క్రికెట్ ఆడుతున్న వీడియోను షేర్ చేశారు కత్రినా. ఈ వీడియోకు నెటిజన్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 26న 'భారత్' చిత్రం టీజర్ రిలీజ్ చేయాలనుకుంటున్నారు. చిత్రాన్ని ఈ ఏడాది రంజాన్‌కు విడుదల చేయాలనుకుంటున్నారు.



పరీక్ష ఉంది.. పరిష్కారమూ ఉంది

కిందటి వారాల్లో మనం మహిళల్లో గర్భధారణకు అడ్డంకిగా ఉండే అనేక అంశాలను చర్చించాం. సాధారణ సామాజిక అంశాలు మొదలుకొని అండం విడుదలలో, గర్భాశయంలో, ఫెలోపియన్ ట్యూబ్స్‌లో, ఫలదీకరణ, ఇంప్లాంటేషన్ లోపాలు మొదలుకొని మానసిక అంశాలు సైతం గర్భధారణను ఎలా ప్రభావితం చేస్తాయో చూశాం. ఆయా లోపాలను అధిగమించే మార్గాలనూ తెలుసుకున్నాం. ఇప్పుడు ఈ భాగంలో సంతానలేమితో బాధపడే మహిళకు తొలి నుంచీ చేసే అవసరమైన పరీక్షలూ, సంతానం కోసం నిర్వహించే ప్రక్రియల తాలూకు పూర్తి వివరాలు తెలుసుకుందాం.

సంతానలేమి సమస్యతో డాక్టర్ ఒక మహిళ దగ్గరికి రాగానే ముందుగా ఆమె వైద్య చరిత్ర (మెడికల్ హిస్టరీ) గురించి డాక్టర్ విపులంగా అడిగి తెలుసుకుంటారు.

మెడికల్ హిస్టరీ : ...అంటే... ఆమె పీరియడ్స్ సక్రమంగా వస్తున్నాయా లేదా; ఒకవేళ ఆ సమయంలో ఏమైనా ఇబ్బందులున్నాయా, ఆ జంట క్రమం తప్పకుండా సెక్స్‌లో పాల్గొంటున్నారా, కలయికలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, లేదా; ఆ జంట ఇద్దరిలోనూ ఎవరికైనా దీర్ఘకాలికంగా ఏవైనా జబ్బులు ఉన్నాయా; వాటి కోసం లేదా ఇతరత్రా ఏమైనా మందులు వాడుతున్నారా... వంటి అనేక అంశాలను అడిగి తెలుసుకుంటారు. దాంతో వారికి ఎలాంటి పరీక్షలు అవసరమవుతాయనే దానిపై డాక్టర్‌కు ఒక అవగాహన ఏర్పడుతుంది.

ఫిజికల్ ఎగ్జామినేషన్ : ఆమె బరువు, ఎత్తు, బీఎమ్ఐ వంటి శారీరక, మానసిక పరిస్థితులు ఎలా ఉన్నాయో కూడా తెలుసుకోవాలి. పెల్విక్ పరీక్షతో పాటు స్పెక్యులమ్ పరీక్ష ద్వారా గర్భసంచి సైజు, షేప్, పొజిషన్ ఎలా ఉందో తెలుస్తుంది. దాంతో పాటు ఇన్ఫెక్షన్ లేదా పూత వంటివి ఏవైనా ఉన్నాయా, గర్భసంచి ముఖద్వారం ఎలా ఉంది వంటి వివరాలు తెలుస్తాయి.

ట్రాన్స్ వెజైనల్ స్కానింగ్ : ఈ పరీక్షతో గర్భసంచి సైజు, ఫైబ్రాయిడ్స్, పాలిప్స్, అండాశయంలో కణితులు, సిస్ట్‌ల వంటివి ఏవైనా సమస్యలు ఉన్నాయా వంటి అవకతవకల వివరాలు తెలుస్తాయి. అలాగే ఫాలిక్యులార్ స్టడీస్ ద్వారా పీరియడ్స్ మొదలైన 10వ రోజు నుంచి 16వ రోజు లోపల అండం విడుదలవుతోందా, లేదా తెలుస్తోంది. ఆ విషయంలో తేడాలేమైనా ఉంటే అది ఎప్పుడు విడుదలవుతోందనేది కూడా తెలుస్తుంది.

డాప్లర్ స్కానింగ్ : ఈ పరీక్ష ద్వారా అండం విడుదలయ్యే సమయంలో అండం చుట్టూ ఉండే ఫాలికిల్, గర్భాశయ పొరలోకి రక్త ప్రసరణ ఎలా ఉంది వంటి అనేక అంశాలను తెలుసుకోవచ్చు.

రక్తపరీక్షలు : ఇందులో సాధారణ రక్తపరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షలూ చేస్తారు. వాటిల్లో... రక్తం ఎలా ఉందో తెలుసుకునే బ్లడ్ కౌంట్ పరీక్ష అవసరం. మహిళ గర్భధారణకు హీమోగ్లోబిన్ పాళ్లు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోవాలి. ఆరోగ్యకరమైన గర్భధారణకు మహిళ రక్తంలోని హీమోగ్లోబిన్ తగినంత ఉండాలి. హీమోగ్లోబిన్ రక్తహీనత సమస్య ఉంటే మహిళకు రక్తం (హీమోగ్లోబిన్) పెరగడానికి ఐరన్ మాత్రలు సూచిస్తారు. సాధారణంగా వాటితో పాటు మహిళకు భవిష్యత్తులో గర్భం వస్తే బిడ్డలో వెన్నుపూస సమస్యలు (న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్) రాకుండా ఉండేందుకు ఫోలిక్ యాసిడ్ మాత్రలూ సూచిస్తుంటారు. ఇక మరో సాధారణ రక్తపరీక్షలో మహిళకు డయాబెటిస్ సమస్య ఉందేమో తెలుసుకోవడం కోసం రాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్) పరీక్ష కూడా చేస్తారు. రక్తంలో ఎక్కడైనా ఇన్ఫెక్షన్ ఉంటే తెలుసుకోడానికి ఈఎస్ఆర్ పరీక్ష.

హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, వీడీఆర్ఎల్ పరీక్షలు దంపతులిద్దరికీ చేయించాలి.

ఇక మరో రకం రక్తపరీక్షలు కాస్తంత అడ్వాన్స్‌డ్‌గా పరిగణించవచ్చు. వీటిలో మహిళల గర్భధారణను ప్రభావితం చేసే హార్మోన్లయిన ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, టీఎస్‌హెచ్ (థైరాయిడ్), ప్రోలాక్టిన్ వంటివి నార్మల్‌గానే ఉన్నాయా లేదా వాటిలో ఏవైనా హెచ్చుతగ్గులున్నాయా అన్న విషయం అర్థమవుతుంది. అలాగే కొందరిలో సీరమ్ ఈస్ట్రోడయాల్, ఏఎమ్‌హెచ్ వంటి పరీక్షలు అవసరాన్ని బట్టి చేయాల్సి ఉంటుంది.

ఇక మగవారికి సీమెన్ ఎనాలిసిస్ పరీక్ష చేయించడం ద్వారా శుక్రకణాల సంఖ్య, కదలిక, నాణ్యత వంటి అంశాలు తెలుసుకోవచ్చు. వాటిలో ఏదైనా సమస్య ఉన్నప్పుడు కారణం తెలుసుకోడానికి మరిన్ని పరీక్షలు అవసరమవుతాయి.

మరో ముఖ్యవిషయం ఏమిటంటే... మహిళలకు అడ్వాన్స్‌డ్ పరీక్షలు చేయించబోయే ముందు, పురుషులు కూడా తప్పనిసరిగా సీమెన్ ఎనాలిసిస్ పరీక్షలు చేయించాలి. మహిళకు అన్ని పరీక్షలు చేయించి, చికిత్స మొదలయ్యాక తర్వాత ఎప్పుడో పురుషులు సీమెన్ టెస్ట్ చేయించుకుని, దానిలో ఏమైనా లోపాలున్నట్లు తేలితే, అప్పటికే మహిళలకు చేయించిన పరీక్షలకూ, చికిత్సలకూ చాలా డబ్బు, సమయం వృథా అవుతాయి.

ట్యూబ్ టెస్టింగ్ : ఫెలోపియన్ ట్యూబ్స్ తెరచుకొని ఉన్నాయా లేదా మూసుకుపోయాయా అన్న విషయం తెలుసుకోడానికి ఉపయోగపడే పరీక్ష. హిస్టరో సాల్పింగోగ్రామ్ అనే ఎక్స్‌-రే పరీక్ష ఇందుకు ఉపయోగపడుతుంది.

పోస్ట్ కాయిటల్ టెస్ట్ : మహిళలోకి ప్రవేశించిన శుక్రకణాలను నిర్వీర్యం చేసే 'యాంటీ స్పెర్మ్ యాంటీబాడీస్'ను తెలుసుకునేందుకు చేసే పరీక్ష ఇది.

లాపరోస్కోపీ : కొంచెం మత్తు ఇచ్చి, పొట్ట మీద మూడు చోట్ల చిన్న గాట్లు పెట్టి, సన్నని గొట్టం వంటి స్కోప్‌తో లోపల గర్భసంచి, అండాశయాలు, ట్యూబ్స్ పరిస్థితి తెలుసుకోడానికి ఉపకరించే పరీక్ష ఇది. అయితే ఏవైనా లోపాలుంటే ఇదే ప్రక్రియలో దానికి అప్పటికప్పుడు చికిత్స చేసే సౌకర్యం కూడా ఇందులో ఉంటుంది.

హిస్టరోస్కోపీ : సన్నని గొట్టం వంటి పరికరంతో గర్భసంచి లోపల ఏమైనా అడ్డుపొరలు (సెప్టమ్), కొయ్యకొండలు /అతుకులు (అడ్‌హెషన్స్), కండ పెరగడం (పాలిప్స్) వంటివి ఉన్నాయేమో తెలుసుకోవచ్చు. ఉంటే అప్పటికప్పుడే చికిత్స కూడా చేయవచ్చు.

కొంతమంది దంపతులలో అన్ని పరీక్షల్లోనూ ఎలాంటి లోపమూ కనిపించదు. అయినా వారికి సంతానం కలగకపోవచ్చు. ఇలా అన్ని బాగుండి కూడా సంతానం కలగకపోవడాన్ని అన్‌ఎక్స్‌ప్లెయిన్‌డ్ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

అయితే ఇక్కడ పేర్కొన్న అన్ని పరీక్షలూ, అందరికీ ఒకేసారి అవసరం ఉండవు. వాళ్ల వాళ్ల ఆరోగ్యచరిత్రనూ, పరిస్థితిని బట్టి వాళ్లలో ఉన్న లోపాల ఆధారంగా పరీక్షలు చేస్తుంటారు. కొన్ని కొన్ని పరీక్షల్లో బయటపడ్డ అంశాల ఆధారంగా ఆ తర్వాతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు చేయడం కూడా జరుగుతుంటుంది.

> **గుర్తుంచుకోండి**
> గర్భధారణ కోసం పైన వివరించిన ప్రక్రియలన్నింటినీ ఒకేసారి నిర్వహించడం జరగదు. అవసరాన్ని బట్టి, దశల వారీగా ఒకటి తర్వాత మరొకటి ప్రయత్నించడం జరుగుతుంది. అందుకని దంపతులందరికీ ఇవన్నీ ఒకేలా వర్తించవు. కాబట్టి వారికి అవసరమైన నిర్ణీత ప్రక్రియను కనుగొనేందుకు కాస్త ఓపికతో ఎదురుచూడాల్సి ఉంటుంది.

చికిత్సలు

సంతానయోగం కోసం చేసే చికిత్సలు... ఆయా దంపతులకు ఉన్న సమస్యలను బట్టి ఉంటాయి. 20 – 30 శాతం మందిలో వారి శారీరక స్థితిపైనా, రుతుచక్రం, అండం విడుదల వంటి అంశాలపై అవగాహన పెంచుకొని, శ్రద్ధవహించి, కొంచెం ఓపిక చేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి చికిత్సలు అవసరం లేకుండానే గర్భం ధరించవచ్చు. కొన్ని జాగ్రత్తలు, నియమాలు పాటిస్తే అవి ఇటు సంతానయోగ్యతకూ, అటు సాధారణ ఆరోగ్యానికీ మేలుచేస్తాయి. ఉదాహరణకు...

- ★ మంచి ఆహార నియమాలు
- ★ సరైన వ్యాయామంతో పాటు ఎత్తుకు తగిన బరువు ఉండేలా జాగ్రత్త తీసుకోవడం.
- ★ జీవనశైలిలో మార్పులు... వీటిలో మంచి ఆహారం, సరైన వ్యాయామంతో పాటు ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి అంశాలపై జాగ్రత్త వహించాలి.
- ★ థైరాయిడ్ సమస్యలు : థైరాయిడ్ గ్రంథి స్రవించే హార్మోన్లలో లోపాలు ఉంటే దానికి తగినట్లుగా చికిత్స తీసుకోవాలి. చాలామందిలో థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు దాన్ని సరిచేయగానే గర్భం ధరించే అవకాశం బాగా పెరుగుతుంది.

అండం విడుదల జరగనప్పుడు : క్లోమిఫిన్, లెట్రోజల్ వంటి మాత్రలను నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే తగిన మోతాదుల్లో వాడాలి. అలాంటప్పుడు ఈ మాత్రలు వాడిన కొద్దిరోజుల్లోనే గర్భధారణ జరగడం నిపుణులు సాధారణంగా చూస్తుంటారు.

- ★ మాత్రలతో అండం విడుదల కానప్పుడు, కొన్ని రకాల హార్మోన్ ఇంజెక్షన్లను ఇచ్చి చూస్తారు. దాంతో గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి.
- ★ గర్భాశయానికి ఇన్ఫెక్షన్ ఏవైనా ఉంటే... సరైన యాంటీబయాటిక్‌ను సరైన మోతాదుల్లో వాడటం వల్ల ... ఇక ఎలాంటి చికిత్స అవసరం లేకుండానే గర్భధారణ జరుగుతుండటం నిపుణులు చూస్తుంటారు.

డీ అండ్ సీ : కొంతమందిలో గర్భాశయ ముఖద్వారం మరీ సన్నగా ఉంటుంది. అలాంటప్పుడు డీ అండ్ సీ అనే చిన్న ఆపరేషన్ చేసి, యోని మార్గాన్ని వెడల్పు చేస్తారు. అలాగే గర్భసంచి లోపలి పొరను శుభ్రం చేయడం కూడా జరుగుతుంది. దీనివల్ల కొంతమందిలో గర్భాశయం లోపలి పొర ఆరోగ్యంగా తయారయ్యే అవకాశం ఉంటుంది. అలాగే అవసరాన్ని బట్టి పొరను బయాప్సీకి పంపడం వల్ల, హార్మోన్ అసమతౌల్యతలు ఏవైనా ఉంటే తెలుస్తాయి. ఇన్ఫెక్షన్స్ వంటివి ఏవైనా ఉన్నా అవి బయటపడతాయి. అలాగే కొందరిలో ఈ పొరను టీబీ పరీక్షకు కూడా పంపించడం జరుగుతుంది. ఇందులో టీబీ నిర్ధారణ అయితే, దానికి చికిత్స తీసుకుంటే కూడా చాలామందిలో గర్భం నిలుస్తుంది.

- ★ హిస్టరోసాల్పింగోగ్రామ్ ద్వారా ఫెలోపియన్ ట్యూబ్స్ తెరచుకొని ఉన్నాయా లేక మూసుకొని ఉన్నాయా అన్న విషయం తెలుస్తుంది. ఒకవేళ మూసుకుపోయినట్లు అనిపిస్తే, అప్పుడు లాపరోస్కోపీ ద్వారా ట్యూబ్స్ మూసుకుపోయిన విషయాన్ని నిర్ధారణ చేసుకుని, కొందరిలో చికిత్స కూడా చేయవచ్చు. మరికొందరిలో సర్జరీ ద్వారా మూసుకుపోయిన ట్యూబ్స్‌ను సరిచేయడానికి ప్రయత్నించవచ్చు.
- ★ గర్భాశయంలో ఉండే ఫైబ్రాయిడ్స్, పాలిప్స్, అడ్డుపొరలు, అండాశయంలోని నీటిబుడగలను లాపరోస్కోపీ, హిస్టరోస్కోపీ ద్వారా సరిచేయవచ్చు.

గర్భం దాల్చడానికి చేసే అడ్వాన్స్‌డ్ ప్రక్రియలు

ఐయూఐ : కొంతమందిలో గర్భాశయ ముఖద్వారానికి ఇన్ఫెక్షన్ లేదా పూత ఉన్నప్పుడు లేదా యాంటీ స్పెర్మ్ యాంటీబాడీస్ ఉన్నప్పుడు; వీర్యకణాలు గర్భాశయంలోకి వెళ్లలేనప్పుడు, మందుల ద్వారా ప్రయత్నించినా గర్భం రానప్పుడు ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) అనే ప్రక్రియను నిర్వహిస్తారు. ఇందులో భర్త వీర్యాన్ని చిన్న కంటెయినర్‌లో సేకరించి, దాన్ని స్పెర్మ్ వాషింగ్ మీడియాలో శుభ్రపరచి, మంచి ఆరోగ్యవంతమైన వీర్యకణాలను వేరుపరచి, అండం విడుదలయ్యే రోజుల్లో గర్భాశయంలోపలికి ప్రవేశపెట్టడం జరుగుతుంది. ముందుగా సేకరించిపెట్టుకున్న ఆరోగ్యకరమైన వీర్యకణాలను ఒక సన్నటి కాన్యులాలోకి తీసుకుంటారు. సరిగ్గా అండం విడుదలయ్యే సమయానికి ఆ కాన్యులాను యోని ద్వారా గర్భాశయంలోకి పంపి అక్కడ వీర్యకణాలను ఇంజెక్ట్ చేస్తారు. దాంతో వీర్యకణాలు... యోని మొదలుకొని, గర్భాశయముఖద్వారంలోని అడ్డంకులను దాటుకొని, గర్భాశయం వరకు ప్రయాణించాల్సిన దూరం తగ్గుతుంది. ఇలాంటి అడ్డంకులు దాటడం వల్ల సాధారణ ప్రయత్నం కంటే గర్భం వచ్చేందుకు ఒకసారికి సాధారణం కంటే 10 – 20 శాతం ఎక్కువగా అవకాశాలు పెరుగుతాయి ఇలా ఐయూఐ ప్రక్రియను 3 నుంచి 6 సార్లు ప్రయత్నించవచ్చు. ట్యూబ్స్ తెరచుకొని ఉండి, గర్భాశయంలో ఎలాంటి అడ్డంకులు లేవని నిర్ధారణ చేసుకున్న తర్వాతే ఐయూఐకి ప్రయత్నించడం మంచిది. గర్భాశయంలోకి ప్రవేశించిన వీర్యకణాలు వాటంతట అవే అక్కడినుంచి ట్యూబ్స్‌లోకి ప్రయాణం చేయాలి. అక్కడ చేరిన అండంలోకి దూరి, దానికి ఫలదీకరణం చేయాలి. ఆ తర్వాత పిండం తయారై, అది గర్భాశయంలోకి చేరి, అక్కడ అంటుకుంటుంది. దీన్నే ఇంప్లాంటేషన్ అంటారు. అప్పుడది గర్భంగా (శిశువుగా) పెరుగుతుంది. వీర్యకణాలను లోపలికి వదిలాక మిగతావన్నీ వాటంతట అవే జరగాలి. అక్కడ ఏవైనా సమస్యలుంటే ఐయూఐతో వాటిని అధిగమించలేము. కాబట్టి ఒక మూడుసార్లు ఈ ప్రయత్నం చేయవచ్చు. మూడుసార్లకు ఈ ప్రక్రియతో సక్సెస్‌రేటు 30% వరకు పెరగవచ్చు. తర్వాత మళ్లీ ఒకసారి కారణాలను విశ్లేషించుకొని, సమస్యలను బట్టి చికిత్సను మార్చుకోవచ్చు. ఇలా మరో మూడు సార్లు ప్రయత్నం చేయవచ్చు.

ఐయూఐ... ఎవరిలో, ఎప్పుడు?

★ అన్నీ బాగున్నా గర్భం రాని అన్‌ఎక్స్‌ప్లెయిన్‌డ్ ఇన్‌ఫెర్టిలిటీ ఉన్నవారికి ★ సర్వైకల్ సమస్యలు ఉన్నవారికి ★ సాధారణ చికిత్సలతో రానప్పుడు ★ మైల్డ్ ఎండోమెట్రియాసిస్ ఉన్నప్పుడు ★ కలయికలో సమస్యలు ఉన్నప్పుడు ★ మగవారిలో అంగస్తంభన, స్ఖలనం (ఎరక్షన్, ఎజాక్యులేషన్) సమస్యలున్నప్పుడు ★ వీర్యకణాల సంఖ్య కొద్దిగా తక్కువగా (అంటే 10 నుంచి 15 మిలియన్లు మాత్రమే)ఉండి, కదలికలు మందకొడిగా ఉన్నప్పుడు ★ దాత వీర్యకణాలు వాడాల్సి వచ్చినప్పుడు

సాధారణంగా అండం తయారవుతున్నా కూడా కొందరిలో ఎక్కువ అండాలు తయారు కావడానికీ, వాటి నాణ్యతకూ, సక్సెస్‌రేటు పెరగడానికి కొన్ని మందులు, ఇంజెక్షన్లు అవసరాన్ని బట్టి ఇవ్వడం జరుగుతుంది.

ఐవీఎఫ్ లేదా టెస్ట్‌ట్యూబ్ బేబీ: పైన పేర్కొన్న పద్ధతిలో చికిత్స తీసుకున్నా ఫలితం లేనప్పుడు, మరికొన్ని అధునాతన ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. అందులో ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ఒకటి. దీన్నే టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియ అని కూడా అంటారు.

ఫెలోపియన్ ట్యూబ్స్ పూర్తిగా మూసుకుపోయి, ఏమాత్రం సరిదిద్దడానికి వీల్లేని పరిస్థితుల్లో ఉన్నవారికి కూడా ఈ పద్ధతి ద్వారా గర్భం వచ్చేలా ప్రయత్నించవచ్చు.

పిల్లలు కాకుండా ఆపరేషన్ అయిపోయి, మళ్లీ పిల్లలు కావాలనుకున్నప్పుడు రీ–ఆపరేషన్ వల్ల ఉపయోగం లేకపోతే కూడా ఐవీఎఫ్ ద్వారా ప్రయత్నించవచ్చు.



(మరికొన్ని వివరాలు తదుపరి వారం)...

డా॥ వేనాటి శోభ, బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదర్‌నగర్, హైదరాబాద్

ముఖ్యంగా తెలుసుకోవాల్సింది

పిల్లల కోసం డాక్టర్ దగ్గరికి వచ్చే దంపతుల్లో కొందరికి చికిత్స మొదలుకాగానే తర్వాతి నెలలోనే గర్భం రావాలంటూ ఆత్రుత పడుతుంటారు. రెండు మూడు నెలలకే మరో డాక్టర్‌ను సంప్రదిస్తుంటారు. ఇలా డాక్టర్లను మారుస్తూ వారి సమయం వృథా చేసుకుంటుంటారు. ఒకరి సమస్యలు, శరీరతత్వం, లోపాల వంటివి తెలుసుకునేందుకే ఒక్కోసారి డాక్టర్‌కు రెండు నెలలు లేదా అంతకంటే కాస్తంత ఎక్కువ సమయం పట్టవచ్చు.




పీరియడ్స్ సక్రమంగా లేకపోతే



కొందరిలో పీరియడ్స్ సక్రమంగా ఉండవు. అంటే సాధారణంగా మహిళల్లో 28 నుంచి 30 రోజులకొకసారి పీరియడ్స్ వస్తుంటాయి. ఇలా వచ్చే వారిలో పీరియడ్ మొదలైన మొదటిరోజు నుంచి లెక్కపెడితే 11 నుంచి 16వ రోజు లోపల చాలావరకు అండం విడుదల అవుతుంది. అయితే కొద్దిమందిలో విధిగా 35, 40 రోజులకు ఒకసారి పీరియడ్స్ వస్తాయి. ఇలాంటి వారిలో పీరియడ్స్ కనపడటానికి 14 రోజుల ముందు అండం విడుదలయ్యే అవకాశం ఉంటుంది. అంటే వారిలో పీరియడ్ వచ్చాక గానీ అండం ఎప్పుడు విడుదలయ్యిందో అంచనా వేయలేం. అంటే... వీరివిషయంలో జరిగేదేమిటంటే...

- ★ నెలసరి సక్రమంగా రానివాళ్లలో అండం విడుదల కూడా సక్రమంగా ఉండదు. పీరియడ్‌కీ, పీరియడ్‌కీ మధ్య ఎప్పుడైనా అండం విడుదల కావచ్చు. లేదా అసలు కాకపోనూ వచ్చు.
- ★ కాబట్టి సంతానం కావాలనుకునే దంపతుల్లో సక్రమంగా పీరియడ్స్ వచ్చేవారు పీరియడ్స్ వచ్చి 11 నుంచి 16 రోజుల సమయంలో తప్పక కలవాలి. పీరియడ్స్ సక్రమంగా రాని వాళ్లు డాక్టర్‌ను సంప్రదించి, ఆ మేరకు అవసరమైన చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలి.

కుటుంబం తోడ్పాటుతో క్యాన్సర్‌పై విజయం



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కాగానే మొదట డాక్టర్లు దాని తీవ్రతను అంచనావేస్తారు. క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. అందుకోసం 'టీఎన్ఎమ్' అనే విషయాలను పరీక్షిస్తారు. ఈ ఇంగ్లిష్ పొడి అక్షరాల్లో 'టీ' అంటే ట్యూమర్ సైజ్, 'ఎన్' అంటే చుట్టుపక్కల ఉండే లింఫ్ నోడ్స్, ఎమ్ అంటే పరిసరాల్లోని ఏయే భాగాలకు పాకిందని తెలుసుకునే 'మెటాస్టాసిస్'. ఈ అంశాల ఆధారంగా క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకుంటారు. క్యాన్సర్‌లో '0' నుంచి '4' వరకు దశలు ఉంటాయి. '0' అంటే క్యాన్సర్ ప్రారంభానికి ముందు దశ. ప్రారంభం అయిన దశను 'స్టేజ్ 1', పెద్ద గడ్డ లింఫ్ గ్రంథులకు సోకితే 'స్టేజ్ 2' లేదా 'స్టేజ్ 3' అని, ఇతర అవయవాలకు కూడా వ్యాపిస్తే దాన్ని 'స్టేజ్ 4' అని నిర్ధారణ చేస్తారు.

ఎన్నో రకాలు... ఎన్నో పేర్లు

క్యాన్సర్ శరీరంలోని ఏ భాగానికి వచ్చిందో దాన్ని బట్టి ఆ పేరుతో పిలుస్తారు. అయితే వైద్య పరిభాషలో సాంకేతికంగా వేర్వేరు పేర్లతో పిలుస్తుంటారు. ఉదాహరణకు చర్మం మీద, అవయవాల లోపలి లేక బయటి పొరల మీద వచ్చే క్యాన్సర్‌ను కార్సినోమా అంటారు. ఎముకలు, రక్తనాళాలు, అవయవాలను కలిపే కనెక్టివ్ టిష్యూతో పాటు కండరాలలో వచ్చే క్యాన్సర్‌ను సార్కోమా అంటారు. రక్తకణాలలో, రక్తకణాలను తయారు చేసే ఎముక మజ్జలో వచ్చే క్యాన్సర్‌ను ల్యుకేమియా అంటారు. ఇక రోగనిరోధక వ్యవస్థను కాపాడే లింఫ్ నాళాల వంటి చోట్ల వచ్చే క్యాన్సర్‌ని లింఫోమా, మైలోమా అంటారు. ఇలా క్యాన్సర్స్‌లో కార్సినోమా, సార్కోమా, ల్యుకేమియా, లింఫోమా/సార్కోమా అని ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.

కొన్ని లక్షణాలను గమనించాక క్యాన్సర్‌ను నిర్ధారణ చేసే పరీక్షలను చేస్తుంటారు. ఎక్స్‌-రే, అల్ట్రాసౌండ్ స్కాన్, సీటీ స్కాన్, న్యూక్లియర్ స్కాన్, ఎమ్మారై, పెట్ స్కాన్, బయాప్సీ, రక్తపరీక్షలు, మలమూత్ర, కళ్లె పరీక్షల వంటివి అవసరాన్ని బట్టి చేయాల్సి ఉంటుంది.



రకాన్ని బట్టి... తీవ్రతను బట్టి చికిత్స

క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ జరిగితే వ్యక్తి వయసు, ఇతర ఆరోగ్య విషయాలను పరిగణనలోకి తీసుకొని ముందుగా సర్జరీ చేసి, ఇతర థెరపీలకు వెళ్తారు. ఒక్కోసారి ఇతర థెరపీల తర్వాత కూడా సర్జరీ చేస్తారు. చికిత్సలో భాగంగా సర్జరీ, కీమో, రేడియో, హార్మోన్ థెరపీలతో పాటు ఒక్కోసారి జీన్, బయొలాజికల్, ఇమ్యూనో వంటి అనేక థెరపీలు చేస్తారు. రక్త సంబంధిత క్యాన్సర్లు ఉన్నవారికి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తారు. ఇటీవల వైద్యరంగంలోని పురోగతితో స్టెమ్‌సెల్ థెరపీ వంటివి కూడా అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో ఏయే క్యాన్సర్లకు ఏయే తరహా చికిత్సలు అవసరం అన్నది అనేక విషయాల ఆధారంగా నిర్ణయిస్తారు. ఇక సర్జరీల విషయానికి వస్తే కోత తక్కువగా ఉండే లేజర్, కీహోల్ సర్జరీలు చేస్తున్నారు. అలాగే కీమోథెరపీలో క్యాన్సర్ కణాన్ని మాత్రమే ప్రభావితం చేసేలా టార్గెటెడ్ థెరపీ చేస్తున్నారు. రేడియేషన్‌లో ఆధునికమైన వీఎమ్ఏటీ రేడియేషన్, 3డీ రేడియేషన్ అందుబాటులో ఉన్నాయి. హార్మోన్‌లను ప్రభావితం చేసే హార్మోన్ థెరపీ కూడా ఇప్పుడు ఒక చికిత్సా ప్రక్రియ. ఇక రోగనిరోధక శక్తిని పెంపొందిస్తూ క్యాన్సర్ కణాల పెరుగుదలకు అడ్డుకట్ట వేసే ఇమ్యూనోథెరపీ వంటి కొత్త కొత్త చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి.

నివారణ సులభమే...

మంచి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఆల్కహాల్, పొగతాగే అలవాటుకు దూరంగా ఉండటం, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, యోగా, ధ్యానం, కాలుష్యాలకు దూరంగా ఉండటం వంటి మన చేతుల్లో ఉండే అంశాలతో చాలావరకు దీన్ని నివారించవచ్చు.

అయితే చాలా కొద్దిరకాలలో మాత్రం క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయడం సాధ్యం కాకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో రోగి బాధలను చాలావరకు తగ్గించి, వారి జీవననాణ్యతను మెరుగుపరచి, తక్కువ బాధతో జీవితాంతం గడిపేలా చేసే ప్రక్రియను 'పాలివేటివ్ కేర్' అంటారు. పాలియేటివ్ కేర్‌లో కొంచెం కణితి పరిమాణం, బాధలను తగ్గించడానికి మత్తు మందులతో పాటు కీమో, రేడియోథెరపీలు ఇస్తుంటారు. ఈ విభాగంలో మత్తు స్పెషలిస్టులు అయిన ఎనస్థిసిస్ట్, పెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్, మెడికల్ ఆంకాలజిస్ట్, సర్జికల్ ఆంకాలజిస్ట్, డైటీషియన్, నర్సులు తమ సేవలు అందిస్తుంటారు. అయితే వారితో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల భూమిక చాలా కీలకం.

కచ్చితంగా నయం చేస్తామనే ప్రకటనలను నమ్మకండి

'క్యాన్సర్ వ్యాధిని తగ్గించడానికి మా వద్ద కచ్చితమైన చికిత్సలున్నాయి' అంటూ చాలా రకాల ప్రకటనలు కనిపిస్తుంటాయి. వాటిని చూసి, నమ్మి, ఆచరించి రోగాన్ని ముదరబెట్టుకునే వాళ్లు చాలా మంది ఉంటారు. ఏ వైద్యవిధానంలోనూ క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసే మందులు లేవు. సైంటిఫిక్‌గా కచ్చితమైన క్లినికల్ ట్రయల్స్‌తో సాగే అల్లోపతిలోనూ తొలిదశలో గుర్తిస్తేనే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయడం సాధ్యమవుతుంది. అందుకే అలాంటి బోగస్ ప్రకటనలను నమ్మకూడదు. ఇక క్యాన్సర్ కణాల మీద మాత్రమే పనిచేసే టార్గెట్ థెరపీలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఆ మందులు చాలా ఖరీదైనవి కాబట్టి ఇప్పటికీ అందరికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు.

మనిషి మనిషి ప్రవర్తనలో తేడాలున్నట్లే క్యాన్సర్ కణం కూడా ఒక్కొక్కరిలో ఒక్కోలా ప్రవర్తిస్తుంటుంది. వయసు, క్యాన్సర్ కణం ప్రవర్తించే తీరును బట్టి వ్యక్తిగత వైద్యచికిత్స ఉంటుంది. అనుసరించే చికిత్స విధానాలు, కీమో, రేడియోథెరపీలన్నీ అందరిలోనూ ఒకేలా ఉండవు. కొందరిలో కొన్ని నెలలు పట్టే చికిత్స మరికొందరికి ఏడాది కూడా పట్టవచ్చు.

కుటుంబం సహకారం అవసరం...

చాలామంది, మరీ ముఖ్యంగా మహిళలు ఈ వ్యాధికి గురైనప్పుడు చాలా తల్లడిల్లిపోతుంటారు. ఇల్లు, పిల్లలు ఏమైపోతారో అన్న వ్యధతో పాటు, తమ వైద్యానికి చాలా ఎక్కువగా ఖర్చవుతోందని, దాంతో కుటుంబంపై ఆర్థిక భారం పడుతోందని మనోవేదనకు గురవుతుంటారు. వారికి డాక్టర్లు ఇచ్చే కౌన్సెలింగ్‌తో పాటు కుటుంబ సభ్యుల సహకారం చాలా ముఖ్యం. నిజానికి వీటిన్నింటికి మించి రోగి కుటుంబ సభ్యుల తోడ్పాటు, సహకారం తప్పనిసరి. మరీ చెప్పాలంటే... అన్నింటికంటే అదే ప్రధానం.

పరి పరిశోధన

అయస్కాంతాలతో కండరాలకు శక్తి...



వ్యాయామం చేస్తూ ఉంటే కండరాలు దృఢంగా మారతాయి. చాలాసార్లు విన్నమాటే ఇది. గాయాలై కదల్లేని వారి గతేమిటి? ఎంరెజెన్ వాడితే చాలంటున్నారు సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. అయస్కాంత శక్తితో పనిచేసే ఈ ఎంరెజెన్‌ను రోజూ ఉపయోగిస్తే ఎలాంటి వారికైనా వ్యాయామం చేసిన ఫలితం దక్కుతుందని అల్‌ఫ్రెడో ఫ్రాంకో ఒబెర్గన్ అంటున్నారు. కండరాలపై నిర్దిష్ట తీవ్రతతో ఒక అయస్కాంత క్షేత్రాన్ని సృష్టించడం ద్వారా ఎంరెజెన్ పనిచేస్తుందని ఫలితంగా ఖర్చయిపోతున్నట్లు భ్రమపడి కండరాలు మళ్లీ దృఢంగా తయారయ్యే ప్రయత్నం చేస్తాయని వివరించారు. వ్యాయామం అస్సలు చేయని లేదా చేయలేని వారి కండరాలు కాలక్రమంలో బలహీనపడుతూ ఉంటాయని.. తద్వారా వచ్చే దుష్పలితాలను ఎంరెజెన్ సాయంతో నివారించవచ్చునని చెప్పారు. 2015, 2017లలో తాము ఈ యంత్రాన్ని కొంతమందిపై ప్రయోగించి చూశామని వారానికి ఒక రోజు పది నిమిషాలపాటు.. ఐదు వారాల పాటు ఒక కాలి కండరంపై దీన్ని వాడినప్పుడు కండరాల శక్తిలో 30 నుంచి 40 శాతం వరకూ పెరుగుదల కనిపించినట్లు తెలిపారు. రెండో ప్రయోగంలో మోకాలి శస్త్రచికిత్స చేసిన వాళ్లు కొంతమందిని రెండు గుంపులుగా విడదీశామని.. కొందరికి ఎంరెజెన్.. మిగిలిన వాళ్లకు సాధారణ ఫిజియోథెరపీ ఇచ్చామని యంత్రాన్ని వాడిన వాళ్లు చాలా తొందరగా కోలుకున్నట్లు తెలిపారు.

మురికి ఇటుకలు...



మురుగునీటిని శుద్ధి చేసి మళ్లీ వాడుకోవడం ఈ కాలంలో సహజమే. పర్యావరణానికి మంచిది కూడా. అయితే ఒక చిక్కుంది. నీళ్లన్నీ శుద్ధి అయిపోయిన తరువాత మిగిలిపోయే మడ్డి వృథాగా మిగిలిపోతూంటుంది. ఈ సమస్యకూ పరిష్కారం కనుక్కున్నారు ఆస్ట్రేలియాలోని ఆర్ఎంఐటీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఈ మడ్డిని భవన నిర్మాణానికి ఉపయోగపడే ఇటుకలుగా మార్చడంలో వీరు విజయం సాధించారు. ఇటుకలు మొత్తం ఈ మడ్డితో తయారు కాలేదుగానీ.. నాలుగోవంతును వాడటం ద్వారా అనేక ప్రయోజనాలు సాధించవచ్చునని అంటున్నారు ఈ ప్రయోగాలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త అబ్బాస్ మొహర్‌జానీ. మడ్డి వాడినప్పటికీ ఈ ఇటుకలు దుర్వాసన ఏమాత్రం వెలువరించవు. అదే సమయంలో తయారీ సమయంలో సగం ఇంధనాన్ని మాత్రమే వాడుకుంటుంది. అంతేకాకుండా.. మడ్డిలోని భారలోహాలు కూడా ఇటుకల్లోకి చేరిపోవడం వల్ల పర్యావరణ సమస్యలను తగ్గించవచ్చునని వివరించారు. అయితే ప్రస్తుతానికి ఈ కొత్త రకం ఇటుకలను మరింత విస్తృతంగా పరిశీలించాల్సి ఉందని ఆ తరువాత మాత్రమే భవన నిర్మాణానికి వాడుకోవచ్చునని వివరించారు.

కాలుష్యంతోనే కరెంటు, హైడ్రోజన్..



ఒక్కదెబ్బకు రెండు పిట్టలంటే ఇదేనేమో. వాతావరణంలో పెరిగిపోతున్న కార్బన్‌డయాక్సైడ్ వాయువును తొలగించడంతోపాటు అటు కరెంటు ఇటు స్వచ్ఛమైన ఇంధనం హైడ్రోజన్‌ను తయారు చేసేందుకు జార్జియా, ఉల్సాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఒక కొత్త విధానాన్ని కనుక్కున్నారు. హైబ్రిడ్ ఎన్‌ఏ–సీఓ2 అని పిలుస్తున్న ఈ కొత్త టెక్నాలజీలో కార్బన్‌డయాక్సైడ్ వాయువును ద్రవంతో నిండిన ఓ పరికరంలోకి పంపుతారు. ఈ తొట్టిలో కాథోడ్‌ను ఉంచి.. పక్కనే ఎలక్ట్రోలైట్‌లో సోడియంతో తయారైన ఆనోడ్‌ను ఉంచుతారు. కార్బన్‌డయాక్సైడ్ ప్రవహించినప్పుడు అది కాథోడ్‌తో చర్య జరిపి ద్రవాన్ని మరింత ఆమ్లయుతం చేస్తుంది. ఫలితంగా అక్కడికక్కడ కరెంటుతోపాటు హైడ్రోజన్ కూడా ఉత్పత్తి అవుతుంది. వాడే కార్బన్ డయాక్సైడ్‌లో కనీసం 50 శాతాన్ని కరెంట్, హైడ్రోజన్ రూపంలో వాడుకోవచ్చునని ఎలక్ట్రోడ్‌లకు ఏమాత్రం హాని జరక్కుండా ఈ పరికరాన్ని వెయ్యి గంటలపాటు వాడుకోవచ్చునని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త కిమ్ తెలిపారు. మిగిలిన సీఓ2ను కూడా ద్రవం నుంచి వేరుచేసి మళ్లీ వాడుకోవచ్చునని తెలిపారు. కొన్ని మార్పులు, చేర్పుల ద్వారా ప్రస్తుత డిజైన్‌ను మరింత మెరుగుపరిచే అవకాశం ఉందని.. ఉత్పత్తి అయ్యే హైడ్రోజన్‌ను వాహనాల్లో వాడుకోవచ్చునని తెలిపారు.

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
24-1-2019

అంతర్జాతీయ అంశాలు

గ్రూప్స్ స్పెషల్ సమకాలీనం

చాగోస్ దీవుల వివాదం

మారిషస్ హిందూ మహా సముద్రంలోని పలు దీవుల సముదాయం (ఆర్కిపెలాగో). మారిషస్ దేశం ఆఫ్రికా ఖండానికి 2000 కిలోమీటర్ల దూరంలో ఆగ్నేయ దిశలో ఉంటుంది. రాజధాని పోర్ట్ లూయిస్. ఆ దేశ ప్రధానమంత్రి ప్రవింద్ జగన్నాథ్. మారిషస్‌లో వివిధ దేశాలకు చెందిన ప్రజలు స్థిరపడ్డారు. వీరిలో భారత సంతతికి చెందిన వారు, ఆఫ్రికన్ ప్రజలు, చైనీయుల తోపాటు యూరోపియన్ సంతతి వారున్నారు. ఆఫ్రికాలో అతి ఎక్కువ జనసాంద్రత గల దేశం ఇది. ఆఫ్రికా ఖండంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో మారిషస్ కూడా ఒకటి.



✦ మారిషస్‌కు 1968లో బ్రిటిష్ నుంచి స్వాతంత్ర్యం లభించింది. అంతకంటే మూడేళ్ల ముందు అంటే 1965లో.. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే).. మారిషస్ నుంచి చాగోస్ దీవుల సముదాయాన్ని వేరుచేసి బ్రిటిష్ ఇండియన్ ఓషన్ టెరిటరీ(బీఐవోటీ)ని ఏర్పాటుచేసింది. అంటే.. 1968లో మారిషస్‌కు స్వాతంత్ర్యం ఇచ్చే సమయంలో చాగోస్ దీవుల సముదాయం యూకే ఆధీనంలోనే ఉంది. చాగోస్ దీవుల్లోని ప్రజలను వేరే ప్రాంతాలకు యూకే తరలించింది. చాగోస్ దీవుల్లోని అతిపెద్ద దీవి పేరు.. డీగో గార్సియా. ఈ దీవి నుంచి ప్రజలను ఖాళీ చేయించాక.. అమెరికా రక్షణ అవసరాల కోసం ఆ దేశానికి 50 ఏళ్ల పాటు డీగో గార్సియాని యూకే లీజుకు ఇచ్చింది. అమెరికా డీగో గార్సియాలో పెద్ద సైనిక స్థావరాన్ని ఏర్పాటుచేసుకున్నది. ప్రస్తుతం 60 చాగోస్ దీవుల్లో జనవాసం ఉన్న ఏకైక దీవి డీగో గార్సియానే కావడం గమనార్హం. అందులో నివాసం ఉంటున్న నాలుగు వేల మంది అమెరికాకు చెందిన సైనికులు మాత్రమే! 1966 డిసెంబర్‌లో యూకే, అమెరికాలకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం-50 ఏళ్లపాటు చాగోస్ దీవులను అమెరికా లీజుకు తీసుకుంది. అంటే.. 50 ఏళ్ల పాటు అమెరికా ఆ దీవుల్లో రక్షణ స్థావరాలను ఏర్పాటుచేసుకోవచ్చు. 2016లో ఆ లీజును మరో 20 ఏళ్లపాటు అంటే 2036 వరకూ పొడిగించారు. అయితే చాగోస్ దీవులు తమ దేశానికే చెందుతాయని మారిషస్ వాదిస్తోంది. స్వాతంత్ర్యానికి ముందు చాగోస్‌ను యూకే వేరుచేయడం ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు వ్యతిరేకమని చెబుతోంది. తన ఆందోళనను యూకే పట్టించుకోకపోవడంతో సమస్యను అంతర్జాతీయం చేయాలని మారిషస్ నిర్ణయించుకుంది. చాగోస్ దీవులపై మారిషస్‌కే సార్వభౌమాధికారం ఉందని ఆఫ్రికన్ యూనియన్, అలీనోద్యమ సంస్థలు ప్రకటించాయి.

✦ 2017 జూన్‌లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ(యూఎన్‌జీఏ) చాగోస్ దీవుల వివాదాన్ని అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే)కు అప్పగించాలని సూచించింది. ఐసీజే నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరంలో ఉంది. 2018 సెప్టెంబర్‌లో ఇరుపక్షాల వాదనలు ప్రారంభమయ్యాయి. 22 దేశాలు తమ సూచనలను ఐసీజేకు అందించాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్‌లు మాత్రమే యూకేకు మద్దతు తెలిపాయి. 17 దేశాలు మారిషస్‌కు అండగా నిలిచాయి. అందులో భారత్ కూడా ఒకటి. నెదర్లాండ్స్‌లో భారత రాయబారి వేణు రాజమొని భారతదేశ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించారు. చాగోస్ దీవులు మారిషస్‌లో అంతర్భాగమేనని భారత్ వాదించింది. చాగోస్ దీవులను తిరిగి మారిషస్‌కు అప్పగించాలని ఐసీజేకు భారత్ విజ్ఞప్తి చేసింది.

2018 ఐసీసీ అవార్డులు

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) వార్షిక అవార్డులను జనవరి 22న ప్రకటించింది. 2018కి గాను ఈ అవార్డులను ప్రకటించగా.. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మూడు అగ్రశ్రేణి అవార్డులను గెలుచుకున్నాడు. ఇందులో అత్యుత్తమమైన ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్(సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ) కూడా ఉంది. ఐసీసీ టెస్ట్ ప్లేయర్, ఐసీసీ ఒడిఐ ప్లేయర్ అవార్డులు కూడా విరాట్ కోహ్లీకే దక్కాయి. మూడు అవార్డులను ఒకే ఏడాది గెలుచుకున్న తొలి క్రికెటర్‌గా విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. అంతేకాక ఐసీసీ టెస్ట్ టీమ్‌కు, వన్‌డే ఇంటర్నేషనల్ టీమ్‌కు కెప్టెన్‌గా కూడా విరాట్ కోహ్లీనే ఐసీసీ ప్రకటించింది. 2018 ముగిసేనాటికి టెస్టుల్లోనూ, వన్‌డేల్లోనూ విరాట్ కోహ్లీ నంబర్ వన్‌గా కొనసాగుతుండటం విశేషం.

ఇతర అవార్డులు

✦ ఐసీసీ ఎమర్జింగ్ ప్లేయర్- రిషబ్ పంత్ (భారత్). ✦ ఐసీసీ అసోసియేట్ ప్లేయర్- కాలమ్ మెక్ లియెడ్(స్కాట్లాండ్). ✦ ఐసీసీ స్పిరిట్ ఆఫ్ క్రికెట్-కేన్ విలియమ్‌సన్(న్యూజిలాండ్). ✦ టీ20 పర్‌ఫామెన్స్ ఆఫ్ ద ఇయర్- ఆరోన్ ఫించ్(ఆస్ట్రేలియా). ✦ అంపైర్ ఆఫ్ ద ఇయర్- కుమార్ ధర్మసేన (శ్రీలంక).


ఎన్.విజయేందర్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ

● విద్య వీక్లీ టెస్ట్-4

కరెంట్ అఫైర్స్ - 2018 గ్రాండ్ టెస్ట్

● ప్రిపరేషన్‌ను సమీక్షించుకునేందుకు అవకాశం
● రాసిన ప్రతిసారీ వేర్వేరు ప్రశ్నలు
● ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం సాక్షి.. విద్య వీక్లీ టెస్ట్‌లో భాగంగా కరెంట్ అఫైర్స్ గ్రాండ్‌టెస్ట్‌ను నిర్వహిస్తోంది. విద్య పేజీల్లో ప్రచురించిన జూలై-డిసెంబర్ కరెంట్ అఫైర్స్‌ను ఆన్‌లైన్‌లో ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలుగా సుమారు 1200 ప్రశ్నలతో ఈ టెస్ట్‌ను రూపొందించారు. ఒకసారి రిజిస్టర్ చేసుకుని ఎన్నిసార్లు అయినా ఆన్‌లైన్‌లో టెస్ట్ రాయొచ్చు. ఒక్కోసారి 50 ప్రశ్నల చొప్పున ప్రతిసారీ వేర్వేరు ప్రశ్నలు వస్తాయి. టెస్ట్ పోర్టల్‌లో ఉండే డిస్కషన్ సెక్షన్‌లో అభ్యర్థుల సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇస్తారు. **www.sakshieducation.com** ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేస్తారు.

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI ACADEMY
Biology



వర్క్ అబ్రాడ్.. స్టడీ అబ్రాడ్.. మన విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యమిదే! విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగం అనగానే అందరికీ గుర్తొచ్చే దేశం అమెరికా. ఎందుకంటే.. ఒకసారి అక్కడ అడుగుపెడితే భవిష్యత్తు బంగారుమయం అనే ఆలోచన! కానీ.. ట్రంప్ ప్రభావంతో.. అమెరికాలో కొలువుకు వీలుకల్పించే హెచ్1బి వీసాలపై అనేక ఆంక్షలు. హెచ్1బి వీసా అందుకోవాలంటే.. సవాలక్ష సమస్యలు! అందుకే ఇటీవల కాలంలో భారతీయుల గమ్యం మారుతోంది. అమెరికాకు బదులుగా మన వాళ్లు యూకే, కెనడావైపు చూస్తున్నారు! ఈ రెండు దేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్న భారతీయులు పెరుగుతున్నట్లు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది.

యూకే, కెనడాల వైపు..
భారతీయుల చూపు!

- హెచ్1బి ఆంక్షలతో యూఎస్‌కు తగ్గుతున్న ఆదరణ
- యూకే, కెనడాల్లో ఉద్యోగాల కోసం పెరుగుతున్న అన్వేషణ
- ఈ దేశాల్లో వీసా నిబంధనల్లో సడలింపులే కారణం అంటున్న నిపుణులు

ఆగస్ట్-2016 నుంచి జూలై 2018 మధ్య కాలంలో.. అమెరికాలో ఉద్యోగాన్వేషణ సాగిస్తున్న భారతీయులు పది శాతం తగ్గారు. అదే సమయంలో కెనడాలో కొలువుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్న భారత అభ్యర్థులు ఆరు నుంచి 13 శాతానికి పెరిగారు. బ్రెగ్జిట్ తర్వాత కాలంలో యూకేలో ఉద్యోగాల కోసం అన్వేషణ సాగిస్తున్న విదేశీయులు 8 శాతం నుంచి పది శాతానికి పెరిగారు. ఇందుకు ఇండీడ్ తాజా నివేదికే నిదర్శనం! ముఖ్యంగా భారతీయులు యూకే, కెనడాలవైపు మొగ్గు చూపడానికి ఆ రెండు దేశాల్లో ఇటీవల కాలంలో వర్క్ వీసా నిబంధనల్లో సడలింపులే కారణమంటున్నారు.

కెనడాలో.. ఉద్యోగాలు.. వీసా విధానాలు

కెనడాలో ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తున్న భారతీయ అభ్యర్థులు.. బిజినెస్ అనలిస్ట్ ✦ మెకానికల్ ఇంజనీర్ ✦ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ✦ ప్రాజెక్ట్ మేనేజర్ ✦ వెబ్ డెవలపర్, ✦ డేటా సైంటిస్ట్ ✦ జావా డెవలపర్ ✦ సివిల్ ఇంజనీర్ ✦ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ✦ డేటా అనలిస్ట్ తదితర జాబ్ ప్రొఫైల్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ స్కీమ్

✦ దేశీయంగా నిపుణుల కొరతను ఎదుర్కొంటున్న కెనడా.. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ పేరుతో విదేశీ నిపుణులను నియమించుకునేందుకు వీసా నిబంధనలను సడలించింది. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోపు ప్రక్రియను పూర్తిచేయడమే లక్ష్యంగా ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. ఇదే ఇప్పుడు భారతీయులకు వరంగా మారిందని చెప్పొచ్చు. కెనడా ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ స్కీమ్‌లో.. స్పాన్సర్‌షిప్ లెటర్ లేకున్నా కూడా పర్మనెంట్ రెసిడెన్సీకి దరఖాస్తు చేసుకొని వీసా పొందొచ్చు. ఆ తర్వాత ఉద్యోగాన్వేషణ సాగించి.. అక్కడే కొలువుదీరొచ్చు.

✦ ఈ స్కీమ్‌ను కెనడా ప్రభుత్వం.. ఫెడరల్ స్కిల్డ్ వర్కర్ ప్రోగ్రామ్, ఫెడరల్ స్కిల్ ట్రేడ్స్ ప్రోగ్రామ్, కెనడియన్ ఎక్స్‌ప్రెస్ క్లాస్.. అంటూ మూడు విభాగాలుగా వర్గీకరించింది.

✦ **ఫెడరల్ స్కిల్డ్ వర్కర్స్ ప్రోగ్రామ్:** పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సులు పూర్తి చేసుకుని కెనడాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి ఉద్దేశించిన ప్రోగ్రామ్ ఇది. దీని ప్రకారం.. కెనడాలో లేదా ఇతర దేశాల్లో సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ తోపాటు ఒక ఏడాది పని అనుభవం ఉన్న వారికి కెనడా కంపెనీల్లో పని చేసే అవకాశం లభిస్తే వీసా సులువుగా మంజూరు చేస్తారు.

✦ **ఫెడరల్ స్కిల్డ్ ట్రేడ్స్ ప్రోగ్రామ్:** ఈ ప్రోగ్రామ్ ప్రకారం పలు వృత్తులకు సంబంధించిన నైపుణ్యాలు సొంతం చేసుకుని వాటికి సంబంధించి కెనడాలోని పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు వీసా మంజూరు చేస్తారు.

✦ **కెనడియన్ ఎక్స్‌పీరియన్స్ క్లాస్:** ఇప్పటికే కెనడాలో నివసించి కనీసం ఏడాది పని అనుభవం గడించి స్వదేశాలకు తిరిగి వెళ్లిన వారిని ఆకర్షించే ప్రోగ్రామ్.. కెనడియన్ ఎక్స్‌పీరియన్స్ క్లాస్.

దరఖాస్తు కూడా సులువే

కెనడా ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ స్కీమ్ ప్రకారం- అభ్యర్థులు పర్మనెంట్ రెసిడెన్సీకి దరఖాస్తు చేసుకోవడం నుంచి ఉద్యోగం లభించాక వీసా మంజూరు వరకు అంతా ఆన్‌లైన్‌లోనే! ఇందుకోసం కెనడా ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌లింక్‌ను అందుబాటులో ఉంచింది.

జాబ్ బ్యాంక్ అకౌంట్

కెనడా ఇమిగ్రేషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ క్రియేట్ చేసుకుంటే.. అభ్యర్థుల అర్హతలు, అనుభవం ఆధారంగా వారికి సరిపడే కంపెనీలకు సదరు అభ్యర్థుల ప్రొఫైల్ తెలుస్తుంది. అభ్యర్థి ప్రొఫైల్ నచ్చితే సదరు సంస్థ కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేస్తుంది. ఆ వెంటనే వీసా మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుంది. మూడు వారాల్లోపు వీసా లభిస్తుంది. ఎలాంటి ఉద్యోగ ఆఫర్ లేకుండా పీఆర్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.. అది మంజూరైన ఏడాదిలోపు అక్కడ ఉద్యోగం సొంతం చేసుకొని స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

యూకేలో.. కొలువులు.. వీసా తీరుతెన్నులు

యూకేలో ఉద్యోగాన్వేషణ సాగిస్తున్న భారతీయులు.. రీసెర్చ్ ఫెలో ✦ ఎస్ఏపీ కన్సల్టెంట్ ✦ ఐఓఎస్ డెవలపర్ ✦ ఆండ్రాయిడ్ డెవలపర్ ✦ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనలిస్ట్ ✦ రీసెర్చ్ అసోసియేట్ ✦ జావాడెవలపర్ ✦ ఫిజిషియన్ ✦ ఆర్కిటెక్ట్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

యూకేలో ఇలా

కొన్నేళ్ల క్రితం వరకు విదేశీయులకు ఉద్యోగ వీసాల మంజూరులో కఠినంగా వ్యవహరించిన యూకే కూడా ఇటీవల కాలంలో నిబంధనలను సరళీకృతం చేస్తోంది. విదేశీ ఉద్యోగ ఔత్సాహికులకు సులభంగా వర్క్ వీసాలు మంజూరు చేసే విధంగా ఆ దేశ ఇమిగ్రేషన్ విభాగం పనిచేస్తోంది. వీసా నిబంధనల సరళీకరణకు బ్రెగ్జిట్ అనంతర పరిణామాలే కారణమని చెబుతున్నారు.

టైర్-2 వీసాలు

యూకేలో అడుగుపెట్టే విదేశీయులకు.. మంజూరు చేసే వీసాలను టైర్-1 నుంచి టైర్-6 వరకు వర్గీకరించారు. ఉద్యోగాల కోసం టైర్-2 వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



యూకేలో ఉద్యోగం దిశగా.. అందుబాటులో ఉన్న ప్రధాన మార్గం.. టైర్-2 వీసాలు. ఇందులో టైర్-2 జనరల్, టైర్-2 ఐసీటీ (ఇంట్రా కంపెనీ ట్రాన్స్‌ఫర్) అని రెండు రకాలు ఉన్నాయి.

టైర్-2 జనరల్.. ఇలా

టైర్-2 జనరల్ వీసా ప్రకారం సంస్థలు నిపుణుల కొరత ఉన్న విభాగాల్లో విదేశీ ఉద్యోగులను నియమించుకోవచ్చు. కనీసం 30 వేల పౌండ్ల వేతనం చెల్లించాలి. ఇటీవల కాలంలో యూకే, భారత్ మధ్య పెరుగుతున్న వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో భారత్ నుంచి ఉద్యోగ ఔత్సాహికులకు అక్కడి సంస్థలు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ విభాగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

వీసా 'క్యాప్'

విదేశీ ఉద్యోగులకు ఇచ్చే వీసా 'క్యాప్'(వీసా పరిమితి)ని ఎత్తివేయాలనే దిశగా యూకే అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సంవత్సరానికి గరిష్టంగా 20,700 వీసాలను మంజూరు చేస్తున్నారు. 2021 నాటికి ఈ వీసా పరిమితిని తొలగించాలనే ప్రతిపాదనను పార్లమెంటు ముందుంచారు. ఇప్పటికే యూకేలో పనిచేస్తున్న విదేశీయుల్లో 55 శాతం మంది భారతీయులే ఉన్నట్లు అంచనా! వీసా క్యాప్ కూడా తొలగిస్తే.. ఈ సంఖ్య 80 శాతానికి చేరే అవకాశముందంటున్నారు.

ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి వీలు కల్పించే జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ పరీక్షకు 8,74,469 మంది హాజరు కాగా.. 15 మంది మాత్రమే 100 పర్సంటైల్ సాధించారు. ఈ 15 మందిలో ఐదుగురు తెలుగు విద్యార్థులు ఉండటం విశేషం. కష్టమైన పరీక్షగా భావించే జేఈఈ మెయిన్‌లో.. 100 పర్సంటైల్ సొంతం చేసుకున్న బట్టేపాటి కార్తికేయ, బొజ్జా చేతన్ రెడ్డి, జయంత్ ఫణి సాయిల సక్సెస్ స్పీక్స్.. వారి మాటల్లోనే!!

విజేతలు ఏమంటున్నారు..

జేఈఈ మెయిన్ సక్సెస్ స్పీక్స్

ఐఐటీల్లో చేరడమే

చిన్నప్పుడు చూసిన ఐరన్ మ్యాన్ మూవీ, ప్రముఖుల ఆటో బయోగ్రఫీలు చదవడమే నేను ఇంజనీరింగ్ లక్ష్యంగా ఎంచుకోవడానికి ప్రేరణ. ఎన్‌టీఏ జేఈఈ-మెయిన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 100 పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉంది. అడ్వాన్స్‌డ్‌లో విజయం సాధించి ఐఐటీలో సీటు సొంతం చేసుకోవడమే నా లక్ష్యం. భవిష్యత్తులో సొంతంగా సంస్థను నెలకొల్పాలనుకుంటున్నాను.

అయిదో తరగతిలోనే ఆసక్తి

మా స్వస్థలం డాక్టర్ వైఎస్ఆర్ కడప జిల్లా.. లక్కిరెడ్డి పల్లి మండలంలోని కొండవండ్ల పల్లి గ్రామం. నాన్న రమేశ్ రెడ్డి వృత్తి రీత్యా ఇంజనీరింగ్ ప్రొఫెసర్. అమ్మ జయసుధ గృహిణి. నాన్న ప్రస్తుతం మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ చేయాలనే ఆసక్తి అయిదో తరగతిలోనే మొదలైంది. అప్పట్లో చూసిన 'ఐరన్ మ్యాన్' సినిమా.. అదే విధంగా వృత్తి రీత్యా నాన్న ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉండటం కూడా నేను బీటెక్ లక్ష్యంగా ఎంచుకోవడానికి దోహదం చేశాయి. దీనికితోడు అక్క మోనిష.. నీట్-2017లో ఆల్ ఇండియా టాపర్‌గా నిలవడం, ఎయిమ్స్, జిప్‌మర్‌లలో సైతం మంచి ర్యాంకులు సొంతం చేసుకోవడంతో.. నేను కూడా ఆ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని భావించా. అందుకు జాతీయ స్థాయి పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.


బొజ్జా చేతన్ రెడ్డి

ఇంటర్‌లో అనుసంధానం చేసుకుంటూ

ఐఐటీలో సీటు.. అందుకు అవసరమైన జేఈఈ పరీక్షలో విజయం కోసం ఎనిమిదో తరగతి నుంచే అడుగులు వేశాను. ముందుగా జేఈఈ పరీక్ష సిలబస్‌కు సంబంధించిన బేసిక్ కాన్సెప్ట్స్‌పై అవగాహన ఏర్పరచుకున్నాను. జేఈఈ విజయం దిశగా పూర్తి స్థాయిలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం నుంచి ప్రిపరేషన్ సాగించాను. రెండు పరీక్షల సిలబస్‌ను అనుసంధానం చేసుకుంటూ చదివా. ఆగస్ట్ నాటికి సిలబస్ పూర్తి కావడంతో జేఈఈ మెయిన్ ప్రిపరేషన్‌కు, ఆయా అంశాల పునశ్చరణకు సమయం లభించింది. పాత ప్రశ్నపత్రాలతోపాటు పలు రకాల ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడంతో కాన్సెప్ట్స్‌పై అవగాహన వచ్చింది. ఇది జేఈఈ మెయిన్ పరీక్షలో 100 పర్సంటైల్ సాధించడానికి దోహద పడింది. ప్రతిరోజు క్లాస్ రూమ్ పాఠాలతో కలిపి 12 నుంచి 13 గంటలు ప్రిపరేషన్ సాగించాను. మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లలో.. నాకు ఫిజిక్స్ అంటే ఎంతో ఇష్టం.

మాక్ టెస్ట్‌లు, ఆన్‌లైన్ టెస్ట్‌లు

ఆన్‌లైన్ టెస్ట్‌లను ప్రాక్టీస్ చేయడం ఎంతో కలిసొచ్చింది. కాలేజ్‌లో రెగ్యులర్‌గా నిర్వహించే ఆన్‌లైన్ ఎగ్జామ్స్‌కు హాజరయ్యాను. అదే విధంగా టీసీఎస్ నిర్వహించిన ఆన్‌లైన్ ఎగ్జామ్‌ను రెండు సార్లు రాశాను. దీంతో అసలు పరీక్ష రోజు ఒత్తిడి లేకుండా సమాధానాలు ఇవ్వగలిగాను.

అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు.. ఐఐటీలో సీటు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ-ముంబై లేదా ఢిల్లీ క్యాంపస్‌లలో సీఎస్ఈ లేదా ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లలో బీటెక్‌లో చేరడం నా లక్ష్యం.

ఒత్తిడిగా భావించకుండా.. ఇష్టంగా

జేఈఈ వంటి పరీక్షల్లో మెరుగ్గా రాణించాలంటే ముందుగా మానసికంగా ఒత్తిడిని దరి చేరనీయకూడదు. ప్రిపరేషన్ పరంగానూ నిర్దిష్ట ప్రణాళికతో వ్యవహరించాలి. ప్రధానంగా కాన్సెప్ట్స్‌పై అవగాహన ఏర్పరచుకుంటే.. ఎలాంటి ప్రశ్నకైనా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది. విజయావకాశాలు మెరుగవుతాయి!!

ఐఐటీ- ముంబైలో సీఎస్ఈలో చేరుతా

జేఈఈ-మెయిన్ పరీక్షలో 100 పర్సంటైల్ రావడం సంతోషంగా ఉంది. ఇప్పుడు నా దృష్టంతా జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌పైనే ఉంది. ఐఐటీ-ముంబైలో సీఎస్ఈ బ్రాంచ్‌లో సీటు సొంతం చేసుకోవడమే నా లక్ష్యం. బీటెక్ పూర్తయ్యాక.. సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించి ఐపీఎస్ అధికారి కావాలనుకుంటున్నాను.


బట్టేపాటి కార్తికేయ

ఏపీ నుంచి తెలంగాణకు

వాస్తవానికి మా స్వస్థలం నెల్లూరు జిల్లా ఇందుకూరు పేట మండలం, నరసాపురం గ్రామం. నాన్న సురేశ్ నాయుడు వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ అమరావతి గృహిణి. నేను ఇంటర్మీడియెట్‌ను హైదరాబాద్‌లో చదువుతుండటంతో తెలంగాణ రాష్ట్రం టాపర్స్ జాబితాలో నిలిచాను. ఏడోతరగతి వరకు నెల్లూరులో, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విజయవాడలో చదివాను. అకడమిక్‌గా ముందంజలో నిలవడంతో కాలేజ్ వాళ్లు హైదరాబాద్‌లో ఇంటెన్సివ్ కోచింగ్ బ్యాచ్‌కు ఎంపిక చేసి అక్కడకు పంపారు.

ఐఐటీ లక్ష్యం.. స్ఫూర్తి సోదరే

నా ఐఐటీ లక్ష్యానికి స్ఫూర్తి అక్క షణ్ముఖ ప్రియ. అక్క ఐఐటీలో చేరాలని ఎంతో కృషి చేసింది కానీ.. అందుకు అవసరమైన ర్యాంకు రాలేదు. దీంతో ఎన్ఐటీ-తిరుచిరాపల్లిలో బీటెక్‌లో చేరింది. అక్కకు ఐఐటీలో సీటు రాకపోవడంతో నేను సాధించాలనే తపన మొదలైంది. అందుకే 8వ తరగతి నుంచే ప్రిపరేషన్ ప్రారంభించాను.

జేఈఈ-మెయిన్.. ఆందోళన లేకుండా

జేఈఈ-మెయిన్‌కు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రిపరేషన్ సాగించాను. క్లాస్ రూమ్ లెక్చర్స్, మోడల్ కొశ్చన్స్, వీక్లీ టెస్ట్స్‌కు హాజరయ్యాను. తరగతి గదిలో చెప్పిన పాఠాలనే ఎప్పటికప్పుడు ప్రాక్టీస్ చేస్తూ ప్రిపరేషన్ సాగించాను. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ కోసం కూడా ఇదే తరహాలో చదువుతున్నాను. కెమిస్ట్రీ కొంత కష్టంగా అనిపిస్తుంది. జేఈఈ మెయిన్‌లోనూ ఇదే సబ్జెక్టు కొంత ప్రభావం చూపింది. ఈ విభాగం నుంచే రెండు ప్రశ్నలకు తప్పు సమాధానాలు ఇచ్చాను. దీంతో 360 మార్కులకు గాను 350 మార్కులే వచ్చాయి.

ఆన్‌లైన్ టెస్ట్‌కు.. టెన్షన్ లేకుండా

కాలేజీలో ఆన్‌లైన్ టెస్ట్‌లు సమర్థంగా రాసేలా శిక్షణనిచ్చారు. ప్రతి టెస్ట్ పూర్తయిన తర్వాత సమాధానాలను విశ్లేషించేవారు. దీంతోపాటు.. పరీక్షకు 15రోజుల ముందు ఇతర ఆన్‌లైన్ టెస్ట్‌లకు కూడా హాజరయ్యాను. ఫలితంగా ఆన్‌లైన్ టెస్టింగ్ విధానంపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పడింది.

కెమిస్ట్రీ టెన్షన్

ఎగ్జామ్ హాల్లో టెస్ట్ ప్రారంభమైన మొదటి 20 నిమిషాలు టెన్షన్‌కు గురయ్యాను. ముందుగా కెమిస్ట్రీ ప్రశ్నలను చూడటమే ఇందుకు కారణం అని చెప్పొచ్చు. అందులో రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోవడంతో టెన్షన్ పడ్డాను. కొద్దిసేపటి తర్వాత కుదురుకొని సమాధానాలకు ఉపక్రమించాను. మిగతా రెండు విభాగాల్లో అన్ని ప్రశ్నలకు సమాధానాలిచ్చాను. కెమిస్ట్రీలో చేసిన పొరపాటు కారణంగా పది మార్కులు తగ్గాయి.

జేఈఈ-మెయిన్‌లో విజయానికి కాన్సెప్ట్‌లపై పూర్తిస్థాయి అవగాహన చాలా ముఖ్యం. ఇందుకోసం ఏ ఒక్క పాఠాన్ని విస్మరించకుండా అన్నిటినీ చదవాలి. అందులో అప్లికేషన్ ఓరియెంటేషన్ ఉన్న వాటిని ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేసుకోవడం, ప్రాక్టీస్ చేయడం వంటి వ్యూహాలతో మెరుగైన ఫలితాలు ఆశించొచ్చు!!

ఆస్ట్రానమీలో రీసెర్చ్ చేస్తా

ఎనిమిదో తరగతి నుంచే ఐఐటీ లక్ష్యంగా అడుగులు వేశాను. ఎన్‌టీఏ జేఈఈ మెయిన్‌లో 100 పర్సంటైల్ వచ్చినా.. నా లక్ష్యం ఆస్ట్రానమీలో రీసెర్చ్ చేయడమే. ఇందుకోసం ముందుగా ఐఐటీ-ముంబైలో బీటెక్‌లో చేరాలనుకుంటున్నాను.

అప్పటి నుంచే ఇంజనీరింగ్ అంటే ఆసక్తి

మా స్వస్థలం విజయవాడ. నాన్న హనుమంతరావు వృత్తి రీత్యా వ్యాపారం. అమ్మ లలిత లావణ్య గృహిణి. పదోతరగతి వరకు విజయవాడలోనే చదువుకున్నాను. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. అందుకే ఫలితాల్లో తెలంగాణ టాపర్స్ జాబితాలో చోటు లభించింది. నాకు చిన్నప్పటి నుంచే ఇంజనీరింగ్ అంటే ఆసక్తి. ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే స్కూల్‌లో ఐఐటీలో చదివితే లభించే భవిష్యత్తు అవకాశాలు గురించి చెప్పారు.


జయంత్ ఫణిసాయి

అప్లికేషన్ ఓరియెంటేషన్

ఐఐటీ లక్ష్యంపై స్పష్టత వచ్చాక.. తొమ్మిదో తరగతి నుంచే ప్రిపరేషన్ ప్రారంభించా. జేఈఈ పరీక్షలో అడిగే ప్రశ్నల శైలికి తగ్గట్టు కాన్సెప్ట్స్, బేసిక్స్‌పై తొమ్మిది, పది తరగతుల్లోనే అవగాహన ఏర్పడింది. దాంతో ఇంటర్మీడియెట్‌కు వచ్చే సరికి పూర్తి స్థాయిలో జేఈఈ కోసం చదవడం సులభమైంది. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం నుంచే జేఈఈలో విజయం దిశగా పూర్తి స్థాయిలో ప్రిపరేషన్ సాగించాను. తరగతి గదిలో చెప్పిన పాఠాలు, వాటికి సంబంధించి అప్లికేషన్ ఆధారితంగా ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడం ప్రాక్టీస్ చేశాను. ఇది పరీక్షలో విజయానికి ఎంతో ఉపయోగపడింది.

ఎలాంటి ఇబ్బంది లేదు

ఒకవైపు ఇంటర్మీడియెట్, మరోవైపు జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ టెస్ట్ ప్రిపరేషన్ పరంగా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. ఎందుకంటే.. తరగతి గదిలో పాఠాలు జేఈఈ ఓరియెంటేషన్‌తో చెప్పడమే. దీంతో ఏ రోజు పాఠాలకు సంబంధించిన ప్రశ్నలను అదే రోజు ప్రాక్టీస్ చేసేవాణ్ని. దాదాపు రోజుకు పన్నెండు గంటలు చదివాను. ఎన్‌టీఏ జేఈఈ మెయిన్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారని తెలిసిన తర్వాత.. పరీక్షకు ముందు నెల రోజుల పాటు అధిక శాతం ఆన్‌లైన్ ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరయ్యాను. ఫలితంగా ఎగ్జామ్ రోజు ఎలాంటి ఆందోళన లేకుండా ఉండగలిగాను.

ఆస్ట్రానమీపై ఆసక్తి

చిన్నప్పటి నుంచి ఆస్ట్రానమీ అంటే ఆసక్తి. దీంతో ఐఐటీలో సీటు సొంతం చేసుకొని ఆ తర్వాత ఆస్ట్రానమీలో రీసెర్చ్ చేయాలనేదే నా లక్ష్యం. ఆస్ట్రానమీయే ఎందుకో తెలియదు కానీ.. చిన్నప్పుడే ఆసక్తి కలిగింది. దీనికి సంబంధించి ఎలాంటి రోల్ మోడల్స్ లేరు. నాకు స్వయంగా కలిగిన ఆసక్తే. అందుకే.. ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విజయమే లక్ష్యంగా చదువుతున్నాను. కచ్చితంగా సీటు లభించే ర్యాంకు వస్తుందనే నమ్మకం ఉంది.

ప్రాక్టీస్ ప్రధానం

జేఈఈలో విజయానికి ప్రాక్టీస్ ఎంతో ప్రధానం. మూడు సబ్జెక్ట్‌లకు సంబంధించి థియరీతో పాటు ప్రాక్టికల్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా ప్రశ్నను ఎలా అడిగినా.. సమాధానం ఇచ్చే నేర్పు లభిస్తుంది. అంతేకాకుండా ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే జేఈఈ సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ సాగిస్తే.. విజయావకాశాలు మెరుగు పరచుకోవచ్చు!!



భారత వెయిట్‌లిఫ్టర్ సంజితపై నిషేధం ఎత్తివేత

డోపింగ్ ఆరోపణలతో భారత వెయిట్‌లిఫ్టర్ సంజిత చానుపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసి, విచారణ కొనసాగించాలని అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య నిర్ణయించింది. గతేడాది కామన్వెల్త్ క్రీడల్లో సంజిత 53 కేజీల విభాగంలో స్వర్ణం గెల్చుకుంది. దీనికిముందు 2017 ప్రపంచ చాంపియన్‌షిప్ సందర్భంగా ఆమె మూత్ర నమూనాలు సేకరించి పరీక్షకు పంపారు. అందులో పాజిటివ్‌గా తేలడంతో కామన్వెల్త్ క్రీడల అనంతరం మే 15న నిషేధం విధించారు. అయితే డోపింగ్ పరీక్షలకు సంజిత నమూనాల సేకరణలో జాప్యం చోటుచేసుకుని... కేసు సంక్లిష్టం కావడమే నిషేధం ఎత్తివేతకు కారణంగా తెలుస్తోంది.

శ్రమించిన సింధు, సైనా

ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో ప్రిక్వార్టర్స్‌కు భారత్ స్టార్స్

జకార్తా: కొత్త సీజన్‌లో తొలి విజయం సాధించడానికి భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తీవ్రంగా శ్రమించింది. సింధుతోపాటు సైనా నెహ్వాల్ కూడా ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్‌లో బోణీ చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ సింధు 22–24, 21–8, 21–17తో ప్రపంచ మాజీ నంబర్‌వన్, 2012 లండన్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత లీ జురుయ్ (చైనా) గెలిచింది. 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను చేజార్చుకున్నా... ఆ తర్వాత పుంజుకొని వరుసగా రెండు గేమ్‌లను సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ సైనా 7–21, 21–16, 21–11తో దినార్ అయుస్టిన్ (ఇండోనేసియా)పై గెలిచేందుకు 49 నిమిషాలు తీసుకుంది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా)తో సింధు; ఫిత్రియాని (ఇండోనేసియా)తో సైనా తలపడతారు.

పోరాడి ఓడిన శుభాంకర్

పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు బరిలోకి దిగగా... కిడాంబి శ్రీకాంత్ మినహా మిగతా అందరూ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. క్వాలిఫయింగ్ నుంచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన శుభాంకర్ డే 14–21, 21–19, 15–21తో ప్రపంచ మాజీ చాంపియన్, నంబర్



వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. ఇతర మ్యాచ్‌ల్లో పారుపల్లి కశ్యప్ 12–21, 16–21తో ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో... సాయిప్రణీత్ 12–21, 16–21తో రియో ఒలింపిక్స్ చాంపియన్ చెన్ లాంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశారు. కిడాంబి శ్రీకాంత్ 21–12, 21–8తో చోంగ్ వె ఫెంగ్ (మలేసియా)పై గెలిచి నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో కెంటో నిషిమోటో (జపాన్)తో పోరుకు సిద్ధమయ్యాడు.

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి–మనూ అత్రి (భారత్) ద్వయం 14–21, 21–19, 21–15తో మ్యాడ్స్ కోల్డింగ్–నిక్లాస్ నోర్ (డెన్మార్క్) జోడీపై నెగ్గింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జంట 14–21, 14–21తో జోంగ్‌కొల్పాన్–ప్రజోంగ్జయ్ (థాయ్‌లాండ్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది.

సర్ఫరాజ్ వర్ణ వివక్ష వ్యాఖ్యలు

వివాదంలో పాకిస్తాన్ కెప్టెన్



డర్బన్: పాకిస్తాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ మైదానంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దక్షిణాఫ్రికాతో మంగళవారం జరిగిన రెండో వన్డే సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ ఫెలుక్‌వాయో నలుపు రంగును ఉద్దేశించి అతను ఈ మాటలు అన్నాడు. క్రీజ్‌లో పాతుకుపోయి సఫారీ జట్టును ఫెలుక్‌వాయో విజయం దిశగా తీసుకెళుతుండగా అసహనంతో పాక్ కెప్టెన్ ఇలాంటి వ్యాఖ్యలు చేశాడు. 'ఒరే నల్లోడా... మీ అమ్మ ఇవాళ ఎక్కడుంది. ఈ రోజు నీ కోసం ఆమెతో ఏం మంత్రం చదివించుకొని వచ్చావు' అని ఉర్దూలో అన్న మాటలు స్టంప్ మైక్‌లో రికార్డయ్యాయి. దీనిపై దక్షిణాఫ్రికా జట్టు అధికారికంగా ఫిర్యాదు చేయకపోయినా... ఐసీసీ స్వతంత్ర విచారణ చేపట్టింది. సరదాగా స్లెడ్జింగ్ కాకుండా ఇవి వర్ణ వివక్ష వ్యాఖ్యలు కావడంతో దోషిగా తేలితే సర్ఫరాజ్‌కు పెద్ద శిక్షే పడవచ్చు. మరోవైపు మ్యాచ్ తర్వాతి రోజు బుధవారం సర్ఫరాజ్ దీనిపై క్షమాపణలు కోరాడు. 'మ్యాచ్‌లో అసహనాన్ని ప్రదర్శిస్తూ నేను చేసిన వ్యాఖ్యలతో ఎవరైనా బాధపడితే మన్నించండి. ఎవరినీ కావాలని ఆ మాటలు అనలేదు. మరెవరినీ బాధపెట్టే ఉద్దేశం నాకు లేదు. ప్రపంచవ్యాప్తంగా సహచర క్రికెటర్లను నేను ఎప్పుడైనా గౌరవిస్తాను' అని సర్ఫరాజ్ ట్వీట్ చేశాడు.



రహానే

రాణించిన రహానే, ఇషాన్

తిరువనంతపురం: కెప్టెన్ అజింక్య రహానే (59; 4 ఫోర్లు), వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ (57 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) ఆకట్టుకోవడంతో... ఇంగ్లండ్ లయన్స్‌తో బుధవారం జరిగిన తొలి అనధికారిక వన్డేలో భారత 'ఎ' జట్టు మూడు వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట ఇంగ్లండ్ లయన్స్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 285 పరుగులు సాధించింది. సామ్ బిల్లింగ్స్ (108 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. భారత 'ఎ' బౌలర్లలో సిద్ధార్థ్ కౌల్, మయాంక్ మార్కండే, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం భారత్ 'ఎ' 49.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసి విజయం సాధించింది. రహానే, ఇషాన్ కిషన్‌లతోపాటు అన్‌మోల్ ప్రీత్ సింగ్ (33; 5 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (45; ఫోర్, 3 సిక్స్‌లు) కూడా రాణించారు.



గప్టిల్‌ను బౌల్డ్ చేసిన షమీ

కూల్చారు... గెలిచారు

తొలి వన్డేలో టీమిండియా తడాఖా

- 8 వికెట్లతో న్యూజిలాండ్‌పై ఘన విజయం
- షమీ, కుల్దీప్, చహల్ ప్రతాపం
- కుప్పకూలిన ఆతిథ్య జట్టు
- 26న మౌంట్ మాంగనీలో రెండో వన్డే

న్యూజిలాండ్ సొంతగడ్డపై ఆడుతున్నదా? లేక భారత్‌లోనా? అన్నంత సందేహం! క్రీజులో ఉన్నది కివీస్ బ్యాట్స్‌మెనేనా? మరేదైనా పసికూన జట్టు ఆటగాళ్లా? అన్నంత అనుమానం! అటువైపు నిప్పులు చెరుగుతున్న షమీ... ఇటువైపు చహల్, కుల్దీప్‌ల మణికట్టు కనికట్టు! వెరసి... ఆతిథ్య దేశం కుప్పకూలింది! బ్యాటింగ్‌లో ధావన్, కోహ్లి నిలకడతో తొలి వన్డేలో టీమిండియాకు ఘన విజయం సొంతమైంది.

నేపియర్: అందరూ కఠినం అనుకుంటున్న న్యూజిలాండ్ పర్యటనను టీమిండియా చక్కటి ప్రదర్శన ద్వారా ఘన విజయంతో ప్రారంభించింది. పేసర్ మొహమ్మద్ షమీ (3/19) అద్భుత బౌలింగ్‌కు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (4/39), యజువేంద్ర చహల్ (2/43) మాయాజాలం తోడవడంతో బుధవారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో కివీస్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. మన బౌలర్ల ప్రతాపంతో కనీస పోరాటమూ చూపలేకపోయిన ఆతిథ్య జట్టు 38 ఓవర్లలో 157 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (81 బంతుల్లో 64; 7 ఫోర్లు) ఒక్కడే అర్ధ సెంచరీతో పోరాడాడు. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ (41 బంతుల్లో 24; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆటగాళ్ల కళ్లకు నేరుగా సూర్య కిరణాలు తాకుతున్న కారణంగా ఆటకు అంతరాయం కలగడంతో... భారత్ లక్ష్యాన్ని 49 ఓవర్లలో 156 పరుగులుగా నిర్దేశించారు. దీనిని టీమిండియా 34.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి అందుకుంది. ఓపెనర్ శిఖర్ ధావన్ (103 బంతుల్లో 75 నాటౌట్; 6 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీకి తోడు కెప్టెన్ కోహ్లి (59 బంతుల్లో 45; 3 ఫోర్లు) రాణించాడు. ఆరంభంలోనే ప్రత్యర్థి వికెట్లు పడగొట్టి, మ్యాచ్‌ను మలుపుతిప్పిన షమీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే శనివారం మౌంట్ మాంగనీలో జరుగనుంది.

షంషేర్ షమీ...

మొదటి బంతి ఓపెనర్ గప్టిల్ బ్యాట్ ఎడ్జ్... రెండో బంతి ఎల్బీ అప్పీల్... మూడో బంతికీ ఎల్బీ అప్పీలే! షమీ తొలి ఓవర్ ఎంత ప్రభావవంతంగా ప్రారంభమైందో చెప్పేందుకు ఇదే



కుల్దీప్

నిదర్శనం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్‌కు అతడు చుక్కలు చూపాడు. ఫ్లాట్ పిచ్ అయినప్పటికీ కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో నిప్పులు చెరుగుతున్న షమీని ఎదుర్కొనడం తనవల్ల కాదన్నట్లు గప్టిల్ (5) ఐదో బంతికి క్లీన్ బౌల్డయ్యాడు. అదే ఊపులో పదునైన డెలివరీతో మరుసటి ఓవర్లో మున్రో (8) వికెట్లను గిరాటేశాడు. ఆచితూచి ఆడిన విలియమ్సన్, టేలర్ 11 ఓవర్ల పాటు మరో వికెట్ పడకుండా చూశారు. అయితే, చహల్ వేగాన్ని మారుస్తూ వేసిన బంతికి తికమకపడిన టేలర్, ఫుల్ డెలివరీని డ్రైవ్ చేయబోయి విఫలమైన లాథమ్ (11) అతడికే క్యాచ్‌లు ఇచ్చారు. విలియమ్సన్



ధావన్

అండతో ఐదో వికెట్‌కు 31 బంతుల్లో 31 పరుగులు జోడించిన నికోల్స్ (12) జాదవ్ బౌలింగ్‌లో మిడ్ వికెట్‌లో కుల్దీప్ పట్టిన క్యాచ్‌కు ఔటయ్యాడు. 24వ ఓవర్ ముగిసేసరికి సగం వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ 107 పరుగులు మాత్రమే చేయగలిగింది. విలియమ్సన్ అర్ధ సెంచరీ (63 బంతుల్లో) అందుకున్నాక రెండో స్పెల్‌కు దిగిన షమీ... సాన్‌ట్నర్ (14)ను ఎల్బీ చేశాడు. ఇక్కడి నుంచి కుల్దీప్ మాయ మొదలైంది. అప్పటి వరకు 7 ఓవర్లలో 30 పరుగులిచ్చి ఒక్క వికెట్టూ తీయలేకపోయిన అతడు... తర్వాత మూడు ఓవర్లలో 9 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు.

సునాయాసంగా...

ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ (11) త్వరగానే వెనుదిరిగినా భారత్‌కు పెద్దగా ఇబ్బంది ఎదురవలేదు. నిలదొక్కుకున్నాక ధావన్ చక్కటి షాట్లు కొట్టాడు. లక్ష్యం చిన్నదే కావడంతో కోహ్లితో కలిసి నింపాదిగా ఆడుకుంటూ పోయాడు. 32 పరుగుల వద్ద లైఫ్ దక్కిన శిఖర్ 69 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విజయానికి 24 పరుగులు అవసరమైన స్థితిలో కోహ్లి... ఫెర్గూసన్ బౌలింగ్‌లో కీపర్ లాథమ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ధావన్, రాయుడు (13 నాటౌట్) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ మ్యాచ్‌లో కోహ్లి (10,430) వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో బ్రియాన్ లారా (10,405)ను వెనక్కి నెట్టి పదో స్థానానికి చేరాడు.

సూర్యుడు... ఆట ఆపాడు



క్రికెట్‌కు వర్షం అంతరాయం గురించి విన్నాం... ప్రేక్షకుల అతితో ఆట ఆగడాన్ని చూశాం... అధ్వాన పిచ్‌ల కారణంగా మ్యాచ్ అర్ధంతరంగా రద్దవడాన్ని గమనించాం! ఇవేవీ కాకుండా 'సూర్యుడి' వల్ల ఇబ్బంది తలెత్తుతుందని ఊహించి ఉండం. కానీ, నేపియర్ డే నైట్ వన్డేలో భారత ఇన్నింగ్స్ పదో ఓవర్ సందర్భంగా ఇదే జరిగింది. ఇక్కడి మెక్‌లీన్ పార్క్ మైదానంలోని పిచ్ తూర్పు–పశ్చిమ దిశలో ఉండటంతో అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు నేరుగా బ్యాట్స్‌మెన్ కంట్లో పడసాగాయి. క్రీజులో ఉన్న కోహ్లి, ధావన్‌లకు ఇబ్బంది ఎదురైంది. ఫీల్డ్ అంపైర్లు సైతం పరిస్థితిని గ్రహించారు. దీంతో ఆటను నిలిపివేశారు. సూర్యుడు పూర్తిగా విశ్రమించాక 36 నిమిషాల అనంతరం పునః ప్రారంభమైంది. 'ఇది నవ్వు తెప్పించే ఘటన. 2014లో ఓసారి ఇలాగే నేను ఔటయ్యా. అప్పుడు ఆటను ఆపే నిబంధనేదీ లేదు' అని మ్యాచ్ అనంతరం కోహ్లి వ్యాఖ్యానించాడు.

కోహ్లికి విశ్రాంతి

న్యూజిలాండ్‌తో జరుగనున్న 4, 5 వన్డేలు, మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ నుంచి కెప్టెన్ కోహ్లికి సెలెక్టర్లు విశ్రాంతినిచ్చారు. రెండు, మూడు నెలలుగా తీరిక లేకుండా ఆడుతున్న కోహ్లిపై మరింత ఒత్తిడి పడకుండా ఉండేందుకు జట్టు మేనేజ్‌మెంట్‌తో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జట్టుకు ఓపెనర్ రోహిత్ శర్మ సారథ్యం వహిస్తాడు. కోహ్లి స్థానంలో మరో ఆటగాడిని ఎంపిక చేయలేదు.

షమీ... 100 కొట్టాడు

న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో అద్భుత స్పెల్‌తో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన షమీ... కెరీర్‌లో 100 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. అత్యంత వేగంగా (56వ మ్యాచ్) ఈ ఘనత సాధించిన భారత బౌలర్‌గానూ నిలిచాడు. ఇప్పటివరకు ఈ రికార్డు ఇర్ఫాన్ పఠాన్ (59 మ్యాచ్‌లు) పేరిట ఉంది. మ్యాచ్‌లో కివీస్ ఓపెనర్ గప్టిల్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన షమీ... అతడిని ఔట్ చేయడం ద్వారానే ఈ ఘనత సాధించడం గమనార్హం. కొంతకాలంగా టెస్టులకే పరిమితమైన అతడు... బుమ్రాకు విశ్రాంతితో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లపై వన్డే సిరీస్‌లు ఆడుతున్నాడు. 'చాలాకాలం తర్వాత పునరాగమనం చేశా. పునరావాస శిబిరంలో ప్రపంచ శ్రేణి సదుపాయాల మధ్య సాధన చేశా. కోహ్లి ఎప్పు డూ నా వెన్నంటే నిలిచాడు. జట్టు మేనేజ్‌మెంట్, సహాయక సిబ్బంది పూర్తిగా సహకరించారు. మేం సాధించినదంతా జట్టుగా చేసినదే. వాతావరణం మినహా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పిచ్‌లు ఒకేలా ఉన్నాయి. పరిస్థితులను ఆకళింపు చేసుకోవడమే ముఖ్యం' అని షమీ పేర్కొన్నాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్టిల్ (బి) షమీ 5; మున్రో (బి) షమీ 8; విలియమ్సన్ (సి) శంకర్ (బి) కుల్దీప్ 64; రాస్ టేలర్ (సి అండ్ బి) చహల్ 24; లాథమ్ (సి అండ్ బి) చహల్ 11; నికోల్స్ (సి) కుల్దీప్ (బి) కేదార్ జాదవ్ 12; సాన్‌ట్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 14; బ్రాస్‌వెల్ (బి) కుల్దీప్ 7; సౌతీ (నాటౌట్) 9; ఫెర్గూసన్ (స్టంప్డ్) ధోని (బి) కుల్దీప్ 0; బౌల్ట్ (సి) రోహిత్ శర్మ (బి) కుల్దీప్ 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (38 ఓవర్లలో ఆలౌట్) 157.**

వికెట్ల పతనం: 1–5, 2–18, 3–52, 4–76, 5–107, 6–133, 7–146, 8–146, 9–148, 10–157. **బౌలింగ్:** భువనేశ్వర్ 5–0–20–0; షమీ 6–2–19–3; విజయ్ శంకర్ 4–0–19–0; చహల్ 10–0–43–2; కుల్దీప్ 10–1–39–4; కేదార్ జాదవ్ 3–0–17–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) గప్టిల్ (బి) బ్రాస్‌వెల్ 11; ధావన్ (నాటౌట్) 75; కోహ్లి (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 45; రాయుడు (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (34.5 ఓవర్లలో 2 వికెట్లకు) 156.**

వికెట్ల పతనం: 1–41, 2–132.

బౌలింగ్: బౌల్ట్ 6–1–19–0; సౌతీ 6.5–0–36–0; ఫెర్గూసన్ 8–0–41–1; బ్రాస్‌వెల్ 7–0–23–1; సాన్‌ట్నర్ 7–0–32–0.

అయ్యో సెరెనా!

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ రికార్డు సమం చేసేందుకు స్టార్ ప్లేయర్ సెరెనా విలియమ్స్ మరి కొంత కాలం వేచి చూడక తప్పదు. రెండేళ్ల క్రితం చివరిసారి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికపై మరో ట్రోఫీని ఆశించిన అమెరికా దిగ్గజం ఆట క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఇటీవలే యూఎస్ ఓపెన్ క్వార్టర్స్‌లో తన చేతిలోనే ఓడిన ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా అద్భుత ఆటతో సెరెనాపై ప్రతీకారం తీర్చుకుంది.

- 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ముగిసిన పోరు
- క్వార్టర్స్‌లో ప్లిస్కోవా చేతిలో ఓటమి
- మూడో సెట్‌లో 5–1తో ఆధిక్యంలో నిలిచి ఓటమి పాలైన అమెరికా స్టార్

మెల్‌బోర్న్: హోరాహోరీగా సాగిన సెరెనా విలియమ్స్ (అమెరికా), కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) మధ్య క్వార్టర్ ఫైనల్ పోరుకు అనూహ్య ముగింపు లభించింది. రెండు సెట్‌ల తర్వాత ఇద్దరూ చెరో సెట్ గెలిచి సమంగా నిలవగా... మూడో సెట్‌లో సెరెనా 5–1తో ఆధిక్యంలో నిలిచింది. మరో గేమ్ గెలిస్తే సెమీస్‌లో చోటు ఖాయమవుతుంది. కానీ ప్లిస్కోవా మొండిగా పోరాడింది. వరుసగా నాలుగు పాయింట్లు కాపాడుకొని ఆధిక్యాన్ని 2–5కు తగ్గించింది. ఆ తర్వాత అదే జోరుతో దూసుకుపోయి సెరెనా ఆట కట్టించింది. 2 గంటల 10 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో చివరకు ఏడో సీడ్ ప్లిస్కోవా 6–4, 4–6, 7–5 తేడాతో 16వ సీడ్ సెరెనాను చిత్తు చేసింది. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

ఓటమి అంచుల నుంచి...

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు సన్నాహకంగా సాగిన బ్రిస్బేన్ ఓపెన్‌లో విజేతగా నిలిచి ఫామ్‌లో ఉన్న ప్లిస్కోవా తొలి సెట్‌లో ఆధిక్యం కనబర్చింది. పదో గేమ్‌ను నెగ్గి సెట్ గెలుచుకుంది. అయితే సెరెనా తన అనుభవాన్ని ఉపయోగిస్తూ రెండో



ప్లిస్కోవా

సెట్‌ను తన ఖాతాలో వేసుకుంది. చివరి సెట్‌లో సెరెనా 5–1తో ముందంజలో నిలిచినప్పుడు మరో ఫలితం గురించి ఎవరూ ఊహించలేదు. కానీ ఈ దశలో సెరెనా ఆట గతి తప్పింది. కాలి మడమకు స్వల్ప గాయంతో సెరెనా కొంత ఇబ్బంది పడటాన్ని గుర్తించిన ఆమె ప్రత్యర్థి మరో అవకాశం ఇవ్వలేదు. ఫలితంగా స్కోరు 5–5తో సమమైంది. 11వ గేమ్‌లో సెరెనా సర్వీస్‌ను మళ్లీ బ్రేక్ చేసిన ప్లిస్కోవా... తర్వాతి గేమ్‌లో చెలరేగిపోయింది. సెరెనా కొట్టిన ఫోర్‌హ్యాండ్ నెట్‌ను తాకడంతో ప్లిస్కోవా గెలుపు ఖాయమైంది. 4 డబుల్ ఫాల్ట్‌లు చేసిన అమెరికా స్టార్, ఏకంగా 37 అనవసర తప్పిదాలతో ఓటమిని ఆహ్వానించింది. మరో క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ నయోమి ఒసాకా (జపాన్) 6–4, 6–1తో స్వితోలినా (ఉక్రెయిన్)పై నెగ్గి సెమీస్ చేరింది. 1994లో కిమికో డాటె తర్వాత తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్ చేరిన తొలి జపాన్ క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందింది.

జొకోవిచ్ జోరు...

పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ జొకోవిచ్ (సెర్బియా) సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. జపాన్‌కు చెందిన ఎనిమిదో సీడ్ కీ నిషికోరితో జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 6–1, 4–1తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గాయం కారణంగా తప్పుకున్నాడు. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్స్‌లో లుకాస్ పుయి (ఫ్రాన్స్) 7–6 (7/4), 6–3, 6–7 (2/7), 6–4తో 16వ సీడ్ మిలోస్ రావ్‌నిచ్ (కెనడా)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాడు.



నేటి షెడ్యూల్

మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్
క్విటోవా X కొలిన్స్
ప్లిస్కోవా X నయోమి ఒసాకా
ఉదయం గం. 8.30 నుంచి

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్
రాఫెల్ నాదల్ X సిట్సిపాస్
మధ్యాహ్నం గం. 2 నుంచి
సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సెరెనా

నృసింహస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ ఉమామహేశ్వరికి స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఈవో

మంగళగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమా మహేశ్వరి బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న నృసింహాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మండేపూడి పానకాలరావు, అర్చకులు జస్టిస్ ఉమామహేశ్వరికి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ఎగువ, దిగువ సన్నిధుల్లో స్వామిని దర్శించుకున్న అనంతరం దిగువ సన్నిధిలోని ముఖమండపంలో న్యాయమూర్తి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఈవో జస్టిస్ ఉమామహేశ్వరికి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆమెవెంట మంగళగిరి జడ్జి వేల్పుల భవాని ఉన్నారు.

'మంత్రి జవహర్‌కు కొవ్వూరు సీటు ఇవ్వొద్దు'

సాక్షి, అమరావతి: మంత్రి జవహర్‌కు రానున్న ఎన్నికల్లో కొవ్వూరు సీటు ఇవ్వవద్దని ఆ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు పార్టీ ముఖ్యనాయకులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి వచ్చిన టీడీపీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు బుధవారం ప్రయత్నించారు. ఆయన అవకాశం ఇవ్వకపోవడంతో గ్రీవెన్స్ హాల్‌లో పార్టీ ముఖ్యులను కలసి కొవ్వూరు సీటు మళ్లీ జవహర్‌కు ఇస్తే ఓటమి ఖాయమని చెప్పారు. నియోజకవర్గంలో టీడీపీకి వ్యతిరేకంగా ఆయన పనిచేస్తున్నారని, పార్టీలో ఎప్పటి నుంచో ఉన్న తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు సీటిస్తే తాము పనిచేయబోమని స్పష్టం చేశారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మళ్లింపు!



- నెల్లూరుకు అధికంగా కేటాయింపు
- నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు
- మున్సిపల్ మంత్రి నారాయణ ఊరా మజాకా
- మిగిలిన మున్సిపాల్టీల్లోని ఎస్సీ కాలనీల్లో అధ్వాన పరిస్థితులు
- ప్రశ్నిస్తే టీడీపీ గూండాల ఆగడాలకు బలవుతామనే భయంలో ఎస్సీలు
- మున్సిపాల్టీల నిధుల వినియోగంలో అధినేతలదే చెల్లుబాటు
- 2018-19 ఏడాదిలో రూ.600 కోట్లు విడుదలైతే ఒక్క నెల్లూరుకే రూ.160కోట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ మున్సిపాల్టీల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన ఎమ్మెల్యేలు, మంత్రులు వాటిని తమ పట్టణాలకు మళ్లించుకుంటున్నారు. ఆ నిధులను ఎస్సీ కాలనీల్లో కాకుండా టీడీపీ అభిమానులు, ఇతర సామాజికవర్గాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వినియోగిస్తున్నారు. తమ ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించిన నిధులు పక్కదారి పడుతున్నాయనే విషయం తెలిసినప్పటికీ.. టీడీపీ గూండాలు ఎక్కడ దాడిచేస్తారో భయంతో ఎస్సీలు ప్రశ్నించలేకపోతున్నారు. ఈ నిధులను రాష్ట్రంలోని మిగిలిన మున్సిపాల్టీల కంటే మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ సొంత జిల్లా నెల్లూరుకు అధికంగా మళ్లించినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇతర ఎస్సీ కాలనీలకు మొండిచెయ్యి

2018–19లో రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీలు, 14 నగరపాలక సంస్థలకు రూ.600కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు విడుదలయ్యాయి. వీటిని ఆయా పట్టణాలు, నగరాల్లోని ఎస్సీ కాలనీల్లో రక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు నిమిత్తం నిధుల కేటాయించారు. అయితే, వీటిని పట్టించుకోకుండా నెల్లూరుకు రూ.160 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. ఈ నిధులను ఎస్సీ కాలనీల్లోని మౌలిక సదుపాయాల కల్పనకు కాకుండా ఇతర సామాజికవర్గాలు అధికంగా ఉన్న ప్రాంతాలు, టీడీపీ అనుకూల ప్రాంతాల్లోని పనులకు వాడుతున్నారు. ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, వీధిలైట్ల కల్పన వంటివి ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన మున్సిపాల్టీల్లోని ఎస్సీ కాలనీలు అసౌకర్యాలతో కునారిల్లుతున్నా తెలుగుదేశం నేతలు పట్టించుకోవడంలేదు. అనేక మున్సిపాల్టీల్లోని ఎస్సీ కాలనీల్లోని సిమెంటు రోడ్లు శిథిలావస్థకు చేరినా వాటికి కనీసం మరమ్మతులు చేయడంలేదు. డ్రైనేజీ సౌకర్యాలు లేక అక్కడి ప్రజలు దోమలబారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు. గత ఏడాది (2017–18) ఎస్సీ కాలనీల్లోని పరిస్థితుల ఆధారంగా రూ.300 కోట్లు కేటాయించారు. కొన్ని మున్సిపాల్టీల్లో ఈ నిధులు ఖర్చుకాలేదు. నిబంధనల ప్రకారం.. ఎక్కడైనా ఈ నిధులు ఖర్చు కాకపోతే, వాటిని ఇతర పట్టణాలకు మళ్లించకుండా మరుసటి ఏడాది వాటిని వినియోగించాలి. దీంతో 2018–19లో రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలోని ఈ కాలనీలకు రూ.600 కోట్లు కేటాయించారు. తిరుపతి నగరపాలక సంస్థకు ఈ ఏడాది రూ.25 కోట్లు విడుదల కాగా రూ.20 కోట్ల పనులకు టెండర్లు ఆహ్వానించారు. రూ.1.60 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. నిబంధనల ప్రకారం ఎస్సీ జనాభా అధికంగా ఉండే ప్రాంతాల్లోనే ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా జరుగుతోంది. ఉదాహరణకు.. మంత్రి నారాయణ సొంత పట్టణమైన నెల్లూరుకు నిబంధనల ప్రకారం ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.60 కోట్లలోపే విడుదల కావాల్సి ఉంది. మిగిలిన మున్సిపాల్టీల్లో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చుకాలేదని చెబుతూ రూ.160 కోట్లు వరకు కేటాయించారు. ఇందులో రూ.54 కోట్ల విలువైన పనులను అక్కడి నగర టీడీపీ ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డికి కట్టబెట్టేందుకు అధికారులు రంగం సిద్ధంచేశారు. టెండరులోని నిబంధనలు కృష్ణారెడ్డి నిర్మాణ సంస్థకు అనువుగా మార్చేసి మరో సంస్థ పోటీకి రాకుండా చేశారు. మిగిలిన సంస్థలు కూడా పోటీలో పాల్గొనే విధంగా చేసి ఉంటే అంచనా విలువ కంటే 10 శాతం తక్కువ రేటుకు టెండర్లు పడేవని నిర్మాణ సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. మంత్రి నారాయణ అనుచరుడికి ఈ టెండరు కట్టబెడుతుండటంతో ప్రభుత్వానికి రూ.5 కోట్ల వరకు అదనపు భారం పడుతోంది. గత ఏడాది నెల్లూరుకు మంజూరైన రూ.72 కోట్లతో చేసిన పనులు కూడా ఎస్సీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో పనులు చేశారు. అనేక పనుల్లో నాణ్యత లేకపోయినా, అధికారులు ప్రశ్నించే పరిస్థితిలేదు. కొంతమంది ఈ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు చేసినా, వాటిపై ప్రభుత్వం స్పందించలేదు.

- ఏపీపీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులకు అన్యాయం చేసే జీవో నెంబర్.5ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. 1997లో తీసుకువచ్చిన 570 నెంబర్ జీవోను సవరించి జీవో నెంబర్ 5ను తీసుకువచ్చారని, ఇది బడుగు వర్గాలకు అన్యాయం చేసేదిగా ఉందని పేర్కొన్నారు. దీన్ని రద్దు చేయాలని కోరుతూ రామకృష్ణ బుధవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

రూ. 6.52 కోట్ల పట్టివేత



నెల్లూరు (క్రైమ్)/తడ: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి చెన్నైకి కారులో అక్రమంగా తరలిస్తున్న రూ 6.52 కోట్ల నగదును శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడ పోలీసులు బుధవారం జిల్లా సరిహద్దుల్లో పట్టుకున్నారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు ఎస్పీ ఐశ్వర్యరస్తోగి ఈఘటనకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్తున్న ఓకారు అనుమానాస్పదంగా కనిపించడంతో తడ ఎస్ఐ డి. వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కారు వెనుకభాగంలో సీటు వెనుక ప్రత్యేక అరలో మూడు బ్యాగ్‌లు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని తెరచిచూడగా అందులో రూ. 6,33,69,500 (2వేల నోట్లు 14,585, 500 నోట్లు 68,399)దేశీయ నగదు, ఒమన్ దేశానికి చెందిన 1670 రియాల్స్, కువైట్‌కు చెందిన 1700 దినార్లు, 16850 యూఎస్ డాలర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ దేశీయ కరెన్సీలో రూ19,11,216 ఉంటుంది. వీటితో పాటు 50 గ్రాముల బంగారు బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మొత్తం నగదు విలువ రూ. 6,52,80,716 అని ఎస్పీ తెలిపారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను నగదుకు సంబంధించిన వివరాలు అడుగగా పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తులు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం రుస్తుంబాద గ్రామానికి చెందిన ఎం. కనక సురేష్, చేమకూరిపాలెంకు చెందిన హరిబాబుగా పోలీసులు గుర్తించారు. సురేష్ నరసాపురంలోని ప్రవీణ్‌కుమార్ జైన్‌కు సంబంధించిన జైదేవ్ జ్యుయలరీస్‌లో గుమస్తాగా, హరిబాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు. యజమాని ఆదేశాల మేరకు చెన్నైలో బంగారం కొనుగోలు చేసేందుకు నగదు తీసుకెళుతున్నామని వారు పోలీసులకు వెల్లడించారు.

అనారోగ్యాన్ని భరించలేక వృద్ధ దంపతుల ఆత్మహత్య

కృష్ణా జిల్లాలో ఘటన


నాగభూషణం, మంగమ్మ మృతదేహాలు

వలసపల్లి(ముసునూరు): వృద్ధాప్యం.. ఆపైన అనారోగ్యం, ఆదరించే వారులేక, జీవితంపై విరక్తితో, ఎవరికీ భారం కాకూడదని, వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన కృష్ణా జిల్లా ముసునూరులో బుధవారం జరిగింది. వలసపల్లికి చెందిన సత్యవోలు నాగభూషణం (90), అతని భార్య మంగమ్మ (85) బుధవారం మధ్యాహ్నం పురుగుమందును సేవించారు. నాగభూషణం గట్టిగా అరవడంతో కుమారుడు నాగేశ్వరరావు వచ్చి చూడగా అప్పటికే దంపతులు నురగలు కక్కుకుంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. తక్షణమే వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ భార్య మృతి చెందింది. మరో గంట వ్యవధిలో భర్త కూడా మరణించాడు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. నాగభూషణం దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జీవనోపాధి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో వారు స్థిరపడ్డారు. దీంతో వృద్ధుల చెంత ఎవరూ లేకపోవడంతో వారికి ఆసరా కరువైంది. అదే గ్రామంలో ఉన్న కుమారుడు నాగేశ్వరరావు పేదరికంతో కులవృత్తిని నిర్వహించుకుంటూ, దేవాలయాల వద్ద వాయిద్యాలకు వెళుతూ కష్టాలతోనే జీవితం గడుపుతున్నాడు. వృద్ధులు ఎవరికీ భారం కాకుండా, ఏదో ఒకరోజు తనువు చాలిస్తామని చెప్పేవారని స్థానికులు తెలిపారు.

సమాజ చిత్రీకరణే సాహిత్యం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రజని


పుస్తకావిష్కరణ చేస్తున్న జస్టిస్ రజని తదితరులు

విజయవాడ కల్చరల్: సమాజంలోని సమస్యల చిత్రీకరణే సాహిత్యం అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో సాహితీమూర్తులకు ఆత్మీయ సత్కారం జరిగింది. అలాగే రచయిత్రి వెన్నెల రచించిన 'వెన్నెల కౌగిళ్ళు' కవితా సంపుటి, సీడీ ఆవిష్కరణ సభ నిర్వహించారు. పుస్తకాన్ని, సీడీని ఆవిష్కరించిన జస్టిస్ రజని మాట్లాడుతూ.. సాహిత్యం సమాజం చుట్టూ పరిభ్రమించాలని, కవులు సమాజంలో జరుగుతున్న మార్పులను గమనించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్మన్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. కవులు, భాష కోసం, పాకులాడకూడదని వస్తువు ప్రాధాన్యతను నిర్ణయించుకుని సాహిత్య సృష్టి చేయాలని సూచించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బి.కృష్ణ సభకు అధ్యక్షత వహించారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు, సంఘ సేవకులు విజయకుమార్, సాహితీవేత్తలు రామకవచం సాగర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు పురస్కారాలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు వడలి రాధాకృష్ణ,, గంగిరెడ్డి, షేక్ బహీరున్నీసా బేగం, పులిజాల ప్రకాష్, డాక్టర్ మురళీకృష్ణ, గజల్ వినోద్, జీఎస్ సాంబశివరావు, నెమలికంటి పూర్ణచంద్రరావు, దగ్గుపాటి రాధాకృష్ణ, కే.కృష్ణమూర్తి. కే.మోహనరావు, కోనేరుకల్పన, పీ.సూర్యకుమారి, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, చింతకింది రాములు తదితరులను ఆత్మీయంగా సత్కరించారు.

కాపుల చెవిలో బాబు పూలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజం
- అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లను కాపులకు పంచడం సాధ్యమేనా?
- అది చంద్రబాబు చేతుల్లో ఉందా?
- కాపులను మోసం చేసేందుకు ఇదో డ్రామా



విజయవాడ సిటీ: బీసీల్లో కలిపేశానంటూ సీఎం చంద్రబాబు కాపుల చెవిలో పూలు పెడుతున్నాడని.. మరోసారి మోసం చేసేందుకు తెగబడ్డాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల్లోని పేదలకిచ్చిన 10 శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకేనంటూ చంద్రబాబు చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అది ఆయన చేతిలోని విషయం కాదన్నారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అసలు చదువుకున్నాడో లేదో అర్థం కావడం లేదన్నారు. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లలో కాపులకు భాగమివ్వడం సాధ్యపడే అంశమేనా అని నిలదీశారు. కాపులను మళ్లీ మభ్యపెట్టి తన బుట్టలో వేసుకునేందుకే ఈ ప్రకటన చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపులకు న్యాయం చేస్తానంటే వైఎస్సార్‌సీపీ, బీజేపీ వద్దంటోందంటూ ప్రజల్ని చంద్రబాబు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. అసలు ఆయన కాపులకు ఏం ఇచ్చారో.. ఏం ఇవ్వాలనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంజునాథ్ కమిషన్ చైర్మన్ నివేదిక ఇవ్వకుండానే.. ఎవరో ఓ సభ్యుడు ఇచ్చిన దాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి కాపులను బీసీ–ఎఫ్‌లో చేరుస్తున్నట్లు ప్రకటించారని అంబటి గుర్తు చేశారు. తీరా కేంద్రానికి నివేదిక పంపకుండా దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ కేంద్రమిచ్చిన 10 శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకంటూ మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అంటే ఆనాడు అసెంబ్లీలో చేసిందంతా మోసమేనా అని ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి డ్రామా మొదలెట్టాడని ఆరోపించారు. చంద్రబాబు మోసాలపై కాంగ్రెస్, జనసేన వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు.



ప్రియాంక రాజకీయ అరంగేట్రం

తూర్పు యూపీ ప్రధాన కార్యదర్శిగా నియామకం

- కార్యకర్తల మనోధైర్యం పెంచేందుకు కాంగ్రెస్ కీలక నిర్ణయం
- జ్యోతిరాదిత్య సింధియాకు పశ్చిమ యూపీ బాధ్యతలు
- ప్రియాంక ఆగమనం రాహుల్ వైఫల్యానికి నిదర్శనం: బీజేపీ

న్యూఢిల్లీ: చాలా ఏళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలకు ఎట్టకేలకు తెరపడింది. గాంధీ కుటుంబం నుంచి మరో వారసురాలు అధికారికంగా రాజకీయ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ వాద్రా(47) బుధవారం తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఆమె బాధ్యతలు చేపడతారని పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించే 80 సీట్లున్న ఉత్తరప్రదేశ్‌లో ఆమె తన సోదరుడు రాహుల్‌కు సహాయకారిగా పనిచేస్తారని వెల్లడించాయి. కాంగ్రెస్‌ను విస్మరించి ఎస్పీ–బీఎస్పీ కూటమిగా ఏర్పడిన నేపథ్యంలో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యం పెంచడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 1980 మధ్యనాళ్ల వరకు ఉత్తరప్రదేశ్‌ను తన కంచుకోటగా నిలుపుకున్న కాంగ్రెస్ క్రమంగా ప్రభ కోల్పోయింది. ప్రియాంక నియామకంతో అక్కడ పునర్వైభవం సంతరించుకుంటామని ఆ పార్టీ ఆశాభావంతో ఉంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక తన తల్లి సోనియా గాంధీ నియోజకవర్గం రాయ్‌బరేలీ నుంచి పోటీచేసే అవకాశాలున్నాయి.అలాగే, ఇటీవల మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించిన జ్యోతిరాదిత్య సింధియాను రాహుల్ గాంధీ పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. హరియాణా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గులాం నబీ ఆజాద్ స్థానాన్ని ప్రియాంక, సింధియా భర్తీ చేయనున్నారు. ప్రియాంక నియామకం పార్టీకి లాభిస్తుందని కాంగ్రెస్ పేర్కొనగా, బీజేపీ పెదవి విరిచింది. రాహుల్ నాయకత్వ వైఫల్యాన్ని ఆమె నియామకం సూచిస్తోందని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్ ఓటమిని ప్రియాంక గాంధీ కూడా తప్పించలేరని పేర్కొంది.



ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

యూపీలో సానుకూల మార్పు:రాహుల్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టడం ఉత్తరప్రదేశ్‌లో కీలక పరిణామంగా మారింది. ప్రియాంక గాంధీ నియామక ప్రకటన వెలువడగానే రాహుల్ గాంధీ అమేథీలో మీడియాతో మాట్లాడుతూ తన సోదరిపై ప్రశంసల జల్లు కురిపించారు. ప్రియాంక సమర్థురాలని, ఎన్నికల సమయంలో ఆమె తనకు అండగా ఉండబోతుండటం హర్షదాయకం అని పేర్కొన్నారు. ఆమె రాకతో ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కొత్త ఆలోచనలు, సానుకూల మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమిగా ఏర్పడిన ఎస్పీ–బీఎస్పీలపై తనకు ఎలాంటి ద్వేషం లేదని, బీజేపీని ఓడించేందుకు వారితో కలసిపనిచేసేందుకు సిద్ధమని ప్రకటించారు. గుజరాత్ అయినా యూపీ అయినా ఎన్నికల్లో దూకుడుగానే వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అంతర్గత పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా, ఇటీవల రాజస్తాన్ సీఎంగా ఎన్నికైన అశోక్ గహ్లోత్ స్థానంలో కేసీ వేణుగోపాల్‌ను ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)గా నియమించింది. ఆయన కర్ణాటక ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా కూడా కొనసాగనున్నారు.

ఇప్పటికే కీలక నిర్ణయాల్లో పాత్ర..

మాజీ ప్రధాని, నానమ్మ ఇందిరా గాంధీ పోలికల్లో ఉండే ప్రియాంక రాజకీయాల్లోకి ఎప్పుడు అడుగుపెడతారని కాంగ్రెస్ నేతలు చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్నారు.ప్రియాంక ఎప్పుడు కోరుకుంటే అప్పుడు రాజకీయాల్లోకి వస్తారని సోనియా గతంలో చెప్పిన సంగతి తెలిసిందే. తల్లి సోనియా, సోదరుడు రాహుల్ తరఫున అడపాదడపా ప్రచారం చేసిన ఆమె.. పార్టీ తీసుకున్న పలు కీలక నిర్ణయాల్లో పాత్ర పోషించారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ సీఎంల ఎంపికలో రాహుల్‌కు సలహాలిచ్చారు. పంజాబ్ కాంగ్రెస్‌లోకి మాజీ క్రికెటర్ సిద్ధూ, మన్‌ప్రీత్ బాదల్‌ను తీసుకురావడంలోచొరవ చూపారు.'ప్రియాంక.. శుభాకాంక్షలు. జీవితంలో ఏ దశలోనైనా నీకు తోడుగా ఉంటా. నీ శక్తిమేర పనిచేసి ఉత్తమ ఫలితాలు రాబట్టు' అని భర్త రాబర్ట్ వాద్రా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. భారత రాజకీయాల్లో ఎక్కువ సమయం వేచి చూసింది ప్రియాంక రాక కోసమేనని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జేడీ(యూ) ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ అన్నారు.

కాంగ్రెస్ బ్రహ్మాస్త్రం..!

లోక్‌సభ ఎన్నికల ముంగిట ప్రియాంక గాంధీ ఎట్టకేలకు రాజకీయ అరంగేట్రం చేశారు. ఉత్తరప్రదేశ్ (తూర్పు) పార్టీ వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమించడం ద్వారా కాంగ్రెస్ బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. తూర్పు యూపీలోని 30 లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించే బాధ్యత ఇప్పుడు ప్రియాంకపై ఉంది. ఈ ప్రాంతంలోనే ప్రధాని నరేంద్ర మోదీ నియోజకవర్గం వారణాసి, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇంతకుమునుపు ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్ ఉన్నాయి. తల్లి సోనియా, సోదరుడు రాహుల్‌ల నియోజకవర్గాలు రాయ్‌బరేలీ, అమేథీల్లో ఆమె 1999 నుంచి అడపాదడపా ప్రచారం చేస్తున్నారు. ఆ రెండు నియోజకవర్గాల ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలను కలుస్తూ అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారు. 2007, 2012, 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రియాంక ఈ రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. ఇలా కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయకుండా పూర్తిస్థాయిలో ప్రియాంకను రాజకీయాల్లోకి దింపి బాధ్యతలు అప్పగిస్తే నాయనమ్మ ఇందిరాగాంధీలా తిరుగులేని విజయాలు సాధిస్తారనే నమ్మకం పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉంది. ముఖకవళికలు, నడక, వేషభాషల్లో ఇందిర పోలికలు ప్రియాంకలో ఎక్కువనే భావన సర్వత్రా ఉంది. 20 ఏళ్ల క్రితమే ప్రియాంకకు కాంగ్రెస్‌లో క్రియాశీల బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ వచ్చినా, తన పిల్లలు ఎదిగే వరకూ ఎదురుచూడాలనే ఇంతకాలం ఆగారని పరిశీలకులు భావిస్తున్నారు. అనుకున్నట్లే కొడుకు రేహాన్(18), కూతురు మిరాయా(16)కు టీనేజ్ వయసు వచ్చాకే ఆమె క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టారు.

✦ 1999లో సోనియా తరఫున ప్రచారం..

కాంగ్రెస్ కష్టకాలంలో ఉండగా జరిగిన 1999 లోక్‌సభ ఎన్నికల్లో తల్లి, అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ మొదటిసారి రాజీవ్ గాంధీ నియోజకవర్గమైన అమేథీ నుంచి పోటీచేసినప్పుడు ప్రియాంక ఎన్నికల ప్రచారంలో తొలిసారి పాల్గొన్నారు. ఇక, రాయ్‌బరేలీలో సమీప బంధువు అరుణ్‌నెహ్రూ బీజేపీ తరఫున పోటీచేయగా, కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన తన తండ్రి సన్నిహిత మిత్రుడు కెప్టెన్ సతీశ్‌శర్మ తరఫున ప్రచారం చేసి గెలిపించారు. అరుణ్ నెహ్రూ పేరెత్తకుండా, 'ఇందిరాజీ కుటుంబానికి ద్రోహం చేసి, నా తండ్రికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తే ఇక్కడ బీజేపీ అభ్యర్థి' అంటూ ప్రియాంక నిప్పులు చెరిగారు. ఈ ఎన్నికల్లో సోనియా భారీ మెజారిటీతో విజయం సాధించగా, అరుణ్‌నెహ్రూను సతీశ్‌శర్మ ఓడించారు. ఇలా ప్రియాంక రాజకీయాల మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. 2004 లోక్‌సభ ఎన్నికల తరువాత సోనియా ప్రధాని పదవిని తిరస్కరించడం వెనక రాహుల్‌తో పాటు ప్రియాంక కూడా ఉన్నట్లు చెబుతారు. 2014 ఎన్నికల్లో అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీతో తలపడిన రాహుల్‌గాంధీ స్వల్ప మెజారిటీతోనైనా గెలవడానికి ప్రియాంక ప్రచారమే తోడ్పడిందని చాలా మంది అభిప్రాయపడ్డారు.

✦ భర్త వ్యాపారాలతో చెడ్డపేరు!


యూపీఏ హయాంలో ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా కొన్ని రియల్ ఎస్టేట్ కంపెనీలు ప్రారంభించి రాజస్థాన్, హరియాణా, ఢిల్లీలో అక్రమంగా భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోయాక వాద్రా భూ కుంభకోణాలపై విచారణ కొనసాగుతోంది. ప్రియాంక క్రియాశీల రాజకీయ రంగ ప్రవేశానికి భర్త వ్యాపార లావాదేవీలపై వచ్చిన ఆరోపణలు అడ్డంకిగా మారాయనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది.



తూర్పు యూపీ బాధ్యతలే ఎందుకు?

పశ్చిమ యూపీతో పోల్చితే ఆర్థికంగా వెనుకబడిన తూర్పు ప్రాంతం రాజకీయంగా కీలకం కావడంతో నరేంద్రమోదీ వారణాసి నుంచి పోటీచేశారు. బీజేపీ, ఎస్పీ–బీఎస్పీ కూటమికి గట్టి పునాదులున్న తూర్పు ప్రాంతంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తేనే ఈ పార్టీ కనీసం 20–25 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. ఈ కారణంగానే ప్రియాంకను 30 లోక్‌సభ సీట్లున్న తూర్పు యూపీ ఇన్‌చార్జిగా నియమించారని భావిస్తున్నారు. అనారోగ్యం వల్ల తల్లి సోనియా వచ్చే ఎన్నికల్లో పోటీచేయకపోతే రాయ్‌బరేలీలో ప్రియాంక రంగంలోకి దిగుతారని అంచనా వేస్తున్నారు. అమేథీ, రాయ్‌బరేలీకి ఆనుకుని ఉన్న సుల్తాన్‌పూర్, ప్రతాప్‌గఢ్, ఉన్నావ్ స్థానాల్లో ప్రియాంక ప్రచారం చేస్తే కాంగ్రెస్ విజయావకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

ఇందిరకు అసలైన వారసురాలు!



ఆహార్యంలోనే కాకుండా మాటతీరు, నడవడికలోనూ నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీని పోలి ఉండే ప్రియాంకనే ఆమెకు నిజమైన వారసురాలని కాంగ్రెస్ కార్యకర్తలు భావిస్తున్నారు. అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గ కార్యకర్తలతో ఎంతో సులువుగా మమేకమై, వారిని ఒక్కతాటిపైకి తేవడంలో ఆమె విజయవంతమయ్యారు. ప్రియాంకకు ఇందిరా గాంధీ పోలికలు ఉండటం పార్టీకి కలిసొస్తుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. 1972, జనవరి 12న జన్మించిన ప్రియాంక గాంధీ ఢిల్లీలోని మోడర్న్ స్కూల్, కాన్వెంట్ ఆఫ్ జీసస్ అండ్ మేరీలో పాఠశాల విద్యను పూర్తిచేశారు. జీసస్ అండ్ మేరీ కాలేజీలో సైకాలజీలో డిగ్రీ పట్టా పొందారు. బౌద్ధధర్మంలో ఎంఏ పాసైన ఆమె బౌద్ధ మతాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది. 1997లో రాబర్ట్ వాద్రాను వివాహమాడారు. వారికి కొడుకు రేహాన్, కూతురు మిరాయా ఉన్నారు.

రాహుల్ వైఫల్యాన్ని అంగీకరించారు: బీజేపీ

ప్రియాంక గాంధీని క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ తమ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నాయకత్వ లోపాన్ని అంగీకరించిందని బీజేపీ వ్యాఖ్యానించింది. విపక్ష కూటమిలో పలు పార్టీల చేతిలో తిరస్కరణకు గురవడంతో రాహుల్ గాంధీ 'కుటుంబ కూటమి'ని ఎంచుకున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఎద్దేవా చేశారు. గాంధీ కుటుంబం నుంచే కాంగ్రెస్ మరొకరికి పట్టాభిషేకం చేయడం సహజమేనని, కాంగ్రెస్‌లో కుటుంబమే పార్టీ అని, కానీ బీజేపీలో పార్టీనే కుటుంబమని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర బూత్‌స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముచ్చటిస్తూ ప్రధాని మోదీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒక కుటుంబం, వ్యక్తి కోరికల ఆధారంగా బీజేపీలో నిర్ణయాలు తీసుకోమని చెప్పారు.

మరింత పెద్ద బాధ్యతకు అర్హురాలు

ప్రియాంక స్థాయికి తూర్పు యూపీ ప్రధాన కార్యదర్శి పదవి తక్కువేనని కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఆమె మరింత విస్తృతమైన పాత్రకు అర్హురాలని పేర్కొన్నారు. ఈ నియామకం కాంగ్రెస్ దృక్కోణాన్ని తెలియజేస్తోందని, ఇది ఒక సోదరుడు(రాహుల్) సోదరిని పార్టీ పదవికి నియమించిన సందర్భమని వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ స్పందిస్తూ.. 2019 ఎన్నికల్లో ప్రియాంక గాంధీనే ప్రత్యేక ఆకర్షణ అవుతారన్నారు.

బడ్జెట్ ప్రవేశపెట్టనున్న పియూష్ గోయల్



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యం కారణంగా ప్రస్తుతం విదేశాల్లో ఉన్నందున, ఆర్థిక శాఖ బాధ్యతలను తాత్కాలికంగా పియూష్ గోయల్‌కు ప్రభుత్వం కేటాయించింది. దాంతో కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన గోయల్ ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం పియూష్ గోయల్ రైల్వే, బొగ్గు శాఖల మంత్రిగా ఉండగా, ఇప్పుడు ఆయనకు ఆర్థిక శాఖ బాధ్యతలను అదనంగా ఇచ్చారు. గతేడాది జైట్లీ మూత్రపిండ మార్పిడి చికిత్స చేయించుకున్నప్పుడు కూడా ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రిగా వంద రోజులపాటు గోయల్ ఉన్నారు. ఈసారి తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి సరిగ్గా 9 రోజుల ముందు ఆర్థిక శాఖ బాధ్యతలు గోయల్‌కు దక్కడం గమనార్హం. జైట్లీ తిరిగి బాధ్యతలు చేపట్టే వరకు గోయల్ ఆర్థిక మంత్రిగా కొనసాగుతారనీ, జైట్లీ మంత్రిగా కొనసాగనున్నప్పటికీ ఆయనకు ఏ శాఖలూ ఉండవని రాష్ట్రపతి భవన్ నుంచి బుధవారం విడుదలైన ఒక ప్రకటనలో ప్రభుత్వం వెల్లడించింది.

అరుణ్ జైట్లీకి ఆపరేషన్ విజయవంతం

న్యూఢిల్లీ: కేన్సర్‌తో బాధపడుతున్న కేంద్ర మంత్రి జైట్లీ(66) అమెరికాలోని న్యూయార్క్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్నారని ఆయన సన్నిహితవర్గాలు తెలిపాయి. ఆపరేషన్ నిర్వహించిన వైద్యులు రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించినట్లు వెల్లడించాయి. జైట్లీకి తొడ భాగంలో అరుదైన కేన్సర్ సోకింది. దీంతో ఆయన ఈ నెల 13న వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్లారు. అమెరికాలో ఉన్నప్పటికీ ఆయన సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటూ వచ్చారు. గతేడాది మే 14న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో జైట్లీ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ చేయించుకున్నారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జైట్లీ బరువు తగ్గేందుకు బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్నారు.

రైల్వేలో పేదల కోటా కింద 23 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: అగ్రవర్ణాల పేదల(ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్‌ను అమలుచేయబోయే తొలి ప్రభుత్వ విభాగంగా భారతీయ రైల్వే నిలవబోతోందని ఆ శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రాబోయే రెండేళ్లలో దాదాపు 23,000 మందికి ఈ కోటా కింద ఉద్యోగాలు ఇస్తామని వెల్లడించారు. ఆరు నెలల్లోగా 1.31 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామనీ, రాబోయే రెండేళ్లలో మరో లక్ష ఉద్యోగుల్ని తీసుకుంటామని పేర్కొన్నారు. 2019–20 మధ్యకాలంలో 53 వేల మంది, 2020–21 కాలంలో 46 వేల మంది ఉద్యోగులు రైల్వేశాఖ నుంచి పదవీ విరమణ చేయబోతున్నారని తెలిపారు.

'మీడియా పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా పాల్



న్యూఢిల్లీ: మీడియా రంగానికి చెందిన డాక్టర్ హెచ్.ఎస్.పాల్‌ను ఏసీఎస్ మీడియా కార్పొరేషన్ తాజాగా 'మీడియా పర్సన్ ఆఫ్ ది ఇయర్–2018' అవార్డుతో సత్కరించింది. ఢిల్లీలోని రష్యా రాయబార కార్యాలయంలో జరిగిన 'కంట్రీవైడ్ మీడియా ఇంపాక్ట్ అవార్డ్స్' కార్యక్రమంలో పాల్‌కు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు డాక్టర్(ప్రొఫెసర్) పీకే పాటసాని, ఏసీఎస్ మీడియా కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన డాక్టర్(ప్రొఫెసర్) అభిరామ్ కులశ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు. 1989 నుంచి మీడియారంగంలో ఉన్న పాల్ ప్రస్తుతం కశ్మీర్‌లోనే అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఇంగ్లిష్ పత్రిక 'డైలీ ఎక్సెల్షియర్'కు ఢిల్లీ బ్యూరో చీఫ్‌గా కొనసాగుతున్నారు.



అమెరికా, కెనడా సరిహద్దులోని ప్రపంచ ప్రఖ్యాత నయాగరా జలపాతం పాక్షికంగా గడ్డకట్టిన దృశ్యం

ఆత్మవిమర్శ కోసం అడవికి!

- ప్రతీ దీపావళికి వెళ్లి.. ఐదు రోజులు ఉండేవాణ్ని
- ఆ అనుభవం ఇప్పటికీ ఉపయోగపడుతోంది: మోదీ

ముంబై: యువకుడిగా ఉన్న రోజుల్లో తాను ప్రతీ దీపావళికి ఐదు రోజులపాటు అడవిలోకి ఒంటరిగా వెళ్లి ఆత్మవిమర్శ చేసుకునేవాడినని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆ అలవాటు కారణంగానే తనకు ఇప్పటికీ జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను ఎదుర్కొనే శక్తి లభిస్తోందని తెలిపారు. 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' అనే ఫేస్‌బుక్ పేజీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆ వివరాలను 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' బుధవారం ప్రచురించింది. అందులో కొంత భాగాన్ని మోదీ తన ట్విట్టర్ ఖాతాలోనూ పోస్ట్ చేశారు. ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ 'ఈ విషయం ఎక్కువ మందికి తెలియదు. ఆ రోజుల్లో ప్రతీ దీపావళికి నేను ఐదు రోజులపాటు దూరంగా వెళ్లే వాణ్ని. అడవిలో ఏదో ఒక చోట, ఎక్కడైతే స్వచ్ఛమైన నీరు తప్ప మనుషులు ఉండరో అక్కడకు చేరుకునే వాణ్ని. ఇన్నాళ్లూ ఏం చేశాను, ఇకపై ఏం చేయాలి, ఎలా ఉండాలి, ఏ పని చేయాలి తదితర అన్ని విషయాలపై అంతర్మథనం చేసుకునే వాడిని. నేను వెళ్లిన చోట వార్తా పత్రికలు కానీ, రేడియో కానీ ఉండేది కాదు. ఇక టీవీ, ఇంటర్నెట్ ఆ రోజుల్లో అసలు లేనే లేవు' అని అన్నారు.

యువత సమయం కేటాయించుకోవాలి

ఈనాటి యువత కాస్తంత తీరిక కూడా లేకుండా తమ జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, వారు కూడా ఎప్పుడో ఒకసారి కొంత సమయాన్ని కేటాయించుకుని అంతర్మథనం చేసుకోవాలని మోదీ కోరారు. అలా చేయడం వల్ల యువత ఆలోచనా దృక్పథం మారుతుందనీ, వారికా వారే బాగా అర్థమవుతారనీ, మరింత ఆత్మవిశ్వాసం రావడంతోపాటు ఇతరులు మీ గురించి ఏమనుకున్నా చలించని మనస్తత్వం అలవడుతుందన్నారు.

ఏం చేయాలో తెలీక హిమాలయాలకు..

చిన్నతనంలోనే తాను రెండేళ్లపాటు హిమాలయాలకు వెళ్లిన విషయంపై కూడా మోదీ చెప్పారు. 'నేను జీవితంలో ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఏ మార్గాన్నీ ఎంచుకోలేదు. అంతా అస్పష్టతే. నేను ఎక్కడికి వెళ్లాలో నాకే తెలీదు. ఏం చేయాలో తెలీదు. ఎందుకు చేయాలో తెలీదు. కానీ ఏదో ఒకటి చేయాలన్నది మాత్రమే నాకు అప్పుడు తెలుసు. కాబట్టి నాకు నేనుగా భగవంతుడికి అంకితమయ్యాను. 17 ఏళ్ల వయసులోనే హిమాలయాలకు వెళ్లాను. ఆ తర్వాత దేవుడు నన్ను ఎక్కడికి తీసుకెళ్లాలనుకుంటే అక్కడికి వెళ్లాను' అంటూ మోదీ తన గతం గురించి గుర్తుచేసుకున్నారు. 'నా జీవితం ఎటు వెళ్లాలో నిర్ణయమవ్వని దశ అది. అయినా అనేక ప్రశ్నలకు జవాబులు దొరికాయి. ప్రపంచాన్ని, నన్ను నేను అర్థం చేసుకున్నా. రామక్రిష్ణ మిషన్‌లో కాలం గడిపా. నాలో నేనే ఏదో కొత్తది కనుగొన్నా. బ్రహ్మ ముహూర్తంలోనే, వేకువ జామున3–3.45 మధ్యలో నిద్రలేచి, గడ్డకట్టే నీటితోనే హిమాలయాల్లో స్నానం చేసే వాడిని. శాంతి, ఏకాంతం, ధ్యానాన్ని ఒక జలధార శబ్దంలోనూ మనం పొందొచ్చని అర్థం చేసుకున్నా. ప్రకృతి తరంగాలతో ఎలా మమేకమవ్వాలో అక్కడి సాధువులు నేర్పారు' అని చెప్పారు.



ఎర్రకోటలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోదీ

కువైట్‌తో 'పని మనుషుల' ఒప్పందానికి కేబినెట్ ఓకే

న్యూఢిల్లీ: పని మనుషుల నియామకంలో సహకారానికి కువైట్‌తో కుదుర్చుకున్న ఒప్పందానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం వల్ల కువైట్‌లో పనిచేస్తున్న 3 లక్షల మంది భారతీయుల(అందులో 90 వేల మంది మహిళలే)కు ప్రయోజనం కలుగుతుంది. రెండు దేశాల మధ్య కుదిరిన ఎంఓయూలో భారత పని మనుషుల హక్కుల పరిరక్షణకు కొన్ని రక్షణలు కల్పించారు. ఐదేళ్ల వరకు అమల్లో ఉండే ఈ ఒప్పందాన్ని ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేసే వెసులుబాటు కూడా కల్పించారు. ఎంఓయూ అమలు పర్యవేక్షణకు సంయుక్త కమిటీని ఏర్పాటుచేయనున్నారు.

బలమైన భారత్ కోసం...

- సుభాష్ చంద్రబోస్ సంకల్పాన్ని నెరవేరుస్తాం
- ఎర్రకోటలో 4 మ్యూజియంలు ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 122వ జయంతి సందర్భంగా కేంద్రం ఆయనకు అరుదైన గౌరవం కల్పించింది. ఢిల్లీలోని ఎర్రకోటలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేరుతో ఓ మ్యూజియాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఆవిష్కరించారు. అలాగే జలియన్ వాలాబాగ్ ఊచకోత, మొదటి ప్రపంచయుద్ధంలో భారత సైనికుల స్మృత్యర్థం 'యాదే జలియన్ మ్యూజియం', భారత కళలకు సంబంధించి 'దృశ్యకళ' మ్యూజియం, 1857 తొలి స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాలను గుర్తుకుతెచ్చేలా మరో మ్యూజియాన్ని ప్రధాని ఎర్రకోటలో ప్రారంభించారు. ఈ నాలుగు మ్యూజియాలను కలిపి 'క్రాంతి మందిర్'గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ..'ఘనమైన భారత చరిత్ర, సంస్కృతికి సంబంధించి నాలుగు మ్యూజియాలను ఆవిష్కరించడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. శక్తిమంతమైన భారత్‌ను నిర్మించాలన్న బోస్ సంకల్పాన్ని నెరవేర్చేందుకు మేం కట్టుబడి ఉన్నాం. ఈ మ్యూజియాన్ని సందర్శించే యువత నేతాజీ జీవితం నుంచి మరింతగా స్ఫూర్తి పొందుతారని ఆశిస్తున్నా. ఎర్రకోటలోని ఈ గోడల్లో చరిత్ర ప్రతిధ్వనిస్తోంది. వలసపాలకులు ఇక్కడే కల్నల్ ప్రేమ్ సెహగల్, కల్నల్ గుర్బక్ష్ సింగ్ ధిల్లాన్, మేజర్ జనరల్ షానవాజ్ ఖాన్‌లను విచారించారు' అని ట్విట్టర్‌లో తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా సుభాష్ చంద్రబోస్ వాడిన టోపీని ఆయన కుటుంబ సభ్యులు మోదీకి బహూకరించగా, ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆ టోపీని మ్యూజియంకు ఇచ్చేశారు. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా బోస్‌వాడిన కుర్చీ, యూనిఫాం, మెడల్స్‌తో పాటు ఆజాద్ హింద్ ఫౌజ్‌కు సంబంధించిన పలు వస్తువులను బోస్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. అలాగే సుభాష్ చంద్రబోస్ జీవితంపై తీసిన డాక్యుమెంటరీని ఇక్కడ ప్రదర్శిస్తారు. ఇక మొదటి ప్రపంచయుద్ధంలో అమరులైన 15 లక్షల మంది భారతీయ జవాన్ల వీరోచిత పోరాటం, త్యాగాన్ని యాదే జలియన్ మ్యూజియంలో ఫొటోల రూపంలో తీర్చిదిద్దారు. భారత సైనికుల త్యాగాన్ని ప్రశంసిస్తూ సరోజినీ నాయుడు రాసిన 'గిఫ్ట్' పద్యాన్నీ ప్రదర్శనకు ఉంచారు.

జడ్జీలు రాజకీయాలకు దూరంగా ఉండాలి

- కొలీజియం నిర్ణయాన్ని ప్రజలకు తెలియజేయలేదు
- న్యాయవ్యవస్థలో బంధుప్రీతి లేదన్న రిటైర్డ్ జస్టిస్ లోకూర్

న్యూఢిల్లీ: రాజస్తాన్ హైకోర్టు సీజే జస్టిస్ ప్రదీప్ నంద్రజాగ్, ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ రాజేంద్ర మీనన్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించకపోవడంపై సుప్రీం మాజీ జడ్జి జస్టిస్ మదన్.బి.లోకూర్ స్పందించారు. జస్టిస్ ప్రదీప్, జస్టిస్ రాజేంద్ర మీనన్‌ల నియామకంపై 2018, డిసెంబర్ 12న కొలీజియం చేసిన సిఫార్సుల్ని ప్రజలకు అందుబాటులోకి తేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 10న సమావేశమైన కొత్త కొలీజియం జస్టిస్ ప్రదీప్, జస్టిస్ మీనన్‌ల పేర్లను తొలగించి జస్టిస్ ఖన్నా, జస్టిస్ మహేశ్వరిల పేర్లను సిఫార్సు చేయడం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. కొలీజియం సిఫార్సుకు కేంద్రం గత వారం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో బుధవారం ది లీఫ్లెట్ న్యూస్‌పోర్టల్ నిర్వహించిన స్టేట్ ఆఫ్ ఇండియన్ జ్యుడీషియరీ అనే కార్యక్రమంలో జస్టిస్ లోకూర్ మాట్లాడుతూ.. '2018, డిసెంబర్ 12న కొలీజియం సమావేశం జరిగింది. అందులో కొన్ని నిర్ణయాలను తీసుకున్నాం. కానీ డిసెంబర్ 12 నుంచి 2019, జనవరి 10 మధ్యన ఏం జరిగిందో నాకు తెలియదు. కాబట్టి నేనేం చెప్పలేను. కానీ మేము ఆమోదించిన తీర్మానాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచకపోవడం నన్ను నిరాశ పరిచింది. అయితే ఆ తీర్మానాన్ని వెబ్‌సైట్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేదో నాకు అనవసరం' అని వ్యాఖ్యానించారు.



విశ్వాసఘాతకానికి పాల్పడలేను..

కొలీజియం నిర్ణయాలపై స్పందిస్తూ.. 'కొలీజియంలో నిర్ణయాలను పరస్పరం నమ్మకంతో రహస్యంగా తీసుకుంటారు. కాబట్టి ఆ సమావేశంలో చర్చించిన విషయాలను బయటపెట్టి విశ్వాసఘాతుకానికి పాల్పడలేను. కానీ ఈ సమావేశంలో మేం కొన్ని నిర్ణయాలను తీసుకున్నాం. వీటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కొలీజియం భేటీలో ఆరోగ్యకరమైన చర్చ సాగింది. అందులో సమ్మతి, అసమ్మతి రెండూ ఉన్నాయి' అని జస్టిస్ లోకూర్ తెలిపారు. ప్రధాని మోదీ ఇటీవల సుప్రీంకోర్టు ప్రాంగణాన్ని సందర్శించడంపై మాట్లాడుతూ.. 'జడ్జీలు రాజకీయాలకు దూరంగా ఉండాలి. అంతమాత్రాన రుషిలా, ఒంటరిగా గడపాల్సిన అవసరం లేదు. దూరం పాటించాలంటే అర్థం ఏంటి? ప్రధాని మోదీ ముఖాన్ని కూడా చూడకూడదంటున్నారా? సాధారణ కార్యక్రమాలకు ప్రధానిని ఆహ్వానించడం తప్పుకాదు. ఇలాంటి కార్యక్రమాలకు సుప్రీంకోర్టు తలుపులు తెరవడం మంచిదే' అని వెల్లడించారు. న్యాయవ్యవస్థలో బంధుప్రీతి ఉందన్న ఆరోపణల్ని కొట్టిపారేశారు. కొలీజియం వ్యవస్థ విఫలమైందని తాను భావించడం లేదని లోకూర్ అన్నారు.

విధివిధానాలు రూపొందించాలి

కొన్నిసార్లు న్యాయవ్యవస్థ కూడా తన పరిధి దాటి వ్యవహరించిందని జస్టిస్ లోకూర్ తెలిపారు. కొలీజియం తీసుకునే నిర్ణయాలను నిర్ణీత గడువులోగా అమలుచేసేలా ఓ వ్యవస్థ ఉండాలన్నారు. ఈ గడువులోగా కేంద్రం నుంచి జవాబు రాకుంటే ఆమోదం లభించాలని వ్యాఖ్యానించారు. ఇందుకోసం కొలీజియంలో కొన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గతంలో జస్టిస్ ఏఎం జోసెఫ్‌ను సుప్రీంకోర్టు జడ్జీగా పదోన్నతి కల్పించే విషయంలో కేంద్రం ఫైలును కొన్నినెలల పాటు తనవద్దే అట్టిపెట్టుకున్న విషయాన్ని ప్రస్తావించారు. న్యాయ వ్యవస్థ, కేంద్రానికి ఇలా ఫైళ్లను తొక్కిపెట్టే అధికారం లేదన్నారు. భవిష్యత్‌లో కేంద్రం ఇచ్చే ఎలాంటి బాధ్యతలను తాను స్వీకరించబోనని చెప్పారు. జస్టిస్ ప్రదీప్, జస్టిస్ మీనన్‌ల పేర్లను ప్రతిపాదించిన కొలీజియంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ లోకూర్.. గత డిసెంబర్ 30న పదవీవిరమణ చేశారు.

సాక్షి బిజినెస్

గురువారం 24-1-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
336 ▼	91 ▼
36,108	10,832

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ			
నాస్‌డాక్	6,972	▼	48
డోజోన్స్	24,400	▼	48
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,843	▼	58
డాక్స్	11,072	▼	19
షాంఘై	2,581	▲	1
నికాయ్	20,593	▼	29

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.05	72.04
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.04	94.55
€	యూరో	ఎస్‌బీఐ	80.15	82.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63	68
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.05	52.04
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.08	54.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.65	20.08
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	09.45	11.15

టాటా 'హారియర్' వచ్చేసింది

ప్రారంభ ధర రూ. 12.69 లక్షలు



ముంబై: కారు ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'టాటా హారియర్' బుధవారం దేశీయ మార్కెట్లోకి ప్రవేశించింది. ల్యాండ్ రోవర్ డీ8 ప్లాట్‌ఫాంపై రూపొందిన ఈ సరికొత్త కాంపాక్ట్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ).. మొత్తం 4 వేరియంట్లలో లభ్యమవుతోంది. 2.0 లీటర్ డీజిల్ ఇంజిన్, 6–స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, సింగిల్ పవర్‌ట్రెయిన్ ఈ కారు ప్రధాన ఫీచర్లు. 'ఎక్స్‌ఈ, ఎక్స్‌ఎం, ఎక్స్‌టీ, ఎక్స్‌జెడ్' మోడళ్లను హారియర్ విభాగంలో కంపెనీ విడుదలచేసింది. వీటి ధరల శ్రేణి రూ.12.69 లక్షల నుంచి రూ.16.25 లక్షల మధ్య ఉన్నట్లు ప్రకటించింది. ఇంపాక్ట్ డిజైన్ 2.0 ఆధారంగా రూపొందించిన తొలి కారు ఇదేనని సంస్థ పేర్కొంది. 'ల్యాండ్ రోవర్ డీ8 ఒమేగాఆర్కిటెక్చర్‌పై ఈ కారు రూపొందింది. టర్న్అరౌండ్ 2.0 ప్రణాళికలో భాగంగానే దీన్నివిడుదలచేశాం' అని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరీఖ్ మాట్లాడుతూ.. వ్యాఖ్యానించారు.

మార్కెట్లోకి కొత్త 'వ్యాగన్‌ఆర్'

- 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్
- ప్రారంభ ధర రూ.4.89 లక్షలు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్‌ఐ).. తన వ్యాగన్–ఆర్ శ్రేణిలో నూతన వెర్షన్‌ను బుధవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ కారును 'బిగ్ న్యూ వ్యాగన్‌ఆర్'గా అభివర్ణించిన సంస్థ.. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో పాటు మరో ఆప్షన్లో భాగంగా 1–లీటర్ ఇంజిన్‌ను కూడా అందుబాటులో ఉంచింది. 1.2 లీటర్ ఇంజిన్ కారు ధరల శ్రేణి రూ.4.89 లక్షలు–రూ.5.69 లక్షలు. 1–లీటర్ ఇంజిన్ ధరల శ్రేణి రూ.4.19 లక్షలు–రూ.4.69 లక్షలు కాగా, ఈ విభాగంలోని ఆటోమేటెడ్ గేర్ షిఫ్ట్ ధర రూ.5.16 లక్షలు. హై టెన్షన్ స్టీలును వాడడం వల్ల నూతన వేరియంట్లో శబ్దం, కుదుపులు తక్కువగా ఉంటాయని కంపెనీ తెలిపింది. 'ఈ కారు కేవలం ఫ్యామిలీనే కాకుండా, యువ కొనుగోలుదారులను కూడా మంచి చాయిస్ కానుంది.' అని సంస్థ సీఈఓ కెనిచి అయుకవా మాట్లాడుతూ.. వ్యాఖ్యానించారు.

జీఎస్‌టీ గణనీయంగా తగ్గాలి..: ప్రస్తుతం ఆటోమొబైల్స్‌పై 28% జీఎస్‌టీ రేటు, ఇందుకు అదనంగా 15% సెస్ అమల్లోఉండగా.. ఇవి తగ్గాల్సిన అవసరం ఉందని కెనిచి అయుకవా అన్నారు. జీఎస్‌టీ తగ్గడం వల్ల పరిశ్రమ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

ఇండిగోకు ఇంధన సెగ..

క్యూ3లో లాభం 75 శాతం డౌన్



న్యూఢిల్లీ: ఇంధన ధరలు పెరిగిపోవడం, కరెన్సీ మారకం విలువ తగ్గడం విమానయాన సంస్థ ఇండిగో లాభాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ నికర లాభం ఏకంగా 75 శాతం క్షీణించి రూ.191 కోట్లకు పడిపోయింది. 2017–18 క్యూ3లో ఇండిగో రూ.762 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. సమీక్షా కాలంలో ఇండిగో మొత్తం ఆదాయం మాత్రం 28 శాతం పెరిగి రూ.6,409 కోట్ల నుంచి రూ.8,229 కోట్లకు చేరుకుంది. అధిక ఇంధన ధరలు, కరెన్సీ పతనం తదితర అంశాలు లాభదాయకతపై ప్రతికూల ప్రభావం చూపాయని కంపెనీ పేర్కొంది. బీఎస్‌ఈలో బుధవారం ఇండిగో షేరు 0.89 శాతం క్షీణించి రూ. 1,108 వద్ద క్లోజయ్యింది.

'ఇంటి'ని చక్కదిద్దరూ..!

రియల్ ఎస్టేట్

- ఎన్నో రియల్టీ ప్రాజెక్టులు నిలిచిపోయాయి
- పూర్తి చేయటంలో జోక్యం చేసుకోండి
- రూ. 2,000 కోట్లతో నిధిని ఏర్పాటు చేయండి
- ఈ బడ్జెట్‌లో ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వండి
- కేంద్రాన్ని కోరిన 'నారెడ్కో'





న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో తమ డిమాండ్లకు చోటు కల్పించాలని పలు రంగాల నుంచి కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థనలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఎన్నో ప్రాజెక్టులు నిలిచిపోయిన పరిస్థితి ఉంది. మరోవైపు ఈఎంఐలు చెల్లిస్తూ ఇంటి స్వాధీనం కోసం కొనుగోలుదారులు వేచి చూస్తున్న పరిస్థితి కూడా నెలకొంది. దీంతో ప్రభుత్వం నుంచి ఊరట కల్పించే చర్యలను ఈ రంగం ఆశిస్తోంది. లిక్విడిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, నిలిచిపోయిన ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు గాను రూ.2,000 కోట్లతో ఓ నిధి (స్ట్రెస్డ్ అస్సెట్ ఫండ్)ని ఏర్పాటు చేయాలని రియల్టర్ల మండలి నారెడ్కో డిమాండ్ చేసింది. ఇంకా ఈ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని ఏం కోరిందంటే...

- ఐఎల్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం తర్వాత బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగంలో నిధుల లభ్యత పరంగా కఠిన పరిస్థితులు ఏర్పడడంతో, లిక్విడిటీ పెంపునకు చర్యలు తీసుకోవాలి.
- అందుబాటు ధరల ఇళ్లపై జీఎస్టీని 8 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలి. ఇతర ప్రాజెక్టులపై జీఎస్టీ రేటును 12 శాతం నుంచి 8 శాతానికి తగ్గిస్తూ, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కల్పించాలి.
- ప్రతికూల నెట్‌వర్త్ ఉన్న డెవలపర్ల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.
- స్టాంప్ డ్యూటీ చార్జీలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి. మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రాపర్టీల సర్కిల్ రేట్లను నిర్ణయించాలి.
- ఇళ్ల అద్దె ఆదాయంపై ఫ్లాట్‌గా 10 శాతం పన్ను రేటు అమలు చేయాలి. సెక్షన్ 24(ఏ)కింద అద్దె ఆదాయంలో తగ్గింపును 30 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. అదే, వికలాంగులు, వృద్ధులు, మహిళలకు 100 శాతం పన్ను మినహాయింపు కల్పించాలి.
- ఇంటి రుణంపై ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల వడ్డీ చెల్లింపుపై ఆదాయపన్ను మినహాయింపు ఉండగా, దీన్ని రూ.3 లక్షలు చేయాలి.

జీఎస్టీ శ్లాబుల్ని హేతుబద్ధీకరించాలి

వర్తకులు



ప్రమాద బీమా సదుపాయం, రాయితీపై రుణాలతో కూడిన ప్యాకేజీ ఇవ్వాలని అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) డిమాండ్ చేసింది. జీఎస్టీ శ్లాబులను హేతుబద్ధీకరించాలని కూడా కోరింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఓ లేఖ రాసింది. లేఖలో ఈ సంఘం ఏం పేర్కొందంటే..

- జీఎస్టీ కింద నమోదైన వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలి.
- కంప్యూటర్లు, వాటికి సంబంధించిన ఉత్పత్తుల కొనుగోలుపై సబ్సిడీ ఇవ్వాలి.
- రిటైల్ ట్రేడింగ్, ఈ కామర్స్‌కు దేశవ్యాప్త విధానాన్ని తీసుకురావాలి.
- రిటైల్ రంగానికి ప్రత్యేకంగా ఒక నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలి.
- ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్‌ను నెలకొల్పాలి.
- బ్యాంకులు వడ్డీ రేటు తగ్గింపుపై రుణాలను వర్తకులకు ఇవ్వాలి. ప్రస్తుతం కేవలం 5 శాతం చిన్న వ్యాపారులే బ్యాంకుల రుణాలు పొందుతుండగా, మిగిలిన వారు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.
- 18 శాతం జీఎస్టీ రేటును ఎత్తివేయాలి. కేవలం సంపన్న(లగ్జరీ) ఉత్పత్తులకే 28 శాతం శ్లాబును పరిమితం చేయాలి. ఆటో విడిభాగాలు, సిమెంట్‌ను ఈ శ్లాబ్ నుంచి తొలగించాలి. పేద ప్రజలు వాడేవి, నిత్యం వినియోగించే వాటిని 5 శాతం రేటులో ఉంచాలి.
- జీఎస్టీ కింద నమోదు చేసుకున్న వ్యాపారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- మండి ట్యాక్స్, టోల్‌ట్యాక్స్‌ను రద్దు చేయాలి.

మార్కెట్‌ను మెప్పించని ఐటీసీ

- క్యూ3లో 4 శాతం పెరిగిన లాభం
- రూ.3,209 కోట్లుగా నమోదు
- 1 శాతానికి పైగా తగ్గిన మార్జిన్లు
- ఆదాయంలో సిగరెట్ల వాటా సగానికన్నా తక్కువే



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ, వ్యవసాయోత్పత్తుల విభాగాల ఊతంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో వ్యాపార దిగ్గజం ఐటీసీ నికర లాభం 4 శాతం పెరిగి రూ. 3,209 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం అక్టోబర్– డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ. 3,090 కోట్లు. 'క్యూ3లో స్థూల ఆదాయం రూ. 15 శాతం పెరిగి రూ. 9,853 కోట్ల నుంచి రూ.11,340 కోట్లకు చేరింది. ఎఫ్‌ఎంసీజీ, అగ్రి బిజినెస్, పేపర్‌బోర్డ్స్, పేపర్, ప్యాకేజింగ్ తదితర విభాగాలు రాణించడం ఇందుకు తోడ్పడింది' అని ఐటీసీ పేర్కొంది. సిగరెట్స్ విభాగంలో పెను సవాళ్లు ఎదురైనప్పటికీ పరిశ్రమలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగలిగామని ఐటీసీ తెలిపింది. మూడో త్రైమాసికంలో వ్యయాలు 17% పెరిగి రూ. 7,446 కోట్లకు చేరాయి. స్థూల లాభం 11.2 శాతం పెరిగినా.. అధిక వ్యయాల కారణంగా మార్జిన్లు 39.8 శాతం నుంచి 38.5 శాతానికి తగ్గాయి. పరిశ్రమవర్గాలు 40 శాతంగా ఉండొచ్చని అంచనా వేశాయి. మొత్తం మీద ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను మెప్పించలేకపోవడంతో ఐటీసీ షేరు దాదాపు 4 శాతం క్షీణించి రూ. 277.70 వద్ద క్లోజయ్యింది.

విభాగాలవారీగా ఆదాయాలు చూస్తే ..

- మొత్తం ఎఫ్‌ఎంసీజీ వ్యాపార ఆదాయం 10 శాతం వృద్ధితో రూ. 7,501 కోట్ల నుంచి రూ. 8,274 కోట్లకు పెరిగింది. ఇందులో సిగరెట్స్ వ్యాపార విభాగం ఆదాయం సుమారు 10 శాతం పెరిగి రూ. 5,073 కోట్లకు చేరింది. ఇతరత్రా ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల విభాగం 11% పెరిగి రూ. 3,201 కోట్లకు చేరింది.
- ఐటీసీ హోటల్ వ్యాపార ఆదాయం 12 శాతం పెరిగి రూ. 452 కోట్లకు చేరింది. సగటు రూమ్ రేటు (ఏఆర్ఆర్) మెరుగుపడటం దీనికి తోడ్పడింది.
- అగ్రిబిజినెస్ వ్యాపార విభాగం 26 శాతం ఎగిసి రూ. 1,531 కోట్ల నుంచి రూ.1,925 కోట్లకు చేరింది.
- పేపర్‌బోర్డ్స్, పేపర్, ప్యాకేజింగ్ విభాగం ఆదాయం 21 శాతం పెరిగి రూ. 1,543 కోట్లుగా నమోదైంది.

ఇన్వెస్టర్లను మెప్పించలేకపోవటంతో ఫలితాల వెల్లడి అనంతరం ఐటీసీ కౌంటర్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. షేరు ఏకంగా 4 శాతానికి పైగా పతనమై రూ.277.70 వద్ద ముగిసింది.

జీఎస్టీపై అప్పీళ్లకు ట్రిబ్యునల్ నేషనల్ బెంచ్

- సార్క్ దేశాలతో కరెన్సీ స్వాప్
- ఆహార రంగంలో జపాన్‌తో సహకారం
- కేంద్ర కేబినెట్ భేటీలో నిర్ణయాలు



న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఏదైనా అంశంలో వివాదం ఏర్పడితే రెండో అప్పీలు చేసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నది కేంద్రం ఉద్దేశం. రాష్ట్రాల స్థాయిలో భిన్న తీర్పులు వచ్చిన కేసులను సైతం జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ నేషనల్ బెంచ్ విచారిస్తుంది. ఢిల్లీలో ఏర్పాటయ్యే ఈ బెంచ్‌లో కేంద్రం నుంచి, రాష్ట్రాల నుంచి ఒక్కో సభ్యుడు ఉంటారు. ఓ ప్రెసిడెంట్ కూడా ఉంటారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ నేషనల్ బెంచ్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నట్టు అధికారిక ప్రకటనలో తెలియజేశారు. జీఎస్టీ విషయంలో రెండో అప్పీల్‌కు, కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తితే పరిష్కారానికి తొలి వేదికగా ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. దీని ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ డిసెంబర్‌లోనే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు కేంద్ర కేబినెట్ అందుకు మార్గం సుగమం చేసింది. దీనితోపాటు పలు ఇతర నిర్ణయాలను కూడా కేంద్ర కేబినెట్ తీసుకుంది.

జపాన్‌తో భాగస్వామ్యం

ఆహార ప్రాసెసింగ్‌లో జపాన్‌తో సహకారానికి అనుకూలంగా కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఆహార శుద్ధి రంగంలో ద్వైపాక్షిక సహకారం ఇరుదేశాలకూ ప్రయోజనకరమని ప్రభుత్వం పేర్కొంది. ఇరుదేశాలకూ మార్కెట్ అనుసంధానత పెరగడంతోపాటు ఈ రంగంలో ఉత్తమ విధానాలను ప్రోత్సహించేందుకు వీలుపడుతుందని వివరించింది. దేశంలో ఆహార ప్రాసెసింగ్ పెరిగేందుకు ఒప్పందం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

400 మిలియన్ డాలర్ల కరెన్సీ స్వాప్

'సార్క్' దేశాలతో 400 మిలియన్ డాలర్ల మేర స్థిర సదుపాయంతో కరెన్సీ మార్పిడికి సంబంధించిన సవరణలకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. సార్క్ ఫ్రేమ్‌వర్క్ కింద ప్రస్తుత పరిమితి మించిన సందర్భాల్లో, సభ్య దేశాల నుంచి అభ్యర్థన వచ్చినప్పుడు భారత్ సత్వరమే స్పందించేందుకు ఈ సదుపాయం ఉపయోగపడుతుంది.

టీసీఎస్.. ప్రపంచంలో టాప్-3

- ఐటీ సేవల్లో మూడో అత్యంత విలువైన బ్రాండ్
- టాప్–10లో ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్
- బ్రాండ్ ఫైనాన్స్ రిపోర్ట్ వెల్లడి



న్యూఢిల్లీ: ఐటీ సేవల్లో భారత కంపెనీలు ప్రతిభ మరోసారి ప్రపంచానికి తెలిసింది. ఈ రంగంలో టీసీఎస్ ప్రపంచంలోనే మూడో అత్యంత విలువైన బ్రాండ్‌గా గుర్తింపు పొందింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను యాక్సెంచర్, ఐబీఎం మొదటి రెండు స్థానాల్లో నిలవగా, టీసీఎస్ మూడో స్థానంలో ఉన్నట్టు 'బ్రాండ్ ఫైనాన్స్' రిపోర్ట్ తెలియజేసింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా ఈ నివేదికను విడుదల చేసింది. భారత్‌కు చెందిన ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, విప్రో సైతం టాప్–10లో చోటు సంపాదించుకోవడం గమనార్హం. 26.3 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో యాక్సెంచర్ మొదటి స్థానంలో నిలిచింది. క్రితం ఆర్థిక సంవత్సరం నివేదికలో ఐబీఎం మొదటి స్థానంలో ఉండగా, దాన్ని వెనక్కి నెట్టి యాక్సెంచర్ మొదటి స్థానానికి చేరుకుంది. 20.4 బిలియన్ డాలర్లతో ఐబీఎం రెండో స్థానానికి పరిమితమైంది. 12.8 బిలియన్ డాలర్లతో టీసీఎస్ మూడో స్థానం దక్కించుకుంది. సంస్థ మార్కెట్ విలువ క్రితం నివేదికతో పోలిస్తే 23 శాతం పెరిగినట్టు బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక తెలిపింది. జపాన్ మార్కెట్లో విజయం సాధించిన తొలి భారత ఐటీ కంపెనీ టీసీఎస్ అని ప్రస్తావించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్ ఆటోమేషన్ సహా అన్ని రకాల కస్టమర్ సేవలను అందించడంలో లీడర్‌గా నిలిచినట్టు వివరించింది.

టాప్–10లో తొలిసారిగా విప్రో

విప్రో తొలిసారి ఈ జాబితాలో టాప్–10లో చోటు దక్కించుకుంది. డిజిటల్ సామర్థ్యాల పెంపు, కీలకమైన కొనుగోళ్లపై కంపెనీ చేసిన గణనీయమైన పెట్టుబడులతో ఈ విభాగంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మూడో కంపెనీగా విప్రో నిలిచినట్టు పేర్కొంది. అమెరికాకు చెందిన కాగ్నిజెంట్ (8.7 బిలియన్ డాలర్లు) నాలుగు, ఇన్ఫోసిస్ (6.5 బిలియన్ డాలర్లు) ఐదో స్థానంలో నిలిచాయి. క్యాప్‌జెమిని, డీఎక్స్‌సీ టెక్నాలజీ, ఎన్‌టీటీ డేటా టాప్–10లో నిలిచిన ఇతర సంస్థలు. నైపుణ్య ఉద్యోగులు, ప్రపంచ స్థాయి సదుపాయాలు, వసతులు వంటివి భారత్‌ను ఆకర్షణీయమైన ప్రదేశంగా, ప్రపంచానికి చోదకంగా నిలుపుతున్నాయని బ్రాండ్ ఫైనాన్స్ సీఈవో డేవిడ్‌హేగ్ పేర్కొన్నారు.

ఆర్థిక వృద్ధి.. అంతకు మించి!

- ఐఎంఎఫ్ అంచనాలు మించుతాం
- నీతి ఆయోగ్ చైర్మన్ అమితాబ్ కాంత్
- ప్రపంచ ఆర్థిక సదస్సులో వెల్లడి



దావోస్: అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, భారత్ మాత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం వృద్ధి సాధిస్తుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసినట్లు నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ వ్యాఖ్యానించారు. ఇది భారత్ సత్తాకు నిదర్శనమంటూ... తాము అంతకు మించిన ఆర్థిక వృద్ధిని సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో(డబ్ల్యూఈఎఫ్) మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

పట్టణీకరణే కీలకం...

భవిష్యత్తులో ఆర్థిక వృద్ధికి పట్టణీకరణ జోరే కీలకమని కాంత్ వివరించారు. వంద స్మార్ట్ సిటీల అభివృద్ధి జరుగుతోందని, ఇది పట్టణీకరణ జోరును మరింతగా పెంచగలదని పేర్కొన్నారు. ''ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమైంది. సంస్కరణలు కొనసాగుతున్నాయి. దీంతో వృద్ధి మరింత జోరందుకుంటుంది. మరోవైపు ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు వంటి ఆర్థిక అంశాలు నియంత్రణలోనే ఉన్నాయి'' అని ఆయన వివరించారు.

వినియోగదారుడికే అగ్ర పీఠం...

టెక్నాలజీ కారణంగా సరైన ఉత్పత్తులను, సేవలను వినియోగదారులకు అందించగలమని బజాజ్ ఫిన్‌సర్వ్ చీఫ్ సంజీవ్ బజాజ్ తెలిపారు. వినియోగదారుడికే అగ్రపీఠం అనే విధానాన్ని తాము అనుసరిస్తామని చెప్పారు. టెక్నాలజీని సరిగ్గా వినియోగించుకోవడం వల్లే వినియోగదారులకు తక్షణం రుణాలందించగలుగుతున్నామని తెలిపారు.

చేయాల్సింది ఎంతో ఉంది...

భారత్, చైనాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత ప్రభావం చూపడం మొదలైందని జర్మనీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ చెప్పారు. అంతర్జాతీయ సంస్థలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అమెరికా వంటి దేశాలు తమ స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బాగా పాడైందని, దీనిని బాగుకోసం చాలా చేయాల్సింది ఉందన్నారు.



అమెరికా, చైనా, భారత్‌లు ముందుండాలి: జపాన్ ప్రధాని షింజో అబె

ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై మళ్లీ విశ్వాసం పెరిగేలా చూడాలని ప్రపంచ దేశాల నాయకులను జపాన్ ప్రధాన మంత్రి షింజో అబె కోరారు. ప్రపంచ వాణిజ్య సంస్థకు (డబ్ల్యూటీఓ) కొత్త జవసత్వాలు కల్పించడానికి అమెరికా, చైనా, భారత్ కృషి చేయాలని కోరారాయన. పెరిగిపోతున్న వృద్ధ జనాభా సమస్యను ఉమెనామిక్స్ (మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించడం) ద్వారా అధిగమించామని, ఓటమినే ఓడించామని పేర్కొన్నారు. తమ దేశంలో 65 ఏళ్ల వ్యక్తులు కూడా పనిచేయడానికి ముందుకు వస్తారని, వంద మంది కాలేజీ పట్టభద్రులు ఉద్యోగాలు చేయడానికి సిద్ధంగా ఉంటే, 98 మందికి ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించారు.

మిత్రులతో వ్యాపారం వద్దు: జాక్ మా



వ్యాపార వీరులు పోటీ గురించి, ఒత్తిడి గురించి అస్సలు ఆలోచించరని చైనా ఆన్‌లైన్ దిగ్గజం ఆలీబాబా వ్యవస్థాపకుడు జాక్ మా వ్యాఖ్యానించారు. పిల్లలు సృజనాత్మకంగా, వినూత్నంగా ఆలోచించేలా చూడాలని, యంత్రాల మాదిరిగా వాళ్లు తయారు కాకూడదని పేర్కొన్నారు. భవిష్యత్తులో యంత్రాలకు చిప్‌లుంటాయని, కానీ మానవులకు హృదయం ఉంటుందని, ఈ దిశలో విద్యావిధానాలు ఉండాలని సూచించారు. పర్యావరణ హితంగా టెక్నాలజీ ఉండాలన్నారు. వ్యాపారం కంటే స్నేహం విలువైనదని, మీ మిత్రులను ఎప్పుడూ వ్యాపారంలో కలుపుకోవద్దని ఆయన సలహా ఇచ్చారు.

లంచ్ బాక్స్ తేవాలా..!

- అన్ని రకాల డెలివరీ సేవలకు విజ్జీ
- హైదరాబాద్ కేంద్రంగా ఎన్నారైల వెంచర్



మీడియా సమావేశంలో రవి బత్తి, రవి గొల్లపూడి (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓ విద్యార్థి సహచర విద్యార్థి ఇంట్లో ఖరీదైన పెన్సిల్ మర్చిపోయాడు. తెల్లవారితే డ్రాయింగ్ కాంపిటీషన్. ఆ స్టూడెంట్ పేరెంట్స్ ఇద్దరూ ఉద్యోగులు. పెన్సిల్ తెచ్చే సమయం లేక డెలివరీ యాప్ 'విజ్జీ'ని ఆశ్రయించారు. స్కూల్‌కు వెళ్లే సమయానికి విద్యార్థి చేతిలోకి ఆ పెన్సిల్ వచ్చి చేరింది. ఇలాంటి అవసరాలే కాదు.. లంచ్ బాక్స్ ఇంటి నుంచి తేవాలన్నా, ఇంట్లో మర్చిపోయిన పెన్ డ్రైవ్, పేపర్స్, పాస్‌పోర్ట్ వంటివి దరి చేరాలన్నా మేమున్నాం అని అంటోంది విజ్జీ. ఫుడ్, గ్రాసరీ డెలివరీ కంపెనీలకు భిన్నంగా ఈ స్టార్టప్ సేవలను విస్తరిస్తోంది. కస్టమర్ కోరితే రూ.10,000 వరకు క్యాష్ సైతం విజ్జీ ఉద్యోగి తీసుకొచ్చి ఇస్తారు. పేటీఎం ద్వారా వినియోగదారుడు ఆ మొత్తాన్ని కంపెనీకి చెల్లించాలి. పేటీఎం లావాదేవీ చార్జీతోపాటు డెలివరీ చార్జీ ఉంటుంది.

ఏడాదిలో 1,000 మందికి ఉపాధి...

ఎన్నారైలు రవి బత్తి, రవి గొల్లపూడి నాలుగు నెలల కిందట విజ్జీని ప్రారంభించారు. ప్రస్తుతం 15 మంది డెలివరీ బాయ్స్ ఉన్నారు. డిసెంబరుకల్లా ఈ సంఖ్యను 1,000కి చేర్చాలని లక్ష్యించుకున్నట్లు రవి బత్తి తెలిపారు. ఇప్పటి వరకు 1,300 మంది కస్టమర్లు 3,000 పైచిలుకు ఆర్డర్లు ఇచ్చారని చెప్పారు. మూడు కిలోమీటర్ల వరకు డెలివరీ చార్జీ రూ.20. ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.10 ఉంటుందని రవి గొల్లపూడి పేర్కొన్నారు. డెలివరీ బాయ్స్‌కు రోజుకు 8 గంటలకు గాను నెలకు రూ.14,000 వేతనం, రూ.3,000 పెట్రోల్ అలవెన్స్ ఇస్తున్నామని చెప్పారు. 'ఆహారోత్పత్తుల తయారీదార్లకు డెలివరీ పెద్ద సమస్య. విజ్జీ ఆ బాధ్యతను తీసుకుంటుంది. వారి వ్యాపార వృద్ధికి మా సేవలు ఉపయోగపడుతున్నాయి. వారు తయారు చేసే ఉత్పత్తులను ప్రమోట్ చేస్తాం' అని వివరించారు.

వృద్ధులకు డిపాజిట్‌పై 9.75 శాతం వడ్డీ రేటు

జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా వృద్ధులు (60 ఏళ్లు నిండిన వారు) చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 9.75 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నామని జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్య మూడేళ్ల కాలానికి చేసే డిపాజిట్లపై ఈ వడ్డీ రేటు అమల్లో ఉంటుందని తెలిపింది.

దక్షిణాఫ్రికాలో రూ.11,500 కోట్ల పెట్టుబడులు

వేదాంత ఛైర్మన్ అనిల్ అగర్వాల్ వెల్లడి

వేదాంత రిసోర్సెస్ కంపెనీ దక్షిణాఫ్రికాలో 160 కోట్ల డాలర్ల (రూ.11,500 కోట్లు) పెట్టుబడులు పెట్టనుంది. దక్షిణాఫ్రికా దేశంలో ఇప్పటికే 40 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టామని వేదాంత రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ చెప్పారు. గత ఏడాది ప్రధాని మోదీ ఆ దేశంలో పర్యటించిన సందర్భంగా తాము వంద కోట్ల డాలర్లు పెట్టుబడులు పెడతామని ప్రకటించామని, ఇప్పుడు దానిని 160 కోట్ల డాలర్లకు పెంచుతున్నామని అనిల్ పేర్కొన్నారు.

గృహోపకరణాల మార్కెట్లోకి హ్యుందాయ్ ఎలక్ట్రానిక్స్

దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కార్పొరేషన్‌కు అనుబంధంగా ఉన్న హ్యుందాయ్ ఎలక్ట్రానిక్స్ భారత గృహోపకరణాల మార్కెట్లోకి అడుగుపెట్టింది. పరిశోధన, ఉత్పత్తి ఆవిష్కరణలపై కంపెనీ దృష్టిసారించిందని ఈ సందర్భంగా సంస్థ సీఈఓ అక్షయ్ దూత్ తెలియజేశారు.

బ్లూ డార్ట్ సీఈఓగా బాల్ఫోర్ మానుయల్

కంపెనీ నూతన సీఈఓగా బాల్ఫోర్ మానుయల్‌ను నియమించినట్లు సరుకు రవాణా సేవల రంగానికి చెందిన బ్లూ డార్ట్ ప్రకటించింది. అనిల్ ఖన్నా స్థానంలో ఈయన పదవీ బాధ్యతలు చేపట్టగా.. అదనపు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవిలో ఖన్నా కొనసాగుతారని తెలిపింది. ఇక బీ2బీ కస్టమర్స్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా సంస్థకు సేవలందించిన మానుయల్‌కు 35 ఏళ్ల అనుభవం ఉంది.

ఆఖర్లో అమ్మకాలు..

- 336 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో విక్రయాలు

ఐటీసీ 4% డౌన్..: మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించకపోవడంతో.. సెన్సెక్స్ షేర్లలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ అత్యధికంగా 4.16% క్షీణించింది. సెన్సెక్స్ 336 పాయింట్ల పతనంలో ఒక్క ఐటీసీ వాటానే 100 పాయింట్లకు పైగా ఉండటం గమనార్హం.



న్యూఢిల్లీ: అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధభయాలు మళ్లీ ముసురుకోవడం .. ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్షియల్, ఐటీ స్టాక్స్‌లో ఆఖర్లో అమ్మకాలు వెల్లువెత్తడం తదితర అంశాల కారణంగా బుధవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ మరింత క్షీణించింది. 336 పాయింట్లు తగ్గి 36,108 వద్ద క్లోజయ్యింది. అటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 91 పాయింట్లు క్షీణించి 10,831 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా బలహీన సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో బుధవారం మార్కెట్ చాలా సేపు స్థిరంగా ఒక శ్రేణిలోనే కదలాడింది. అయితే, యూరోపియన్ మార్కెట్లు నెగటివ్‌గా ప్రారంభం కావడంతో.. ఆఖర్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. అటు క్రూడ్ ధర కాస్త తగ్గడం, రూపాయి కొంత కోలుకోవడం వంటి అంశాలు .. దేశీ సూచీలు మరింత పతనం కాకుండా అడ్డుకట్ట వేయగలిగాయి. చైనాతో ఈ వారంలో జరగాల్సిన సమావేశాన్ని అమెరికా రద్దు చేసిందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం తప్పదన్న భయాలు మళ్లీ రేకెత్తడంతో అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నప్పటికీ.. నెగటివ్ ధోరణిలో కనిపించాయి. వడ్డీ రేట్ల పెంపులో అమెరికా ఫెడరల్ రిజర్వ్ కాస్త నిదానంగా వ్యవహరించనుండటం, దేశీయంగా కీలక పాలసీ రేట్ల తగ్గింపునకు అవకాశాలు తదితర అంశాల కారణంగా మార్కెట్లో నిధుల కొరత సమస్య కొంత తగ్గొచ్చని విశ్లేషణలు ఉన్నాయి. బుధవారం సెన్సెక్స్ 36,521–36,038 పాయింట్ల మధ్య, నిఫ్టీ 10,945–10,812 పాయింట్ల శ్రేణిలో తిరుగాడాయి.

వొడాఫోన్ రైట్స్ ఇష్యూ • రూ.25,000 కోట్లు

వొడాఫోన్ ఐడియా కంపెనీ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.25,000 కోట్లు సమీకరించనుంది. రిలయన్స్ జియో నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి కంపెనీ ఈ స్థాయిలో నిధులను సమీకరిస్తోంది. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.25,000 కోట్లు సమీకరించడానికి తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని వొడాఫోన్ ఐడియా పేర్కొంది. రైట్స్ ఇష్యూలో భాగంగా వొడాఫోన్ గ్రూప్ రూ.11,000 కోట్లు, ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.7,250 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేస్తాయని, మిగిలిన మొత్తాన్ని వాటాదారుల నుంచి సమీకరిస్తామని వెల్లడించింది. ఒకవేళ వాటాదారుల రైట్స్ ఇష్యూ పూర్తిగా సబ్‌స్క్రైబ్ కాకపోతే, ప్రమోటర్లు మిగిలిన మొత్తాన్ని సర్దుబాటు చేస్తారని పేర్కొంది. రైట్స్ ఇష్యూ నిర్ణయానికి సంబంధించి బోర్డ్ సమావేశం నేపథ్యంలో బీఎస్‌ఈలో వొడాఫోన్ ఐడియా షేర్ 1.4 శాతం లాభంతో రూ. 33.95 వద్ద ముగిసింది.

- హాథ్‌వే కేబుల్ అండ్ డేటాకామ్‌లో మరో 26% వాటాల కొనుగోలుకు రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని గ్రూప్ కంపెనీలు ఓపెన్ ఆఫర్ ప్రకటించాయి. షేరు ఒక్కింటికి రూ. 32.35 ధరతో 46.02 కోట్ల షేర్ల కొనుగోలు కోసం రూ. 1,489 కోట్లు వెచ్చించనున్నాయి. హాథ్‌వే, డెన్ నెట్‌వర్క్స్ సంస్థల్లో మెజారిటీ వాటాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ సుమారు రూ. 5,230 కోట్లకు కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే.

సోమవారం స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,310
ఎన్‌ఎస్‌ఈ	27,522
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	8,22,817
ఎఫ్‌ఐఐ	- 776
డీఐఐ	584

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	430.4	2.73
YESBANK	197.25	2.63
TATASTEEL	463.1	1.43
WIPRO	351	1.3
ZEEL	430.3	1.19
BAJAJFINSV	6,505.00	1.08
TECHM	721	0.95
JSWSTEEL	280.45	0.88
INFRATEL	279.75	0.76
HINDALCO	205	0.71

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ITC	276	-4.75
GRASIM	780.5	-2.97
IBULHSGFIN	777.15	-2.53
TITAN	960	-2.3
M&M	694.1	-2.03
INFY	731.65	-1.84
ADANIPORTS	384.5	-1.56
KOTAKBANK	1,272.05	-1.53
SBIN	286.2	-1.4
HDFCBANK	2,106.95	-1.35

ఇంటి వంటకాలకు 'ఫుడీబడ్డీ'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మీరు రుచిగా వంటకాలు చేయడంలో నిష్ణాతులా? తయారు చేసిన ఫుడ్ విక్రయించడం ద్వారా సంపాదించాలని అనుకుంటున్నారా? ఇదుగో 'ఫుడీబడ్డీ' ఉన్నది మీ లాంటి వారికోసమే. బెంగళూరులో 1,000 మంది ఫుడ్ విక్రేతలు, 20,000 పైచిలుకు కస్టమర్లతో విజయవంతంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ యాప్ ఇపుడు హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. ఇంట్లో చేసిన వంటకాలను మాత్రమే ఈ యాప్ ద్వారా విక్రయిస్తారు. ఇది ఎలా పనిచేస్తుందంటే.. తయారీదారు యాప్‌లో షెఫ్‌గా నమోదు చేసుకోవాలి. ఏం వండుతారు. ఎన్ని ప్లేట్లు తయారు చేస్తారు? ధర ఎంత? కస్టమర్ ఏ సమయంలోగా ఆర్డరు ఇవ్వాలి? వంటి అంశాలను ఫోటోతో సహా యాప్‌లో పొందుపర్చాలి. తయారీదారే డెలివరీ చేయాల్సిన పనిలేదు. కస్టమర్ వచ్చి తీసుకెళ్లాలనే నిబంధన కూడా పెట్టొచ్చు. చెల్లింపులు డిజిటల్‌తో పాటు క్యాష్ రూపంలోనూ చేయొచ్చని ఫుడీబడ్డీ కో–ఫౌండర్ రచన రావు బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. తయారీదారు ఎన్ని ప్లేట్లు విక్రయించారు, వంటకాలకు రేటింగ్, కస్టమర్ల స్పందన వంటివి యాప్‌లో డిస్‌ప్లే చేస్తారు.

➤ రచన రావుతో సహ వ్యవస్థాపకులు అఖిల్ సేతురామన్, అనూప్ గోపినాథ్

మార్చికల్లా నిస్సాన్ లీఫ్ ఎలక్ట్రిక్ కారు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థ నిస్సాన్.. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఎంట్రీ ఇస్తోంది. పలు దేశాల్లో పాపులర్ మోడల్ అయిన 'లీఫ్' ఎలక్ట్రిక్ కారును తొలుత ప్రవేశపెట్టబోతోంది. 2010 నుంచి ఇప్పటి వరకు కంపెనీ అంతర్జాతీయంగా 3.5 లక్షల యూనిట్లను విక్రయించినట్టు సమాచారం. ఒకసారి చార్జి చేస్తే కారు 239 మైల్స్ ప్రయాణిస్తుంది. 2019 మార్చికల్లా భారత రోడ్లపై పరుగులు తీయించాలన్న లక్ష్యంతో ఉన్నట్టు డీలర్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ షహానే వెల్లడించారు. కిక్స్ ఎస్‌యూవీని బుధవారమిక్కడ విడుదల చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'జపాన్‌లో తయారైన లీఫ్ కారును ఇక్కడ ప్రవేశపెడతాం. భారత్‌లో నిస్సాన్ ఏటా ఒక కొత్త మోడల్‌ను రంగంలోకి దింపుతోంది. డాట్సన్, నిస్సాన్ బ్రాండ్లలో దేశవ్యాప్తంగా 272 షోరూంలు ఉన్నాయి. మూడేళ్లలో ఈ సంఖ్యను రెట్టింపు చేస్తాం. కిక్స్ ఎస్‌యూవీ కోసం ఇప్పటి వరకు 40,000 పైచిలుకు ఎంక్వైరీలు వచ్చాయి' అని వివరించారు.



అతుల్ షహానేతో డీలర్ ప్రతినిధులు కంభంపాటి జైరామ్, సిరాజ్ ◄

విజయా బ్యాంక్ లాభం 80 శాతం అప్

మొండిబాకీలకు భారీగా పెరిగిన ప్రొవిజనింగ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ విజయా బ్యాంక్ నికర లాభం 80 శాతం ఎగిసి రూ. 143 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో ఇది రూ.80 కోట్లు. మరోవైపు తాజా క్యూ3లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.3,451 కోట్ల నుంచి రూ. 4,106 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 6.17 శాతం నుంచి 6.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 3.99 శాతం నుంచి 4.08 శాతానికి పెరిగాయి. మొండి బాకీలకు కేటాయింపులు రెట్టింపై రూ.333 కోట్ల నుంచి రూ.582 కోట్లకు ఎగిశాయి. ఏప్రిల్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్ విలీనం కానున్న సంగతి తెలిసిందే. బుధవారం బీఎస్‌ఈలో విజయా బ్యాంకు షేరు 1.87 శాతం క్షీణించి రూ. 44.50 వద్ద ముగిసింది.

ఆర్‌కామ్ నష్టాలు రూ. 341 కోట్లు

న్యూఢిల్లీ: రుణభారంతో కుంగుతున్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో రూ.341 కోట్ల నష్టం నమోదు చేసింది. రూ.1,091 కోట్ల రుణానికి సంబంధించిన వడ్డీలు, కరెన్సీ మారక క్షీణత కారణంగా తలెత్తిన నష్టాలు ఇందులో పొందుపర్చలేదు. వీటన్నింటిని కూడా చేరిస్తే నష్టం మొత్తం రూ. 617 కోట్లకు పెరిగేదని కంపెనీ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నష్టం రూ.206 కోట్లు. రిలయన్స్ రియల్టీ అసెట్స్, రుణాలు, అందులో పెట్టుబడులను ఖాతాల నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ ఆర్థిక ఫలితాలను పోల్చి చూడటానికి లేదని ఆర్‌కామ్ పేర్కొంది. సమీక్షా కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,083 కోట్లకు తగ్గింది. మరోవైపు, ఆర్‌కామ్ విదేశీ విభాగం జీసీఎక్స్ కూడా సంక్షోభంలో కూరుకుపోతోంది. జీసీఎక్స్ అసెట్స్, రుణభారం మధ్య వ్యత్యాసం 324 మిలియన్ డాలర్లకు పెరిగిపోయింది. 2019 ఆగస్టులో 350 మిలియన్ డాలర్ల బాండ్లను తిరిగి చెల్లించాల్సి ఉంది.

భారతీ ఇన్‌ఫ్రాటెల్ లాభం రూ. 648 కోట్లు

న్యూఢిల్లీ: టెలికం టవర్స్ కంపెనీ భారతీ ఇన్‌ఫ్రాటెల్ మూడో త్రైమాసిక నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 648 కోట్లకు చేరింది. ఆదాయం స్వల్ప క్షీణతతో రూ.3,640 కోట్లుగా నమోదైంది. దేశీ టెలికం రంగంలో కన్సాలిడేషన్, విలీన దశ ముగిసినట్లేనని భారతీ ఇన్‌ఫ్రాటెల్ చైర్మన్ అఖిల్ గుప్తా తెలిపారు. 4జీ నెట్‌వర్క్‌ను పటిష్టం చేయడంతో పాటు తదుపరి రాబోయే 5జీ సేవల సంబంధిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నట్లు ఆయన వివరించారు.

నేటి బోర్డ్ మీటింగ్స్...

యస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, బయోకాన్, కోల్గేట్ పామోలివ్, పీవీఆర్, ఫైజర్, పీఎన్‌బీ హౌసింగ్, రిలయన్స్ పవర్, వీఎస్‌టీ ఇండస్ట్రీస్, జీ మీడియా కార్పొరేషన్, ఇక్రా, ఎంఫసిస్, సుప్రీమ్ ఇండస్ట్రీస్, ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హట్సన్ ఆగ్రో, జ్యోతి ల్యాబ్స్, క్వెస్ కార్పొ, జిందాల్ సా, నెల్కో

యూనిటెక్ ప్రమోటర్ల బెయిల్‌కు సుప్రీం నో

న్యూఢిల్లీ: యూనిటెక్ ప్రమోటర్లు సంజయ్ సంద్ర, అజయ్ చంద్రలకు బెయిల్ మంజూరు చేయడానికి సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. గృహ కొనుగోలుదారులను కోట్లాది రూపాయిల మేర మోసం చేశారన్న ఆరోపణలపై వీరు అరెస్టయ్యారు. అత్యున్నత న్యాయస్థానం రిజిస్ట్రీ వద్ద రూ.750 కోట్ల డిపాజిట్ చేయాలని 2017 అక్టోబర్ 30వ తేదీన ఇచ్చిన ఆదేశాలను రియల్టీ గ్రూప్ పాటించనందున వారికి బెయిల్ మంజూరు చేయడం లేదని జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హేమంత్ గుప్తాలతో కూడిన డివిజనల్ బెంచ్ స్పష్టం చేసింది. దాదాపు ఏడాదిన్నర నుంచీ తీహార్ జైలులో ఉంటున్న వీరు, ఇప్పటికి దాదాపు రూ.400 కోట్లు డిపాజిట్ చేశారు. 2015లో దాఖలైన ఒక క్రిమినల్ కేసులో వీరివురూ బెయిల్ కోరారు. గురుగ్రామ్‌లోని యూనిటెక్ ప్రాజెక్ట్స్– 'వైల్డ్ ఫ్లవర్ కంట్రీ', 'అంథియా ప్రాజెక్ట్'లో గృహాలు కొనుగోలు చేసిన 158 మంది తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఈ క్రిమినల్ కేసు దాఖలు చేశారు. యూనిటెక్ షేర్ 52 వారాల గరిష్ట స్థాయి రూ.9.45 అయితే, బుధవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఈ షేర్ ధర 52 వారాల కనిష్టస్థాయి రూ.1.80 వద్ద ముగిసింది.

ఐడీబీఐ బ్యాంక్ రేటింగ్ పెంచిన మూడీస్

ఐడీబీఐ బ్యాంక్ రేటింగ్‌ను మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ రెండంచెలు పెంచింది. ఎల్‌ఐసీ నుంచి భారీగా పెట్టుబడులు అందడంతో ఈ బ్యాంక్ సాల్వెన్సీ నిష్పత్తి పెరిగిందని మూడీస్ తెలిపింది. అందుకే ఈ బ్యాంక్ రేటింగ్‌ను 'బీ1' నుంచి 'బీఏ2'కు పెంచుతున్నామని పేర్కొంది. మొండి బకాయిలు తగ్గే అవకాశాలుండటంతో బ్యాంక్ అవుట్‌లుక్‌ను 'సానుకూలంగా (పాజిటివ్)' మార్చామని వివరించింది. ఐడీబీఐ బ్యాంక్‌కు గత నెల 28న రూ.14,500 కోట్లు, ఈ నెల 21న రూ.5,030 కోట్లు చొప్పున ఎల్‌ఐసీ నుంచి నిధులు అందాయి. ఈ నిధుల కారణంగా మొండి బకాయిలకు ఐడీబీఐ బ్యాంక్ కేటాయింపులు చేయగలుగుతుందని, రుణ నాణ్యత మెరుగుపడి, వడ్డీ వ్యయాలు తక్కువగా ఉంటాయని, 2020లో లాభదాయకత మెరుగుపడుతుందని మూడీస్ వివరించింది.

అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు (రూ. కోట్లలో)

కంపెనీ	నికర లాభం 2018-19	నికర లాభం 2017-18	వృ/క్షీ(%)	నికర ఆదాయం 2018-19	నికర ఆదాయం 2017-18	వృ/క్షీ(%)
రేమండ్	40	31	30	1,706	--	13
డీబీ కార్ప్	76	78	-3	662	--	11
రాడికో ఖైతాన్	52	35	49	2,081	1,748	19
ఉజ్జీవన్ ఫైనాన్షియల్	45	--	54	--	--	--
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	(3,764)	(597)	--	--	--	--
బీఏఎస్‌ఎఫ్ ఇండియా	(38)	7	--	1,410	1,283	10
ఎస్సెల్ ప్రొప్యాక్	46	--	14	602	697	16
యునైటెడ్ స్పిరిట్స్	192	135	42	2,500	2,225	11

(నష్టం)

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	33,310	0
బంగారం (22 క్యారెట్లు)	31,720	0
వెండి (కిలో)	42,500	▲ 300
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,500	▲ 10
బంగారం (22 క్యారెట్లు)	30,970	▲ 10
వెండి (కిలో)	42,500	▲ 300
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,520	▲ 10
బంగారం (22 క్యారెట్లు)	30,970	▲ 10
వెండి (కిలో)	42,500	▲ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,100	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	30,670	▲ 190
వెండి (కిలో)	40,500	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,290	▲ 200
బంగారం (22 క్యారెట్లు)	30,960	▲ 180
వెండి (కిలో)	40,000	
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	33,785	
బంగారం (22 క్యారెట్లు)	30,970	
వెండి (కిలో)	42,300	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,480	▲ 10
బంగారం (22 క్యారెట్లు)	30,970	▲ 10
వెండి (కిలో)	40,200	▲ 200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	52.21 (రాత్రి 11.30కు)	$53.01 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	60.62 (రాత్రి 11.30కు)	$61.50 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 24-01-2019

విజయవాడ	417-00
విశాఖపట్నం	417-00
చిత్తూర్	423-00
వరంగల్	402-00
చెన్నై	430-00
ముంబై	455-00
నమక్కల్	415-00
గోదావరి	417-00
23-1-2019 ఫామ్ ధర..	
హైదరాబాద్	400-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	415-00
కోల్‌కత	448-00
ఢిల్లీ	435-00

అటల్ పెన్షన్ యోజన వయోపరిమితి పెంపును పరిశీలిస్తున్న కేంద్రం

అటల్ పెన్షన్ యోజన పథకాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు గాను పీఎఫ్‌ఆర్‌డీఏ చేసిన సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి రాజీవ్‌కుమార్ తెలిపారు. అటల్ పెన్షన్ యోజన పింఛను పథకంలో చేరేందుకు ప్రస్తుతం గరిష్ట వయోపరిమితి 40 ఏళ్లుగా ఉంటే, దీన్ని 50 ఏళ్లు చేయాలని... అలాగే, కనీస పెన్షన్ రూ.5,000ను రూ.10,000 చేయాలని పీఎఫ్‌ఆర్‌పీఏ కేంద్రాన్ని కోరింది. వీటిని ప్రభుత్వం పరిశీలిస్తుందని రాజీవ్‌కుమార్ తెలిపారు. అటల్ పెన్షన్ యోజనను విస్తృతం చేసేందుకు బ్యాంకులు సరికొత్త మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు.

ఎస్‌ఎమ్‌ఎస్ ద్వారా డేటా కనెక్టివిటీ!

బి–బౌండ్‌తో చేతులు కలిపిన బీఎస్‌ఎన్‌ఎల్

ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా యాప్‌లు పనిచేసేలా, ఎస్‌ఎమ్‌ఎస్ ద్వారా డేటా కనెక్టివిటీ అందించే ఆఫర్‌ను బీఎస్‌ఎన్‌ఎల్ అందుబాటులోకి తెస్తోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేనిచోట, సిగ్నళ్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఎస్‌ఎమ్‌ఎస్ ద్వారా డేటా అందిస్తారు. ఇందుకు బీఎస్‌ఎన్‌ఎల్... ఫ్రాన్స్ కంపెనీ బి–బౌండ్‌లు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఎస్‌ఎమ్‌ఎస్ ఆధారిత డేటా సర్వీసెస్ టెక్నాలజీ కోసం గతంలో ప్రయత్నాలు చేశామని బీఎస్‌ఎన్‌ఎల్ సీఎమ్‌డీ అనుపమ్ శ్రీవాత్సవ చెప్పారు. అయితే బి–బౌండ్ సంస్థ, ఇప్పటికే ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసి పేటెంట్ కూడా పొందిందని తెలిపారు.

టాప్ 100లో రిలయన్స్ రిటైల్!!

డెలాయిట్ రిటైలింగ్ దిగ్గజాల జాబితాలో 94వ స్థానం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ రిటైల్ దిగ్గజాల జాబితాలో టాప్ 100లో రిలయన్స్ రిటైల్ చోటు దక్కించుకుంది. ఏకంగా 95 స్థానాలు ఎగబాకి 94వ స్థానానికి చేరింది. నిత్యావసరాలు, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, లైఫ్‌స్టయిల్ తదితర వ్యాపార విభాగాలు రాణిస్తుండటం ఇందుకు తోడ్పడింది. ప్రపంచవ్యాప్తంగా 250 దిగ్గజ రిటైల్ సంస్థలతో కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఈ జాబితాను రూపొందించింది.

నంబర్ వన్‌గా వాల్‌మార్ట్..: ప్రపంచంలోనే అతిపెద్ద రిటైలర్‌గా అమెరికాకు చెందిన వాల్‌మార్ట్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. కాస్ట్‌కో, క్రోగర్, అమెజాన్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టాప్ 10లో ఏడు రిటైల్ సంస్థలు అమెరికాకు చెందినవే ఉండటం గమనార్హం.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	385.2	390.6
ASIAN PAINT	1396.55	1406.95
AXIS BANK L	661.6	661.6
BAJAJ AUTO	2674.1	2688.35
BAJAJ FINSE	6493.15	6435.55
BAJAJ FINAN	2634.35	2621.9
BHARTI AIRT	303.7	304.85
BHARAT PETR	357.15	353.8
CIPLA LTD	509.3	507.1
COAL INDIA	225.55	227.75
EICHER MOTO	20089.15	20023.6
GAIL (INDIA	334.2	332.9
GRASIM INDU	782.15	804.35
HCL TECHNOL	944.45	940.75
HDFC LTD	1958.25	1979.4
HDFC BANK L	2105.4	2135.85
HERO MOTOCO	2795.95	2824.9
HINDALCO I	205.45	203.55
HPCL	241.85	242
HUL	1767.2	1750.2
INDIABULLS	778.7	797.35
ICICI BANK	367.4	369.05
INDUSIND BA	1495	1501.6
BHARTI INFR	277	277.65
INFOSYS LIM	731.65	745.35
INDIAN OIL	136.1	135.95
ITC LTD	277.3	289.75
JSW STEEL L	280.9	278
KOTAK MAHIN	1276.5	1291.75
LARSEN & T	1301.45	1301.15
MAHINDRA &M	695.85	708.5
MARUTI SUZU	7045.4	7068.85
NTPC LTD	140.75	142.8
OIL AND NAT	143.3	144.35
POWER GRID	186.3	189.7
RIL	1226.3	1235.15
SBI	286.65	290.25
SUN PHARMAC	431	418.95
TATA MOTORS	180.25	180.85
TATA STEEL	464.6	456.55
TCS	1875.6	1901.9
TECH MAHIND	720.7	714.2
TITAN COMPA	962.15	982.65
ULTRATECH C	3850.65	3860.5
UPL LIMITED	762.85	763.3
VEDANTA LIM	192.8	191.5
WIPRO LTD	351.55	346.5
YES BANK LI	197.25	192.2
ZEE ENTERTA	432.85	425.25

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

ABB INDIA L	1293.2	1309.15
ADITYA BIRL	87.4	90.85
ACC LIMITED	1429.85	1436.35
AMBUJA CEME	212.4	213.85
ASHOK LEYLA	89.15	87.95
BANDHAN BAN	414.2	408.95
BANK OF BAR	111.3	113.8
BHARAT ELEC	83.9	85.15
BHEL	69.35	71.2
BIOCON LIMI	670.65	668.6
BOSCH LIMIT	19090.15	19208.35
BRITANNIA I	3203.85	3153.65
CADILA HEAL	342.05	346.05
COLGATE PAL	1307.25	1306.55
CONTAINER C	659.9	669.5
DABUR INDIA	430.65	433.35
DLF LIMITED	177.25	180.05
AVENUE SUPE	1397.3	1357.9
GENERAL INS	247.7	252.25
GODREJ CONS	789.8	792.85
HAVELLS IND	696.2	711.85
HDFC STAND	373.35	383.85
HINDUSTAN Z	259.4	260.25
ICICI LOMBA	832.25	847.65
ICICI PRU L	305.4	345
VODAFONE ID	33.9	33.5
INTERGLOBE	1109.3	1120.65
L&T FINANCE	136.6	137
LIC HOUSING	466.95	475.2
LUPIN LIMIT	864.6	865.45
MARICO LIMI	376.55	375.55
UNITED SPIR	580.25	597.2
MOTHERSON S	157.55	162.55
MRF LTD	66072.05	65259.6
NHPC LTD	25.25	25.4
THE NEW IND	179.3	181.7
NMDC LTD.	89.9	90.55
ORACLE FIN	3769.65	3684.8
OIL INDIA L	170.05	170.5
PIRAMAL ENT	2357.85	2339.15
PETRONET LN	226.8	222.95
P&G HYGIENE	9914.85	9987.95
PIDILITE IN	1131.45	1152.8
STEEL AUTHO	48.55	48.25
SBI LIFE IN	620	619.9
SHREE CEMEN	16103.35	15917.55
SIEMENS LTD	1045	1049.5
SHRIRAM TRA	1088.05	1096.15
SUN TV NETW	529.45	519.25

ఆర్థిక వృద్ధి స్పీడ్‌లో భారత్ ఫస్ట్!

ఐక్యరాజ్యసమితిసహా పలు బహుళజాతి సంస్థల అంచనా

భారత్ ఆర్థికాభివృద్ధి రేటు 2019- 2020లో ప్రపంచంలోని అన్ని దేశాలకన్నా ఎక్కువగా ఉంటుందని ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సహా పలు ఆర్థిక విశ్లేషణా సంస్థలు విశ్లేషిస్తున్నాయి. ఈ రెండు సంవత్సరాల్లో భారత్ వృద్ధి రేటు 7 శాతంపైనే ఉంటుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఆయా అంచనాలను క్లుప్తంగా చూస్తే...



'వినియోగం' ఇంధనం: ఐక్యరాజ్యసమితి

భారత్ వృద్ధి రేటు 2018–19 ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతంగా ఉంటుందని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అవకాశాల (డబ్ల్యూఈఎస్‌పీ) నివేదిక పేర్కొంది. 2019–20లో ఈ రేటు 7.6 శాతంగా ఉంటుందని వివరించింది. అయితే 2020–2021 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 7.4 శాతానికి తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. కాగా 2018లో చైనా వృద్ధి రేటు 6.6 శాతం అయితే 2019లో ఈ రేటు 6.3 శాతానికి తగ్గవచ్చని విశ్లేషించింది. 2020లో 6.2 శాతంగా అంచనావేసింది. భారత్ వృద్ధికి ప్రైవేటు వినియోగం గణనీయంగా పెరగడం ఒక కారణంగా ఉంటుందని పేర్కొంది. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితాలూ వృద్ధి పటిష్టతకు దోహదపడతాయని వివరించింది.

క్రిసిల్ అంచనా 7.3 శాతం... అయితే!

2019–20 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి రేటు 7.3 శాతంగా ఉంటుందని క్రిసిల్ తన తాజా అవుట్‌లుక్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.2 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ఇంతకుమించి వచ్చే ఏడాది వృద్ధి పెరగడానికి సార్వత్రిక ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ, సాధారణ వర్షపాతం నమోదు, క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉండడం వంటివి అవసరమనీ క్రిసిల్ ఉద్ఘాటించింది. దేశీయ ప్రైవేటు వినియోగంలో వృద్ధి, పెట్టుబడులు పెరగడంవంటివి భారత్ వృద్ధి స్పీడ్‌లో కీలక అంశాలని వివరించింది. ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు లక్ష్యాలకు కేంద్రం కట్టుబడి ఉంటుందన్న అభిప్రాయాన్ని క్రిసిల్ వ్యక్తం చేసింది.

ఐఎంఎఫ్ అంచనాలు ఇవీ...

భారత్ ఆర్థిక వ్యవస్థ 2019, 2020లో ఊపందుకోనున్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) పేర్కొంది. ఈ రెండు సంవత్సరాల్లో వరుసగా 7.5 శాతం, 7.7 శాతం వృద్ధి నమోదవుతుందని విశ్లేషించింది. అంతకుముందు అంచనాలకన్నా ఇది 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) ఎక్కువ. ఈ రెండు సంవత్సరాల్లో చైనా ఆర్థిక వృద్ధి రేటు 6.2 శాతంగా ఉంటుందని వివరించింది. తద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తున్న దేశంగా నిలుస్తుందని ఐఎంఎఫ్ పేర్కొంది. క్రూడ్ ధరలు తక్కువగా ఉండడం, నిత్యావసరాల ధరల పెరుగుదల స్పీడ్ తగ్గడం, కఠిన ద్రవ్య పరపతి విధాన ప్రక్రియ నెమ్మదించడం భారత్ వృద్ధి పురోగతికి కారణంగా వివరించింది.

పారిశ్రామిక ఉత్పత్తి పేలవం: డీఅండ్‌బీ

సమీపకాలంలోభారత్ పారిశ్రామిక క్రియాశీలత పేలవంగా ఉండే అవకాశం ఉందని గణాంకాల విశ్లేషణా సంస్థ– డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డీఅండ్‌బీ) పేర్కొంది. దేశీయ డిమాండ్ బలహీనత, బలహీన ప్రపంచ ఆర్థికాభివృద్ధి అవుట్‌లుక్, 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వ్యాపారాల పురోగతిపై అనిశ్చితి పరిస్థితులు దీనికి కారణమని వివరించింది. లక్ష్యాలకన్నా తక్కువగా పన్ను వసూళ్లు జరగడంపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. 2018 డిసెంబర్‌లో కూడా వృద్ధి 1.5 శాతం నుంచి 2 శాతం శ్రేణిలోనే నమోదయ్యే వీలుందని అంచనావేసింది. నవంబర్‌లో పారిశ్రామిక వృద్ధి రేటు కేవలం అరశాతంగా నమోదయిన నేపథ్యంలో డీఅండ్‌బీ తాజా నివేదిక విడుదలైంది. రానున్న ఆర్థిక పరిస్థితుల తీరుతెన్నులను ఫిబ్రవరి 1 వార్షిక బడ్జెట్ నిర్దేశిస్తుందని పేర్కొంది.

అగ్రిగోల్డ్ బాధితులకు మరోసారి మోసం

- వైఎస్సార్‌సీపీ బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి
- రూ.250 కోట్లను ఏ ప్రాతిపదికన చెల్లిస్తారు?
- ప్రభుత్వ ప్రకటనతో భయాందోళనలో అగ్రిగోల్డ్ బాధితులు



విలేకరులతో మాట్లాడుతున్న అప్పిరెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

నెహ్రూనగర్ (గుంటూరు): అగ్రిగోల్డ్ బాధితులను మరోమారు మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులకు మంత్రివర్గం రూ.250 కోట్లు ప్రకటించడం పెద్ద మోసంగా అభివర్ణించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారమే రూ.5 వేలు, రూ.10వేల లోపు డిపాజిట్ చేసిన వారికి రూ.336 కోట్లు, రూ.20 వేల డిపాజిట్లకు రూ.1,182 కోట్లు అవసరమని తెలిపారు. మంత్రివర్గం ఏ ప్రాతిపదికన రూ.250 కోట్లు ప్రకటించిందో సీఎం వివరించాలని డిమాండ్ చేశారు. మంత్రి వర్గం చేసిన ప్రకటనతో అగ్రిగోల్డ్ బాధితుల్లో ఆందోళన మరింత రెట్టింపైందన్నారు. రూ.250 కోట్లను ఏ విధంగా సర్దుబాటు చేస్తారు? ఏ ప్రాతిపదికన బాధితులను నిర్ణయిస్తారు? అసలు ప్రభుత్వ జాబితాలో తమ పేరు ఉందో...లేదో అన్న అనుమానాలు బాధితుల్లో వ్యక్తమవుతున్నాయని చెప్పారు.

ఆదాయపన్ను పరిమితిని పెంచాలి

కేంద్రాన్ని కోరిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: ప్రస్తుతమున్న ఆదాయ పన్ను కనీస పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి వినతిపత్రం ఇచ్చారు. బేసిక్ లిమిట్ పెంచకపోవడం, పెరిగిన వ్యయాలను దృష్టిలో పెట్టుకొని 60 ఏళ్ల లోపు ఉన్న వారి పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని లేఖలో పేర్కొన్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ తెలిపారు. సెక్షన్ 80–సీ కింద లభించే మినహాయింపుల పరిమితిని రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలని కోరామన్నారు.

సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు హుస్సేన్‌షా స్మారక పురస్కారం



భీమవరం (ప్రకాశం చౌక్): ప్రముఖ సినీ గేయ రచయిత కానుకుంట్ల చంద్రబోస్‌కు హుస్సేన్‌షా స్మారక పురస్కారం లభించింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉమర్ ఆలీషా 74 వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబోస్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం చంద్రబోస్ మాట్లాడుతూ.. డాక్టర్ ఉమర్ ఆలీషా విద్యావేత్త, సాహితీవేత్త, ఆధ్యాత్మిక వేత్త అని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి వర్ధంతి సందర్భంగా ఈ పురస్కారం అందుకోవడం తన అదృష్టమన్నారు. సినిమాల్లో హీరో తెరపై మాత్రమేనని.. కానీ డాక్టర్ ఉమర్ ఆలీషా జీవితంలో నిజమైన కథానాయకుడు అన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో విజేతలకు చంద్రబోస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆదికవి నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముత్యాల నాయుడు, ఉద్దరాజు విశ్వనాథరాజు, దాయన చంద్రాజీ, రచయిత కొసరాజు, నరసింహరాజు, ఉమర్ ఆలీషా సాహితీ సమితి సభ్యులు పాల్గొన్నారు.

రగులుతున్న రగడ!

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎదుట ఏపీపీఎస్సీ చైర్మన్ గైర్హాజర్
- బ్యాక్‌లాగ్ పోస్టులు, రిజర్వేషన్ల అమలు విషయంలో పలు ఫిర్యాదులు
- అట్రాసిటీ చట్టం కింద ఉదయభాస్కర్‌పై చర్యలకు కారెం శివాజీ యోచన
- ఉదయభాస్కర్ 31న తమ ఎదుట హాజరు కావాలని మరోసారి నోటీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ, ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్ మధ్య వివాదం రాజుకుంటోంది. బ్యాక్‌లాగ్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయకపోవడం, రిజర్వేషన్ అభ్యర్థులను జనరల్ కేటగిరీలో మెరిట్ ప్రకారం తీసుకోవడం కుదరదని ఏపీపీఎస్సీ నిర్ణయించడంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పలు ఫిర్యాదులు అందాయి. ఏపీపీఎస్సీ కార్యాలయంలో ప్రమోషన్‌ల విషయంలో రోస్టర్ పాటించడం లేదని ఫిర్యాదులున్నాయి. వీటిపై విచారించేందుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ గత నెలలో ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల ప్రకారం ఈనెల 22వ తేదీన ఉదయభాస్కర్ కమిషన్ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉండగా ఆయన రాకుండా కార్యాలయ సిబ్బందిని పంపించారు. వారు సరైన సమాచారంతో రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఈనెల 31న కమిషన్ ఎదుట హాజరు కావాలని ఉదయభాస్కర్‌ను ఆదేశిస్తూ మరోసారి నోటీసులు జారీ చేశారు. తమ నోటీసులను లెక్క చేయకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం–1989 ప్రకారం చర్యలు చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. తాను ఎస్సీ ఎస్టీ కమిషన్ వద్దకు వెళితే తన స్థాయి తగ్గుతుందని, అందువల్ల వెళ్లే ప్రశ్నే లేదని కొందరు ఏపీపీఎస్సీ అధికారులతో ఉదయ భాస్కర్ పేర్కొన్నట్లు సమాచారం.



ఉదయభాస్కర్



కారెం శివాజీ

రిజర్వేషన్ల చట్టానికి తూట్లు

విద్య, ఉద్యోగాల భర్తీలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మహిళలకు కూడా 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంది. వీరంతా జనరల్ కేటగిరీలో మెరిట్ సాధిస్తే జనరల్‌లోనే ఎంపిక చేస్తారు. అయితే జనరల్ కేటగిరీలో రిజర్వేషన్ అభ్యర్థులను ఎంపిక చేసేది లేదని, రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినా రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు రిజర్వేషన్ కేటగిరీలోనే ఎంపిక కావాల్సి ఉంటుందని ఏపీపీఎస్సీ నిబంధన పెట్టింది. ఇది 'స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీసు రూల్స్ 1996, 22–ఏ' నిబంధనకు విరుద్ధమని రిజర్వేషన్ కలిగిన అభ్యర్థులు పేర్కొంటున్నారు.

జనరల్ కోటాలో బ్యాక్‌లాగ్ పోస్టులు

ఈ సంవత్సరం ఏపీపీఎస్సీ విడుదల చేసిన ఉద్యోగాల భర్తీ ప్రకటనల్లో 225 ఎస్సీ, 257 ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను జనరల్ నోటిఫికేషన్‌తో కలిపి ఖాళీలు చూపించారు. జనరల్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ కాని ఎస్సీ, ఎస్టీ పోస్టులకు ఎప్పటికప్పుడు నోటిఫికేషన్‌లు ఇచ్చి కేవలం ఆయా వర్గాలతో భర్తీ చేయాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీలో కలిపి అన్ని పోస్టులకు నోటిఫికేషన్ పిలవడం వల్ల కుల ప్రాతిపదికన వచ్చిన రిజర్వేషన్లకు అర్థం లేకుండా పోయిందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ వాదిస్తోంది. ఏపీపీఎస్సీ, ఇతర ప్రభుత్వ అధికారులకు నోటీసులు ఇవ్వగానే వెంటనే సీఎం పేషీ నుంచి కాస్త స్పీడు తగ్గించుకోవాలంటూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శివాజీకి ఫోన్లు వస్తున్నట్లు తెలిసింది.

తీరు మారకుంటే చట్టపరమైన చర్యలు..

ఏపీపీఎస్సీ కమిషన్ చైర్మన్ ఉదయభాస్కర్ తీరు మారకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఆయన విధానాల వల్ల పాలకులకు చెడ్డపేరు వస్తోంది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తుంది. రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను కాలరాయటంపై ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏపీపీఎస్సీ పట్ల ఆగ్రహంతో ఉన్నారు.

– కారెం శివాజీ (రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్)

విశాఖలో రక్షణ రంగ కార్మికుల సమ్మె



విశాఖలోని ఎన్ఏడీ గేటు వద్ద నిరసన తెలుపుతున్న రక్షణ రంగ కార్మికులు

ఎన్ఏడీ జంక్షన్ (విశాఖపట్నం): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నావల్ ఆర్మమెంట్ డిపో (ఎన్ఏడీ), నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్), నావల్ డాక్ యార్డ్‌లో మూడు రోజుల పాటు తలపెట్టిన సమ్మె తొలి రోజు బుధవారం విజయవంతమైంది. రక్షణ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తుండటం, ఎఫ్‌డీఐలను అనుమతించడానికి నిరసనగా, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా రక్షణ రంగ కార్మికులు ఆందోళనలకు దిగారు. అందులో భాగంగా విశాఖపట్నంలోని ఎన్ఎస్‌టీఎల్, ఎన్ఏడీ, నావల్ డాక్ యార్డ్‌లోని పలు విభాగాల ఉద్యోగులు సమ్మెకు మద్దతు పలికారు. ఎన్ఏడీ ప్రధాన గేటు వద్ద ఉదయం 3 గంటల నుంచే కార్మికులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్ఏడీలో ముఖ్య విభాగాల ఫ్యాక్టరీ, సోర్స్ టార్పిడో వర్క్‌షాప్ వంటి పలు విభాగాల్లో ఉద్యోగులు విధులకు హాజరుకాలేదు. సుమారు 96 శాతం మంది ఉద్యోగులు హాజరు కాలేదని కార్మిక నాయకులు చెప్పారు. ఈ సమ్మెలో ఐఎన్‌టీయూసి, ఎన్ఏడీ సీఈ యూనియన్ వర్క్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమ బాట

ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ వెల్లడి

తుళ్లూరు రూరల్ (తాడికొండ): ఆరేళ్లుగా రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామని, ఇక ఉద్యమబాట పట్టనున్నామని అప్సా చైర్మన్ ఎన్.చౌదరిబాబు చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని గ్లోబల్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన అప్సా సమావేశంలో ఆయన అప్సా రాష్ట్ర కార్యవర్గ సభ్యుల వివరాలను వెల్లడించారు. అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గ్లోబల్ విద్యాసంస్థల అధినేత మన్నవ అప్పాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చౌదరిబాబు మాట్లాడుతూ..118 జీఓను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలకు ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులో తెచ్చిన తమపై ప్రభుత్వం ఎందుకు కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతుందో అర్థం కావడం లేదని అన్నారు. మన్నవ అప్పాజీని రాష్ట్ర నాయకులు సన్మానించారు.

'కవర్డ్ కండక్టర్ల' నిందితులకు రక్షణ!

- కాంట్రాక్టు సంస్థకు రూ.131.30 కోట్లు అదనంగా చెల్లింపు
- సీఎంవో ఉన్నతాధికారి పాత్ర కీలకం
- ఎవరిపై చర్యలు తీసుకోవాలి, ఎవరిని దోషులుగా చూపించాలనే దానిపై తర్జనభర్జనలు

సాక్షి, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థల (తూర్పు, దక్షిణ ప్రాంత డిస్కమ్‌లు) పరిధిలో చోటుచేసుకున్న కవర్డ్ కండక్టర్ల కుంభకోణం ఘటన పలు మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయంలోని (సీఎంవో) ఓ ఉన్నతాధికారే ఇందులో సూత్రధారి అని ఇంధనశాఖ ముఖ్య అధికారి ఒకరు అనుమానిస్తున్నారు. అయితే, విజిలెన్స్ విభాగం ఈ విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో చర్యలకు ఆస్కారం లేకుండా పోతోంది. అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కొందరిని తప్పిస్తారా?

విజిలెన్స్ అధికారుల నివేదికపై ఇంధన శాఖ డిస్కమ్ సీఎండీని వివరణ కోరింది. కాంట్రాక్టు నిబంధనల్లో తామెలాంటి అవకతవకలకు పాల్పడలేదని, నిబంధనల ప్రకారం కవర్డ్ కండక్టర్స్ వేశారా? లేదా? అన్నదే తమ పరిధిలోని అంశమని డిస్కమ్ సీఎండీ వివరణ ఇచ్చారు. కాంట్రాక్టు సంస్థకు అదనపు చెల్లింపుల వ్యవహారంలో ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పాత్ర ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యమంత్రితో అత్యంత సన్నిహిత సంబంధాలున్న ఈ అధికారి పాత్రను ప్రస్తావించకుండా ఈ కేసులో ఎవరిపైనా చర్యలు తీసుకునే అవకాశం లేదని సమాచారం. అయితే, ఈ కుంభకోణం నుంచి కొంతమంది అధికారులను తప్పించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నా, తీగలాగితే డొంకంతా కదలుతుందనే భయం అధికారుల్లో ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ ఉన్నతాధికారికి, ఇంధనశాఖలో సలహాదారుగా ఉన్న వ్యక్తికి మధ్య ముడుపుల వ్యవహారంలో తలెత్తిన వివాదమే ఈ కథ ఇంత దూరం రావడానికి కారణమని తెలుస్తోంది. ఇప్పుడు ఎవరిపై చర్యలు తీసుకోవాలి, ఎవరిని దోషులుగా చూపించాలనే విషయంలో ఉన్నతస్థాయిలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

అవకతవకలు నిజమే

కృష్ణా పుష్కరాల సందర్భంగా ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ పరిధిలో కవర్డ్ కండక్టర్స్ వేశారు. ప్రకృతి వైపరీత్యాల సంభవించినా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా నిరోధించడమే వీటి ఉద్దేశం. ఇందుకోసం డిస్కమ్‌లు టెండర్లు పిలిచాయి. ఈ వ్యవహారంలో బెంగళూరుకు చెందిన రేచమ్ ఆర్‌పేజీ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి అనుకూలంగా టెండర్ నిబంధనలు రూపొందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంట్రాక్టు దక్కించుకున్న ఈ కంపెనీ 3,804.36 కిలోమీటర్ల మేర కవర్డ్ కండర్స్ వేసింది. దీనికి రూ.195.83 కోట్లు అవుతుందని తెలిపింది. అయితే, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పరికరాల ఇన్‌వాయిస్‌లను పరిశీలిస్తే రూ.64.52 కోట్లు మాత్రమే ఉన్నట్టు తేలింది. దీన్నిబట్టి కాంట్రాక్టు సంస్థకు డిస్కమ్‌లు దాదాపు రూ.131.30 కోట్లు అదనంగా చెల్లించినట్టు స్పష్టమైంది. ఈ అవినీతి బాగోతంపై ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి విచారణకు ఆదేశించారు. అన్ని కోణాల్లో విచారించిన ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగం అవకతవకలు జరిగినట్టు తేల్చింది. అయితే, ఈ వ్యవహారంలో నిందితులు ఎవరన్నది వ్యక్తిగతంగా నిర్ధారించలేదు. కాంట్రాక్టర్ నుంచి రూ.131.30 కోట్లు తిరిగి రాబట్టాలని సూచించింది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.